సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 30

మంగళవారం 22-4-2025


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'



oppo
Flipkart
అన్ని పనులూ పూర్తయినా
బ్యాటరీ నడుస్తూనే ఉంటుంది
OPPO K13 5G
అన్ని చూసుకుంటుంది
7000 mAh battery
Browse
Navigate
Social
Watch
Snapdragon 6 Gen 4
7.9L+ AnTuTu Score
62% Charge in 30mins
7000mAh
80W Charger In-Box
Vapour Cooling
5700mm² Ultra-large
₹1,000
Instant Discount on Select Banks* Credit/Debit Card
Or
*T&C Apply
Additional up to ₹1,000 Exchange Bonus*
0%
No Cost EMI up to 6 Months*


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 30

మంగళవారం 22-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గుజరాత్ టైటాన్స్ విజయం

39 పరుగుల తేడాతో ఓడిన కోల్‌కతా నైట్‌రైడర్స్ - 14లో



శ్రేయస్ అయ్యర్‌కు మళ్లీ చోటు

34 మందితో కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించిన బీసీసీఐ - 14లో



కళ్లలో కారం చల్లి.. కత్తితో పొడిచి

కర్ణాటక మాజీ డీజీపీ, భర్త ఓం ప్రకాశ్ కళ్లలో కారం చల్లి, కత్తితో పలుమార్లు పొడిచి చంపినట్లు భార్య పల్లవి ఒప్పుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. -6లో



అసలే మాపై అభియోగాలు

'పార్లమెంటు పనితీరులో జోక్యమంటూ ఇప్పటికే మా (సుప్రీం)పై ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ రాష్ట్రపతికి ఆదేశాలిమ్మంటారా?' అని జస్టిస్ గవాయ్ అన్నారు. -6లో



మహిళల ఆయుష్షే గట్టిదట!

పురుషులు, మహిళల్లో సాధారణంగా ఎవరు ఎక్కువ కాలం జీవిస్తారు? ప్రపంచమంతా ఏమోగానీ మనదేశంలో మాత్రం మహిళలే ఎక్కువకాలం జీవిస్తున్నారు. -16లో



నేడు ఇంటర్ ఫలితాలు

ఇంటర్ ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. ఇంటర్ బోర్డు కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విడుదల చేస్తారు. -2లో

సిరి మా'లక్ష'మి..

దేశంలో రూ. లక్ష మార్కును దాటేసిన 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం

న్యూఢిల్లీ: అందరికీ ప్రియమైన బంగారం దేశంలోని సామాన్యులను మాత్రం బెంబేలెత్తించేలా పరుగులు తీస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో రూ. 78 వేలు పలికిన 10 గ్రాముల 24 క్యారట్ల ధర తాజాగా పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ మొదలవుతున్న వేళ అందరినీ అవాక్కయ్యేలా చేస్తూ వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కలుపుకుని ఏకంగా రూ.లక్ష మార్కును దాటేసింది. సోమవారం బెంగళూరు బులియన్ మార్కెట్‌లో రూ. 1,02,000గా పసిడి ధర నమోదైంది. ఇక ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాములకు రూ. 1,650 పెరిగి రూ. 99,800 మార్క్‌ను తాకగా హైదరాబాద్‌లో అటుఇటుగా రూ. 1,00,100కు చేరుకుంది. మరోవైపు 99.5 శాతం స్వచ్ఛతగల బంగారం ఢిల్లీలో రూ. 1,600 పెరిగి రూ. 99,300 వద్ద నూతన గరిష్టాన్ని నమోదు చేసింది. డాలర్ బలహీనపడటం, చైనా-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతుండటం బంగారం కొనుగోళ్లకు మద్దతుగా నిలుస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు బంగారం 26 శాతం ర్యాలీ చేసింది. 10 గ్రాములకు రూ. 20,850 పెరిగింది. మరోవైపు వెండి కిలో రూ. 500 పెరిగి రూ. 98,500 మార్క్‌ను చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్ (31.1 గ్రాములు)కు 101 డాలర్ల వరకు ఎగసి 3,430 డాలర్లకు చేరుకుంది. 2006 వరకు నాలుగు అంకెల స్థాయికే పరిమితమైన బంగారం ధర.. 2007 నుంచి అయిదు అంకెల స్థాయిలోకి అడుగుపెట్టింది. ఏటా ధర వృద్ధి చెందుతూ 2012లో రూ.31 వేలకు చేరినప్పటికీ.. ఆ తరువాత పసిడి ధర ఒడిదుడుకులకు లోనై తిరోగమనం చెందింది. ఇక 2016 నుంచి ఏటా దూకుడు కొనసాగించింది.

బెంగళూరు బులియన్ మార్కెట్‌లో రూ. 1,02,000గా నమోదు

హైదరాబాద్‌లో అటుఇటుగా రూ. 1,00,100కు చేరిక

డాలర్ బలహీనపడటం, అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలే పెరుగుదలకు కారణం



ఎంసీఎక్స్‌లోనూ రికార్డులు..

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) లోనూ బంగారం రూ. 98 వేల రికార్డు స్థాయికి చేరుకుంది. 10 గ్రాముల జూన్ నెల కాంట్రాక్టు ధర రూ. 2,111 పెరగడంతో (2.22%).. ఆల్‌టైమ్ గరిష్టం రూ. 97,365 నమోదైంది. ఆగస్ట్ నెల కాంట్రాక్టు సైతం రూ. 2,104 పెరిగి రూ. 98,000కు, అక్టోబర్ కాంట్రాక్టు రూ. 2,617 పెరిగి రూ. 98,000కు చేరడం గమనార్హం.

పసిడి పరుగే పరుగు..!

గత ఐదేళ్లలో రెట్టింపుకన్నా ఎక్కువగా పెరిగిన ధర.. మరింతగా పెరగొచ్చంటున్న బులియన్ మార్కెట్

ధరలకు ఆజ్యం పోస్తున్న అంతర్జాతీయ పరిణామాలు

అనిశ్చితి నేపథ్యంలో పెట్టుబడులకు బంగారమే భద్రం అంటున్న ఇన్వెస్టర్లు

12 లో



పోప్.. అస్తమయం

బ్రెయిన్ స్ట్రోక్‌తో కన్నుమూత..

శోకసంద్రంలో క్యాథలిక్ సమాజం..

ప్రపంచవ్యాప్తంగా సంతాపాల వెల్లువ

ఈస్టర్ సందర్భంగా చివరిసారి దర్శనం..

→ ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మందికి పైగా రోమన్ క్యాథలిక్‌ల అత్యున్నత మత గురువైన పోప్ ఫ్రాన్సిస్ ఇక లేరు. 88 ఏళ్ల ఫ్రాన్సిస్ అనారోగ్య సమస్యలతో సోమవారం కన్నుమూశారు. 'తన జీవితమంతటినీ చర్చి, ప్రభువు సేవకే అంకితం చేసిన రోమ్ బిషప్ ఫ్రాన్సిస్ ఈ ఉదయం 7.35కు తండ్రి సన్నిధి చేరారు' అంటూ వాటికన్ కార్డినల్ కెవిన్ ఫారెల్ అధికారిక ప్రకటన చదివి వినిపించారు. ఆ వెంటనే రోమ్ అంతటా చర్చి టవర్లలో సంతాప సూచకంగా గంటలు మోగాయి. పోప్ అస్తమయం పట్ల ప్రపంచవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తాయి. పలువురు దేశాధినేతలు దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. పోప్ ఫ్రాన్సిస్ అస్తమయం పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. - 6లో

సంస్కరణవాదిగా పోప్ చెరగని ముద్ర - వివరాలు 6లో

న్యూస్‌రీల్

జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ సురేందర్ బదిలీ



తెలంగాణకు చెందిన ఇద్దరు న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. జస్టిస్ పి. శ్రీసుధను కర్ణాటకకు, జస్టిస్ కె. సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సిఫార్సు చేసింది.

- వివరాలు 16లో

ఎంఐఎంకు అండగా కాంగ్రెస్, బీఆర్ఎస్



హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంకు అండగా నిలుస్తున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు సూపర్ బాస్ ఒవైసీ అని అన్నారు.

- వివరాలు 3లో

విద్యుత్ డిమాండ్ భారీగా పతనం



రాష్ట్రంలో 25లక్షల బోరుబావుల కింద యాసంగి పంటల సాగు ముగియడంతో విద్యుత్ వినియోగం బాగా తగ్గిపోయింది. ఆదివారం నాటికి 10,539 మెగావాట్ల కనిష్ట స్థాయికి పడిపోయింది.

- వివరాలు 5లో

4 ఎకరాలకుపైన ఉన్నవారికీ త్వరలో రైతు భరోసా



యాసంగి సీజన్‌కు సంబంధించి నాలుగెకరాలకు పైన ఉన్న రైతులకు సైతం త్వరలోనే రైతుభరోసా నిధులు జమ చేయాలని నిర్ణయించినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

- వివరాలు 5లో



ప్రధాని మోదీతో భేటీ అయిన అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్, ఉషా దంపతులు

6 లో

వాణిజ్య బంధం బలోపేతంపైనే దృష్టి

ట్రేడ్ డీల్‌పై చర్చించిన ప్రధాని మోదీ, అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం పురోగతిపై సంతృప్తి వ్యక్తంచేసిన ఇరు నేతలు

తొలుత వాన్స్ కుటుంబానికి తన నివాసం వద్ద సాదరస్వాగతం పలికిన ప్రధాని

కొత్త ప్రపంచాన్ని నిర్మిద్దాం

కలిసి పనిచేద్దామంటూ జపాన్ పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్ ఆహ్వానం

తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయని వెల్లడి

ఒసాకాలో వరల్డ్ ఎక్స్‌పోలో పాల్గొన్న సీఎం బృందం

ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్



జపాన్‌లోని ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్‌పోలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ, ఒసాకా, ప్రపంచం కలిసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. 'తెలంగాణకు జపాన్ మధ్య చక్కటి సంబంధాలున్నాయి. హైదరాబాద్‌కు రండి.. మీ ఉత్పత్తులు తయారు చేయండి.. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేసేందుకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి. కలిసి పనిచేద్దాం.. నవ ప్రపంచాన్ని నిర్మిద్దాం..' అంటూ జపాన్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికారు. జపాన్ పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సోమవారం ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్‌పోలో పాలుపంచుకుంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపార వేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమైంది. తెలంగాణలో వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. 'ఒసాకాలో జరుగుతున్న వరల్డ్ ఎక్స్‌పోలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ పాలుపంచుకోవటం గర్వంగా ఉంది. తెలంగాణ, జపాన్‌ల మధ్య ఉన్న చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాల భాగస్వామ్యంగా మార్చుకుందాం. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కలిసి పనిచేద్దాం. మా ప్రభుత్వం స్థిరమైన, సులభతర పారిశ్రామిక విధానాన్ని అనుసరిస్తోంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయి..' అని సీఎం చెప్పారు.

బయో, ఐటీ రంగాల్లో గుర్తింపు: శ్రీధర్‌బాబు

ఐటీ, బయో టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ప్రత్యేకమైన గుర్తింపు సాధించిందని

మిగతా 3వ పేజీలో ▶

జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- అగ్రనేత ప్రయాగ్ మాంఝీ సహా 8 మంది మావోయిస్టులు మృతి
- బొకారో జిల్లా లాల్‌పానియా దగ్గర లుగూ గుట్టల్లో ఘటన
- కేంద్ర కమిటీ సభ్యుడు మాంఝీపై కోటి రూపాయల రివార్డు
- మృతుల్లో స్పెషల్ ఏరియా, జోనల్ కమిటీ సభ్యులు -3లో



ఎన్‌కౌంటర్ ఘటనాస్థలానికి వెళ్తున్న 'కోబ్రా' కమాండోలు

కీరవాణి నన్ను టార్గెట్ చేశారు

- వెడ్డింగ్ ఈవెంట్స్ చేసేవాళ్లు గాయకులే కాదనడం చాలాపెద్ద తప్పు
- ఈటీవీ 'పాడుతా తీయగా' కంటెస్టెంట్ ప్రవస్తి ఆరాధ్య ఆవేదన
- ఆయన కంపోజ్ చేసిన పాటలు పాడితేనే ఎక్కువ మార్కులు వేస్తారు
- సింగర్స్‌ని తక్కువ చేసి మాట్లాడతారు.. పక్షపాతంగా వ్యవహరిస్తారు
- వాళ్లకు నచ్చిన వాళ్లను విజేతలుగా ప్రకటిస్తున్నారన్న గాయని - 16లో

ఇదండీ సంగతి



నాకెందుకో బైడెన్ కూడా వలసదారుడేమోనని అనిపిస్తోంది సార్!


మద్యం మసి పూసి.. సిట్ పోలీసుల 'కసి'

విచారణకు హాజరవుతానని సందేశం పంపిన రాజ్ కసిరెడ్డి

అందుకోసం విజయవాడ వస్తుంటే హైదరాబాద్‌లోనే అరెస్టు

విజయవాడకు తరలింపు

ఇప్పటికే ఆయన కుటుంబ సభ్యులను బెదిరించిన సిట్



రాజ్ కసిరెడ్డిని విజయవాడ సీపీ కార్యాలయానికి తీసుకొచ్చిన సిట్ అధికారులు

సాక్షి, అమరావతి: అక్రమ కేసులు నమోదు చేయడం.. లేని ఆధారాలు సృష్టించేందుకు బెదిరింపులు, వేధింపులకు పాల్పడడమే చంద్రబాబు ప్రభుత్వ ఏకైక విధానంగా మారింది. రెడ్ బుక్ కుట్రలను అమలు చేయడమే పనిగా పెట్టుకున్న సిట్ అధికారులు ప్రభుత్వ పెద్దల కోసం చట్టాన్ని ఉల్లంఘిస్తూ బరితెగిస్తున్నారు. ఇందులోభాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంపై నమోదు చేసిన అక్రమ కేసు దర్యాప్తు పేరిట సిట్ పన్నాగం పరాకాష్టకు చేరింది. ఈ అక్రమ కేసులో సాక్షిగా విచారణకు పిలిచిన రాజ్ కసిరెడ్డిని సిట్ అధికారులు సోమవారం హైదరాబాద్‌లో అరెస్టు చేయడమే దీనికి తాజా నిదర్శనం. విజయవాడలో సిట్ అధికారుల ఎదుట మంగళవారం విచారణకు హాజరవుతానని చెప్పిన ఆయనను హడావుడిగా అరెస్టు చేయడం వెనుక పక్కా కుట్ర ఉందన్నది స్పష్టమవుతోంది. గోవా నుంచి సోమవారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్న రాజ్ కసిరెడ్డిని శంషాబాద్ విమానాశ్రయంలోనే సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం విచారణకు హాజరవుతానని చెప్పినా వినిపించుకోకుండా తమ వాహనంలోకి ఎక్కించి విజయవాడకు తరలించారు. ఓ వైపు న్యాయస్థానం పరిధిలో ఉన్న అంశం అయినప్పటికీ సిట్ అధికారుల రాజ్ కసిరెడ్డిని హడావుడిగా అరెస్టు చేయడం వెనుక అసలు పన్నాగం ఇలా ఉంది.

విచారణకు వస్తానంటే అరెస్టు ఏమిటో...?

రెడ్‌బుక్ కక్ష సాధింపే తప్ప మరొకటి తమ ఉద్దేశం కాదని చంద్రబాబు ప్రభుత్వం మరోసారి తేల్చిచెప్పింది. ఈ కేసులో రాజ్ కసిరెడ్డిని సోమవారం హడావుడిగా అరెస్టు చేసిన తీరే అందుకు నిదర్శనం. మంగళవారం సిట్ విచారణకు హాజరవుతానని ఆయన సోమవారం మధ్యాహ్నం ఆడియో సందేశం విడుదల చేశారు. అయినా సోమవారం సాయంత్రం హడావుడిగా హైదరాబాద్‌లో అరెస్టు చేయల్సిన అవసరం ఏమిటి? అంటే ఆయనను విచారించడం.. వాస్తవాలు తెలుసుకోవడం తమ లక్ష్యం కాదని సిట్ తన చేతల ద్వారా వెల్లడించింది. అరెస్టు చేసి వేధించి.. ప్రభుత్వ రెడ్‌బుక్ కుట్రకు అనుకూలంగా ఆయన పేరిట అబద్ధపు వాంగ్మూలం నమోదు చేయించడమే తమ అసలు

మిగతా 3వ పేజీలో ▶

కోరి తెచ్చుకున్న తెలంగాణలో కొందరికే ఉద్యోగాలు: భట్టి

యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని వెల్లడి



మెగా జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

మధిర: కోరి, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కొందరు రాజకీయ నాయకులకే ఉద్యోగాలు దక్కాయి తప్ప.. గత పదేళ్లలో నిరుద్యోగులకు లాభం జరగలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిరలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందుకోసం తొలుత పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి, జాబ్ కేలెండర్‌ను విడుదల చేయగా.. తొలి ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలు భర్తీ చేసి, మరో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కసరత్తు చేస్తున్నామని చెప్పారు. రెండో దశలో బహుళ జాతి సంస్థలను రాష్ట్రానికి రప్పించి, లక్షలాది యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కృషి జరుగుతోందని వివరించారు. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దావోస్‌లో పర్యటించి రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకోవడమే కాక ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్నారని తెలిపారు. మూడో దశలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాలకు తోడు రూ.9 వేల కోట్లతో

మిగతా 3వ పేజీలో ▶



అమెరికా సంబంధమా.. అసలే వద్దు!

అమెరికా పెళ్లి సంబంధాలపై ట్రంప్ ఎఫెక్ట్

- వీసా కష్టాలతో వెనకడుగు వేస్తున్న కుటుంబాలు
- నిర్ణయమైన సంబంధాలూ రద్దు చేసుకుంటున్న వైనం
- మళ్లీ స్థానిక సంబంధాలకు పెద్ద పీట
- సొంత ఊళ్లో ఆస్తిపాస్తులు ఉంటే చాలనే అభిప్రాయం

'అగ్రరాజ్యంలో ఉద్యోగం. డాలర్లలో జీతం, పెళ్లయితే ఇద్దరూ కలిసి బాగా సంపాదిస్తారు. కార్లు, బంగళాలు అన్నీ వచ్చేస్తాయి. పిల్లలు అమెరికా పౌరులవుతారు. సొంత ఊళ్లో ఏమున్నా లేకపోయినా అమెరికాలో ఉద్యోగం ఉంటే చాలదా? బంగారంలాంటి అమెరికా సంబంధాన్ని వదులుకోవడం కంటే మూర్ఖత్వం మరొకటి ఉంటుందా?'.. నిన్నమొన్నటి వరకు తెలుగువాళ్లలో అమెరికా సంబంధాలపై ఉన్న అభిప్రాయమిది. ఇప్పుడు అమెరికా పేరెత్తితేనే బాబోయ్ మాకొద్దు ఆ సంబంధం అంటున్నారు. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రావడానికి ముందు, తరువాత అన్నట్లుగా అమెరికా పెళ్లి సంబంధాల పరిస్థితి తయారైంది. ట్రంప్ ఆంక్షలకు ముందు కుదుర్చుకున్న పెళ్లి సంబంధాలు సైతం రద్దవుతున్నాయి. మధ్య తరగతి వర్గాల నుంచి సంపన్న కుటుంబాల వరకు ఇదే పరిస్థితి ఉంది. - సాక్షి, హైదరాబాద్

"ఈ అనిశ్చితి మరో రెండేళ్లు ఉండొచ్చు



ఇది ఒకవిధంగా కష్టకాలమే. ఈ అనిశ్చితి మరో రెండేళ్లు ఉంటుందేమో అనిపిస్తోంది. ఏదో ఒక పరిణామం జరిగి ట్రంప్ మారితే తప్ప ఇప్పట్లో పరిస్థితులు మారుతాయని భావించలేము.

– హిమబిందు, కాన్వొకేషన్స్‌స్క్వేర్, ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ.

ఆ అబ్బాయి షికాగోలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాది క్రితం హైదరాబాద్‌లోని చిక్కడపల్లికి చెందిన ఒక అమ్మాయితో వివాహం నిశ్చయమైంది. గత నెలలో పెళ్లి చేయాలని ఇరు కుటుంబాలు భావించాయి. కానీ డిపెండెంట్ వీసాలపై అమెరికా ఆంక్షలు విధించటంతో ఇప్పుడు ఆ కుటుంబాలు పునరాలోచనలో పడ్డాయి. 'చేసుకుంటే అమెరికా అబ్బాయినే పెళ్లి చేసుకోవాలి' అని కలలు గన్న ఆ అమ్మాయి ఇప్పుడు 'ఏ హైదరాబాదీ అయినా సరే పెళ్లికి రెడీ' అంటోంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన భార్యాభర్తలు కొంతకాలంగా అమెరికాలోని ఒహాయోలో ఉంటున్నారు. భర్తకు హెచ్–1 వీసా ఉంది. హెచ్–4 వీసాపై రెండేళ్ల క్రితం భార్యను తీసుకెళ్లాడు. అక్కడికి వెళ్లిన తరువాత ఆమె రెండుమూడు కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నట్లు ప్రభుత్వం వద్ద నమోదు చేసుకుంది. ఇటీవల సొంత ఊరుకు వచ్చిన ఆ జంట తిరిగి అమెరికాకు వెళ్లారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు ఎయిర్‌పోర్టులోనే ఆమెను నిలిపివేసి, ఉద్యోగాల గురించి ఆరా తీశారు. ఆమె పనిచేస్తున్నట్లు చెప్పిన కంపెనీల హెచ్‌ఆర్ విభాగాలు ఆ విషయాన్ని ధ్రువీకరించకపోవడంతో ఆమె వీసాను ఫ్రీజ్ చేశారు. గత్యంతరం లేక ఆమె భారత్‌కు తిరిగి రావాల్సి వచ్చింది. ట్రాఫిక్ ఉల్లంఘనలకు కూడా వీసాలు రద్దయిపోతున్న పరిస్థితి ఉంది. ట్రంప్ ఆంక్షలు ప్రారంభమైన తరువాత ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు రెండున్నర నెలల్లోనే సుమారు వేయి మంది తెలుగువాళ్లు వివిధ కారణాలతో వెనుదిరిగి వచ్చినట్లు హైదరాబాద్‌కు చెందిన కన్సల్టెన్సీ సంస్థలు చెబుతున్నాయి. మరోవైపు కొత్తగా వీసాల దరఖాస్తు చేసుకున్న వేలాది మంది ఆశలు వదిలేసుకున్నారు. ఈ అనిశ్చితి కారణంగా పెళ్లి సంబంధాలు రద్దుకావడం, వాయిదా వేసుకోవడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అమీర్‌పేట్‌లో ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న హిమబిందు తెలిపారు. అమెరికా సంబంధాల కోసం మ్యారేజ్ బ్యూరోల్లో దరఖాస్తు చేసుకున్నవాళ్లు సైతం విరమించుకుంటున్నట్లు చెప్పారు.



అంతులేని వీసా కష్టాలు

చాలాకాలంగా అమెరికాలో ఉండి గ్రీన్‌కార్డుదారులుగా స్థిరపడ్డవాళ్లకు కూడా ఇప్పుడు భద్రత లేకుండా పోయింది. సాధారణంగా ఏడేళ్లకు పైగా అక్కడ ఉంటే గ్రీన్‌కార్డు లభించే అవకాశం ఉంది. కానీ ఏడెనిమిదేళ్ల తరువాత వివిధ కారణాల వల్ల తిరిగి వచ్చి తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడుతున్న వాళ్లు ఇప్పుడు తమ గ్రీన్‌కార్డులను వదులుకోవాల్సి వస్తోంది. సాధారణంగా గ్రీన్‌కార్డుదారులు తమ గుర్తింపును కొనసాగించాలంటే అమెరికాలోనే ఉంటున్నట్లు నమోదు కావాలి. అందుకోసం ప్రతి 6 నెలలకు ఒకసారి అమెరికా వెళ్లి వస్తారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇలాంటివారి గ్రీన్‌కార్డులను కూడా రద్దు చేస్తుండటంతో భద్రత లేకుండా పోయింది. అమెరికా పౌరసత్వం కలిగిన వాళ్లకు మాత్రమే ఇప్పుడు పూర్తి భద్రత ఉందని హిమబిందు తెలిపారు. అలాంటి కుటుంబాల్లో సంబంధాలు ఇచ్చిపుచ్చుకోవడానికి కొంత అవకాశాలు ఉన్నాయి.

అమెరికా పౌరులైతేనే భద్రత

డాలర్ డ్రీమ్స్ కరిగిపోవటంతో పెళ్లి సంబంధాల్లో పాతకాలపు పద్ధతులకు మళ్లీ పెద్దపీట వేస్తున్నారు. అమెరికాలో ఉద్యోగం, పెద్ద చదువుల జోలికి వెళ్లకుండా సొంత ఊళ్లో ఏ మేరకు ఆస్తి ఉంది? ఎన్ని ఎకరాల భూమి ఉంది? హైదరాబాద్‌లో సొంత ఫ్లాట్, ఇల్లు వంటివి ఉన్నాయా? ఉన్న ఊళ్లో సదరు కుటుంబానికి ఎలాంటి గౌరవ మర్యాదలు ఉన్నాయి? వంటి అంశాలను ఆరా తీసి సంబంధాలను ఎంపిక చేసుకుంటున్నారు. 'అమెరికా అబ్బాయిల కోసం ఎదురుచూసేందుకు అమ్మాయిలు నిరాకరిస్తున్నారు. చాలామంది ఇప్పుడు డిగ్రీ చేసిన వాడైనా సరే కుటుంబ భద్రత బాగుంటే చాలని భావిస్తున్నారు' అని హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ వివాహ పరిచయవేదిక ప్రతినిధి ఒకరు చెప్పారు.

పాతకాలపు 'నయా'ట్రెండ్

క్లుప్తంగా...

మానవసేవకు అంకితమైన పోప్ ఫ్రాన్సిస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: శాంతిదూతగా ప్రపంచంపై పోప్ ఫ్రాన్సిస్ చెరగని ముద్ర వేశారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. కేథలిక్ చర్చి అధిపతి పోప్ ఫ్రాన్సిస్ మరణంపై విచారం వ్యక్తం చేశారు. ఆయన తన జీవితాన్ని చర్చి, మానవ సేవకు అంకితం చేశారని కొనియాడారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం మానవాళికి తీరని లోటని సీఎం తెలిపారు.

పోప్ ఫ్రాన్సిస్ మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



సాక్షి, అమరావతి: పోప్ ఫ్రాన్సిస్ మృతిపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'పోప్ ఫ్రాన్సిస్ మృతి బాధాకరం. క్యాథలిక్ చర్చి సమాజానికి ప్రభావవంతమైన అధిపతి.. లాటిన్ అమెరికా నుంచి వచ్చిన మొదటి పోప్.. శాంతి, కరుణ కోసం ప్రపంచ గొంతుకగా నిలిచిన నిజమైన మానవతావాది.. పోప్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను' అని వైఎస్ జగన్ 'ఎక్స్'లో సంతాపం తెలిపారు.

పాడైన రోడ్ల జాబితా సిద్ధం చేయాలి

మంత్రి కోమటిరెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వాహనచోదకులను ఇబ్బంది పెడుతున్న రోడ్లను హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో కాంట్రాక్టర్లకు అప్పగించి అభివృద్ధి చేయాలని నిర్ణయించినందున.. సత్వరం వాటిని గుర్తించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. ఇప్పటికే 5189 రోడ్లను గుర్తించినందున, వాటికి డీపీఆర్‌లు సిద్ధం చేయాలని సూచించారు. త్వరలో సీఎంతో చర్చించి కేబినెట్ ఆమోదానికి ఉంచుతామని, ఆ వెంటనే పనులు ప్రారంభించేలా చూస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగం నిర్వాసితులకు పరిహారం పంపిణీని వేగంగా పూర్తి చేయాలని, 2025–26కు జాతీయ రహదారి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

పాఠ్యపుస్తకాల్లో మార్పులు

రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లికి స్థానం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం ఇటీవల రాష్ట్ర గీతంలో స్వల్ప మార్పులు చేయగా.. తెలంగాణ తల్లి చిత్రాన్ని కూడా కొత్తగా రూపొందించింది. వీటిని విస్తృత ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో భాగంగా పాఠ్యపుస్తకాల్లో ముద్రించారు. జూన్‌లో మొదలయ్యే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఉచిత పుస్తకాల్లో.. కొత్తగా రూపొందించిన తెలంగాణ తల్లి చిత్రంతో పాటు అందెశ్రీ రచించిన రాష్ట్ర గీతాన్ని పొందుపరిచారు. ఈసారి కొత్తగా పాఠ్యపుస్తకాల్లో రాజ్యాంగం పీఠికను సైతం ముద్రించారు.



పాఠ్యపుస్తకంలో తెలంగాణ తల్లి నూతన చిత్రం

టీచర్లకు వేసవిలో శిక్షణ

- విద్యా ప్రమాణాలు పెంచడం కోసమే
- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ
- ముందుగా రిసోర్స్ పర్సన్ల ఎంపిక
- ఈ నెల 30లోగా ఈ ప్రక్రియ పూర్తి
- ఎంపిక ప్రక్రియలో వివిధ అంశాలకు మార్కులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి జిల్లా అధికారులను సోమవారం ఆదేశించారు. జిల్లా, మండల స్థాయిలో నైపుణ్యం గల శిక్షకులను (రిసోర్స్ పర్సన్స్) గుర్తించాలని సూచించారు. దీనికోసం జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో జిల్లా విద్యాశాఖాధికారి కన్వీనర్‌గా, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్, క్వాలిటీ కో–ఆర్డినేటర్, ముగ్గురు సబ్జెక్టు నిపుణులు సభ్యులుగా ఉంటారు. శిక్షణ కార్యక్రమాన్ని గతం కన్నా భిన్నంగా నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో రిసోర్స్ పర్సన్ ఎంపికకు ప్రామాణికాలను రూపొందించింది. వచ్చిన దరఖాస్తులను అనేక కోణాల్లో వడపోసి ఎంపిక చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ముందుగా రిసోర్స్ పర్సన్స్‌కు రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇస్తారు. వీళ్లు జిల్లా, మండల స్థాయిలో టీచర్లకు శిక్షణ ఇస్తారు. రిసోర్స్ పర్సన్ ఎంపిక ఈ నెల 30లోగా పూర్తి చేయాలని సూచించారు.

ఎందుకీ శిక్షణ?

కొన్నేళ్లుగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే సహా అనేక జాతీయ సర్వేల్లో రాష్ట్ర విద్యా ప్రమాణాలు తగ్గినట్టు తేలింది. చదవడం, రాయడంలో కనీస ప్రమాణాలు కన్పించడం లేదు. ఈ అంతరాన్ని పూడ్చడానికి ముందుగా టీచర్లలో మార్పు తేవాలని విద్యాశాఖ భావిస్తోంది. విద్యార్థుల స్థాయిని గుర్తించడం, వెనుకబడిన వారికి అర్థమయ్యేలా బోధన చేయడం, మారుతున్న బోధన విధానాలను అనుసరించడం, సిలబస్‌లో మార్పులను అవగతం చేసుకోవడంతో పాటు సాంకేతిక విద్యా విధానాలపై శిక్షణ ఇస్తారు. ఢిల్లీలో సరికొత్త బోధన మెళకువలు అనుసరిస్తున్నారు. కేరళలో డిజిటల్ విద్యపై టీచర్లకు శిక్షణ ఇచ్చారు. మహారాష్ట్రలో పాఠశాల స్థాయిలో విద్యా ప్రమాణాలపై అంచనాలను రూపొందిస్తున్నారు. ఇదే స్థాయిలో తెలంగాణలోనూ ముందుగా టీచర్ల బోధన పటిమను పెంచేలా శిక్షణ ఇస్తారు.

అర్హులకే అవకాశం

రిసోర్స్ పర్సన్ ఎంపికలో బోధన అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. కనీసం పోస్టు–గ్రాడ్యుయేషన్ విద్యార్హత ఉండాలని విద్యాశాఖ సూచించింది. గతంలో శిక్షణ ఇచ్చిన అనుభవం, సబ్జెక్టులో నైపుణ్యం, అత్యాధునిక బోధన ప్రమాణాల్లో నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలను పరిగణనలోనికి తీసుకుంటారు. ప్రతి సబ్జెక్టు నుంచి నలుగురిని ఎంపిక చేస్తారు. వీరిని ఎంపిక చేసేప్పుడు ఒక్కో అంశానికి కొన్ని మార్కులను ఎంపిక కమిటీ ఇస్తుంది. ఎక్కువ మార్కులు ఎవరికి వస్తే వారిని మాత్రమే ఎంపిక చేస్తారు. సబ్జెక్టు నైపుణ్యం, కమ్యూనికేషన్ ప్రజెంటేషన్, బోధనలో నైపుణ్యం, డిజిటల్ టూల్స్ వాడుతూ బోధించటం వంటి ఒక్కో విభాగానికి పది మార్కులు కేటాయిస్తారు. ఇన్నోవేటివ్ ప్రాక్టీస్, ట్రైనింగ్ అవసరాలపై ఇచ్చే ప్రజెంటేషన్‌కు ఒక్కో దానికి ఐదు మార్కుల చొప్పున ఉంటాయని అధికారులు తెలిపారు.

నేడు ఇంటర్ ఫలితాలు

- మధ్యాహ్నం 12 గంటలకు విడుదల
- త్వరగా ఫలితాలు అందించేందుకు 'సాక్షి' ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలకానున్నాయి. ఇంటర్ బోర్డు కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ ఫలితాలను విడుదల చేస్తారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు జరిగాయి. రెండు సంవత్సరాలకు కలిపి 9 లక్షల మందికిపైగా విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 60 లక్షల సమాధాన పత్రాలకు 19 కేంద్రాల్లో మూల్యాంకనం చేపట్టారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ ప్రక్రియ పూర్తయింది. తర్వాత మార్కుల ఆన్‌లైన్ ఫీడింగ్, ట్రయల్ రన్ కూడా వారం రోజుల క్రితమే నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి సమయం కోసం అధికారులు ఇంత కాలంగా నిరీక్షిస్తున్నారు. కాగా, ఫలితాల రోజే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ తేదీని కూడా ప్రకటిస్తామని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.

'సాక్షి'లో వేగంగా ఫలితాలు..

ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలను వేగంగా అందించేందుకు 'సాక్షి' ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. విద్యార్థులు ఫలితాల కోసం www.sakshieducation.com వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వొచ్చు.

బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు

- నోటిఫికేషన్ విడుదల
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- పదో తరగతి మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు
- బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి వచ్చేనెల 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. జూనియర్ ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీలతో అగ్రికల్చర్ – క్రాప్ ప్రొడక్షన్, కంప్యూటర్ గ్రాఫిక్స్, యానిమేషన్, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 130 జూనియర్ కాలేజీలలో బాలురకు 11,360 సీట్లు, 127 జూనియర్ కాలేజీల్లో బాలికలకు 10,720 సీట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు సొసైటీ వెబ్‌సైట్ https://mjptbcwreis.telangana.gov.in (లేదా) https://mjpabcwreis.cgg.gov.in/TSMJBCWEB/లో లేదా 040–23328266 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. బీసీ గురుకుల పాఠశాలల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, వారు 10వ తరగతి చదివిన గురుకుల స్కూల్‌లో సంబంధిత ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు ఇస్తే సరిపోతుందని వివరించారు.

ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో కొత్త కోర్సులు

- బీకాం సీఏ, సీఎస్, ఫైనాన్స్‌తోపాటు, టూరిజం, బీఏ ఆర్కియాలజీ కోర్సులు
- ఫుడ్‌సైన్స్ న్యూట్రీషియన్, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, నర్సింగ్ కూడా..
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తేవాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. డిమాండ్‌కు తగిన కోర్సులు, మార్కెట్‌లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న వాటిని గుర్తించి విద్యార్థులకు అందించాలని ఎస్సీ గురుకుల సొసైటీ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ సొసైటీ పరిధిలో 30 గురుకుల డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిలో బీఎస్సీ, బీకాం, బీజెడ్సీ కోర్సులు మాత్రమే ఉన్నాయి. మొత్తం కాలేజీల్లో 25 వేల సీట్లు ఉన్నాయి. బీకాం, బీజెడ్సీ కోర్సులకు డిమాండ్ తగ్గుతూ వస్తోంది. దీంతో కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చి, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ఎస్సీ గురుకుల సొసైటీ కసరత్తు వేగవంతం చేసింది. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందించింది.

కోర్సు ముగియగానే కొలువొచ్చేలా...

- డిగ్రీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టే ముఖ్య ఉద్దేశం తక్షణ కొలువులు దక్కడమే. ఈ దిశగా కసరత్తు చేసి బీకాంలో 3 కొత్త కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీకాం కార్పొరేట్ సెక్రెటరీషిప్, బీకాం ఫైనాన్స్ కోర్సులను అందుబాటులోకి తెస్తున్నారు.
- బీఏ ఆర్కియాలజీ, బీఏ టూరిజం కోర్సులతోపాటు ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషన్, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, నర్సింగ్ కోర్సులు కూడా కొత్తగా ప్రవేశపెట్టనున్నారు. కొత్త కోర్సులకు అత్యంత డిమాండ్ ఉండటంతో ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య కూడా సంతృప్తికరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్‌కు అరుదైన గౌరవం

'ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన' అవార్డు దక్కించుకున్న మండలం

సాక్షి, న్యూఢిల్లీ: ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలం అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. ప్రధాన మంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం 2024లో భాగంగా 'ఆకాంక్షాత్మక బ్లాక్ కార్యక్రమం' కేటగిరీలో మొత్తం ఐదు బ్లాకులు ఎంపికకాగా అందులో నార్నూర్ బ్లాక్ ఒకటిగా అవార్డు గెలుచుకుంది. జాతీయ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ అవార్డులు ప్రదానం చేశారు. ఆకాంక్షాత్మక బ్లాక్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేసి మండలం అభివృద్ధికి చేసిన కృషికిగాను నార్నూర్ మండలానికి ఈ అవార్డు దక్కింది. దేశంలో అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాల్లోని 426 బ్లాక్‌లను 'ఆకాంక్షాత్మక బ్లాక్ కార్యక్రమం' కింద నీతిఆయోగ్ ఎంపిక చేసింది. ఇందులో భాగంగా విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనతో పాటు వ్యవసాయ రంగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన ఐదు బ్లాక్‌లను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపిక చేశారు. నార్నూర్ మండలంలో పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రాల ద్వారా 100 శాతం టీబీని గుర్తించడం, ఇప్ప పువ్వుతో తయారు చేసిన లడ్డూ ద్వారా పోషకాహారం అందించడం, 70 శాతం పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్స్ ఏర్పాటు, ప్రకృతి వ్యవసాయం ద్వారా 1,200 కుటుంబాలకు నేరుగా లబ్ధి, 74 శాతం గ్రామ పంచాయతీలను సీఎస్‌సీ సెంటర్ల ద్వారా అనుసంధానించడం వంటి కార్యక్రమాల ద్వారా నార్నూర్ మండలంలో జరిగిన అభివృద్ధికి గుర్తింపుగా జాతీయ పురస్కారం దక్కింది.

వైద్య విద్యలో ప్రమాణాలు తగ్గొద్దు

- ఘోస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తే కఠిన చర్యలు
- ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు మంత్రి దామోదర హెచ్చరిక
- యాజమాన్యాలు, డీన్స్, ప్రిన్సిపాల్స్‌తో సమావేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లో బోధన నాణ్యత విషయంలో రాజీ పడితే సహించేది లేదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. తెలంగాణ వైద్యులకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుందని, దానిని వైద్య విద్యా సంస్థలు కాపాడాలని సూచించారు. సోమవారం సచివాలయంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీల యాజమాన్యాలు, డీన్స్, ప్రిన్సిపాల్స్‌తో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఘోస్ట్ ఫాకల్టీని పెట్టి నడిపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని, ఇలాంటి చర్యలు వల్ల వైద్య విద్య ప్రమాణాలు దిగజారుతాయని అన్నారు. నాణ్యత పాటించని కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు స్టైఫండ్స్ చెల్లించే విషయంలో కొన్ని కాలేజీలపై వరసగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ విషయంలో రాజీ పడొద్దని సూచించారు. అదనపు ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టినా, ముందుగానే ఫీజులు కట్టాలని ఒత్తిడి చేసినా ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ఎన్ఎంసీ నిబంధనల విషయంలో కాలేజీలు లేవనెత్తిన సమస్యలను ఆ సంస్థ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

2030 నాటికి ఎయిడ్స్‌ను నియంత్రిద్దాం: రాష్ట్రం నుంచి ఎయిడ్స్‌ను పూర్తిగా పారద్రోలేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీసాక్స్) అధికారులతో మంత్రి సోమవారం కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో సమావేశమయ్యారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, పరీక్షలు, చికిత్సల పురోగతిని సమీక్షించారు. 2024–25లో 19.02 లక్షల మందికి హెచ్ఐవీ టెస్టులు చేయగా.. 9,415 మందికి పాజిటివ్ వచ్చిందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 1.24 లక్షల మంది హెచ్ఐవీ పేషెంట్లు ఉన్నారని, వీరికి ఏఆర్టీ సెంటర్ల ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తున్నామని తెలిపారు. దీంతో 2030 నాటికి హెచ్ఐవీ/ఎయిడ్స్‌ను పూర్తిగా నియంత్రించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా టీసాక్స్ పనిచేయాలని సూచించారు.

కేసు నుంచి తప్పించేందుకు... బిల్లు మంజూరు చేసేందుకు...

రూ. లక్ష చొప్పున తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సీఐ, మున్సిపల్ డీఈఈ



నగదుతో పట్టుబడిన సీఐ సోమ సతీశ్. చిత్రంలో గోపి



ఏసీబీ అధికారులకు పట్టుబడిన నాగారం మున్సిపల్ డీఈఈ రఘు, రాకేశ్, సురేశ్

కీసర/మణుగూరు టౌన్: ఏసీబీ వలకు ఇద్దరు అవినీతి అధికారులు చిక్కారు. భూ వివాదంలో కేసు నుంచి తప్పించేందుకు ఇప్పటికే రూ.3 లక్షలు తీసుకుని, మరో లక్ష రూపాయలు తీసుకుంటూ సీఐ.. బిల్లు క్లియరెన్స్‌కు కాంట్రాక్టర్ నుంచి లక్ష రూపాయలు తీసుకుంటూ నాగారం మున్సిపల్ డీఈఈ.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీలు తెలిపిన ప్రకారం ఆయా ఘటనల వివరాలు..

కేసు నమోదు చేస్తామని బెదిరించి..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం గుట్టమల్లారంలోని సర్వే నంబర్ 39, 40లో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకుంటున్నారు. తహసీల్దార్ రాఘవరెడ్డి ఫిర్యాదుతో ఇళ్లు నిర్మిస్తున్న ఆరుగురిపై ఈనెల 14న కేసు నమోదైంది. ఈ క్రమంలో ఆ భూమి విక్రయించిన మణుగూరు వాసి బేతంచర్ల వెంకటేశ్వర్లు, ఆయన మేనల్లుడు కూరాకుల శ్రీనివాసరావుపైనా కేసు నమోదు చేస్తానని సీఐ సోమ సతీశ్ బెదిరించారు. ఈ క్రమంలో ఓ చానల్ (సాక్షి కాదు) రిపోర్టర్ గోపీ ద్వారా రూ.4 లక్షలు డిమాండ్ చేయగా, నాలుగు రోజుల క్రితం సీఐ బాకీ ఉన్న వ్యక్తికి బేతంచర్ల వెంకటేశ్వర్లు నేరుగా రూ.3 లక్షలు చెల్లించారు. మిగిలిన రూ.లక్షను వెంకటేశ్వర్లు షాప్ వద్ద గోపి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి విచారించడంతో సీఐ సతీశ్ తీసుకురమ్మన్నాడని తెలిపారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ రమేశ్ తెలిపారు.

బిల్లు క్లియరెన్స్‌కు..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం మున్సిపల్ పరిధి ఆర్ఎల్‌నగర్ సమీపంలో రూ.11 లక్షల మేర సీసీ రోడ్డుపనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ రమేశ్ పనులు దక్కించుకున్నాడు. పూర్తయిన పనులకు సంబంధించి జీఎస్టీ మినహాయించి కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ 8.5 లక్షల మేర బిల్లును క్లియర్ చేసేందుకు డీఈఈ సుదర్శనం రఘు రూ.1,37,000 డిమాండ్ చేశాడు. మొదటి విడతగా సోమవారం లక్ష రూపాయలను డీఈఈ సూచన మేరకు వర్క్ ఇన్‌స్పెక్టర్ వి.రాకేశ్ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. విచారణలో మరో మున్సిపల్ ఇన్‌స్పెక్టర్ వి.సురేశ్ కూడా భాగమని తేలడంతో ముగ్గురినీ అరెస్టు చేశామని, వీరిని నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని రంగారెడ్డి సెంట్రల్ జోన్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు.

వేముల రోహిత్ చట్టాన్ని అమలు చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లేఖ
- బలమైన చట్టంతో విద్యావ్యవస్థలో కులం పేరుతో దూషణలకు చెక్ పెట్టాలి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో వేముల రోహిత్ చట్టాన్ని అమలు చేయాలని.. బలమైన చట్టంతో విద్యావ్యవస్థలో కులం పేరుతో దూషణలకు చెక్ పెట్టాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ప్రతి విద్యార్థి వివక్ష లేకుండా గౌరవంగా, భద్రతతో, సమాన అవకాశాలను పొందకపోతే మన విద్యావిధానం అందరికీ న్యాయం చేయదన్నారు. వివక్ష కారణంగా యువత హత్యలను ఆపేందుకు చట్టం అవసరమని తెలిపారు. కుల వివక్ష నిర్మూలనకు, ప్రతి బిడ్డకు సమాన విద్యను అందించడానికి కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కట్టుబడి ఉందన్న రాహుల్... ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాసిన తర్వాత, తాజాగా హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖూ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసి 'రోహిత్ వేముల చట్టం' అమలు చేయాలని రాహుల్‌గాంధీ అభ్యర్థించారు. అంబేడ్కర్, రోహిత్ వేముల సహా కోట్లాది మంది ఇతరులు అనుభవించిన కులవివక్షను భారతదేశంలోని ఏ విద్యార్థి ఎదుర్కోరాదన్నారు. అణగారినవారు కూడా సాధికారత సాధించేందుకు, కులవివక్షను పారదోలేందుకు విద్య ఒక్కటే సాధనమని అంబేడ్కర్ చెప్పినా, దశాబ్దాల తర్వాత కూడా లక్షలాదిమంది దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు కులవివక్షను ఎదుర్కోవడం చాలా సిగ్గుచేటని చెప్పారు. ఈ వివక్ష రోహిత్ వేముల, పాయల్ తాడ్వీ, దర్శన్ సోలంకి వంటి మంచి విద్యార్థుల జీవితాలను బలిగొన్నదని, ఇలాంటి భయానక ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. ఇప్పుడు ఈ అన్యాయానికి పూర్తిగా అడ్డుకట్ట వేయాల్సిన సమయం వచ్చిందని రాహుల్‌గాంధీ గుర్తు చేశారు.

'ఉపాధి' మరింత విస్తరణ

రాజకీయ సహకారంలో కొత్త ఒరవడి

- ప్రపంచ స్థాయి రాజకీయ యవనికకు తెలంగాణ ఆతిథ్యం
- రాష్ట్ర ప్రభుత్వం, సమృద్ధ భారత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గ్లోబల్ సమ్మిట్... 24 నుంచి 26 వరకు నిర్వహణ

పూర్తి వివరాలు సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో..

క్లుప్తంగా...

కొత్త ఉద్యోగాలు దేవుడెరుగు.. ఉన్న ఉద్యోగాలు పోతున్నాయి

● బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రానికి లక్ష కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని గతంలో కూడా చెప్పారు. అవి ఎక్కడా కనిపించలేదు. ఇప్పుడు చెబుతున్న కొత్త వాటి సంగతేమిటో తెలియదు. రాష్ట్రంలో కొత్త ఉద్యోగాలు దేవుడెరుగు. ఉన్న ఉద్యోగాలు పోతున్నాయి. జీతాలు ఇవ్వడం లేదు. గత బడ్జెట్లో రూ.74 వేల కోట్లు ఖర్చు పెట్టలేక పోయామని సీఎం స్వయంగా చెప్పారు' అని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పదేళ్ల బీజేపీ పాలనపై అబిడ్స్ చౌరస్తా వద్ద చర్చకు రావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక స్మార్ట్ సిటీల పేరుతో, అమృత్ నగరాల పేరుతో నేరుగా నిధులు ఇచ్చి నగరాలను అభివృద్ధి చేస్తున్నారని ఆయన చెప్పారు. జీహెచ్‌ఎంసీతో సహా రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అభివృద్ధికి వేల కోట్ల నిధులు కేంద్రం ఇచ్చిందని, అయినా రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష ప్రదర్శిస్తోందంటూ బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎన్నికల బహిష్కరణ పిలుపు నివ్వడం సరికాదన్నారు.

రజతోత్సవం బీఆర్‌ఎస్‌దా.. టీఆర్‌ఎస్‌దా?: చామల



సాక్షి, హైదరాబాద్: 'దేశాన్ని దోచుకుందామని టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చింది నిజం కాదా? పార్టీ పేరు నుంచి తెలంగాణ అనే పదాన్ని తొలగించిన వారు రజతోత్సవ సభ ఎలా నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ పెట్టి 25 ఏళ్లు అయిందా? లేదంటే 2001లో పెట్టిన టీఆర్‌ఎస్ ఇంకా ఉందా? రజతోత్సవ సభ బీఆర్‌ఎస్‌దా? టీఆర్‌ఎస్‌దా? తుపాకీ రాముడు కేటీఆర్ నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి' అని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కళ్ల ముందున్న చరిత్రను కేటీఆర్ వక్రీకరిస్తున్నారని, కేసీఆర్‌ను నెల్సన్ మండేలాలాగా, గాంధీలాగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. అసలు కేసీఆర్‌కు లేవడానికే చేతకావడం లేదని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయి ఏం చేస్తారని చామల ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ నేతలు గజ్జి భాస్కర్ యాదవ్, కమల్, శ్రీకాంత్ యాదవ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పెట్టారని, చంద్రబాబు హైటెక్ సిటీ కట్టారని చెపుతున్న కేటీఆర్ మరి కేసీఆర్ ఏం చేశారో ఎందుకు చెప్పలేకపోతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్‌కు త్వరలోనే బీసీ నేతను అధ్యక్షుడిని చేస్తారనే వార్తలు వస్తున్నాయని చామల చెప్పారు.

బలం లేనిదే పోటీ ఎందుకు?: బల్మూరి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ అభివృద్ధి కోసం ఏమీ చేయలేని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మతం పేరుతో రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలిచేందుకు తగినన్ని ఓట్లు లేవని, ఆ పార్టీ గెలిచే అవకాశాలు, బలం లేకపోయినా అసలెందుకు పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. సోమవారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రశాంత హైదరాబాద్ నగరంలో మత విద్వేషాలు పెంచే ప్రయత్నంలో బీజేపీ నేతలు ఉన్నారని ఆరోపించారు. గెలిచే బలంలేని పాలమూరులో పోటీ చేయని బీజేపీ, అక్కడ జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓట్లేసిన సంగతి అందరికీ తెలుసునని అన్నారు. అందుకు ప్రతిగా ఇప్పుడు బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి పడతాయనే ఆశతోనే బలం లేకపోయినా పోటీ చేస్తోందన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లయిన బీసీ, ఎస్సీ కార్పొరేటర్లు ఎవరూ బీజేపీకి ఓట్లు వేయొద్దని బల్మూరి వెంకట్ విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ రక్షణ మన బాధ్యత: ఎమ్మెల్సీ కవిత



భద్రాచలం అర్బన్: కాంగ్రెస్ పార్టీ కబంధ హస్తాల నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపైనా ఉందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆమె సోమవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ఉద్యమకారుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ శ్రేణులకు ఏ అవసరమొచ్చినా తనను సంప్రదించాలని చెప్పారు. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి పనులకు మూడు పైసలు కూడా తేలేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసత్యాలు మాట్లాడుతున్నారని, రూ.1.6 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి తెచ్చిన సర్కారును ప్రశ్నిస్తే బుకాయిస్తున్నారని ఆరోపించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ద్రోహి అని, ఇప్పుడు ఉప ఎన్నిక వస్తే బీఆర్‌ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

అగ్రనేత ప్రయాగ్ మాంఝీ సహా 8 మంది మావోయిస్టులు మృతి

- బొకారో జిల్లా లాల్‌పానియా దగ్గర లుగూ గుట్టల్లో ఘటన
- కేంద్ర కమిటీ సభ్యుడు మాంఝీపై కోటి రూపాయల రివార్డు
- మృతుల్లో స్పెషల్ ఏరియా, జోనల్ కమిటీ సభ్యులు



స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో ఆపరేషన్‌లో పాల్గొన్న బలగాలు



ఎన్‌కౌంటర్ మృతులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శాంతిచర్చల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న సమయంలో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. జార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లా లాల్‌పానియా దగ్గర లుగూ గుట్టల్లో సీఆర్‌పీఎఫ్ కోబ్రా దళాలు – మావోయిస్టుల మధ్య సోమవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో 8 మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంఝీ (60) అలియాస్ వివేక్ అలియాస్ కరణ్‌దాదాతో పాటు స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు అరవింద్ యాదవ్, జోనల్ కమిటీ సభ్యుడు రాహుల్ మాంఝీ కూడా ఉన్నారు. ప్రయాగ్ మాంఝీపై రూ.కోటి, అరవింద్ యాదవ్‌పై రూ.25 లక్షలు, రాహుల్ మాంఝీపై రూ.10 లక్షల రివార్డు ఉన్నాయి. ఇతర మృతులను మహేశ్ మాంఝీ, తాలు, రంజు మాంఝీ, గంగారామ్, మహేశ్‌గా గుర్తించారు. ఘటనాస్థలిలో ఏకే 47, ఇన్సాస్, ఎస్‌ఎల్‌ఆర్‌తో పాటు భారీ సంఖ్యలో నాటు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. గత జనవరిలో ఒడిశాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి మరణించిన విషయం విదితమే. ప్రయాగ్ మాంఝీ స్వస్థలం జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్ జిల్లా తుండి పోలీస్ స్టేషన్ పరిధిలోని దల్‌బుదా గ్రామం అని తెలిసింది.

దాడులకు వ్యూహాలు, అమల్లో దిట్ట

ప్రయాగ్ మాంఝీ కేంద్ర కమిటీ సభ్యుడి హోదాలో దేశంలోని తూర్పు ప్రాంతానికి మావోయిస్టు పార్టీ బాధ్యుడిగా ఉన్నారు. దాడులకు వ్యూహాలు రచించడం, అమలు చేయడంలో దిట్టగా ఆయనకు పేరుంది. 50 మంది సాయుధ సభ్యులతో కూడిన టీమ్ ఈయనకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంది. జార్ఖండ్‌తో పాటు బిహార్, బెంగాల్, ఒడిశాలో ప్రభావం చూపగల నేతగా పేరుంది. ఇలాంటి వ్యక్తి సాధారణ ఎన్‌కౌంటర్‌లో చనిపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయనపై వందకు పైగా కేసులు ఉన్నాయి. ఇందులో కేవలం గిరిడ్ జిల్లా పరిధిలోనే 50కి పైగా కేసులు ఉండటం గమనార్హం. ప్రయాగ్ మాంఝీ భార్య, మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలలు జయా మాంఝీ ధన్‌బాద్‌లోని ఓ ఆస్పత్రిలో కేన్సర్‌కు చికిత్స పొందుతూ గతేడాది జూలైలో అరెస్టయ్యారు. ఆ తర్వాత కొన్ని రోజులకే ఆమె చనిపోయారు.

మళ్లీ పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారా?

లాల్‌పానియా – పరస్‌నాథ్ ప్రాంతంలోని లూగు కొండలు ఒకప్పుడు మావోయిస్టులకు షెల్టర్ జోన్లుగా ఉండేవి. అయితే ఇక్కడ యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్ పెరిగిన తర్వాత వారి కదలికలు తగ్గాయి. అయితే తాజా ఎన్‌కౌంటర్‌తో మరోసారి మావోయిస్టులు ఈ ఏరియాలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్‌పై హోం మంత్రి అమిత్‌షా 'ఎక్స్'' వేదికగా స్పందించారు. 'నక్సల్స్ ఏరివేతలో భాగంగా చేపట్టిన ఆపరేషన్‌లో మరో భారీ విజయం దక్కింది. ఆపరేషన్‌లో పాల్గొన్న దళాలకు అభినందనలు. నక్సలిజాన్ని అంతమొందించే వరకు ఈ ఆపరేషన్ కొనసాగుతుంది..' అని అందులో పేర్కొన్నారు.

శాంతిచర్చల వేళ...

ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం ముప్పేట దాడి చేస్తుండటంతో మావోయిస్టులు శాంతి చర్చలు జరిపేందుకు ముందుకొచ్చారు. శాంతి చర్చలకు ప్రభుత్వం, ప్రజా సంఘాలు చర్యలు తీసుకోవాలని.. అప్పటివరకు కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు. గడిచిన ఇరవై రోజులుగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో ఈ అంశం నానుతోంది. కాల్పుల విరమణపై ప్రభుత్వ స్పందన కోసం ఎదురు చూస్తుండగా అనూహ్యంగా జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్ చోటు చేసుకోవడంతో, శాంతిచర్చల అంశం ఏ మలుపు తీసుకుంటుందనే ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

బీజాపూర్‌లో మరో మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా చెర్పాల్ అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో గుర్తు తెలియని మావోయిస్టు మృతి చెందాడు. ఈ ఘటనలో పలువురు మావోయిస్టులు గాయపడి తప్పించుకుని ఉంటారనే అనుమానంతో పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. మరోవైపు సుక్మా జిల్లాలోని కేర్లపాల్ అటవీ ప్రాంతంలో నలుగురు మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. మందుపాతరలను అమర్చేందుకు వెళ్తున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

మందుపాతర పేలి జవాన్ మృతి

మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ జవాన్ మృతి చెందిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా తోయినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీస్‌స్టేషన్‌కు నాలుగు కిలోమీటర్ల దూరంలోని మోర్మాడ్ వద్ద మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబు (మందుపాతర)ను గమనించని ఆర్మ్‌డ్ ఫోర్స్ విభాగానికి చెందిన జవాన్ మనోజ్ పూజారి (30) దానిని తొక్కాడు. అది పేలడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

కొత్త ప్రపంచాన్ని నిర్మిద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. వీటితో పాటు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్ పరిశ్రమలకు ఉన్న అనుకూలతలను వివరించారు. హైదరాబాద్‌లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీపై ఈ నగరం ఆధారపడుతుందని పేర్కొన్నారు. జపాన్‌కు చెందిన మరుబెని కార్పొరేషన్‌తో ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్)తో పాటు రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నామని, ఆర్‌ఆర్‌ఆర్‌కు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్)కు మధ్య ఉన్న జోన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందని మంత్రి తెలిపారు. నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణతో పాటు నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ చెప్పారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా పెవిలియన్

ఒసాకాలో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'ఒసాకా ఎక్స్‌పో'లో తెలంగాణ తన ప్రత్యేకపెవిలియన్‌ను ఏర్పాటు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి..మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సోమవారం దీనిని ప్రారంభించారు. ప్రతి ఐదేళ్లకో మారు ఒసాకా ఎక్స్‌పో నిర్వహిస్తారు. అయితే ఈ ఎక్స్‌పోలో భారతదేశం నుంచి పాల్గొన్న తొలిరాష్ట్రం తెలంగాణ కావడం విశేషం. కిటాక్యుషు నుంచి సీఎం బృందం ఒసాకా చేరుకుంది. కాగా ఒసాకా ఎక్స్‌పో వేదికపై తెలంగాణ తన వైవిధ్యమైన సంస్కృతి, అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక అనుకూల వాతావరణం, సాంప్రదాయ కళలు, పర్యాటక ఆకర్షణలను ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే సందర్శకులకు చాటి చెప్పనుంది. తెలంగాణ పెవిలియన్‌లో రాష్ట్ర సాంకేతిక పురోగతి, సాంస్కృతిక వారసత్వం, పర్యాటక సంపదను ప్రతిబింబించే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ వేదిక ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించే దిశగా రాష్ట్రం అడుగులు వేయనుంది.



'ఒసాకా ఎక్స్‌పో'లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

కోరి తెచ్చుకున్న తెలంగాణలో కొందరికే ఉద్యోగాలు: భట్టి

▶ మొదటి పేజీ తరువాయి

రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకొచ్చామని, జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తామని భట్టి వెల్లడించారు.

మరో నాలెడ్జ్ సిటీతో 5 లక్షల మందికి లబ్ధి

నాటి ప్రధాని రాజీవ్ గాంధీ దూరదృష్టితో దేశంలో ఐటీ విప్లవానికి నాంది పలికితే, హైదరాబాద్‌లో అప్పటి కాంగ్రెస్ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హైటెక్ సిటీకి పునాదులు వేశారని భట్టి గుర్తు చేశారు. కాగా, ఐదు లక్షల మంది యువతకు ఉపాధి కల్పించేలా మరో నాలెడ్జి సిటీ ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని తెలిపారు. కాగా, జాబ్‌మేళాలో 97 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా 5,827 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 2,325 మందిని ఎంపిక చేసి, కొందరికి డిప్యూటీ సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేంరాజు పాల్గొన్నారు.

రూ. 30 లక్షల జరిమానా కట్టిన చెన్నమనేని

- హైకోర్టు ఆదేశాల మేరకు రెండు డీడీల సమర్పణ
- రూ. 25 లక్షలు ఆది శ్రీనివాస్‌కు.. మిగతాది లీగల్ సర్వీసెస్ అథారిటీకి అందజేత



చెన్నమనేని రమేశ్



డీడీని తీసుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్/వేములవాడ: పౌరసత్వం వివాదం కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు రూ. 25 లక్షల డీడీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సోమవారం అందజేశారు. మరో రూ. 5 లక్షల డీడీని లీగల్ సర్వీసెస్ అథారిటీ పేరిట తీసి కోర్టుకు సమర్పించారు. చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడేనని తేలుస్తూ గత డిసెంబర్‌లో తీర్పు చెప్పిన హైకోర్టు.. తప్పుడు పత్రాలను కోర్టును మోసం చేశారంటూ చెన్నమనేని రమేశ్‌కు రూ. 30 లక్షల జరిమానా విధించింది. ఆ మొత్తంలో పిటిషనర్, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే (ప్రభుత్వ విప్) అయిన ఆది శ్రీనివాస్‌కు రూ. 25 లక్షలు, మిగిలిన సొమ్ము లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని చెన్నమనేని రమేశ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా రెండు డీడీలను చెన్నమనేని రమేశ్ తరఫున ఆయన న్యాయవాది ఆది శ్రీనివాస్ న్యాయవాదికి అందజేశారు.

న్యాయ వ్యవస్థపై విశ్వాసానికి నిదర్శనం: ఆది శ్రీనివాస్

కోర్టు బయట డీడీని అందుకున్న ఆది శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. '15 ఏళ్లుగా న్యాయ పోరాటం ఫలించింది. న్యాయం గెలిచింది. పౌరసత్వాన్ని సవాల్ చేసి విజయం సాధించడం దేశంలో ఇదే ప్రథమం. భారత పౌరసత్వం లేకుండానే 2009 నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతూ తప్పుడు పత్రాలతో అధికారులను, న్యాయస్థానాలను రమేశ్‌బాబు మోసం చేశారు. నాలుగుసార్లు నేను ఎమ్మెల్యే కాకుండా అడ్డుకున్నారు. హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యంపై నమ్మకానికి, న్యాయ వ్యవస్థపై విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం. ఎట్టకేలకు కోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళ్లకుండా రమేశ్‌బాబు తప్పును తెలుసుకున్నారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి. ఇప్పటికే డీజీపీకి ఫిర్యాదు చేశా. అక్రమ మార్గంలో ఎమ్మెల్యేగా కొనసాగినందుకు వేములవాడ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. 2009 నుంచి 2003 వరకు చెన్నమనేని ఎమ్మెల్యే కాదని గెజిట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా' అని వివరించారు.

ఏప్రిల్ కోటా సన్న బియ్యం పంపిణీ పూర్తి

● 74.67 లక్షల కార్డులకు 1.54 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ సజావుగా ముగిసింది. ఏప్రిల్ కోటా కింద ఈనెల ఒకటో తేదీ నుంచే సన్న బియ్యం పంపిణీ ప్రారంభం కాగా, 20వ తేదీ వరకు పంపిణీని పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 91.19 లక్షల ఆహార భద్రతా కార్డులు ఉండగా, 1.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతుందని తేల్చారు. అయితే హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సన్న బియ్యం పంపిణీ జరగలేదు. కాగా, ఈ నెలలో 74.67 లక్షల కార్డులకు గాను 1.54 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశారు. మే నెల కోటా కింద రేషన్ దుకాణాలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల సంస్థ సన్నద్ధమవుతోంది. ఏప్రిల్ కోటా పూర్తయిన నేపథ్యంలో ఈనెల 24వ తేదీ నుంచి స్టేజ్ –1 గోడౌన్‌ల నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు బియ్యం పంపిస్తారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు ఈనెలాఖరులోగా బియ్యాన్ని సరఫరా చేస్తే, మే ఒకటో తేదీ నుంచి పంపిణీ జరుగుతుంది. కాగా ఏప్రిల్ కోటా బియ్యం పంపిణీ అనుకున్న విధంగా సాగినట్లు డైరెక్టర్ ప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు.

మద్యం మసిపూసి.. సిట్ పోలీసుల 'కసి'

▶ మొదటి పేజీ తరువాయి

కుట్ర అని తేల్చిచెప్పింది. రాజ్ కసిరెడ్డి విషయంలో సిట్ మొదటి నుంచీ అదే కుతంత్రంతో వ్యవహరిస్తోంది. ఈ కేసులో సాక్షిగా విచారణకు రావాలని ఆయనకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. తనను ఏ విషయంలో విచారించాలని భావిస్తున్నారో తెలియజేస్తే తగిన సమాచారంతో వస్తానని ఆయన సిట్ అధికారులకు ఈ–మెయిల్ ద్వారా తెలిపారు. కానీ, ఆయన అడిగిన సమాచారం ఇవ్వకుండా వెంటనే మరోసారి ఈ–మెయిల్ ద్వారా నోటీసులు పంపడం గమనార్హం. దాంతో రాజ్ కసిరెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు నిర్ణయం అనంతరం విచారణకు స్వయంగా వస్తానని.. దర్యాప్తునకు సహకరిస్తానని కూడా రెండు రోజుల క్రితం ఓ ఆడియో సందేశం పంపించారు. ఇంతలో న్యాయ ప్రక్రియకు కాస్త సమయం పడుతుండటంతో ఇక తానే మంగళవారం విచారణకు వచ్చి పూర్తిగా సహకరిస్తానని సోమవారం తెలిపారు. అంటే మంగళవారం ఆయన విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వస్తారని తెలుసు. మరి రాజ్ కసిరెడ్డిని హైదరాబాద్‌లో సోమవారమే అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?

న్యాయస్థానం పరిధిలో ఉన్న అంశం

ఈ అంశం ప్రసుతం న్యాయస్థానం పరిధిలో ఉంది కూడా. తనకు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ రాజ్ కసిరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ కోసం కూడా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ రెండు ప్రస్తుతం ఆయా న్యాయస్థానాల పరిధిలో ఉన్నాయి. మరోవైపు విచారణకు హాజరవుతాను.. దర్యాప్తునకు సహకరిస్తానని కూడా రాజ్ కసిరెడ్డి చెప్పారు. అయినా సరే అరెస్టు చేయడం గమనార్హం.

బెదిరించి లొంగదీసుకునేందుకేనా..!

ఇప్పటికే కుటుంబ సభ్యులను తీవ్రంగా వేధించిన సిట్ రెడ్‌బుక్ కుట్రకు అనుకూలంగా రాజ్ కసిరెడ్డితో అబద్ధపు వాంగ్మూలం నమోదు చేయించడమే సిట్ లక్ష్యంగా పెట్టుకుంది. అందుకే ఆయనను హడావుడిగా అరెస్టు చేసింది. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో సోమవారం అర్ధరాత్రి విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి తీసుకువచ్చారు. మంగళవారం తెల్లవారుజాము వరకు ఆయనను బెదిరించి పూర్తిగా తమకు అనుకూలంగా లొంగదీసుకోవడమే సిట్ ప్రస్తుత లక్ష్యం. ఇప్పటికే ఈ కేసులో రాజ్ కసిరెడ్డి కుటుంబ సభ్యులను సిట్ అధికారులు కొన్ని రోజులుగా తీవ్రంగా వేధించి బెంబేలెత్తించారు. హైదరాబాద్‌లోని రాజ్ కసిరెడ్డి నివాసానికి వెళ్లి తల్లిదండ్రులతో పాటు సమీప బంధువులను కూడా బెదిరించి వేధించారు. ఆయన సన్నిహితుడు, ఎరేట్ హాస్పిటల్స్ అధినేత విజేయంద్రరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను కూడా బెదిరించారు. ప్రస్తుతం రాజ్ కసిరెడ్డి పైనే పూర్తి స్థాయిలో పోలీసు మార్క్ ప్రతాపం చూపించనున్నారు. తాము చెప్పినట్టుగా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని ఆయనను బెదిరిస్తున్నట్టు సమాచారం.

మొదటి నుంచీ సిట్ తీరు అంతే..

అక్రమ కేసులో లేని ఆధారాలు సృష్టించేందుకు సిట్ మొదటి నుంచి కూడా దండనీతినే నమ్ముకుంది. బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను తీవ్రస్థాయిలో వేధించి సాధించింది. తద్వారా తాము చెప్పినట్టుగా ఆయన అబద్ధపు వాంగ్మూలం ఇచ్చేలా ఒప్పించింది. వాసుదేవరెడ్డి అబద్ధపు వాంగ్మూలం ఇచ్చిన వెంటనే ప్రభుత్వం ఆయనను రాష్ట్ర సర్వీసుల నుంచి రిలీవ్ చేసి కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు అనుమతించడం గమనార్హం. అదే రీతిలో బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ స్పెషల్ ఆఫీసర్ సత్యప్రసాద్, చిరుద్యోగి అనూషను కూడా సిట్ అధికారులు వేధించి బెదిరించి వారితో అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేయించారు. ఇక విజయ సాయిరెడ్డి ఎంపీగా మరో మూడున్నరేళ్ల పదవీ కాలం ఉన్నా సరే కేవలం టీడీపీకి కూటమికి రాజ్యసభలో ప్రయోజనం కలిగించేందుకే రాజీనామా చేశారు. అసలు ఎలాంటి కుంభకోణం జరగనే లేదని విజయసాయిరెడ్డే సిట్ విచారణ అనంతరం చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయినా సరే అబద్ధపు వాంగ్మూలాల నమోదు, తప్పుడు సాక్ష్యాల సృష్టికి సిట్ అధికారులు బరితెగించి బెదిరింపులకు పాల్పడుతూ అధికారికంగా గూండాగిరీకి తెగిస్తున్నారు.

ఎంఐఎంకు అండగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో రాణిరుద్రమ, ప్రకాశ్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఎంఐఎంకు అండగా నిలుస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల సంసిద్ధతపై ఆయన బీజేపీ కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు సూపర్ బాస్ అసదుద్దీన్ ఒవైసీ అని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మజ్లిస్‌తో చేతులు కలిపిన ఈ రెండు పార్టీలు సెక్యులర్ పార్టీలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. ఓటింగ్‌కు రాకుండా బీఆర్‌ఎస్ తమ కార్పొరేటర్లను బెదిరిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్పొరేటర్లు ఓటు వేయకపోతే వారికి ఓటేసిన గ్రేటర్ ప్రజలను అవమానించడమేనన్నారు. సంఖ్యాబలం ఉన్నా ఎందుకు పోటీ చేయడంలేదన్న విషయాన్ని కేసీఆర్ ప్రజలకు చెప్పాలన్నారు. 'ఆ మూడు పార్టీల నిజస్వరూపం బయట పెట్టాలనే ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం. గెలుపుపై మాకు నమ్మకం ఉంది. రజాకార్ల వారసుల పార్టీ గురించి రాహుల్ గాంధీ తెలుసుకోవాలి' అని హితవు పలికారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రశాంతంగా ఉండాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. 'ఆ మూడు పార్టీలు కుటుంబ పార్టీలు' అని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో మానవ సంబంధాలు దెబ్బతిన్నాయన్నారు. అంతకు ముందు ఒక పార్టీ ఎమ్మెల్యే ఇంటికి మరో పార్టీ ఎమ్మెల్యే వెళ్లేవారని, ఇప్పుడా పరిస్థితి లేదని విచారం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో బీజేపీ ఏం చేసింది, బీఆర్‌ఎస్ ఏం చేసిందనే అంశంపై చర్చకు సిద్ధమా? అని ఆయన కేటీఆర్‌కు సవాలు చేశారు.

నాంపల్లి కోర్టుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

● బెదిరింపు కాల్ కేసులో సాక్ష్యం నమోదు

సిటీ కోర్టులు (హైదరాబాద్): గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు కాల్ వచ్చిందని తాను చేసిన ఫిర్యాదుపై.. సైబర్‌క్రైం పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ సందర్భంగా సాక్ష్యం చెప్పేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నాంపల్లిలోని 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌కు హాజరయ్యారు. ఈ కేసు విచారణకు అప్పటి ఫిర్యాదీ, ప్రస్తుత కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సోమవారం కోర్టుకు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. 2019లో గుర్తు తెలియని వ్యక్తినుంచి తనకు ఫోన్ కాల్ వచ్చిందని, అందులో అసభ్య పదజాలంతో దుర్భాషలాడటంతో పాటు చంపుతానని బెదిరించారని అప్పటి బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సైబర్‌క్రైం పోలీసులు సెక్షన్ 66(డి) ఐటీ యాక్ట్, 506, 507 కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కడప జిల్లాకు చెందిన షేక్‌ఇస్మాయిల్‌గా గుర్తించారు. దీంతో 2022లో పోలీసులు నాంపల్లి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా.. అప్పటినుంచి కేసు విచారణ జరుగుతోంది. వచ్చే విచారణకు సాక్షులు హాజరుకావాలని కోర్టు నోటీసులు జారీ చేస్తూ.. విచారణను మే 21కి వాయిదా వేసింది.

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట

● 'డ్రోన్', 'మూసీ' కేసులను కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా మరో ఇద్దరు నేతలపై దాఖలైన కేసును హైకోర్టు కొట్టివేసింది. కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్‌ల పిటిషన్‌ను అనుమతిస్తూ ఊరటనిచ్చింది. '2024, జూలై 26న మేడిగడ్డ బరాజ్‌ను కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్ సందర్శించారు. ఎటువంటి సమాచారం, అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరించారు' అని మేడిగడ్డ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్ నేతలపై మహదేవ్‌పూర్ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఎలాంటి తప్పు చేయకున్నా తమపై తప్పుడు కేసు నమోదు చేశారని, తమపై విచారణ సహా తదుపరి చర్యలు నిలిపివేయడంతోపాటు ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి.. గత నెల తీర్పు రిజర్వు చేశారు. ఈ నేపథ్యంలో 'డ్రోన్' ఎగరవేత కేసును కొట్టివేస్తూ సోమవారం తీర్పునిచ్చారు.

ఉట్నూర్ కేసు కూడా కొట్టివేత ..

మూసీ ప్రాజెక్టు పేర రూ.25 వేల కోట్ల నిధులను కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి తరలించిందని కేటీఆర్ ఆరోపణలు చేశారని, కాంగ్రెస్ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని ఆ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉట్నూర్ పోలీసులు గతేడాది సెప్టెంబర్ 30న కేసు నమోదు చేశారు. అయితే, ఫిర్యాదులో పేర్కొన్నదంతా కల్పితమని.. ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఎఫ్‌ఐఆర్‌ను రద్దు చేస్తూ సోమవారం తీర్పు వెలువరించారు.

తగ్గుతున్న 'ఎల్లంపల్లి' నీటిమట్టం

● హైదరాబాద్, స్థానిక తాగునీటి పథకాలకే వినియోగం



ఎల్లంపల్లి ప్రాజెక్టు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: హైదరాబాద్ మహానగరం, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు తాగు, సాగునీరు అందించే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గిపోతోంది. డ్యామ్‌లో నీటి నిల్వ సామర్థ్యం 20.17 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.76 టీఎంసీలు ఉంది. పూర్తి స్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా ప్రస్తుతం 142 మీటర్లుగా ఉంది. నీటిమట్టం 134 మీటర్లకు పడిపోతే డెడ్‌స్టోరేజీకి చేరుతుంది. వేసవి దృష్ట్యా ప్రస్తుతం నంది, వేమ్నూరు పంపుహౌస్‌లు, గూడెం ఎత్తిపోతలకు అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం రోజూ 191 క్యూసెక్కుల నీరు ఆవిరైపోతోంది. రోజూ హైదరాబాద్ నగరానికే 330 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదికాక, రామగుండం ఎరువుల కర్మాగారం, రామగుండం, మంచిర్యాల కార్పొరేషన్లు, బెల్లంపల్లి, చెన్నూరు పట్టణాలకు భగీరథ నీటికోసం 81 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. డ్యామ్ నుంచి నీటిని తోడి, అప్రోచ్ కెనాల్ నింపేందుకు బూస్టర్ పంపులు ఏర్పాటు చేసుకోవాలని ప్రాజెక్టు అధికారులు హైదరాబాద్ జలమండలికి సూచించారు.



“ మనిషి సంతోషానికి రెండు శత్రువులు: బాధ, విసుగు.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 22 ఏప్రిల్ 2025

ఈసారి ‘మహా’ వంతు!

ఏదేమైనా హిందీని అందరికీ నేర్పించి తీరాలన్న సంకల్పం ఎలాంటి మలుపులు తిరుగుతుందో మహారాష్ట్రలో తాజాగా రాజుకుంటున్న వివాదాన్ని చూసైనా బీజేపీ తెలుసుకోవాలి. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కావొచ్చు... దూకుడు ప్రదర్శిస్తున్న బీజేపీని ఇరకాటంలో పెట్టాలని కావొచ్చు హిందీని బలవంతంగా రుద్దే విధానాన్ని అంగీకరించబోమని ప్రకటించి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దక్షిణాదిన దుమారం రేపారు. స్థానిక భాషతోపాటు ఇంగ్లిష్, మరేదైనా భాష ప్రాథమిక స్థాయిలో తప్పనిసరి చేసే నూతన విద్యావిధానాన్ని కేంద్రం తీసుకొచ్చిన నేపథ్యంలో స్టాలిన్ దాన్ని తప్పుబట్టారు. అదింకా పూర్తిగా చల్లారక మునుపే మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆ రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకూ మూడో భాషగా హిందీని తప్పనిసరి చేయటమే ఆ నిర్ణయం సారాంశం. ఇంతవరకూ ప్రాథమిక స్థాయిలో తప్పనిసరి భాషలు మరాఠీ, ఇంగ్లిష్ మాత్రమే. కానీ జాతీయ విద్యావిధానం చెబుతున్నట్టు ‘ఏదైనా మరో భాష’ కూడా తప్పనిసరి గనుక హిందీని ఆ రెండింటితో జత చేశామని ప్రభుత్వం అంటున్నది. సహజంగానే మహారాష్ట్రలో ఇది వివాదాన్ని రేకెత్తించింది. ‘మేం హిందువులమేగానీ... హిందీ అవసరం లేద’ంటూ మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) ముంబై నగరంలో పెద్ద పెద్ద ఫ్లెక్సీలు పెట్టింది. నిజానికి ఎంఎన్‌ఎస్ అయినా, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) అయినా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయంగా అయోమయంలో పడ్డాయి. ఎంఎన్‌ఎస్ ఏర్పడి ఇరవయ్యేళ్లు కావొస్తున్నా ఇంతవరకూ ఆ పార్టీ అసెంబ్లీలోకి అడుగుపెట్టలేకపోయింది. యూబీటీగా చీలకముందు శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే కాంగ్రెస్, ఎన్సీపీలతో కూటమి ప్రభుత్వాన్ని నడిపారు. కానీ ఏక్‌నాథ్ షిండే రూపంలో వచ్చిపడిన విపత్తుతో పార్టీ నిలువునా చీలిపోవటమే కాక, అధికారాన్ని కూడా కోల్పోయింది. జనం సానుభూతి చూపిస్తారనుకుంటే అదీ జరగలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నిండా ఆర్నెల్లు కాలేదు. కనుక విపక్షాలు ఏం చేయటానికీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మహారాష్ట్ర సర్కారు విపక్షాలకు ఆయుధాన్ని అందించింది.

తమిళనాడులో స్టాలిన్ హిందీ వివాదాన్ని రేకెత్తించినప్పుడు కేంద్రం తన విధానాన్ని గట్టిగా సమర్థించుకుంటూ ఒక మాట చెప్పింది. మూడో భాషగా హిందీయే నేర్వాలని తాము పట్టుబట్టడం లేదని, దేశ భాషల్లో దేన్నయినా ఎంపిక చేసుకోవచ్చని అన్నది. కానీ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇస్తున్న వివరణ చూస్తే అందుకు భిన్నంగావుంది. నూతన విద్యావిధానంలో భాగంగా స్థానిక భాష, ఇంగ్లిష్‌తోపాటు హిందీని కేంద్రం తప్పనిసరి చేసిందని, దాన్నే తాము అమలు చేస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. ఈ వివరణ సహజంగానే తమిళనాడులో పాలక డీఎంకేకు అందివచ్చింది. మూడో భాషగా ‘మరేదైనా’ నేర్చుకోవచ్చన్న నిబంధన ఆంతర్యమేమిటో మహారాష్ట్ర నిర్ణయం బట్టబయలు చేసిందని ఆ పార్టీ అంటున్నది. దేశంలో హిందీని ఏదో విధంగా దొడ్డిదోవన అనుసంధాన భాషగా చేయాలన్నదే కేంద్రంలోని ఎన్డీయే పాలకుల ఉద్దేశమని విమర్శిస్తోంది. యూపీఏ ప్రభుత్వ హయాంలో కూడా కేంద్రంనుంచి ఇలాంటి ప్రయత్నాలే జరిగాయి. వాటిని ఎప్పటికప్పుడు దక్షిణాది రాష్ట్రాలు, మరీ ముఖ్యంగా తమిళనాడు వ్యతిరేకిస్తూనే వచ్చాయి.

తమిళనాడు మాదిరే మహారాష్ట్రలో కూడా భాషాభిమానం బాగా ఎక్కువ. దాన్ని అన్నివిధాలా ఉపయోగించుకుందామని ఠాక్రే సోదరులు భావిస్తున్నట్టు కనబడుతోంది. సొంత అన్నదమ్ములు కాకపోయినా ఇద్దరూ శివసేనలో కలిసి పనిచేసేవారు. 2005లో వారిమధ్య పొరపొచ్చాలు బయల్దేరాక పార్టీ అధినేత బాల్ ఠాక్రే ఇద్దరి మధ్యా రాజీకి ప్రయత్నించారు. కానీ అది ఫలించలేదు. 2006లో రాజ్ ఠాక్రే ఎంఎన్‌ఎస్ స్థాపించారు. మొదట్లో యూపీ, బిహార్‌లనుంచి వలస వచ్చేవారి వల్ల స్థానికుల ఉపాధి దెబ్బతింటున్నదని, వారు దాదాగిరీ చలాయిస్తున్నారని ఆరోపిస్తూ నడిపిన ఉద్యమం హింసాత్మకంగా మారింది. ఆ తర్వాత దుకాణాల బోర్డులన్నీ మరాఠీలో ఉండాలంటూ సాగించిన ఉద్యమం కూడా ఆ తోవలోనే నడిచింది. ఇవిగాక మరాఠీ ఆత్మగౌరవం పేరిట చాలా ఉద్యమాలు నడిపినా రాజ్ ఠాక్రేకు కలిసిరాలేదు. ఇప్పుడు బలవంతంగా హిందీ రుద్దుతున్నారన్న అంశంపై సాగించే ఉద్యమానికి స్పందన ఏమాత్రం వస్తుందన్నది చూడాలి. మహారాష్ట్రకు రావాల్సిన ప్రాజెక్టులను గుజరాత్‌కు తన్నుకుపోవటాన్ని తప్పుబడుతూ నిరుడు లోక్‌సభ ఎన్నికల సమయంలో తాను నిలదీసినప్పుడు రాజ్ కలిసిరాలేదని, అదే జరిగుంటే ఇవాళ కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఉండేది కాదని ఉద్ధవ్ వాదన. తమ మధ్య కేవలం చిన్న చిన్న అపోహలు మాత్రమే ఉండేవని ఉద్ధవ్ అంటుంటే... అసలు సోదరులిద్దరూ విడిపోయిందెక్కడని యూబీటీ ఎంపీ సంజయ్ రౌత్ ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి ఠాక్రే సోదరుల ప్రకటనలు వారిద్దరూ మళ్లీ కలిసి పనిచేయబోతున్నారన్న సంకేతాలిస్తున్నాయి. అది బీజేపీ మనుగడను దెబ్బతీస్తుందా లేదా అన్నది చూడాలి.

అయితే పాలకులు మేల్కొనాల్సిన సమయం వచ్చింది. 1963 నాటి అధికార భాషల చట్టం, దానికి 1967లో తీసుకొచ్చిన సవరణలు గమనించి మసులుకుంటే భాషా వివాదం తలెత్తదు. అధికార లావాదేవీలన్నిటా ఇంగ్లిష్, హిందీ వినియోగించాలని, హిందీ మాతృభాషగా లేని రాష్ట్రాలతో ఇంగ్లిష్‌లోనే ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించాలని చట్టం స్పష్టంగా చెబుతున్నప్పుడు అందరూ హిందీ నేర్చుకు తీరాలని శాసించటం సరికాదు. దేశ సమైక్యత, సమగ్రత పేరిట దాన్ని తలకెత్తుకుంటే అందుకు విరుద్ధమైన ఫలితాలొస్తాయి. మహారాష్ట్ర పరిణామాలు ఆ సంగతిని చాటుతున్నాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.నవమి ప.1.03 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** శ్రవణం ఉ.8.06 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.12.02 నుండి 1.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.08 వరకు, తదుపరి రా.10.50 నుండి 11.36 వరకు, **అమృతఘడియలు:** రా.9.30 నుండి 11.01 వరకు.

సూర్యోదయం : 5.44
సూర్యాస్తమయం: 6.13
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఇండియా విధానం సరైనదేనా?

విశ్లేషణ



టంకశాల అశోక్

భారత ప్రభుత్వం సుంకాల విషయమై అమెరికాతో చర్చిస్తున్న పద్ధతిని కొందరు సమర్థిస్తుండగా, కొందరు విమర్శిస్తున్నారు. విలువైన అంశాలు రెండింటిలోనూ ఉన్నాయి. కానీ ఈ చర్చలన్నీ తక్షణ అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. అవి అవసరమే. అదే సమయంలో మరికొంత లోతుకు వెళ్లటం, దీర్ఘకాలిక దృష్టి తీసుకోవటం కూడా చేస్తే తప్ప ఇంత ముఖ్యమైన విషయమై సమగ్రమైన అవగాహన ఏర్పడదు.

ఇతర దేశాల నుంచి దిగుమతులపై తాము స్వల్పమైన సుంకాలు విధిస్తున్నామనీ, తమ ఎగుమతులపై మాత్రం వారు భారీ సుంకాలు వేస్తున్నారనీ, ఆ విధంగా తాము రెండు విధాలుగానూ నష్టపోతున్నామన్నది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నమాట. కేవలం గణాంకాలకు పరిమితమైతే అది నిజమే. కానీ, అందులో అనేక మతలబులున్నాయి. అమెరికాలో ఒకప్పుడు విస్తారంగా ఉండిన ఉత్పత్తుల రంగాన్ని కుదించి, పరిశ్రమలను ఇతర దేశాలకు తరలించింది అక్కడి ప్రభుత్వమే గదా? అసలు వివిధ అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య సంస్థలను ఉనికిలోకి తెచ్చి స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహించిందే అమెరికా. ఒకవేళ 90 రోజుల వాయిదా కాలంలో చర్చల ద్వారా కొన్ని సర్దుబాట్లు జరిగినా కొంత నష్టం మిగిలే ఉంటుంది. ఈ పరిణామాలన్నింటి ప్రభావంతో అమెరికా పట్ల ప్రపంచానికి ఇంత కాలం ఉండిన విశ్వాసం తగ్గుతుందనే సందేహం ఉంది. అది జరిగినపుడు ఇప్పటికే గల బహుళ ధ్రువ ప్రపంచ ధోరణులు మరింత బలపడగలవనే అభిప్రాయాలు ఎక్కువవుతున్నాయి.

నాలుగు ధోరణులు

ఇండియాతో అమెరికా వాణిజ్య లోటు 2024–25లో 41.18 బిలియన్ డాలర్లు. మన దిగుమతులపై అమెరికా సుంకాల రేటు సగటున 2.7 శాతం. అమెరికా నుంచి దిగుమతులపై మన సుంకాల రేటు సగటున 12 శాతం కాగా, కొన్ని సరుకులపై 48 శాతం వరకు ఉంది. ఈ లెక్కలను బట్టి అమెరికా అధ్యక్షుడు అన్ని దేశాలతో గల వాణిజ్య లోటులో 50 శాతం మేర సుంకాలు పెంచిన ప్రకారం భారత ఎగుమతులపై రేటును 26 శాతంగా ప్రకటించారు. ఏప్రిల్ 2న ఈ కొత్త రేట్లు ప్రకటించటానికి ముందే చేసిన హెచ్చరికలను బట్టి భారత ప్రభుత్వం అమెరికన్ మోటార్ సైకిళ్లు వగైరాపై సుంకాలు తగ్గించటం తెలిసిందే. అయినప్పటికీ కొత్త రేట్లు యథావిధిగా పెరిగాయి.

ఈ పరిస్థితుల దృష్ట్యా భారత్ ఏమి చేయాలన్నది ప్రశ్న. ప్రపంచ దేశాలు చేస్తున్నదేమిటని చూడగా నాలుగు ధోరణులు కనిపిస్తున్నాయి. కొన్ని చిన్న ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా లొంగి పోతున్నాయి. అమెరికా నుంచి దిగుమతులపై సుంకాలు నూరు శాతం రద్దు చేస్తున్నాయి. ఇందుకు ఒక ఉదాహరణ జింబాబ్వే. కొన్ని సామరస్య ధోరణితో ఇచ్చిపుచ్చుకునే మార్గాన్ని అనుసరిస్తున్నాయి. జపాన్ అందుకొక ఉదాహరణ. కొన్ని ఎదురు సుంకాలతో ప్రతిఘటిస్తూ అమెరికా తగ్గితే తాము తగ్గుతామంటున్నాయి. కెనడా, యూరోపియన్ దేశాలు ఈ కోవలోకి వస్తాయి. చైనా ఒక్కటి భిన్నంగా కనిపిస్తున్నది. పోరాడు తాము తప్ప లొంగే ప్రసక్తి లేదని స్పష్టం చేస్తున్నది.

ఈ నాలుగింటిలో ఇండియా ప్రయోజనాలకు ఉపయోగపడగలది ఏది? చైనా వలె పూర్తిగా ధిక్కరించటమన్నది అభిలషణీయం కాదు, కావాలనుకున్నా సాధ్యమయ్యేదీ కాదు. వారిది రెండవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. భారత దేశం కన్నా అయిదు రెట్లు పెద్దది. క్రమంగా అమెరికాను మించిపోయి అగ్రస్థానానికి చేరాలన్నది చైనా లక్ష్యం. మన స్థితిగతులుగానీ, లక్ష్యాలుగానీ వీటైనంత అభివృద్ధి చెందటమే తప్ప చైనా వంటివి కావు. కనుక ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు అటువంటి వైఖరి తీసుకోవటమన్న ఆలోచనే అసందర్భం. ఇదంతా అర్థమయ్యో, కాకనో కొందరు భారత ప్రభుత్వాన్ని ఆక్షేపిస్తున్నారు.



ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్

◆ సుంకాల విషయంలో చైనా వలె ఇండియా పూర్తిగా అమెరికాను ధిక్కరించటమన్నది అభిలషణీయం కాదు, కావాలనుకున్నా సాధ్యమయ్యేదీ కాదు.

◆ కొన్ని దేశాలు అమెరికాతో సామరస్య ధోరణితో ఇచ్చిపుచ్చుకునే మార్గాన్ని అనుసరిస్తున్నాయి. జపాన్ అందుకొక ఉదాహరణ. భారత్ స్థూలంగా జపాన్ తరహా వైఖరిని తీసుకుంటున్నట్లు కనిపిస్తున్నది.

◆ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఇండియా ఎదగాలంటే, ఈ కూటమి, ఆ కూటమి అనే ఒకప్పటి రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని వైపుల నుంచి సహకారం కోసం సమ సంబంధాలు పాటించాలి.

జపాన్ మార్గం

ఇక మిగిలినవి జపాన్, కెనడా ప్లస్ యూరోపియన్ మార్గాలు. ఈ రెండింటిలో రెండవది కూడా ఇండియాకు అనుకూలించగలది కాదు. అందుకు ఒక కారణం యూరోపియన్ దేశాలన్నీ ఒక బృందం వలె నిలిచి ఉన్నాయి. అది గాక సైనికంగా, భౌగోళిక వ్యూహాల రీత్యా అమెరికా, కెనడా, యూరప్‌ల సాన్నిహిత్యం భిన్నమైనది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నందువల్లనే అమెరికా ట్యారిఫ్‌లను వారు బలంగా ఎదుర్కొంటూ, ఆ దేశం దిగి రావలసిందేనని స్పష్టం చేస్తున్నారు. ఇదంతా భారతదేశానికి సాధ్యమయ్యేది కాదు.

అందువల్ల స్థూలంగా జపాన్ నమూనా ఒక్కటే మిగులుతున్నది. దక్షిణ కొరియా, మెక్సికో మొదలైన వాటి వైఖరి కూడా ఇంచుమించు ఇదే విధంగా కనిపిస్తున్నది. ఈ పద్ధతి ఇంకా ఇదమిత్థంగా రూపు తీసుకోలేదు. చర్చలు జరిగే కొద్దీ ఇందుకొక రూపం రాగలదని భావించవచ్చు.

భారత్ స్థూలంగా జపాన్ తరహా వైఖరిని తీసుకుంటున్నట్లు కనిపిస్తున్నది. ఇందులోనూ ఒక ఆకు తక్కువే. అమెరికాతో జపాన్‌కు గల వ్యూహాత్మక భాగస్వామ్యం వేరు. అందుకే ‘స్థూలంగా’ అనే మాటను ఉపయోగించటం. ఇవన్నీ చెప్పుకున్న తర్వాత, భారతదేశం గురించి మాట్లాడుకోవలసిన మౌలికమైన విషయాలు రెండున్నాయి. భారత అభివృద్ధి స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయి? కొత్త అభివృద్ధి లక్ష్యాల సాధనకు అనుసరించవలసిన మార్గం ఏమిటని ప్రభుత్వం భావిస్తున్నది? సుంకాల యుద్ధంపై తీసుకోగల వైఖరికి ఈ ప్రశ్నలతో సంబంధం ఉంటుంది.

దేశ ప్రయోజనాలే ముఖ్యం!

ఆర్థికాభివృద్ధి రీత్యా ఇండియా ఇంకా వర్ధమాన దేశమే. అభివృద్ధి చెందుతున్నా, ఆ వేగం ఉండవలసినంతగా లేదు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే అంతర్గతంగా జరగవలసింది చాలా ఉండటంతో పాటు, అభివృద్ధి చెందిన దేశాల నుంచి, ఇంచుమించు తన స్థాయిలో గల వర్ధమాన దేశాల నుంచి, అవసరమైన వనరులు గల దేశాల నుంచి సహకారం అవసరం. అందుకోసం ఈ కూటమి, ఆ కూటమి అనే ఒకప్పటి రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని వైపుల నుంచి సహకారం కోసం సమ సంబంధాలు పాటించాలి. దేశ ప్రయోజనాలే దేనికైనా గీటురాయి కావాలి. శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులంటూ ఉండరు.

పరిస్థితులు, ఫిలాసఫీ రెండూ ఇవే. ఇదంతా ఇప్పుడు మనం సుంకాల సమస్యల సందర్భంలో కొత్తగా సూత్రీకరిస్తున్నది కాదు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ‘ది ఇండియా వే, స్ట్రాటజీస్ ఫర్ యాన్ అన్‌సర్టెన్ వరల్డ్’ (2020) పేరిట రాసిన పుస్తకంలో ఈ సూత్రీకరణలన్నీ కనిపిస్తాయి. శీర్షిక దానికదే ఎంతో అర్థవంతమైనది. ‘మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా జీవించటమే వివేకం’ అనే తిరు వళ్ళువర్ బోధనతో ఆయన తన పుస్తకాన్ని ప్రారంభించారు. బ్రిటిష్ పాలకులు వచ్చిపడుతుండగా చదరంగంలో మునిగి రాజ్యం పోగొట్టుకున్న బెంగాల్ నవాబుల ఉదంతంతో ‘షతరంజ్ కే ఖిలాడీ’ సినిమా తీసిన సత్యజిత్ రే హెచ్చరిక, అమెరికా బలహీనపడుతుండగా ముందుకు దూసుకుపోతున్న చైనాల గురించి చర్చిస్తూ, ‘ఇప్పుడు భారతదేశం తనను తాను నిర్వచించుకుంటుందా? లేక ఇంకో ప్రపంచమే నిర్వచిస్తుంటుందా?’ అని ప్రశ్నిస్తారు. స్వయంగా అమెరికా, చైనాలలో రాయబారిగా పనిచేసిన జైశంకర్ సూత్రీకరణలు, రూపొందిస్తున్న విదేశాంగ విధానాలు ప్రస్తుత క్లిష్ట పరిణామాలకు తగినవే.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

కరుణామయుడు



పోప్ ఫ్రాన్సిస్ క్యాథలిక్ చర్చ్ చరిత్రలోనే అత్యంత కరుణామయ పోప్ అని నా అభిప్రాయం. ఆయన అన్ని సమాజాల మనుషుల పక్షాన నిలబడ్డారు. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక!

– ఎ. ఫైజుర్ రహమాన్, పీస్ యాక్టివిస్ట్

ప్రగతి సేవలో...



సివిల్ సర్వీసెస్ డే (ఏప్రిల్ 21) సందర్భంగా అందరు సివిల్ సర్వెంట్లు, వాళ్ల కుటుంబాలకు నా శుభాకాంక్షలు. ఇండియా అభివృద్ధి, ప్రగతిలో వాళ్ల నిబద్ధత, కఠిన శ్రమ ఎంతో విలువైనవి.

– ఎస్. జైశంకర్, విదేశీ వ్యవహారాల మంత్రి

డాలర్ - రూపాయి



నేను నాలుగు బోర్డుల్లో ఉన్నాను. అందులో మూడు లిస్టెడ్ కంపెనీలు, ఇంకోటి త్వరలో పబ్లిక్ ఇష్యూకు వెళ్లనుంది. డాలర్, రూపాయి గురించి ఏకకాలంలో మాట్లాడటం గురించిన బోర్డుల నైపుణ్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆచరణాత్మక సంఖ్యలన్నీ ఎక్కువగా రూపాయల్లో మాట్లాడుతారు; అదే ఫండ్ రెయిజింగ్, మదింపు, స్వాధీనం లాంటి వాటిని డాలర్లలో చర్చిస్తారు.

– రాజేశ్ సహానీ, ఇన్వెస్టర్

సంతాప సందర్భాలు



2005లో పోప్ రెండో జాన్ పాల్ చనిపోయినప్పుడు ఇండియా మూడు రోజుల సంతాప దినాలు ప్రకటించింది. అయితే 2022లో పోప్ బెనెడిక్ట్ విషయంలో అలాంటిదేమీ ప్రకటించలేదు. గత కొన్నేళ్లలో ఇరాన్, సౌదీ అరేబియా, ఒమన్ లాంటి దేశాల అధినేతలు మరణించినప్పుడు ఇండియా సంతాప దినాలను ప్రకటించిన సందర్భాలున్నాయి.

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

ముద్దు మాటలు



భారత పర్యటనకు వచ్చిన యూఎస్ ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ పిల్లలు ముద్దుగా కనబడ్డారు. కుర్తా, పైజామా అనే పదాల మూలాలు ఉర్దూలో ఉన్నాయి. అవి నిజానికి పార్శీ పదాలు అని చెప్పడానికి ఇదే సందర్భం. ఇండియాలో భాషా మిశ్రమం ఎంత బాగా జరుగుతుందో!

– సబా నఖ్వీ, రచయిత్రి

ఉప్పొంగే భావం



భక్తి అనేది లోతైన భావం. ఒకరు తన పరిమితులను గుర్తించి– నిర్వచనాలు, పరిమితులు అనేవి లేని దైవత్వం వైపు చూసినప్పుడు హృదయంలో భక్తి అనేది ఉప్పొంగుతుంది. ద్వేషానికి చోటు లేని, ప్రేమ మాత్రమే ఉన్న స్వచ్ఛమైన హృదయంలో అది జరుగుతుంది.

– శ్రీ ఎం, ఆధ్యాత్మిక బోధకుడు

అసలు ప్రేరణ




బయటి నుంచి ప్రేరణ పొందిన జనాల కంటే, అంతరంగం ద్వారా ప్రేరేపితమైన జనాలకు పోటీపరంగా ప్రయోజనం ఎక్కువుంటుంది.

– డాల్టన్ కాల్డ్‌వెల్, ఆంత్రప్రెన్యూర్

ఇన్ బాక్స్

లెనిన్ ప్రాసంగికత

మార్క్స్ – ఏంగెల్స్‌ల రచనలను అధ్యయనం చేసి, వెనుకబడ్డ రష్యాలో సోషలిస్ట్ విప్లవాన్ని విజయవంతం చేసి ‘శాస్త్రీయ సోషలిస్టు సమాజా’న్ని ఈ భూమిపై మొదట నిర్మించినవాడు లెనిన్ మహాశయుడు. 1870 ఏప్రిల్ 22న రష్యాలోని ‘సింబర్స్క్’ పట్టణంలో జన్మించిన ఆయన అసలు పేరు వ్లదిమీర్ ఇల్యీచ్ ఉల్యానోవ్. లెనిన్ అనేది ఆయన కలం పేరు. తన రచనల ద్వారా అతివాద, మితవాద అరాచక వాదాన్ని ఎదుర్కొంటూ సోషలిస్టు విప్లవానికి కార్యక్రమ పంథా రూపొందించారు. లెనిన్ తన జీవితకాలంలో 10 సంవత్సరాలకు పైగా ప్రవాస జీవితం గడిపారు. ప్రవాసంలో ఉండగా ఆయన 30కి పైగా రచనలు చేశారు. 1916లో రాసిన ‘సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ’ అందులో ఒకటి. 1917లో రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతమైంది. రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యా ప్రముఖ పాత్ర వహించింది. ప్రపంచంలో సోషలిస్టు శిబిరం ఏర్పడింది. లెనిన్ నాయకత్వాన ఉన్న రష్యా కమ్యూనిస్టు పార్టీ వెనుకబడ్డ దేశాల్లో సామాజిక విముక్తి కొరకు, దోపిడీ రహిత సమాజం ఏర్పాటు కొరకు, వివిధ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీల ఏర్పాటు కొరకు సహకరించింది.



లెనిన్

సామ్రాజ్య వాదం కింద ప్రపంచ విప్లవం రెండు ప్రవాహాలుగా ఉంటుందన్నారు లెనిన్. సామ్రాజ్యవాద దేశాలలో సోషలిస్టు విప్లవంగానూ; ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికన్ దేశాలలో లేక అణచబడిన దేశాలలో ‘జనతా ప్రజాతంత్ర విప్లవాలుగా’నూ ఉంటుందని సూత్రీకరించారు. భారతదేశంలోని కమ్యూనిస్టులు మారిన జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్లో లెనిన్ చేసిన ఈ సూత్రీకరణను దృష్టిలో ఉంచుకోవలసిన అవసరం, అధ్యయనం చేసి ఐక్యం కావలసిన అవసరం ఎంతైనా ఉంది. భారతదేశం నేడు నయా వలస, నయా పెట్టుబడిదారీ దశలో ఉన్నది. అలాగే నయా ఫాసిజం హిందూ మతోన్మాద రూపంలో అమెరికన్ సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా ఉంది. ఈ పరిస్థితుల్లో అన్ని కమ్యూనిస్టు పార్టీలు, దళిత, బహుజన పార్టీలు, ప్రజాతంత్ర సంస్థలు ఐక్యమై కాషాయ ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్ ఏర్పాటు కావాలి. ఇది లెనిన్ సూత్రీకరణకు అనుగుణంగా ఉంటుంది.

– మన్నవ హరిప్రసాద్, సీపీఐ (ఎమ్ఎల్) రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు
(నేడు లెనిన్ 155వ జయంతి)

గ్లోబల్ కలలు సరే... మరి లోకలో!

అభిప్రాయం



డా॥ తారకేశ్వరరావు ఇప్పిలి

రాష్ట్రానికి ప్రపంచ విద్యా సంస్థలను తీసుకొస్తామని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విద్యాశాఖా మాత్యులు ఆర్భాటంగా ప్రకటించడం పరిపాటిగా మారిపోయింది. గ్లోబల్ సంస్థలను తీసుకొస్తే కాదనే వారెవరు? మరి ఇప్పటికే ఇక్కడ ఉన్న విశ్వవిద్యాలయాల్లో కనీస సౌకర్యాల కల్పన చేయాలన్న సంగతే మర్చిపోతే ఎలా? అధ్యాపకుల కొరతతో విశ్వవిద్యాలయాలు ఒప్పంద అధ్యాపకులతో నెట్టుకొస్తున్నాయి. విద్యార్థుల సమస్యలు, శిక్షణా అవసరాల కంటే రాజకీయ అజెండాలకే విశ్వవిద్యాలయాల్లో ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ప్రతిపక్ష పార్టీలను నిరోధించే వేదికలుగా, ప్రభుత్వ విధానాలను సమర్థించే ప్రచార కేంద్రాలుగా మారుతున్న ఈ విద్యా సంస్థలు తమ పరిపక్వతను కోల్పోతున్నాయి. విశ్వవిద్యాలయాల నిర్వహణ అధ్వాన్నంగా ఉంది. ఎటువంటి స్పష్టమైన పాలనా విధానం లేకుండా, అనుసంధాన కార్యక్రమాలు లేకుండా, విశ్వవిద్యాలయాలు కేవలం తమ తమ అస్తిత్వం కొనసాగించేందుకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే, తెలుగు రాష్ట్రాల విద్యా వ్యవస్థ మరింత దిగజారిపోతుంది.



రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కేంద్రం మంజూరు చేసిన ‘గిరిజన విశ్వవిద్యాలయా’లు పూర్తి స్థాయి క్యాంపస్‌లుగా రూపుదిద్దుకోలేదు. తాత్కాలిక అద్దె భవనాల్లోనే ఇంకా నెట్టుకొస్తున్నాయి. ఏర్పాటు చేసి దశాబ్దం కావొస్తున్నా ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వీటి పరిస్థితి కొనసాగుతోంది. ఏ ఉద్దేశ్యంతో అయితే ఈ సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయో వాటిని అందుకోవడంలో విఫలమవుతున్నాం. కానీ వీటి గురించి ఆలోచించే నాథుడే లేకపోవడం గమనార్హం. విద్య, పరిశోధనల వైపు దృష్టి సారించాల్సిన అధ్యాపకులు పదవుల కోసం పాకులాడుతూ విద్యా వాతావరణాన్ని పాడుచేస్తున్నారు.


మన విశ్వవిద్యాలయాల్లో గ్లోబల్ (అంతర్జాతీయ) ప్రమాణాలను కల్పించేందుకు పలు చర్యలు తీసుకోవాలి. అధ్యాపకుల నియామకాన్ని తక్షణం చేపట్టాలి. పూర్తి స్థాయి అధ్యాపకులను నియమించి, వారి శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. విశ్వవిద్యాలయాల్లో పరిశోధన నిధులను పెంచాలి. పరిశోధనా పత్రాలను ప్రచురించేలా ప్రోత్సహించడంతో పాటు, విదేశీ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేయాలి. ఆధునిక మౌలిక వసతులు కల్పించి, అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపోయే ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, డిజిటల్ లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. విద్యార్థుల స్టార్టప్‌లను ప్రోత్సహించే విధంగా నూతన విధానాలను అమలు చేయాలి. విశ్వవిద్యాలయాల పాలనలో పారదర్శకతను పెంచి, అకడమిక్ స్వాతంత్ర్యాన్ని పరిరక్షిస్తూ, రాజకీయ జోక్యాన్ని తగ్గించాలి.

అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల విధానాన్ని అనుసరించి, విద్యార్థులకు పరిశ్రమ అనుభవాన్ని పెంచే ఇంటర్న్‌షిప్‌లు, కో–ఆపరేటివ్ ప్రోగ్రామ్‌లను అమలు చేయడం అత్యవసరం. పరిశ్రమతో అనుసంధానం పెంచి, విద్యార్థులను వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కారానికి సిద్ధం చేయాలి. విద్యాబోధన, పరిశోధన రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకురావడానికి... ప్రభుత్వాలు మౌలిక వసతుల కల్పనకు సమగ్ర ప్రణాళికలతో ముందుకు రావాలి. ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ విద్యా సంస్థలతో పోటీ పడటమే కాకుండా, పరిశోధన, నూతన ఆవిష్కరణల కేంద్రాలుగా మారతాయి. అప్పుడు ఎక్కడి నుంచో కొత్తగా విశ్వవిద్యాలయాలను, సంస్థలను తీసుకు రావలసిన అవసరమే ఉండదు.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, విజయనగరం

సుగుణాలు – సద్గతులు

భాగవతంలోని ప్రతి చిన్న సంఘటన మనకు ఎన్నో మంచి విషయాలను నేర్పుతుంది. పరీక్షిన్మహారాజు వేటకు వెళ్ళాడు. దాహం వేసి... ఏకాగ్రచిత్తుడై బ్రహ్మానుసంధానం చేసి ఉన్న శమీక మహర్షిని మంచినీళ్లు ఇమ్మని అడిగాడు. కానీ ఆ మహర్షికి అది వినిపించక మిన్నకుండి పోయాడు. దీనితో శమీకుని మెడలో ఒక చచ్చిన పామును వేశాడు. ఇది తెలిసిన మహర్షి కుమారుడైన శృంగి కోపోద్రిక్తుడై... ‘రాజు హరకేశవులొడ్డిననైన; ఇచ్చుపో యేడవనాడు తక్షక ఫణీంద్ర విషానల హేతి సంహతిన్’ అని శాపం పెట్టాడు.



రాజు దాన్ని విని గంగా తీరాన ప్రాయోపవేశాన్ని ప్రారంభించాడు. ఎందరో మహర్షులు వచ్చారు. ఆ రాజు వారికి నమస్కరించి, ‘దయామయుడైన పరమేశ్వరుడు బ్రాహ్మణ రూపమున నాకు శాపమునిచ్చి నాలో వివేక వైరాగ్యాలను మేల్కొలిపాడు. తక్షకుడు నాకు కాటు వేయువరకు శ్రీ మహావిష్ణువు యొక్క గాథలను వినుపించుడు. నేను ఎన్ని జన్మలు ధరించవలసి వచ్చినా అనంతుని యెడల భక్తి ప్రేమలు కలిగి, మహాత్ములతోటి సాంగత్యం, సర్వప్రాణుల యందు ప్రేమ కలుగునట్లు దీవింపుడు’ అని వేడుకొన్నాడు. (పుట 69–ప్రథమ స్కంధము, భాగవత సుధ, శ్రీరామకృష్ణ మఠము, చెన్నై).

తనకు శాపమిచ్చిన వానిపై రాజు ప్రతీకారం తీర్చుకోదలచలేదు. పైగా శాపాన్ని వరంగా మార్చుకోగలిగాడు. అది ఆయనలో వివేక, వైరాగ్యాల్ని– ఏవైతే ఏ వ్యక్తి ఆధ్యాత్మికాభివృద్ధికైనా ఆవశ్యకాలో – వాటిని రగిల్చినట్టు భావించాడు. దైవ గాథలను చివరి వరకు విని ప్రాణం వదలదలిచాడు. సాధు సాంగత్యాన్ని కోరాడు. మరీ ముఖ్యంగా ప్రాణులన్నిటి పట్ల ప్రేమ కలిగే విధంగా దీవించమన్నాడు. ఆ సుగుణాలన్నీ ఉన్న వ్యక్తికి సద్గతులు కలుగవా?

– రాచమడుగు శ్రీనివాసులు


విద్యుత్ డిమాండ్ భారీగా పతనం

- ఈ నెల 20న 10,539 మెగావాట్లకు తగ్గుదల
- పంటల సాగు ముగియడంతో భారీగా తగ్గిన డిమాండ్
- గత నెల 20న 17,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పతనమైంది. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల బోరుబావుల కింద యాసంగి పంటల సాగు ముగియడంతో విద్యుత్ వినియోగం బాగా తగ్గిపోయింది. గత నెల 20న రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరి కొత్త రికార్డు సృష్టించింది. గత నెల 18న రోజువారీ విద్యుత్ వినియోగం సైతం 335 మిలియన్ యూనిట్ల (ఎంయూ)కు చేరి పాత రికార్డులను చెరిపివేసింది. విద్యుత్ (ఉత్పత్తి) డిమాండ్ రోజంతా ఒకేతరహాలో ఉండదు. వినియోగంలో హెచ్చుతగ్గులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు డిమాండ్ పెరుగుతూ తగ్గుతూ ఉంటుంది. కాగా మార్చి 20న గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఇక 24 గంటల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాడే మొత్తం విద్యుత్‌ను మిలియన్ యూనిట్లలో లెక్కిస్తారు. కాగా మార్చి 18న అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైందన్న మాట.

పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ పెరిగినా..

బోరుబావుల కింద యాసంగి పంటల సాగు ముగింపునకు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ క్రమంగా తగ్గుతూ ఆదివారం నాటికి 10,539 మెగావాట్ల కనిష్ట స్థాయికి పడిపోయింది. రోజువారీ విద్యుత్ వినియోగం సైతం 221 ఎంయూలకు తగ్గిపోయింది. మరోవైపు వేసవి తీవ్రత పెరగడంతో ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు, రిఫ్రిజిరేటర్ల వాడకం పెరగడంతో హైదరాబాద్ నగరంతో పాటు ఇతర పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిపోయింది. అయినప్పటికీ వ్యవసాయ విద్యుత్ వినియోగం



లేకపోవడంతో రాష్ట్రవ్యాప్త విద్యుత్ డిమాండ్ మాత్రం పతనావస్థలోనే ఉంది.

వేసవి కష్టాలు అధిగమించినట్టే..!

గతేడాది వేసవిలో చాలాచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగడంతో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. ప్రస్తుత వేసవిలో మాత్రం కీలకమైన పంటల సాగు ముగిసినా ఎక్కడా విద్యుత్ అంతరాయాలు చోటుచేసుకున్నట్టుగా ఫిర్యాదులు రాలేదు. గాలివానలు బీభత్సం సృష్టించడంతో కొన్నిచోట్ల విద్యుత్ వ్యవస్థ దెబ్బతిని సరఫరాలో అంతరాయం కలిగినా సత్వర పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ గణనీయంగా తగ్గిన నేపథ్యంలో వేసవిలో విద్యుత్ కష్టాలు తీరినట్టేనని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

ఎక్ఛేంజీల నుంచి తగ్గిన కొనుగోళ్లు

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా తగ్గిపోవడంతో పవర్ ఎక్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించింది. ఆదివారం 13 ఎంయూల విద్యుత్‌ను మాత్రమే కొనుగోలు చేసింది. గతేడాది డిసెంబర్ నుంచి జనవరి తొలివారం వరకు రోజుకు 100–125 ఎంయూల విద్యుత్‌ను పవర్ ఎక్ఛేంజీల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ తర్వాత రోజుకి సగటున 80 ఎంయూల వరకు కొనుగోలు చేసింది.

భారీగా మిగులు విద్యుత్

రాష్ట్రం మొత్తం 20,275 మెగావాట్ల విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని (కాంట్రాక్ట్ కెపాసిటీ) కలిగి ఉంది. అందులో ప్రధానంగా జెన్‌కోకి సంబంధించిన 4,842.5 మెగావాట్ల థర్మల్, 2442.76 మెగావాట్ల జలవిద్యుత్‌తో పాటు 1200 మెగావాట్ల సింగరేణి, 3186.76 మెగావాట్ల కేంద్ర ప్రభుత్వ విద్యుత్‌తో పాటు 839.45 మెగావాట్ల సెమ్‌కార్ప్ విద్యుత్ ఉంది. అయితే 1000 మెగావాట్ల ఛత్తీస్‌గఢ్ విద్యుత్, 807.31 మెగావాట్ల గ్యాస్ ఆధారిత విద్యుత్ సరఫరా జరగడం లేదు. దీంతో రాష్ట్ర వాస్తవ విద్యుత్ సరఫరా సామర్థ్యం 18,467.69 మెగావాట్లే. కాగా గరిష్ట విద్యుత్ డిమాండ్ నెలకొని ఉండే సమయాల్లో ఇప్పటివరకు భారీగా ఎనర్జీ ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్లు చేశారు. ప్రస్తుతం డిమాండ్ భారీగా తగ్గడంతో పెద్ద మొత్తంలో విద్యుత్ మిగిలిపోతోంది.

4 ఎకరాలకు పైన ఉన్నవారికీ త్వరలో రైతు భరోసా

మూడున్నరేళ్లలో ప్రతి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ • రైతు మహోత్సవంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: యాసంగి సీజన్‌కు సంబంధించి నాలుగెకరాలకు పైన ఉన్న రైతులకు సైతం త్వరలోనే రైతు భరోసా నిధులు జమ చేయాలని నిర్ణయించినట్టు రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న రైతు మహోత్సవాలను సోమవారం సహచర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్నా, రైతు ప్రయోజనాలే పరమావధిగా పంట రుణాల మాఫీ కింద రైతుల ఖాతాల్లో రూ.33 వేల కోట్లు జమ చేశామన్నారు. సేంద్రియ వ్యవసాయంతోపాటు, ఆధునిక సాంకేతికతను జోడించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విధంగా వ్యవసాయ మెళకువలను అందించేందుకు రైతు మహోత్సవ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. రైతులు పామాయిల్ పంట పండించాలని, టన్ను ధర రూ.21 వేలు పలుకుతుందన్నారు. మూడున్నరేళ్లలో ప్రతి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్‌లను పునరుద్ధరిస్తూ, నిజామాబాద్‌కు వీటి మంజూరులో ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

కాళేశ్వరం నీరు లేకుండా వరిసాగులో రికార్డు : మంత్రి ఉత్తమ్

వానాకాలం, యాసంగి సీజన్లలో 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తెలంగాణలో ఉత్పత్తి అయ్యిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక..కాళేశ్వరం ప్రాజెక్టు చుక్కనీటిని కూడా వినియోగించకుండానే రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా దేశంలోనే అత్యధికంగా వరిని పండించి రికార్డును సృష్టించామన్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో పూడికతీత పనులకు ఈ నెలాఖరులోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని, పూడిక తొలగింపు ద్వారా లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీరందిస్తామన్నారు. కాళేశ్వరం 20, 21, 22 ప్యాకేజీల పెండింగ్ పనులకు నిధులు కేటాయించి త్వరలో పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా గన్నీ బ్యాగుల కొరత, కొనుగోలు కేంద్రాల్లో సమస్యలకు అధికారుల నిర్లక్ష్యమే కారణమైతే సస్పెండ్ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.



రైతు మహోత్సవంలో పాల్గొన్న సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఉత్తమ్‌కుమార్, మహేశ్‌గౌడ్, జూపల్లి కృష్ణారావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

• రాష్ట్రాన్ని 64 ఏళ్లు పాలించిన 21 మంది సీఎంలు రూ.64 వేల కోట్లు అప్పులు చేస్తే...గత కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలోనే రాష్ట్ర అప్పును రూ.8 లక్షల కోట్లకు చేర్చిందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఏడాదికి అప్పులపై రూ.1.40 లక్షల కోట్లు వడ్డీ చెల్లిస్తున్నామని చెప్పారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని, మోసం చేసే పార్టీ కాదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. మూడున్నరేళ్లలో అన్నివర్గాల ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి, వచ్చే ఎన్నికల్లో 90 సీట్లు సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. రైతుల ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. గ్రామీణ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు.

కూలిన రైతు మహోత్సవ వేదిక స్వాగత తోరణం
హెలికాప్టర్ ల్యాండింగ్ సమయంలో ఘటన

రైతు మహోత్సవంలో పాల్గొనేందుకు మంత్రులు ఉత్తమ్, తుమ్మల, జూపల్లి హెలికాప్టర్‌లో వచ్చారు. ల్యాండింగ్ సమయంలో రైతులు ఏర్పాటు చేసిన స్టాళ్లు మొత్తం కదిలిపోయాయి. ఆ ప్రాంతమంతా దుమ్ము ఆవరించింది. దీంతో అక్కడున్నవారంతా పరుగులు తీశారు. ఏం జరిగిందో అర్థం కాలేదు. హెలికాప్టర్ గాలి కారణంగా రైతు మహోత్సవ వేదిక, స్టాల్స్ కోసం ఏర్పాటు చేసిన స్వాగత తోరణం పూర్తిగా లోపలకు కూలిపోయింది. ఒకవేళ హెలికాప్టర్ ల్యాండ్ అయిన వైపు స్వాగత తోరణం కూలిపోయి ఉంటే ఊహించని నష్టం జరిగి ఉండేది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకపోవడంతో అధికారులు సహా అక్కడకు వచ్చినవారంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉడుకుతున్న ఉత్తర తెలంగాణ

- ఆదిలాబాద్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు
- రేపు...ఎల్లుండి మరింత పెరగనున్న తీవ్రత

సాక్షి, నెట్‌వర్క్: ఎండల తీవ్రతతో ఉత్తర తెలంగాణ హడలిపోతోంది. సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 43.7 డిగ్రీలు, సిర్పూర్‌లో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లాలో 43.1 కామారెడ్డి జిల్లాలో 43, కరీంనగర్ జిల్లాలో 42.9, మంచిర్యాల జిల్లాలో 42.8, నిర్మల్ జిల్లాలో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవి సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికం. వచ్చే రెండు రోజుల్లో రాష్ట్ర మంతటా ఎండ తీవ్రత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. సోమవారం జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూలు జిల్లాల్లో మినహాయిస్తే అన్ని జిల్లాల్లో నలభై డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో వాతావరణ శాఖ అలర్ట్ నోటీస్ జారీ చేసింది.

వడదెబ్బతో నలుగురి మృతి

వేర్వేరు జిల్లాల్లో సోమవారం వడదెబ్బతో నలుగురు మృతి చెందారు. నిర్మల్ జిల్లా కూరన్నపేటకు చెందిన నిగులపు శంకర్ (48), నిగులపు రాజు (42) వడదెబ్బకు గురి కాగా, కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వారు మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ గ్రామానికి చెందిన చవాన్ కేశవ్ (60) ఉపాధి హామీ పనుల్లో ఎండ వేడిమికి అస్వస్థతకు గురై.. నిద్రలోనే ప్రాణాలు విడిచాడు. కరీంనగర్ జిల్లా గొల్లపల్లికి చెందిన ఉడిగె ఐలమ్మ (50) వరిలో బెరుకులు ఏరేందుకు వెళ్లి వడదెబ్బకు గురైంది. ఈ క్రమంలోనే ఇంటి పనులు చేసుకుంటూ కుప్పకూలి మరణించింది.

పలుచోట్ల వర్షం.. తడిసిన ధాన్యం

- వికారాబాద్ జిల్లాలో రైలు పట్టాలపై పడిన చెట్టు



హుస్నాబాద్‌లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎత్తి పోస్తున్న రైతులు

సాక్షి, నెట్‌వర్క్: సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి సిద్దిపేట జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలు తడిసిముద్దయ్యాయి. ఆరబెట్టిన ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. కాగా, వికారాబాద్ జిల్లాలో సోమవారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులతో వర్షం కురవడంతో మహ్మదాస్‌పల్లి వద్ద వేపచెట్టు విరిగి రైల్వే ట్రాక్‌పై పడింది. స్థానికుల సమాచారంతో.. ఇటువైపు రావాల్సిన ముంబై ఎక్స్‌ప్రెస్‌తోపాటు మరో రెండు గూడ్స్ రైళ్లను రైల్వే అధికారులు ఆపేశారు. పట్టాలపై పడిన చెట్టును తొలగించి, ట్రాక్‌ను క్లియర్ చేశారు. అనంతరం 15నిమిషాలు ఆలస్యంగా రైళ్లు యథావిధిగా నడిచాయి. కాగా, సోమవారం గద్వాల జిల్లా ఉండవల్లిలో 56.2 మి.మీ. నాగర్‌కర్నూలు జిల్లా తెలకపల్లిలో 39.8, భద్రాద్రి జిల్లా చంద్రుగొండలో 27.8 మి.మీల వర్షం కురిసినట్టు వాతావరణ శాఖ తెలిపింది.

• రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో, హైదరాబాద్‌లోని పేదల బస్తీల్లో కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆరోగ్య వెలుగులు నింపేందుకు ఉపకరిస్తుందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాధిని గుర్తించే సదుపాయాలు అందుబాటులో లేక పలు వురు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

రెండు కార్లు ఢీ.. ముగ్గురి మృతి

- మరో ఏడుగురికి గాయాలు
- పుట్టు వెంట్రుకలు తీసేందుకు వెళ్తుండగా ఘటన

కౌడిపల్లి (నర్సాపూర్): మనవడి పుట్టు వెంట్రుకలు తీసేందుకు దర్గాకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు వారి 14 నెలల మనవడు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట గేట్ బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. హైదరాబాద్ సూరారం క్రిష్ణానగర్‌కు చెందిన మహమ్మద్ అలీ(50) హైటెక్ సిటీలో కార్పెంటర్‌గా పనులు చేస్తుంటాడు. సోమవారం తెల్లవారుజామున అతని పెద్ద కూతురు కుమారుడు గౌస్ (14 నెలలు) పుట్టు వెంట్రుకలు తీసేందుకు కొల్చారం దర్గాకు వెళ్దామని నిర్ణయించుకున్నారు. అలీ ఆదివారం రాత్రి పనులు త్వరగా ముగించుకొని భార్య అజీమాబేగం (45), చిన్న కూతురు సమ్రిన్‌తో కలిసి సూరారం నుంచి కారులో నర్సాపూర్ వచ్చారు. నర్సాపూర్‌లో పెద్ద కుమార్తె ఇరాన్ షాహిన్, ఆమె పిల్లలు నీలోఫర్, మహమ్మద్, గౌస్ ఉండగా, బంధువులు సనా బేగం, ఆమె కూతురు జునేర అక్కడికే వచ్చా రు. అక్కడి నుంచి 9 మంది ఒకే కారులో కొల్చారం దర్గాకు బయలుదేరారు. ఇదే సమయంలో రాయిలాపూర్ గ్రామానికి చెందిన హరీశ్‌రెడ్డి కారులో వెంకట్రావ్‌పేట వైపు వస్తున్నారు. కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట గేట్ సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే రెండు కార్లు అతివేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మహమ్మద్ అలీ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన అజీమాబేగం, గౌస్‌లతోపాటు మిగతా వారిని పోలీసులు నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మధ్యలో బాలుడు గౌస్ చనిపోయాడు. అజీమాబేగం పరిస్థితి విషమంగా ఉండటంతో నారాయణ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందింది. మరో కారులో ఉన్న హరీశ్‌రెడ్డి కాలు విరుగగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి వేర్వేరుగా పరిశీలించారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



మహమ్మద్ అలీ



అజీమాబేగం



బాలుడు గౌస్

కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచ్ భిక్షాటన

- హనుమకొండలో వినూత్న నిరసన

హనుమకొండ: పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఓ మాజీ సర్పంచ్ భిక్షాటన చేశారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం చోటుచేసుకుంది. జిల్లాలోని మండల కేంద్రమైన నడికూడ గ్రామ మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు గత ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. కాగా, ఆయనకు రూ.52.50 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. ఐదుసార్లు కలెక్టర్‌ను కలిసినా ఫలితం లేకపోవడంతో తాను భిక్షాటన చేసినట్లు రవీందర్‌రావు తెలిపారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టానని, తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల సమస్యను ప్రధాన ఎజెండాగా తీసుకుని బిల్లులు చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేస్తున్న నడికుడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు

కట్టుకున్నోళ్లనే కడతేర్చారు

కరెంటు షాక్ పెట్టి ఒకరు.. చీరతో ఉరేసి మరొకరు.. • భర్తలను హతమార్చిన భార్యలు
- కేపీహెచ్‌బీ కాలనీ, మెదక్ జిల్లాలో ఘటనలు



జోగయ్య



సాయిలు



కవిత

కేపీహెచ్‌బీ కాలనీ/పాపన్నపేట (మెదక్): తనను అనుమానిస్తూ, నిలదీశాడనే కోపంతో ఒకరు.. కుమార్తెకు పెళ్లి చేయడం లేదనే కోపంతో మరొకరు.. ఇద్దరు భార్యలు తమ భర్తలను దారుణంగా హతమార్చారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో భర్తకు కరెంట్ షాక్ ఇచ్చి చంపిన భార్య.. మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టింది. మెదక్ జిల్లాలో మద్యం మత్తులో పడుకున్న భర్తను.. ఓ భార్య కుమార్తె సాయంతో చీరతో ఉరేసి హతమార్చింది. ఆయా ఘటనల వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం..

భర్త నిలదీశాడన్న కోపంతో..

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పాత లింగాయపల్లికి చెందిన సాయిలు (45)కి కవిత (42)తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె శ్వేత (17), కుమారుడు బన్నీ (14) ఉన్నారు. దంపతుల మధ్య సఖ్యత లేకపోవడంతోపాటు కవిత ప్రవర్తన నచ్చక సాయిలు తన పిల్లలతో ఊళ్లోనే పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కవిత నగరంలోనే ఉంటూ తోచినప్పుడు ఊరికెళ్లి భర్తతో, పిల్లలతో రెండు మూడ్రోజులు గడిపి వచ్చేది. ఈ నెల 12న భర్త వద్దకు వెళ్లిన కవిత ఉద్యోగం చూపిస్తానంటూ అతడిని నగరానికి తీసుకొచ్చింది. హైదర్‌నగర్ మిత్రహిల్స్ ప్రాంతంలో ఉండే తన సోదరి జ్యోతి, ఆమె భర్త మల్లేశ్‌తో పాటు కవిత తన భర్తతో ఉంటోంది. ఈ నెల 18న రాత్రి భార్య కవిత ప్రవర్తనపై అనుమానం రావడంతో సాయిలు ఆమెను నిలదీశాడు. దీంతో కక్షగట్టిన కవిత కరెంటు వైర్‌తో షాక్ ఇచ్చి భర్తను హత్య చేసింది. జ్యోతి, మల్లేశ్ సహకారంతో మృతదేహాన్ని గోనె సంచిలో మూటగట్టి ఆటోలో వేసుకొని ఊరికి బయలుదేరింది. నిర్మానుష్య ప్రాంతంలో పూడ్చిపెట్టేందుకు యత్నించగా, ఆటోడ్రైవర్‌కు అనుమానం వచ్చి నిలదీశాడు. అనంతరం కవిత కోరిక మేరకు తిరిగి మిత్రాహిల్స్‌లో దింపేసి వెళ్లిపోయాడు. అదే రాత్రి మిత్రాహిల్స్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో జ్యోతి, మల్లేశ్ సాయంతో సాయిలు మృతదేహాన్ని కవిత పూడ్చిపెట్టింది. శనివారం కవిత ఊరికి తిరిగివెళ్లింది. సాయిలు తల్లి తన కుమారుడి గురించి కవితను ప్రశ్నించింది. కవిత పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చింది. మరోవైపు ఆటోడ్రైవర్ కూడా కేపీహెచ్‌బీ పోలీసులకు జరిగిన విషయం వెల్లడించాడు. దీంతో సోమవారం ఉదయం పోలీసులు ఊరిలో ఉన్న కవిత, మిత్రాహిల్స్‌లోని మల్లేశ్, జ్యోతిని అదుపులోకి తీసుకొని విచారించడంతో చేసిన నేరాన్ని అంగీకరించారు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించనున్నట్లు కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సాయిలు తనను నిత్యం వేధిస్తుండటంతోనే తట్టుకోలేక హతమార్చినట్లు కవిత పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. అయితే సాయిలు కుటుంబసభ్యులు మాత్రం కవిత చెప్పేవన్నీ అబద్ధాలని, పథకం ప్రకారమే సాయిలును అంతమొందించిందని ఆరోపిస్తున్నారు. చెడు తిరుగుళ్లకు అలవడి పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని గ్రామస్తులు అంటున్నారు.

కూతురి పెళ్లి చేయడం లేదని..

మెదక్ జిల్లా బాచం గ్రామానికి చెందిన గొల్ల జోగయ్య (45), నాగమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లతోపాటు కుమారుడున్నారు. అప్పుచేసి పెద్ద కుమార్తె పెళ్లి చేశారు. అప్పుల బాధతో జోగయ్య హైదరాబాద్ వెళ్లి కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన జోగయ్యతో రెండో కుమార్తె మౌనిక పెళ్లి విషయమై భార్య గొడవ పడింది. ఆదివారం దంపతుల మధ్య మరోసారి గొడవ జరిగింది. అదే రాత్రి మద్యం మత్తులో పడుకున్న జోగయ్యను కూతురు మౌనికతో కలిసి నాగమ్మ చీరతో ఉరేసి హతమార్చింది. అనంతరం ఉరి వేసుకున్నట్లు మృతదేహాన్ని ఇంట్లో దూలానికి వేలాడదీశారు. అనుమానించిన గ్రామస్తులు.. సమాచారం ఇవ్వడంతో నాగమ్మని, కూతురిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారని ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

క్లుప్తంగా...

అనాథ విద్యార్థినులకు ఆశ్రయం కల్పించండి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



పాపన్నపేట(మెదక్): బడికి సెలవులంటేనే భయం శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లాలో ఉన్న అనాథ విద్యార్థినుల వివరాలు సేకరించి, వారికి ఆశ్రయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ రాధాకిషన్ జిల్లాలోని అన్ని బాలికల హాస్టళ్ల నుంచి వివరాలు సేకరించారు. 47 మంది అనాథ బాలికలు ఉన్నట్టు తేల్చారు. వీరందరికీ ఆశ్రయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అందుబాటులోకి ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్

- బీబీనగర్ ఎయిమ్స్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు



ఎల్లో ఫీవర్ టీకా తీసుకుంటున్న వ్యక్తి, పరిశీలిస్తున్న డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్: దోమకాటు ద్వారా సంక్రమించే ప్రాణాంతక ఎల్లో ఫీవర్ నివారణ వ్యాక్సిన్ యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్‌లో అందుబాటులోకి వచ్చింది. కేంద్ర ఆరోగ్య శాఖ ఆమోదం తెలపడంతో ఎయిమ్స్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో సోమవారం ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. కేవలం రూ.300కే ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ వేశారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్‌ను.. ప్రతి సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల్లోపు ఇవ్వనున్నారు. వ్యాక్సిన్ కోసం వచ్చేవారు పాస్‌పోర్టు తప్పనిసరిగా తీసుకురావలసి ఉంటుంది. వ్యాక్సిన్ అపాయింట్‌మెంట్ కోసం yfvcaiimrbibinagar@gmail.comకి ఈ మెయిల్ చేయడం ద్వారా స్లాట్ షెడ్యూల్ పొందవచ్చు. కాగా గర్భిణులు, హెచ్ఐవీ, క్యాన్సర్ రోగుల్ని వ్యాక్సిన్ నుంచి మినహాయించారు.

అప్పు తీర్చే మార్గం లేక..

- సిరిసిల్లలో నేతన్న ఆత్మహత్య



బలరాం

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన బూర బలరాం (55) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బలరాం సిరిసిల్లలోని పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆడపిల్లల వివాహం చేయడానికి గతంలో అప్పు చేశాడు. మరో రూ.2 లక్షల రుణం మహిళా సంఘాల వద్ద తీసుకున్నాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

కడవరకు తోడుగా కాలభైరవుడు

- ప్రతి అంతిమయాత్రకు శునకం హాజరు



కర్మకాండల కోసం వెళ్తున్న కుటుంబసభ్యుల వెనుక శునకం

జగిత్యాల జోన్: మానవత్వం లేని మనుషుల కంటే.. మమకారం చూపే జంతువులే నయం అంటారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో ఒక శునకం.. ఆ ఊరిలో ఎవరు చనిపోయినా అంత్యక్రియల్లో పాల్గొంటోంది. శ్మశానం వరకు వస్తోంది. అంత్యక్రియల అనంతరం బంధువులందరూ చెరువులో స్నానం చేస్తుంటే.. శునకం కూడా స్నానం చేసి ఇంటివరకు వెళ్తోంది. కర్మకాండలు నిర్వహించే సమయంలోనూ శ్మశానం వరకూ వస్తూ.. తంతు పూర్తయ్యేదాకా అక్కడే గడుపుతోంది. తొలుత శునకం ప్రవర్తించే తీరును ఎవరూ పట్టించుకోలేదు. కొన్ని నెలలుగా గ్రామంలో ఎవరు మృతి చెందినా.. వారి బంధువుల వెంబడి శ్మశానం వరకు వెళ్తుండటం చూసి గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు.



చెరువులో స్నానం చేస్తున్న శునకం

పోప్ అస్తమయం

బ్రెయిన్ స్ట్రోక్‌తో కన్నుమూత • ఈస్టర్ సందర్భంగా చివరిసారి దర్శనం

శోకసంద్రంలో క్యాథలిక్ సమాజం • ప్రపంచవ్యాప్తంగా సంతాపాల వెల్లువ



వాటికన్ సిటీ: ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మందికి పైగా రోమన్ క్యాథలిక్‌ల అత్యున్నత మత గురువైన పోప్ ఫ్రాన్సిస్ ఇక లేరు. 88 ఏళ్ల ఫ్రాన్సిస్ అనారోగ్య సమస్యలతో సోమవారం కన్నుమూశారు. ''పోప్ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై కోమాలోకి వెళ్లిపోయారు. అది గుండె వైఫల్యానికి దారి తీసింది'' అని వాటికన్ వర్గాలు పేర్కొన్నాయి. ''తన జీవితమంతటినీ చర్చి, ప్రభువు సేవకే అంకితం చేసిన రోమ్ బిషప్ ఫ్రాన్సిస్ ఈ ఉదయం 7.35కు తండ్రి సన్నిధి చేరారు' అంటూ వాటికన్ కార్డినల్ కెవిన్ ఫారెల్ అధికారిక ప్రకటన చదివి వినిపించారు. ఆ వెంటనే రోమ్ అంతటా చర్చి టవర్లలో సంతాప సూచకంగా గంటలు మోగాయి. పోప్ పార్థివ దేహాన్ని తొలుత వాటికన్ మత పెద్దలు, అధికారుల సందర్శన నిమిత్తం శాంతా మార్తా చాపెల్‌లో ఉంచుతారు. అనంతరం సాధారణ ప్రజల సందర్శనార్థం సెయింట్ పీటర్స్ చర్చికి తరలిస్తారు. విశ్వాసులు, దేశ విదేశీ ప్రముఖులు ఆయనకు నాలుగు నుంచి ఆరు రోజుల పాటు తుది నివాళులు అర్పిస్తారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తారు. అందుకు త్వరలో తేదీని ఖరారు చేస్తారు. ఆ తర్వాత 9 రోజుల పాటు వాటికన్‌లో సంతాప దినాలు పాటించాక పోప్ వారసుని ఎన్నిక జరుగుతుంది. దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న పోప్ ఇటీవలే 38 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. నిమోనియాతో 1950ల్లోనే ఆయన కుడి ఊపిరితిత్తిని తొలగించాల్సి వచ్చింది. పోప్ చివరిసారిగా ఈస్టర్ సందర్భంగా ఆదివారం బయటి ప్రపంచానికి కన్పించారు.


మోదీతో పోప్ ఫ్రాన్సిస్

భారతీయులపై పోప్ ప్రేమాభిమానాలు మరవలేనివి: మోదీ

న్యూఢిల్లీ: పోప్ ఫ్రాన్సిస్ అస్తమయం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. ''ప్రేమాభిమానాలకు, సహానుభూతికి మారుపేరుగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారు. యువ ప్రాయం నుంచే ఫ్రాన్సిస్ క్రీస్తు సేవకు అంకితమయ్యారు. పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారు. బాధల్లో ఉన్న కోట్లాదిమందిలో ఆశాదీపం వెలిగించారు. ఆజన్మాంతం ఫ్రాన్సిస్ ప్రదర్శించిన ఆధ్యాత్మిక స్థైర్యం అందరికీ ఆదర్శం. ముఖ్యంగా భారతీయుల పట్ల ఎనలేని ప్రేమాభిమానాలు చూపారు. ఆయనతో భేటీ అయిన క్షణాలను ఎన్నటికీ మర్చిపోలేను'' అన్నారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, దేశవ్యాప్తంగా పలు చర్చిల ప్రతినిధులు తదితరులు పోప్ అస్తమయం పట్ల సంతాపం తెలిపారు. దేశవ్యాప్తంగా మూడు రోజుల పాటు సంతాపం పాటించనున్నట్టు కేంద్రం ప్రకటించింది.


సంతాపాల వెల్లువ

పోప్ అస్తమయం పట్ల ప్రపంచవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తాయి. పలువురు దేశాధినేతలు దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. ఇది తమనెంతో ఆవేదనకు గురిచేసిందన్నారు. బ్రిటన్ రాజు చార్లెస్–3, ప్రధాని కియర్ స్టార్మర్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, యూరోపియన్ యూనియన్ ప్రెసిడెంట్ ఉర్సలా వాండెర్ లెయన్, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్, పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్, డెన్మార్క్ ప్రధాని డిక్ స్కూఫ్, ఈజిప్ట్ అధ్యక్షుడు ఎల్ సిసీ, ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్, దుబాయ్ పాలకుడు షేక్ మహ్మద్ బిల్ రషీల్ అల్ మక్తూమ్ తదితరులు సంతాప సందేశాలు విడుదల చేశారు. భావి తరాలకు ఫ్రాన్సిస్ గొప్ప ఆదర్శంగా నిలుస్తారంటూ కొనియాడారు. ఈస్టర్ సందర్భంగా ఆదివారమే పోప్‌తో భేటీ అవడాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ గుర్తు చేసుకున్నారు.

పోప్ వారసుని ఎన్నిక ఇలా.. - సాక్షి ప్లస్‌లో

సంస్కరణవాదిగా చెరగని ముద్ర

అది 2013. పోప్ బెనెడిక్ట్–16 తన పదవికి రాజీనామా చేసి రిటైరయ్యారు. అలాంటి అసాధారణ పరిస్థితి తలెత్తడం 600 సంవత్సరాల్లో అదే తొలిసారి. అలాంటి అనూహ్య పరిస్థితుల నడుమ 266వ పోప్‌గా ఫ్రాన్సిస్ బాధ్యతలు స్వీకరించారు. ఆ పదవి చేపట్టిన తొలి లాటిన్ అమెరికన్‌గా, తొలి జెస్యూట్‌గా చరిత్ర సృష్టించారు. ఆయన అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. 1936 డిసెంబర్ 17న అర్జెంటీనాలో రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో జన్మించారు. ఐదుగురు సంతానంలో అందరికంటే పెద్దవాడు. దైవసేవే తన మార్గమని 17 ఏళ్ల వయసులోనే నిర్ణయించుకున్నారు. 36 ఏళ్లకే అర్జెంటీనాలోని జెస్యూట్లకు సారథి అయ్యారు. 1992లో బ్యూనస్ ఎయిర్స్ సహాయ బిషప్, 1998లో ఆర్చి బిషప్ అయ్యారు. 2001లో కార్డినల్ అయ్యారు. అనంతరం పోప్‌గా 12 ఏళ్లకు పైగా తన పనితీరుతో చెరిగిపోని ముద్ర వేశారు. అతి నిరాడంబర జీవన శైలితో ఆకట్టుకున్నారు. మిగతా పోప్‌ల్లా రాజప్రాసాదంలో కాకుండా వాటికన్‌లోని ఓ హోటల్లో నివసించారు. 2023 దాకా బెనెడిక్ట్, ఫ్రాన్సిస్ రూపంలో వాటికన్‌లో ఏకకాలంలో ఇద్దరు పోప్‌లు ఉండటం ఓ అసాధారణ ఘటనగా నిలిచిపోయింది. అయితే బెనెడిక్ట్ అబార్షన్ వ్యతిరేక అజెండాను ఫ్రాన్సిస్ పూర్తిగా సమర్థించలేదు. అధికార బలమున్న వాళ్లు నిస్సహాయులను పీల్చుకు తినడం ఎంత మాత్రమూ సరికాదంటూ తరచూ సామ్యవాద తరహా భావనలు వెలిబుచ్చేవారు.


చివరిసారిగా ఆదివారం ఈస్టర్ ప్రార్థనల్లో..

ఎన్నో సంచలనాలు

శరణార్థులు, అణగారిన వర్గాలతో పాటు స్వలింగ సంపర్కుల పట్ల ఫ్రాన్సిస్ ఎంతో సహానుభూతి చూపారు. వారితో పాటు పేదలు, ఖైదీలు, అంటరాని వర్గాలకు చర్చి వ్యవస్థ పెద్ద దిక్కుగా నిలవాలని స్పష్టం చేశారు. స్వలింగ సంపర్కం నేరం కాదని బాహాటంగా ప్రకటించారు. అంతేగాక, 'ఈ అంశంపై తీర్పు చెప్పేందుకు నేనెవరిని?' అంటూ ఆయన చేసిన వ్యాఖ్య చిరస్థాయిగా నిలిచిపోయింది. స్వలింగ వివాహాలు చేసుకున్న జంటలను చర్చి ఆశీర్వదించడానికి అనుమతించారు. స్వలింగ సంపర్కులు ప్రీస్ట్ బాధ్యతలు స్వీకరించడాన్ని సమర్థించారు. దీన్ని ఆఫ్రికా, ఆసియా, ఇతర ప్రాంతాల బిషప్‌లు తీవ్రంగా వ్యతిరేకించినా పట్టించుకోలేదు. సంప్రదాయవాదుల తీరుతెన్నులను సందర్భం దొరికినప్పుడల్లా గట్టిగా ఆక్షేపించారు.

ఇరాక్ పర్యటన

ఇరాక్‌లో పర్యటించిన తొలి పోప్‌గా ఫ్రాన్సిస్ నిలిచారు. అరబ్ దేశాల్లోనూ పర్యటించి ముస్లిం ప్రపంచంతో చర్చి సంబంధాల్లో కొత్త అధ్యాయానికి తెర తీశారు. వాటికన్ బ్యూరోక్రసీతో పాటు మొత్తంగా చర్చి వ్యవస్థనే సంస్కరించేందుకు ప్రయత్నించి సంచలనం సృష్టించారు. మరణశిక్షను పూర్తిగా వ్యతిరేకించేలా, అణ్వాయుధాలు కలిగి ఉండటాన్ని అనైతికంగా పేర్కొనేలా చర్చి వైఖరిలో మార్పులు తెచ్చారు. పోప్‌ను ఎంపిక చేసే కీలక కార్డినల్ పదవుల్లో పాస్టర్లకు అధిక ప్రాధాన్యమిచ్చారు. కార్డినల్స్‌పై క్రిమినల్ కేసుల విచారణకు ఉన్న అడ్డంకులను కూడా తొలగించారు. వాటికన్ కార్యాలయాలపై పోలీసు దాడు లకూ అనుమతులిచ్చారు! వాటికన్ అధికారుల అపరిమిత ఆర్థికాధికారాలకు కత్తెర వేశారు. వారందుకునే కానుకలపైనా పరిమితి విధించారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో అమెరికా వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ఫ్రాన్సిస్ పనితీరుపై కొన్ని వివాదాలూ తలెత్తకపోలేదు. మైనర్లపై లైంగిక వేధింపుల అభియోగాలున్న కార్డినల్ థియోడర్ మెక్‌కారిక్‌కు చాలాకాలం పాటు దన్నుగా నిలిచారన్న విమర్శలు ఎదుర్కొన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అసలే మాపై అభియోగాలు

మళ్లీ ఆదేశాలివ్వమంటారా? • విమర్శలపై సుప్రీంకోర్టు స్పందన

న్యూఢిల్లీ: బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లతో పాటు రాష్ట్రపతికి కూడా గడువు విధిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన సంచలన తీర్పుపై కొద్ది రోజులుగా విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో పాటు బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తదితరులు దీన్ని తీవ్రంగా తప్పుబడట్టమే గాక సుప్రీంకోర్టు తీరును నిశిత విమర్శలు గుప్పించారు. దీనిపై సుప్రీంకోర్టు తాజాగా స్పందించింది. సోమవారం రెండు కేసుల్లో జస్టిస్ బి.ఆర్.గవాయ్ సారథ్యంలోని ధర్మాసనాలు జరిపిన విచారణలు ఇందుకు వేదికయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ స్పందిస్తూ, ''పార్లమెంటు, కార్యనిర్వాహక వ్యవస్థల పనితీరులో తలదూరుస్తున్నామని ఇప్పటికే మా (సుప్రీంకోర్టు)పై ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ రాష్ట్రపతికి ఆదేశాలిమ్మంటారా?'' అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టుపై, సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాపై ఎంపీ నిశికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేస్తామని న్యాయవాది అనస్ తన్వీర్ కోరగా, అందుకు తమ అనుమతి అక్కర్లేదని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. కేంద్రం తరఫున అటార్నీ జనరల్ అంగీకారం తీసుకోవాలని సూచించారు. ఆ మేరకు ఏజీకి ఇప్పటికే లేఖ రాసినట్టు తన్వీర్ వెల్లడించారు. ఆరోపణలు చేసేటప్పుడు వ్యవస్థల ప్రతిష్టను, హుందాతనానికి భంగం కలగకుండా వ్యవహరించాలని మరో కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కూడా దూబేకు సూచించింది.

కెనడాలో ఆలయంపై ఖలిస్తానీల దాడి

టొరంటో: కెనడాలోని మరో ఆలయంపై ఖలిస్తానీలు దాడి చేశారు. సర్రేలో ఉన్న లక్ష్మీ నారాయణ్ ఆలయం గోడలపై ఈ నెల 19న రంగులను స్ప్రే చేసి, ఖలిస్తానీ అనుకూల రాతలు రాశారు. ఈ చర్యలపై కెనడాలోని హిందువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోడలను వికృతంగా మార్చినట్లుగా ఉన్న ఒక వీడియోను కెనడియన్ హిందూ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎక్స్‌లో షేర్ చేసింది. ఈ చర్యను 'హిందూ ఫోబియా'గా అభివర్ణించింది. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, మౌనం సరైన విధానం కాదని పేర్కొంది. అదేవిధంగా, వాంకోవర్‌లోని రాస్ స్ట్రీట్‌లో ఉన్న ఖల్సా దివాన్ సొసైటీ గురుద్వారా గోడలపైనా ఖలిస్తానీ అనుకూలురు 'ఖలిస్తానీ జిందాబాద్' తదితర రాతలే రాశారని సొసైటీ తెలిపింది.

వాణిజ్య బంధం బలోపేతంపైనే దృష్టి

ద్వైపాక్షిక ఒప్పందంపై చర్చించిన ప్రధాని మోదీ, అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్

- ఒప్పందం పురోగతిపై సంతృప్తి వ్యక్తంచేసిన ఇరు నేతలు
- తొలుత వాన్స్ కుటుంబానికి తన నివాసం వద్ద సాదరస్వాగతం పలికిన ప్రధాని

న్యూఢిల్లీ: అగ్రరాజ్యాధినేత ట్రంప్ ఆదేశాలతో అమెరికా ప్రభుత్వం భారత్‌పై సుంకాల సుత్తితో మోదుతున్న వేళ ట్రంప్‌కు కుడిభుజం, ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా హస్తినకు విచ్చేసిన వాన్స్ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీని ఆయన నివాసంలో కలిశారు. సతీమణి ఉషా చిలుకూరి, పిల్లలు ఇవాన్, వివేక్, మీరాబెల్‌లతో కలిసి 7, లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని మోదీ అధికారిక నివాసానికి వాన్స్ విచ్చేశారు. అక్కడ వీళ్ల కుటుంబానికి మోదీ సాదర స్వాగతం పలికారు. స్వయంగా కారు దాకా వచ్చిన మోదీ.. వాన్స్ కారు దిగి దగ్గరకు రాగానే ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. వాన్స్ వెంట వచ్చిన కుమారులిద్దరినీ సరదాగా పలకరించారు. వారిని పరిచయం చేసుకున్నారు. కుమార్తె మీరాబెల్‌ను ఎత్తుకుని వచ్చిన ఉషా చిలుకూరితో మోదీ కరచాలనం చేసి కుశల ప్రశ్నలు వేశారు. తర్వాత చిన్నారులను చేయిపట్టుకుని ఇంట్లోకి తీసుకెళ్లారు. తొలుత వాన్స్ కుటుంబసభ్యులందరికీ ఇంటి గార్డెన్‌ను మోదీ స్వయంగా చూపించారు. నెమళ్లు స్వేచ్ఛగా విహరిస్తున్న పచ్చికబయళ్లలో కుటుంబంతో కలిసి మోదీ కలియతిరిగారు. తర్వాత ఇంట్లోకి తీసుకెళ్లి గ్రూప్ ఫొటో దిగారు. తర్వాత నెమలి ఈకలను ముగ్గురు చిన్నారులకు ఇచ్చి వారితో ముచ్చటించారు. మీద కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్పారు. వాన్స్ చిన్నకుమారుడు వివేక్ మోదీ తరహా డ్రెస్, పెద్దబ్బాయి ఇవాన్ సూట్ ధరించారు.

ఒప్పందం పురోగతిపై సంతృప్తి

తర్వాత మోదీ, వాన్స్‌లు విడిగా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరుదేశాలకు ప్రయోజనకారి అయిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై విస్తృతస్థాయిలో చర్చలు జరిపారు. ఒప్పందం పురోగతిపై మోదీ, వాన్స్‌లు సంతృప్తి వ్యక్తంచేశారు. వీలైనంత త్వరగా ఒప్పందం ఓ కొలిక్కి వచ్చేలా చూడటంపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. దీంతోపాటు రక్షణ, ఇంధనం, వ్యూహాత్మక సాంకేతికత రంగాల్లో మరింత సహకారంపైనా చర్చలు జరిపారు. త్వరలో భారత్‌లో పర్యటించాలని భావిస్తున్నందుకు ట్రంప్‌కు తన తరఫున కృతజ్ఞతలు తెలపాలని వాన్స్‌తో మోదీ చెప్పారు. ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన పలు అంశాల్లో పురోగతి సాధించంపై ఇరు దేశాల నేతలు సమగ్ర స్థాయిలో చర్చలు జరిపారని భేటీ ముగిశాక సోమవారం రాత్రి భారత్ ఒక ప్రకటన విడుదలచేసింది. '' ఫిబ్రవరిలో ట్రంప్‌తో భేటీ, ఫలవంతమైన చర్చల వివరాలను వాన్స్ వద్ద మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. నాటి చర్చలు ఇరు దేశాల మధ్య సహకారానికి బాటలు వేశాయి. అటు మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్‌కు, ఇటు వికసిత్ భారత్ 2047 సుసాధ్యానికి మార్గం సుగమం చేశాయి. ఇరు దేశాల ప్రజల సంక్షేమానికి దోహదపడే ద్వైపాక్షిక వాణిజ్యం ఒప్పందం(బీటీఏ) పురోగతిపై నేతలిద్దరూ సంతృప్తి వ్యక్తంచేశారు. టారిఫ్‌లు, ఇరు దేశాల మార్కెట్లలోకి సులభంగా ప్రవేశించడం తదితర కీలకాంశాలు బీటీఏలు ఉండనున్నాయి. పరస్పర ప్రయోజనకర అంశాలతోపాటు అంతర్జాతీయ సమకాలీన అంశాలూ మోదీ, వాన్స్‌ల భేటీలో ప్రస్తావనకు వచ్చాయి. సమస్యాత్మక అంతర్జాతీయ అంశాల్లో దౌత్యం, సంప్రతింపులే పరిష్కార మార్గాలని నేతలు భావించారు. భారత్‌లో ఉన్నన్ని రోజులు వాన్స్, ఉషా, వాళ్ల చిన్నారులు ఎంతో ఆహ్లాదంతో గడపాలని మోదీ ఆకాంక్షించారు'' అని ఆ ప్రకటన పేర్కొంది. చర్చల్లో భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ప్రధాని ముఖ్య కార్యదర్శి శక్తికాంతదాస్ పాల్గొన్నారు. 12 ఏళ్ల తర్వాత అమెరికా ఉపాధ్యక్షుడు ఒకరు భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. 2013లో నాటి ఉపాధ్యక్ష హోదాలో జోబైడెన్ ఢిల్లీకి వచ్చారు.


సోమవారం ఢిల్లీలోని తన నివాసంలో జేడీ వాన్స్, ఉష దంపతులు, వారి పిల్లలతో ప్రధాని మోదీ (మరిన్ని చిత్రాలు సాక్షి ప్లస్‌లో)

ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి మరీ..

న్యూఢిల్లీ: నాలుగు రోజుల పర్యటనలోభాగంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సోమవారం ఉదయం 9.50 గంటలకు ఢిల్లీలోని పాలెం వైమానిక స్థావరంలో దిగారు. తెలుగమ్మాయి, భార్య ఉషా చిలుకూరి, తమ ముగ్గురు సంతానం ఇవాన్, వివేక్, మీరాబెల్‌తో కలిసి వాన్స్ 'ఎయిర్‌ఫోర్స్ టు' విమానం నుంచి దిగారు. ఈ సందర్భంగా వాన్స్ దంపతులకు ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి మరీ కేంద్ర కేబినెట్ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సాదర స్వాగతం పలికారు. వాన్స్‌తోపాటు అమెరికా జాతీయ భద్రతా మండలి సీనియర్ డైరెక్టర్ రికీ గిల్, ఇతర ఉన్నతాధికారులు వచ్చారు. ఎయిర్‌బేస్‌లోనే కళాకారులతో ఏర్పాటుచేసిన నృత్యకార్యక్రమం వాన్స్ కుటుంబ సభ్యులను అలరించింది. తర్వాత వాన్స్ భారత త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. వాన్స్ పర్యటన నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక వాన్స్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి.

భారతీయ దుస్తుల్లో పిల్లలు

విమానం దిగేటప్పుడు వాన్స్ ముగ్గురు పిల్లలు భారతీయ దుస్తుల్లో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎనిమిదేళ్ల పెద్దకుమారుడు ఇవాన్ బూడిద రంగు కుర్తా, తెలుపు పైజామా ధరించాడు. ఐదేళ్ల కుమారుడు వివేక్ పసుపు రంగు కుర్తా, తెలుపు పైజామా ధరించాడు. మూడేళ్ల కుమార్తె ఆకుపచ్చ రంగు అనార్కలీ సూట్, జాకెట్ ధరించారు. అమెరికా సెకండ్ లేడీ, వాన్స్ భార్య ఉషా ఆధునిక దుస్తుల్లో కనిపించారు. స్వాగత కార్యక్రమం పూర్తయ్యాక వాన్స్ కుటుంబం ఢిల్లీకి తరలివెళ్లింది.

అక్షరధామ్ ఆలయ సందర్శన

ఢిల్లీలో తొలుత అక్షరధామ్ ఆలయాన్ని వాన్స్ కుటుంబం సందర్శించింది. యమునా తీరంలో అత్యద్భుతంగా నిర్మించిన స్వామినారాయణ్ అక్షరధామ్ ఆలయాన్ని చూసి వాన్స్ కుటుంబం పులకించిపోయింది. లోపలికి వెళ్లి దర్శనం చేసుకున్నాక ఆలయం మొత్తం కలియతిరిగారు. గజేంద్రపీఠంను చూసి అచ్చెరువొందారు. '' ఇంతటి సుందర ప్రదేశంలో సాదర స్వాగతం పలికి ఆతిథ్యమిచ్చినందుకు కృతజ్ఞతలు. ఎంతో నేర్పుతో శ్రద్ధతో ఇంత అందమైన ఆలయాన్ని నిర్మించిన భారత్‌ను ప్రశంసించాల్సిందే. మా పిల్లలకు ఈ ఆలయం ఎంతో నచ్చింది'' అని అక్కడి సందర్శకుల పుస్తకంలో వాన్స్ రాశారు. వాన్స్ దంపతులకు ఢిల్లీ అక్షరధామ్ ఆలయ నమూనాను, చెక్క ఏనుగును చిన్నారులకు చిన్నపిల్లల పుస్తకాన్ని ఆలయ నిర్వాహకులు కానుకగా ఇచ్చారు. ఆలయం ఎంతో ప్రశాంతంగా ఉందని వాన్స్ కుటుంబం తనతో చెప్పిందని వాళ్లకు ఆలయంలో సహాయపడిన మీరా సోందాగర్ చెప్పారు. తర్వాత వాన్స్ దంపతులు జన్‌పథ్‌లోని సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రీస్ ఎంపోరియంను సందర్శించారు. అక్కడ కొన్ని భారతీయ హస్తకళలను కొనుగోలుచేశారు. ఢిల్లీలో ఉన్నంతసేపు వాన్స్ కుటుంబం ఐటీసీ మౌర్య షెరటాన్ హోటల్‌లో బసచేయనుంది.

ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకే..

గతంలో అమెరికా ఉపాధ్యక్షులు విచ్చేసినప్పుడు కేంద్ర సహాయ మంత్రి, విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వంటి వారు మాత్రమే స్వాగతం పలికారు. ఈసారి ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి ఏకంగా కేంద్ర కేబినెట్ మంత్రి అమెరికా ఉపాధ్యక్షుడికి సాదర స్వాగతం పలికారు. కేబినెట్ ర్యాంక్ స్థాయి నేత ఇలా స్వయంగా ఆహ్వానం పలకడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది. 2023 సెప్టెంబర్‌లో నాటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సదస్సు కోసం వచ్చినప్పుడు పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి వీకే సింగ్ స్వాగతం పలికారు. బైడెన్ 2013లో ఉపాధ్యక్ష హోదాలో వచ్చినప్పుడు నాటి విదేశాంగ శాఖ కార్యదర్శి రంజన్ మథాయ్ స్వాగతం పలికారు. ట్రంప్ అధ్యక్షునిగా 2020లో వచ్చినపుడు కేబినెట్ మంత్రి కాకుండా కేవలం సహాయ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ ట్రంప్‌కు స్వాగతం పలికారు. సుంకాల భారం మోపుతూ భారత్ పట్ల ఆగ్రహం ఉన్న ట్రంప్ సర్కార్‌ను వాన్స్ ద్వారా ప్రసన్నం చేసుకునేందుకు మోదీ సర్కార్ ఇలా కేబినెట్ మంత్రిని పంపించి సాదరంగా ఆహ్వానించింది.

నేడు జైపూర్‌లో సందర్శన

మంగళవారం ఉదయం నుంచి జైపూర్‌లోని పలు చారిత్రక ప్రదేశాలను వాన్స్ కుటుంబం సందర్శించనుంది. తొలుత జైపూర్‌లోని రామ్‌భాగ్ ప్యాలెస్‌లో బస చేస్తారు. మంగళవారం యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన అంబర్ కోటకు వెళ్తారు. సాయంత్రం జైపూర్‌లోని రాజస్తాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో వాన్స్ ప్రసంగిస్తారు. బుధవారం ఉదయం వాన్స్ దంపతులు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో చరిత్రాత్మక కట్టడం తాజ్‌మహల్‌ను సందర్శిస్తారు. తర్వాత భారతీయ శిల్పకళల ప్రదర్శనశాల అయిన శిల్పాగ్రామ్‌కు వెళ్తారు. సాయంత్రం మళ్లీ జైపూర్‌కు వస్తారు. జైపూర్ నుంచి గురువారం ఉదయం అమెరికాకు బయల్దేరతారు.

వాహనాలకు హారన్‌గా భారతీయ సంగీతం

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ: వాహనాలకు హారన్‌గా భారతీయ సంగీత ధ్వనులు మాత్రమే వచ్చేలా త్వరలో చట్టం తేవాలని యోచిస్తున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. నవభారత్ టైమ్స్ 78వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో గడ్కరీ ప్రసంగించారు. అన్ని రకాల వాహనాలకు కూడా భారతీయ సంగీత ధ్వనులే హారన్‌గా ఉంటాయని, వీటిని వినడం ఆహ్లాదకరంగా కూడా ఉంటుందన్నారు. సంగీత పరికరాలైన ఫ్లూట్, తబలా, వయోలిన్, హార్మోనియం ధ్వనులు ఇందులో ఉంటాయన్నారు. దేశంలో మొత్తం వాయు కాలుష్యం రవాణా రంగం వాటా 40 శాతం వరకు ఉంటుందని చెప్పారు. మన ఆటోమొబైల్ మార్కెట్ అమెరికా, చైనాల తర్వాత జపాన్‌ను వెనక్కి నెట్టేసి మూడో స్థానంలో నిలిచామన్నారు. 2014లో భారత ఆటోమొబైల్ రంగం విలువ రూ.14 లక్షల కోట్లు కాగా నేడది రూ.22 లక్షల కోట్లకు చేరిందన్నారు. కార్లు, ద్విచక్ర వాహనాల ఎగుమతి వల్లే దేశానికి ఎక్కువ ఆదాయం వస్తోందని వెల్లడించారు.

కళ్లలో కారం చల్లి.. కత్తితో పొడిచి

బనశంకరి: కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్(68) హత్య కేసులో నిజాలు ఒక్కోటి వెలుగు చూస్తున్నాయి. ఈ కేసులో ఆదివారం ఉదయం ఓం ప్రకాశ్ నివాసంలో భార్య పల్లవి, కుమార్తె కృతిని హత్య నేరం కింద పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. విచారణలో పల్లవి ప్రధాన నిందితురాలని వెల్లడైందని పోలీసులు తెలిపారు. భర్త ఓం ప్రకాశ్ కళ్లలో కారం చల్లి, కత్తితో పలుమార్లు పొడిచి చంపినట్లు ఆమె ఒప్పుకున్నట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి. కర్ణాటకలోని దండేలిలో ఉన్న భూమి విషయంలో ఓం ప్రకాశ్ దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతోంది. శనివారం రాత్రి వారి మధ్య భోజనం చేస్తున్న సమయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. తీవ్ర ఆవేశంతో ఉన్న పల్లవి భర్త ముఖంపై కారం చల్లింది. మంటతో ఆయన విలవిల్లాడుతుండగా ఇదే అదనుగా పలుమార్లు అయన్ను కత్తితో పొడిచి చంపేసింది. అనంతరం తన ఫ్రెండ్‌కు వీడియో కాల్ చేసి, 'ఆ రాక్షసుడిని చంపేశాను'అని చెప్పినట్లు విచారణలో వెల్లడైంది. బిహార్‌కు చెందిన 1981 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఓం ప్రకాశ్ బెంగళూరు నగరంలోని హెచ్‌ఎస్ఆర్ లేఔట్‌లోని మూడంతస్తుల సొంతింట్లో రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండగా ఆదివారం పోలీసులు గుర్తించడం తెల్సిందే. కొన్ని నెలల క్రితం పల్లవి స్థానిక హెచ్ఎస్ఆర్ లేఔట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, భర్తపై ఫిర్యాదుకు ప్రయత్నించింది. అధికారులు నిరాకరించడంతో పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగింది. స్కిజోఫ్రీనియా అనే మానసిక వ్యాధితో 12 ఏళ్లుగా బాధపడుతున్న పల్లవి ప్రస్తుతం చికిత్స చేయించుకుంటోందని సమాచారం. ఇక, ఓం ప్రకాశ్‌కు ఓ అధ్యాపకురాలితో అక్రమ సంబంధం ఉందని, అది కూడా కుటుంబ కలహాలకు కారణమైందని తెలుస్తోంది.


భార్య, కూతురుతో ఓంప్రకాశ్ (ఫైల్)

ఓం ప్రకాశ్ హత్య ఘటనపై ఆయన కుమారుడు కార్తికేశ్ స్పందించారు. తల్లి, సోదరి పైనే ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 'వారం రోజులుగా మా నాన్నను చంపేస్తానంటూ మా అమ్మ బెదిరిస్తూ వస్తోంది. ఈ బెదిరింపుల భయంతోనే ఆయన సొంత సోదరి ఇంట్లో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం నా సోదరి కృతి అక్కడికి వెళ్లి బలవంతంగా ఆయన్ను ఇక్కడికి తీసుకువచ్చింది. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో దొమ్మలూర్‌లోని కర్నాటక గోల్ఫ్ అసోసియేషన్ వద్ద ఉండగా నాకు సమాచారం వచ్చింది. ఇంట్లో మా నాన్న రక్తపు మడుగులో పడి ఉన్నాడని..'అని కార్తికేశ్ తెలిపారు. 'అక్కడికి వెళ్లే సరికి తల, శరీరంపై తీవ్ర గాయాలతో పడి ఉన్నారు. పక్కనే పగిలిన సీసా, కత్తి పడి ఉన్నాయి. తర్వాత ఆయన్ను సెయింట్ జాన్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు'అని వివరించారు. నాన్నతో అమ్మ పల్లవి, సోదరి కృతి తరచూ గొడవ పడుతున్నారు. ఆయన హత్యలో వీరిద్దరిపైనే నాకు ఎక్కువ అనుమానాలున్నాయి. వీరిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి'అని ఆయన పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

చైనాలో 10జీ నెట్‌వర్క్..!

బీజింగ్: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సముపార్జనలో డ్రాగన్ దేశం చైనా మరో అడుగు ముందుకు వేసింది. ప్రపంచంలోనే మొట్ట మొదటిసారిగా 10 గిగాబైట్స్ ఫర్ సెకన్స్() వేగంతో పనిచేసే 10జీ బ్రాడ్ బ్యాండ్ నెట్‌వర్క్‌ను ప్రారంభించింది. రాజధాని బీజింగ్ సమీపంలోని హుబే ప్రావిన్స్‌లో చేపట్టిన ప్రయోగ పరీక్షల్లో గరిష్ఠంగా 10 జీబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ పని చేసినట్లు మీడియా వెల్లడించింది. ఈ వేగంతో అత్యంత స్పష్టతతో కూడిన రెండు పూర్తి సినిమాలను కేవలం సెకన్‌లోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. క్లౌడ్ కంప్యూటింగ్, టెలీ మెడిసిన్ తదితర రంగాల్లో దీనితో ఎన్నో మార్పులు సంభవించనున్నాయి.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



రూ.1950 కోట్ల భూమిని కాపాడాడు!

ఓ గొర్రెల కాపరి ఫిర్యాదుతో హైడ్రా అలర్ట్ అయింది. ఆక్రమణ దారుల నుంచి రూ.1950 కోట్ల విలువైన భూమిని కాపాడింది. -8లో



జలకాలాటల్లో.. 'జిమ్'దగీ..

నగరంలో ఆక్వా వర్కవుట్స్‌కు ఆదరణ పెరుగుతోంది. నీటి అడుగున వ్యాయామాలతో అదనపు లాభాలుంటాయని నిపుణులు చెబుతున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.0/26.0

నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 39, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

పని చేస్తేనే గుర్తింపు

ఎక్సైజ్‌లో 50 మందికి నగదు పురస్కారాలు

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్స్ మెంట్, ఎస్టీఎఫ్, డీటీఫ్ తదితర విభాగాల్లో పని చేస్తున్న 50 మంది సిబ్బందికి ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్ రెడ్డి సోమవారం నగదు పురస్కారాలు అందజేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ, శక్తి సామర్థ్యాలను చాటుకున్నవారికి ఈ అవార్డులు లభించాయి. కష్టపడి పనిచేసేవారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఎక్సైజ్ శాఖలో ప్రతిభ కనబరిచిన వారికి చేయూతనందించాలనే లక్ష్యంతోనే నగదు పురస్కారాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సంగారెడ్డిలో వరుసగా నిందితులకు శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టడం, సంగీతా సాహు లాంటి గంజాయి డాన్‌తోపాటు ఒడిశాకు చెందిన నిందితులను పట్టుకొని అరెస్టు చేసిన పలువురికి ఈ అవార్డులు లభించాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, మెదక్ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరెడ్డి, ఎస్టీఎఫ్ టీం లీడర్లు నంద్యాల అంజిరెడ్డి, ప్రదీప్ రావు, తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

లక్డీకాపూల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు బాధ్యతతో పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం మెరుగుపరుచుకుని ఒకే ఫిర్యాదు రిపీట్ కాకుండా నివారించాలని సూచించారు. కాగా ఈ కార్యక్రమంలో 82 విన్నపాలు రాగా, అందులో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానివే 32 ఉన్నాయి. ఇక జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 111 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, యాదగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

సిటీ @ 40 డిగ్రీలు

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో సూర్యుడు భగ్గుమన్నాడు. వాతావరణం వేడెక్కింది. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం గరిష్ఠ ఉష్ణోగ్రత నగటున 40 డిగ్రీలు నమోదైంది. ఈ సీజన్‌లో రికార్డు స్థాయి గరిష్ఠ ఉష్ణోగ్రత ఇదే. సాయంత్రం నాలుగు గంటల తర్వాత వాతావరణంలో మార్పులు వచ్చి కాసింత చల్లబడింది. మధ్యాహ్నం ఎండకు బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సాధారణం కంటే 0.08 డిగ్రీలు పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రత 25.9 డిగ్రీలు నమోదైంది. అత్యధికంగా నగర శివారులోని దుండిగల్‌లో 41.6 డిగ్రీలు, ఆసిఫ్‌నగర్‌లో 40.6 డిగ్రీలు నమోదైంది. మరోవైపు నగర శివారులోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. గతేడాది కంటే రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నా..ఉక్కపోత మాత్రం నగర వాసులను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.



కావూరిహిల్స్‌లో ఇలా..



ఎల్బీనగర్‌లో బస్ షెల్టర్ లేక రోడ్డు పైనే ప్రయాణికులు

బిగ్ స్టోరీ

షెల్టర్ ప్లీజ్!

ఎండల్లో మండుతున్నం.. వానొస్తే తడుస్తున్నం..

గ్రేటర్‌లో సిటీ బస్సు ప్రయాణికుల వేదన

- బస్‌షెల్టర్లు లేక రహదారులపైనే వేచి చూడాల్సిన పరిస్థితి
- 90 శాతం ప్రాంతాల్లో ఇదే పరిస్థితి
- ఏసీ షెల్టర్లున్నా వేసవిలో చెమటలే..
- కొన్నింట్లో దుకాణాలు, జిరాక్స్ సెంటర్లు
- యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నా పట్టని అధికారులు

నగరంలో బస్సు ప్రయాణికులిలా..

గ్రేటర్ ఆర్టీసీలో డిపోలు: 28
ప్రయాణించే రూట్లు: 1,050
సిటీబస్సులు: 2,550
ఏసీ బస్సులు : దాదాపు 80
ప్రతిరోజూ ట్రిప్పులు: 30,000
ప్రయాణికులు: దాదాపు 20 లక్షలు



ఇబ్బందిగా ఉంది..



చందానగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పీఈటీగా ఉద్యోగం చేస్తున్నా. కూకట్‌పల్లికి వెళ్ళడానికి చందానగర్ గంగారం బస్టాప్‌లో నిలబడ్డా. బస్ షెల్టర్ లేక అరగంట నుంచి మండుటెండలో బస్సు కోసం ఎదురుచుస్తున్నా. చాలా ఇబ్బందిగా ఉంది. వస్తున్న బస్సులు సైతం ఫుల్ రష్‌తో ఉంటున్నాయి. – అరవింద్, టీచర్

ఎఫ్‌ఓబీ నీడలో..



నేను దీప్తిశ్రీనగర్‌లో ఉంటా. రుద్రారంలోని తోషిబా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. మదీనాగూడ దీప్తిశ్రీనగర్ బస్టాప్‌లో బస్‌షెల్టర్ లేక ఎండాకాలంలో ఎఫ్‌ఓబీ కింద నిల్చుంటున్నాం. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు సమస్య వివరించినా పట్టించుకున్నవారే లేరు. – రవికుమార్, ప్రైవేట్ ఉద్యోగి

అటు హయత్‌నగర్ నుంచి పటాన్‌చెరు, ఆరాంఘర్ నుంచి సికింద్రాబాద్, ఇటు గచ్చిబౌలి నుంచి అఫ్జల్‌గంజ్, కూకట్‌పల్లి నుంచి కోఠి వరకు మాత్రమే కాదు..నగరంలో ఎటువైపు నుంచి ఎటు వెళ్లాలన్నా, ఒక దిక్కు నుంచి మరో దిక్కుకు పోవాలన్నా దాదాపు 20 లక్షల మంది సామాన్య ప్రజలు ప్రయాణిస్తున్నది సిటీ బస్సుల్లోనే. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సిటీ బస్సు ప్రయాణికుల విషయంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. వేల సంఖ్యలో ప్రజలు బస్సుల కోసం నిరీక్షించే ప్రాంతాల్లో ఎలాంటి షెల్టర్లు లేవు. మండుటెండల్లో మలమల మాడుతున్నారు. అకాల వర్షాలతో తడుస్తున్నారు. బస్ షెల్టర్లు ఉన్న ప్రాంతాల్లో అవి ప్రజలకు ఉపయోగపడటం లేదు. తూతూ మంత్రంగా ఏర్పాటు చేసిన షెల్టర్లు..కేవలం కొన్ని ప్రైవేటు ఏజెన్సీలను మేపేందుకేననే విమర్శలు ఎంతోకాలంగా వెల్లువెత్తుతున్నా సంబంధిత యంత్రాంగాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌లో బస్‌షెల్టర్ల దుస్థితి..ప్రయాణికుల వెతలపై 'సాక్షి' బిగ్ స్టోరీ.. – సాక్షి, సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వివిధ జంక్షన్లను, ఫ్లై ఓవర్లను రంగుల హంగులతో తీర్చిదిద్దుతున్న యంత్రాంగం..బస్సుల కోసం వేచి చూసే లక్షల ప్రయాణికులకు కనీసం నీడ కల్పించలేకపోతోంది. అధికారుల లెక్కల మేరకు నగరంలో 1300కు పైగా బస్‌షెల్టర్లున్నాయి. కానీ, వాటిల్లో సగం కూడా ప్రయాణికులకు ఉపయోగపడటం లేదు. మెజార్టీ షెల్టర్లు ఎంపిక చేసిన కొన్ని ప్రైవేటు ఏజెన్సీలకు ప్రకటనల ద్వారా కాసుల వర్షం కురిపించేందుకు తప్ప, లక్షల సంఖ్యలో ఉన్న ప్రజలకు కనీసం నీడనివ్వడం లేవు. అన్నీ తెలిసినా సంబంధిత యంత్రాంగం నిద్ర నటిస్తోంది. వాటిని ఏర్పాటు చేసిందే 'పై వాళ్ల' కోసం అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. అంతేకాదు..ఫిర్యాదులందినప్పుడో, పత్రికల్లో వచ్చినప్పుడో చర్యలు తీసుకోమన్నా కిందిస్థాయి సిబ్బంది డోంట్ కేర్ అన్నట్లుగా వ్యవహరిసున్నారంటే పరిస్థితి అంచనా వేసుకోవచ్చు.



ఫిర్యాదుతో బూజు దులిపి



మూసివేసిన దృశ్యం

ఈ ఫొటోలో కనిపిస్తున్న బస్‌షెల్టర్లు ప్రతిరోజూ లక్షల సంఖ్యలో ప్రజలు ప్రయాణించే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ దగ్గరివి. అంతమంది తిరుగాడే అక్కడే ఏసీ బస్‌షెల్టర్లలో ఒకదాంట్లో మొబైల్స్‌తో సహా జనరల్‌స్టోర్ పెట్టేశారు. ఇదే విషయాన్ని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సంబంధిత ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లగా, దాన్ని తొలగించాల్సిందిగా సంబంధిత సర్కిల్ స్థాయి ఉద్యోగులను ఆదేశిస్తే.. తొలుత తచ్చాడారు. అయినా స్పందించలేదు. తొలగించకుంటే స్వయంగా తానే అక్కడకొచ్చి తొలగిస్తాననడంతో ఆదరాబాదరాగా తొలగించేశారు. సర్కిల్‌స్థాయిలోని సిబ్బందికి, ప్రైవేటు వ్యక్తులకు ఉన్న సంబంధాలకు ఇది మచ్చుతునక. తిరిగి మళ్లీ ఎప్పుడక్కడ కొత్త దుకాణం వెలుస్తుందో చెప్పలేం !

ఏసీ షెల్టర్లున్న ప్రాంతాలు

ఖైరతాబాద్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, బోరబండ, కేపీహెచ్‌బీ, ఆరాంఘర్, దిల్‌సుఖ్‌నగర్, కొండాపూర్, మలేసియన్ టౌన్‌షిప్, కోఠి, తార్నాక, మదీనాగూడ, శిల్పారామం, విద్యానగర్, బేగంపేట్.

చెమటలు పుట్టిస్తున్న ఏసీ షెల్టర్లు

పేరుకు ఏసీ షెల్టర్లయినా, వాటిల్లో ఉండలేక ప్రజలకు చెమటలు పడుతున్నాయి. నగరంలో 19 ఏసీ షెల్టర్లుండగా పేరుకే ఏసీ చందంగా మారాయి. కొన్ని ప్రయాణికులకు షెల్టర్లుగా కాకుండా, ప్రైవేటు దుకాణాలుగా బాగా ఉపయోగపడుతున్నాయి. జ్యూస్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లుగానే కాక జనరల్ స్టోర్స్‌గానూ లాభాలు కురిపిస్తున్నాయి. ఖైరతాబాద్, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్‌లలో ఇలాంటివి చూడవచ్చు. సికింద్రాబాద్‌తో సహా పలు ప్రాంతాల్లో బస్‌షెల్టర్ల ముందే చిరు దుకాణాలుండటంతో ప్రజలు వాటిల్లోకి వెళ్లలేక బయటే నిలబడాల్సిన దుస్థితినెలకొంది.

ప్రయాణికులున్నా, షెల్టర్లు లేవు

బస్‌షెల్టర్లకు అనుమతులిచ్చేది జీహెచ్‌ఎంసీ. షెల్టర్లు ఏర్పాటు చేసి లాభాలు పొందేది ప్రైవేటు ఏజెన్సీ. ప్రయాణికుల కోసం బస్సులాపేది ఆర్టీసీ. ఒకరితో ఒకరికి సంబంధం లేదు. అనుమతులిచ్చాక నిర్వహణ లోపాలపై జీహెచ్‌ఎంసీ చర్యల్లేవు. ఎక్కడ అడ్వర్టయిజ్‌మెంట్లు బాగా కనిపిస్తాయో అక్కడ ఏర్పాటు చేస్తున్నారే తప్ప ప్రజలు అవస్థలు పడుతున్న బస్టాపుల్లో షెల్టర్లు ఏర్పాటు చేయడం లేదు. సికింద్రాబాద్, పంజగుట్ట, ముషీరాబాద్, రామంతాపూర్, ఎల్‌బీనగర్ వంటి అనేక ముఖ్య ప్రాంతాల్లో అసలు షెల్టర్లే లేవు. రోడ్లపైనే నుంచుని ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారుల కళ్లకు కనిపించడం లేదు. వారి దృష్టిలో అక్కడ బస్‌షెల్టర్లు అవసరం లేదు. ఆర్టీసీ అధికారుల లెక్కల మేరకు తగినంత మంది ప్రయాణికులు లేనందున అక్కడ బస్‌షెల్టర్‌లు అవసరం లేదని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. ఉన్న ప్రాంతాల్లోనూ చాలా చోట్ల విరిగిన బెంచీలు, చెత్తా చెదారాలు, పాన్, జర్దా మరకలు, వాటిల్లోనే ఆవాసముంటున్న కుక్కలు, పిల్లులతో మురికిమయంగా మారాయి. వాటి కంటే బయట ఎండలో ఉండేందుకే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. చాలా ప్రాంతాల్లో రాత్రుళ్లు లైట్లు వెలగక, తిష్టవేసే పోకిరీలతో అక్కడ ఉండాలంటే మహిళలు భయపడాల్సిన పరిస్థితి.

ఇవ్వడం వరకే జీహెచ్‌ఎంసీ వంతు..

డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేషన్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్ఓటీ) కింద జీహెచ్‌ఎంసీ షెల్టర్ల ఏర్పాటుకు కొన్ని ప్రైవేటు ఏజెన్సీలకు మాత్రమే అనుమతులిచ్చింది. ఏసీ షెల్టర్లకు అనుమతులిచ్చి దాదాపు ఎనిమిదేళ్లయింది. లెక్క ప్రకారం పదేళ్ల గడువు కాగా, మరో ఐదేళ్లు అదనంగా పొడిగించే సదుపాయాన్నీ ఇచ్చేసినట్లే పరిగణిస్తున్నారు. మిగతా షెల్టర్లదీ అదే పరిస్థితి. షెల్టర్లకు గ్రేడ్లున్నప్పటికీ,ఉండాల్సిన సదుపాయాల్లేవు. ఇన్నేసి ఏళ్లపాటు ప్రైవేటుకు కట్టబెట్టి, ప్రజలకు సమస్యలు మిగులుస్తున్నారు.

మండుటెండలో అవస్థలు



బస్ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సమయానికి బస్సులు రాక, కూర్చునే సదుపాయం లేక ఎంతోసేపు వేచి చూసేందుకు నరకం అనుభవిస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి అడ్డగుట్ట డివిజన్‌లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి. – మహేష్, అడ్డగుట్ట

గాల్లో దీపంలా..



బస్టాప్‌ల వద్ద ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారింది. అత్యంత రద్దీగా ఉండే టోలిచౌకి కూడలి వద్ద ఒక్క బస్‌షెల్టర్ కూడా లేదు. ప్రతి గంటకు ఈ చౌరస్తా నుంచి వేలాది మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వృద్ధులు, మహిళలు సైతం ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్‌షెల్టర్లు ఉండాలి. –సయ్యద్ ఇబ్రోజ్, టోలిచౌకి

దుకాణాల ముందే నిల్చుంటున్నాం..



బస్‌షెల్టర్ లేక రోడ్డుపైనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. చిన్నారులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎండకు తాళలేక దుకాణాల ముందు నిలబడి చీవాట్లు తినాల్సి వస్తోంది. జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో బస్ షెల్టర్లు నిర్మించాలి. –అంబటి రాజేష్, ఛత్రినాక

పేరుకే ఏసీ..



నిత్యం ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు తిరిగే తిరిగే ప్రదేశం మాదాపూర్. ఇక్కడ పేరుకు ఏసీ బస్‌షెల్టర్ ఉన్నా కూర్చోడానికి వీలులేకుండా, అపరిశుభ్రంగా మారింది. చెత్తా చెదారం, దుమ్ముధూళితో నిండి ఉంది. నిర్వహణ లేదు. ఏసీ లేని బస్‌షెల్టర్లు ఎందుకు?. – రాజేశ్, స్థానికుడు, మాదాపూర్

చర్యలు తీసుకుంటున్నాం..



బస్ షెల్టర్ల నిర్వహణపై ఫిర్యాదులను పరిశీలించి ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ (అడ్వర్టయిజ్‌మెంట్స్) వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. సంబంధిత ఏజెన్సీలు యూనియాడ్స్, ప్రకాశ్‌ఆర్ట్స్, మీడియా కార్ట్‌లకు రూ.2,45,000 జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రస్తుతానికి మరమ్మతులు చేశారన్నారు. ఎక్కడైనా పనిచేయకుంటే ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో బస్ షెల్టర్ దుస్థితి ఇదీ..



తొలగిస్తారా..తొలగించమంటారా?

రహదారుల కబ్జాపై హైడ్రా ప్రత్యేక దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న లే ఔట్లతో పాటు నివాస ప్రాంతాల్లో ఉన్న రహదారులపై ఆక్రమణల్ని తక్షణం తొలగించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. అలాంటివి తమ దృష్టికి వస్తే వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు. ఓఆర్ఆర్ పరిధిలో ఎక్కడా రహదారులపై ఆటంకాలు, ఆక్రమణలకు తావు లేకుండా తమ విభాగం పర్యవేక్షిస్తుందని భరోసా ఇచ్చారు. పార్కులు, పాఠశాలలు, గ్రంథాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రాథమిక ఆసుపత్రులు ఇలా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కేవలం అందుకోసమే వినియోగించాలని సూచించారు. రహదారులకు అడ్డంగా గోడలు కట్టి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను బై నంబర్లతో కాజేస్తున్నారని ఆరోపించారు. ఇలా సోమవారం మొత్తం 52 ఫిర్యాదులు హైడ్రాకు వచ్చాయి.



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న రంగనాథ్

- మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీలోని బౌరంపేట గ్రామంలో సర్వే నం.345లోని ప్రభుత్వ స్థలంలో స్థానిక మాజీ ప్రజాప్రతినిధి 25 గుంటలు ఆక్రమించి, గెస్ట్‌హౌస్ నిర్మించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆయనే సర్వే నం.14 లోనూ 36 గుంటల ప్రభుత్వ స్థలానికి బై నంబరు వేసి ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు.
- బాలానగర్ ఫిరోజ్‌గూడలోని మాధవి నగర్ పార్కు స్థలాన్ని కబ్జా చేశారని, దీనిపై తాము కోర్టుకు వెళ్లగా స్పష్టమైన ఆదేశాలిచ్చినా ప్రయోజనం లేకపోయిందని నివాసితులు వాపోయారు. పార్కు నిర్మాణం కోసం కేటాయించిన 300 గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు.
- శామీర్‌పేట మండలంలోని దేవరయాంజల్‌లో రహదారులు కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదు అందింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని రాజేంద్రనగర్ శ్రీ వేంకటేశ్వర కాలనీకి 60 ఫీట్ల రోడ్డు ఉండగా కొందరు దానికి అడ్డంగా ప్రహరీ నిర్మించేశారని, అక్కడే సర్వే నం.20లో 23 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- సరూర్‌నగర్ చెరువుకు సమీపంలో తమకు ఇంటి స్థలం ఉందని, దానికి చుట్టూ ఇళ్లున్నా తాము ఇంటిని నిర్మించుకోడానికి ఎఫ్‌టీఎల్ అంటూ అనుమతులు ఇవ్వట్లేదని కోటేశ్వరరావు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. చెరువుకు వెంటనే ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని ఆయన కోరారు. ఇదే పరిస్థితి రావిర్యాల పెద్దచెరువులోనూ ఉందని, నీటి నిలువలు పెరిగి తమ ప్లాట్లు మునిగిపోతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు.

ఉక్కపోత..ఉక్కిరి బిక్కిరి!

అనూహ్యంగా పెరుగుతున్న విద్యుత్ వినియోగం

- 2024 ఏప్రిల్ 21న గ్రేటర్‌లో 3140 మెగావాట్ల వినియోగం..
- తాజాగా సోమవారం 3814 మెగావాట్లు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరుగుతోంది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులకు తోడు..భరించలేని ఉక్కపోత కారణంగా గృహాలు, వాణిజ్య సంస్థలు సహా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనూ రోజంతా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఆన్‌లోనే ఉంటున్నాయి. ఫలితంగా మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. ఆదివారంతో పోలిస్తే..సోమవారం ఏకంగా 600 మెగావాట్లు అధికంగా నమో దు కావడం గమనార్హం. ఇదిలా ఉంటే గత ఏడాది ఏప్రిల్ 21న మధ్యాహ్నం 3.30 గంటలకు రికార్డు స్థాయిలో 3140 మెగా వాట్లు రికార్డు కాగా, తాజాగా సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఏకంగా 3814 మెగా వాట్లకు విద్యుత్ వినియోగం చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే మే చివరి నాటికి మరెంత పెరగనుందో? అనే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది.

తగ్గుతున్న జీరో బిల్లుల సంఖ్య..



హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 62 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 52 లక్షలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ప్రతి నెలా 10 లక్షల మంది 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగిస్తూ, గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లును పొందుతున్నారు. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడవడంతో గృహ వినియోగం రెట్టింపైంది. ఫలితంగా మార్చిలో వీరి సంఖ్య తొమ్మిది లక్షలకు పడిపోయినట్లు తెలిసింది. మే మొదటి వారంలో జారీ కానున్న (ఏప్రిల్ మాసానికి సంబంధించి)బిల్లుల్లో వీరి సంఖ్య మరింత తగ్గిపోయే అవకాశం లేకపోలేదని ఇంజనీరింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నిజానికి ఇటీవల వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం భగ్గున మండిన ఎండలు...సాయంత్రానికి చల్లబడుతున్నాయి. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పటికీ..ఉక్కపోతను భరించలేని పరిస్థితి. ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వినియోగిస్తుండటంతో వినియోగం పెరుగుతోంది.

గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం ఇలా..

తేదీ	మెగా వాట్స్	మిలియన్ యూనిట్లు
6	3830	80.90
17	3889	82.55
18	3808	78.81
19	3604	76.89
20	3399	74.10
21	3814	82.45

నీటి సంపులో యువతి అస్థిపంజరం


డీబీఆర్ మిల్‌లోని సంపును పగలుగొడుతున్న దృశ్యం

కవాడిగూడ: లోయర్ ట్యాంక్ బండ్, డీబీఆర్ మిల్స్‌లోని నీటి సంపులో గుర్తుతెలియని యువతి అస్థిపంజరం బయటపడింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఆదివారం దోమల గూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. డీఆర్‌ఆర్‌మిల్స్ 40 ఏళ్ల క్రితమే మూతపడింది. సెక్యూరిటీ సిబ్బంది ఆదివారం సాయంత్రం మూత్ర విసర్జన కోసం పురాతన భవనం వైపు వెళ్లాడు. అనంతరం నీటి కోసం 3వ అంతస్తులో ఉన్న సంపు మూత తెరిచి చూడగా యువతి మృత దేహం కనిపించింది. దీంతో అతను వెంటనే దోమల గూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఉదయం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు 25 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. ఆరు నెలల క్రితం ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి సంపులో పడవేసి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. మృత దేహం పూర్తిగా కుళ్లిపోవడంతో నీటి సంపును పగల గొట్టారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. గుర్తుతెలియని వ్యక్తులు సదరు యువతిని ఇక్కడికి తీసుకువచ్చి అత్యాచారం చేసి హత్య చేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృత దేహాన్ని గాంధీ మార్చురీకి తీసుకెళ్లలేని పరిస్థితి ఉండటంతో గాంధీ ఆసుపత్రి ఫోరెన్సిక్ సిబ్బందిని రప్పించి సోమవారం మధ్యాహ్నం అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. దోమల గూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ నిరంజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య..


వెంకటేష్ మృతదేహం

నిజాంపేట్ : కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి లోనైన ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముచ్చర్ల గ్రామానికి చెందిన వెంకటేష్ (30) శ్వేత దంపతులు బాచుపల్లిలో నివాసం ఉంటున్నారు. భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో రెండు నెలల క్రితం శ్వేత పుట్టింటికి వెళ్లిపోవడంతో అప్పటి నుంచి వెంకటేష్ ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శ్వేత నర్సాపూర్‌లో భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం అతను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వచ్చాడు. సోమవారం ఆమెతో మాట్లాడేందుకు వెంకటేష్ అక్క సుక్కమ్మ, తల్లి అంజమ్మ బాచుపల్లికి వచ్చారు. స్నానం చేసేందుకు తల్లి,సోదరితో కలిసి బాచుపల్లిలోని బైరుని చెరువుకు వెళ్ళాడు. అక్క, తల్లి వారిస్తున్నా లోపలికి వెళ్లిన వెంకటేష్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. దీంతో అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్ల గసహాయంతో వెంకటేష్ మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో చెఫ్ ఆత్మహత్య

గచ్చిబౌలి: అప్పుల బాధ తాళలేక నేపాల్‌కు చెందిన ఓ చెఫ్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నేపాల్‌కు చెందిన ఖడ్క బహదూర్ సునూర్(49) రెండేళ్లుగా రాయదుర్గంలోని షాగౌస్‌లో చెఫ్‌గా పని చేస్తూ రెండో భార్య మమతతో కలిసి మధురానగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం తెల్లవారుజామున అతను సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి నిర్మాణం, భూమి కొనేందుకు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుమారుడు కృష్ణ బహదూర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల కాపరి రూ.1950 కోట్ల భూమిని కాపాడాడు!

ప్రభుత్వ స్థలంలో గొర్రెలు మేపుకున్న కుటుంబం

- 39 ఎకరాలు కబ్జా చేసిన అక్రమార్కులు
- నీటి వనరుల్నీ చెరబట్టి గొర్రెల్నీ రానీయని వైనం
- ఈ అంశంపై హైడ్రాకు ఫిర్యాదు
- క్షేత్రస్థాయి పరిశీలనలో నార్నే ఆక్రమణ వెలుగులోకి
- రాయదుర్గం కూల్చివేతల వెనుక ఆసక్తికర కోణం

సాక్షి, సిటీబ్యూరో: 1999లో జమ్మూకాశ్మీర్‌లోని కార్గిల్ సెక్టార్‌లోకి పాకిస్థాన్ బలగాలు చొచ్చుకుని వచ్చాయని, భారత భూభాగాన్ని ఆక్రమించాయనే సమాచారం సైన్యానికి స్థానిక గొర్రెల కాపరుల ద్వారానే అందింది. షేక్‌పేట మండలం రాయదుర్గం దర్గా సమీపంలోని సర్వే నం.5/2లో ఉన్న రూ.వందల కోట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందనే విషయం కూడా హైడ్రా అధికారులకు ఓ గొర్రెలకాపరి ద్వారానే తెలిసింది. ఈ ప్రాంతంలో నార్నే ఎస్టేట్స్ సంస్థ నిర్మించిన ప్రహరీని శనివారం కూల్చేసిన హైడ్రా అధికారులు దాదాపు రూ.1950 కోట్ల విలువైన 39 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జాకోరల నుంచి విడిపించారు. అక్కడే ఉన్న మరో 104 ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు సన్నాహాలు చేపట్టారు. రూ.వేల కోట్ల విలువైన ఈ స్థలాన్ని నిరక్షరాస్యుడైన ఓ గొర్రెలకాపరి ఎలా కాపాడాడంటే...


ప్రహరీని కూల్చివేస్తున్న దృశ్యం

ఏళ్ల పాటు అక్కడే ఉన్న కుటుంబం...

రాయదుర్గంలోని దర్గా సమీపంలో 143 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉన్న 'సాఫ్ట్‌వేర్ సిటీ'కి అనుకుని ఉండే ఈ ప్రాంతంలో ఎకరం రూ.50 కోట్లకు తక్కువ లేదు. అక్కడి సర్వే నం.5/2లో ఖాళీ స్థలంతో పాటు ఓ చెరువు కూడా ఉండేది. దీంతో సంచార జీవులైన గొర్రెలకాపరులు కొన్నేళ్ల పాటు అక్కడే తమ జీవాలను మేపుకున్నారు. అలాంటి ఓ కుటుంబం ప్రస్తుతం లంగర్‌హౌస్ ప్రాంతంలో నివసిస్తోంది. ఈ కుటుంబానికి చెందిన ఓ యువకుడు (19) గతంలో తన స్నేహితులతో కలిసి దర్గా సమీపంలో ఉన్న ఆ ప్రభుత్వ స్థలంలో క్రికెట్ ఆడేవాడు. తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూ అప్పుడప్పుడు గొర్రెలను మేత కోసం ఆ స్థలంలోకి తీసుకువెళ్లేవాడు. మేత మేసేప్పుడు దాహం వేసిన గొర్రెలు అక్కడ ఉన్న చెరువులోకి వెళ్లి నీళ్లు తాగేవి.

సెక్యూరిటీ గార్డులు అడ్డుకుంటుండటంతో...

ఈ కుటుంబం లంగర్‌హౌస్ ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ ఆ యువకుడు అప్పుడప్పుడు గొర్రెల్ని తీసుకుని దర్గా వద్దకు వెళ్లేవాడు. ఆ స్థలాన్ని ఆక్రమించి, కొంత మేర ప్రహరీ నిర్మించిన నార్నే ఎస్టేట్స్ సంస్థ ఆ ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుల్ని ఏర్పాటు చేసింది. చెరువు పూడ్చేయటంతో పాటు దానికి నీరు అందించే నాలాల్లోనూ మట్టి వేసింది. కొన్నేళ్లుగా ఈ విషయం వెలుగులోకి రాలేదు. ఇటీవల గొర్రెలతో ఆ ప్రాంతానికి వెళ్లిన యువకుడిని సెక్యూరిటీ గార్డులు అడ్డుకున్నారు. గొర్రెలకు మేత, నీరు అందకుండా చేస్తున్నారు. తాము క్రికెట్ ఆడుకున్న, తమ జీవాల ఆకలి, దాహం తీర్చిన ప్రభుత్వ స్థలాన్ని ఎవరో ఆక్రమించారని గుర్తించాడు. మీడియా ద్వారా హైడ్రా విషయం తెలుసుకున్న అతడు పరిచయస్తుడితో ఓ కాగితంపై ఆంగ్లంలో ఫిర్యాదు రాయించాడు. దీన్ని హైడ్రా ప్రధాన కార్యాలయంలోని ఇన్‌వార్డ్‌లో ఇచ్చి వచ్చాడు.



స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలం

ఆరా తీసిన ఇన్‌స్పెక్టర్.. దృష్టి పెట్టిన కమిషనర్...

ఈ లేఖ హైడ్రాలో విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ వద్దకు చేరింది. ఈ ఫిర్యాదుతో పాటు ఎలాంటి ఎన్‌క్లోజర్లు లేకపోయినా ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. అదనపు సమాచారం కోసం లేఖలో ఉన్న నెంబర్ ఆధారంగా యువకుడికి ఫోన్ చేశారు. పూర్తి వివరాలు చెప్పలేకపోయినా.. ప్రభుత్వ స్థలం కబ్జాపై ప్రాథమిక అంశాలు మాత్రం తెలియజేశాడు. దీంతో అప్రమత్తమైన రాజశేఖర్ విషయాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా శాఖలతో సంప్రదింపులు, క్షేత్ర స్థాయి పరిశీలన ద్వారా పూర్తి విషయం తెలుసుకోవాలని రంగనాథ్ భావించారు. దీనికోసం ఆయనే స్వయంగా వెళ్లి దర్గా వద్ద ఉన్న ఆ భూమిని పరిశీలించడంతో పాటు రెవెన్యూ రికార్డులు పరిశీలించాడు. ఫలితంగా నార్నే ఎస్టేట్స్ ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు వెలుగులోకి వచ్చింది.

39 ఎకరాలకు విముక్తి...

ఈ స్థలంపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు ఉన్నట్టు బోర్డులు ఉన్నప్పటికీ స్థలాల క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు తెలుసుకున్నారు. ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి ఉంటే సంప్రదించాలంటూ కొన్ని ఫోన్ నెంబర్లతో కూడిన బోర్డుల్ని గుర్తించారు. అక్కడ నార్నే ఎస్టేట్స్ సంస్థ అనుమతిలేని లే ఔట్ వేయడంతో రహదారులు నిర్మిస్తున్నట్లు, చెరువును కూడా కబ్జా చేసి ప్లాట్లుగా అమ్ముతున్నట్లు తేల్చారు. శనివారం 39 ఎకరాలకు సంబంధించి నిర్మించిన ప్రహరీని హైడ్రా కూల్చివేసింది. అక్కడ అది ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. ఆక్రమణదారులపై రాయదుర్గం ఠాణాలో ఫిర్యాదు చేసిన హైడ్రా అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేయించారు. ఆ చుట్టుపక్కల ఉన్న మరో 104 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా కోరల నుంచి విడిపించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలవన్మరణం


అముదన్ విజయ్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.తమిళనాడుకు చెందిన అముదన్ విజయ్(23) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ కొంపల్లి సెంట్రల్ పార్కు సమీపంలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. గత కొన్నాళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్న అతను మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం హాస్టల్ భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని అతడిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అదే రోజు మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తరచూ గొడవ పడుతున్నాడని..

స్నేహితుల చేతిలో యువకుడి దారుణ హత్య

నాగోలు: ప్రతి చిన్న విషయానికి గొడవ పడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడని ఓ యువకుడిని అతడి స్నేహితులు హత్య చేసిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుత్బుల్లాపూర్ కు చెందిన ముద్దం వెంకటేష్ బండ్లగూడలో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నాడు. అతని వద్ద ఛత్తీస్‌గఢ్ కు చెందిన దేవీరామ్(24) పనిచేస్తున్నాడు. ఇటీవల అతను తన గ్రామానికి చెందిన ముఖేష్‌కుమార్, సమ్వార్ సింగ్, యోగేష్ కుమార్‌లను పని చేసేందుకు తీసుకువచ్చాడు. దేవీ రామ్ ప్రతి చిన్న విషయానికి వారితో గొడవ పడుతూ ముఖేష్, యోగేష్ కుమార్‌లను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మరోసారి దేవీరామ్ వారితో గొడవ పడ్డాడు. వారి గదిలో ఉన్న భోజనాన్ని కుక్కలకు పెడుతుండటంతో ముఖేష్ కుమార్, యోగేష్‌కుమార్ అతడిని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి లోనైన దేవీరామ్ వారిపై దాడి చేశాడు. దీంతో వారు అక్కడే ఉన్న కూరగాయల కత్తితో దేవీరామ్ కడుపులో పొడవడంతో అతను కుప్పకూలాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న వాటర్ ప్లాంట్ నిర్వాకుడు వెంకటేష్ అతడి చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం దేవీరామ్ మృతి చెందాడు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు ముఖేశ్‌కుమార్, మోగేష్‌కుమార్‌లను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫేస్‘బుక్కై’పోయాడు!

- ఫేస్‌బుక్ ద్వారా నగరవాసికి నేరగాడి ఎర
- అమెరికాలో సర్జన్‌గా పరిచయం
- డాలర్లు తెస్తూ కస్టమ్స్‌కు చిక్కానని ఫోన్
- ట్యాక్స్ పేరుతో రూ.1.55 లక్షలు స్వాహా


రాబర్ట్‌గా చెప్పకున్న వ్యక్తి ఫేస్‌బుక్ ప్రొఫైల్ పిక్చర్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సుదీర్ఘ కాలం తర్వాత మరో కస్టమ్స్ ఫ్రాడ్ కేసు నమోదైంది. నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన నేరగాడు కస్టమ్స్ అధికారుల పేరు చెప్పి రూ.1.55 లక్షలు కాజేశాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు చేపట్టారు. సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగికి దాదాపు రెండు నెలల క్రితం ఫేస్‌బుక్ ద్వారా ఓ ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. అమెరికాలో ఉంటున్న సర్జన్ హెన్రీ రాబర్ట్ అంటూ ప్రొఫైల్ ఉండటంతో నగరవాసి యాక్సప్ట్ చేశాడు. ఆపై వాట్సాప్ కాల్స్ చేసిన రాబర్ట్ నగరవాసితో పరిచయం పెంచుకుని స్నేహం చేశాడు. తాను త్వరలోనే భారత్‌కు వస్తున్నానని, హైదరాబాద్ వచ్చి కలుస్తానని చెప్పాడు. పూర్తిగా నమ్మించేందుకు డమ్మీ ఫ్లైట్ టిక్కెట్స్ ఫొటోలను పంపాడు. కొన్ని రోజులకు బాధితుడికి కాల్ చేసిన రాబర్ట్ తాను ముంబై విమానాశ్రయంలో దిగానని, తన వద్ద లెక్కలు చెప్పని 1.2 లక్షల డాలర్లు ఉన్నాయని నమ్మించాడు. దీంతో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారన్న రాబర్ట్ పన్ను చెల్లించకపోతే నగదుతో పాటు తన లగేజీ సైతం జప్తు చేస్తారని చెప్పాడు. ఆపై ముంబై ఎయిర్‌పోర్టు కస్టమ్స్ అధికారిగా మాట్లాడిన మరో వ్యక్తి రాబర్ట్ రూ.1.55 లక్షలు పన్ను చెల్లించాలని చెప్పాడు. తాను బయటకు వచ్చాక ఆ మొత్తం ఇచ్చేస్తానంటూ రాబర్ట్ చెప్పంతో నమ్మిన నగర వాసి ఆ మొత్తం వాళ్లు చెప్పిన ఖాతాల్లోకి బదిలీ చేశాడు. చివరకు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో నిందితుడి అరెస్టు...

నగరానికి చెందిన బాధితుడి (68) నుంచి ఏళ్ల బాధితుడి నుంచి ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.52,29,500 కాజేసిన కేసులో ఓ నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సోషల్‌మీడియా ద్వారా బాధితుడికి ఎర వేసిన సైబర్ నేరగాళ్లు 5పైసా క్యాపిటల్ లిమిటెడ్, బార్‌క్లేస్, షాండా క్యాపిటల్ గ్రూప్ లిమిటెడ్‌ల్లో పెట్టుబడుల పేరు చెప్పారు. ఓ టెలిగ్రాం గ్రూపులో సభ్యుడిగా చేర్చి ప్రియా అగర్వాల్, గౌరవ్ ముంజాల్ పేర్లతో ఇరువురు సలహాలు సూచనలు ఇచ్చారు. తాము చెప్పినట్లు పెట్టుబడులు పెడితే భారీ లాభాలంటూ నిండా ముంచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఘజియాబాద్‌కు చెందిన ప్రతీక్ శుక్లాను అరెస్టు చేశారు. అతడిపై దేశ వ్యాప్తంగా తొమ్మిది కేసులు ఉన్నట్లు గుర్తించారు.

వేలిముద్రలు పట్టించాయి..

మాజీ మంత్రి పొన్నాల ఇంట్లో చోరీ కేసులో ముగ్గురి రిమాండ్

ఫిలింనగర్: మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఇంట్లో నగలు, నగదు దొంగిలించిన ఘటనలో ముగ్గురు నిందితులను ఫిలింనగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-92లో నివసించే మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆయన భార్య అరుణాదేవి గత జనవరి 10న ఇంటికి తాళం వేసి సమీపంలోని టీటీడీ టెంపుల్‌కు వెళ్లారు మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి అల్మారాలో తనిఖీలు చేయగా అందులో ఉన్న రూ.1.50 లక్షల నగదు, విలువైన బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితురాలు అరుణాదేవి ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైమ్ పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. ఇదిలా ఉండగా జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-87లో పది రోజుల క్రితం ఓ వ్యాపారి ఇంట్లో చోరీ యత్నం జరిగింది. ఆ ఘటనలో నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా ఫిలింనగర్ పోలీసులకు అప్పగించారు. సదరు నిందితుడికి సంబంధించిన వేలిముద్రలను తీసుకుని ట్యాలీ చేయగా, పొన్నాల లక్ష్మయ్య ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నిందితుడి వేలిముద్రలతో సరిపోయాయి.దీంతో అతడిని విచారించగా మాజీ మంత్రి పొన్నాల ఇంట్లో దొంగతనానికి పాల్పడింది తానేనని అంగీకరించాడు. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌కు చెందిన రాజ్‌కుమార్‌పాండే గత పదేళ్లుగా నగరంలో కారు డ్రైవర్‌గా పని చేస్తూ జల్సాలకు అలవాటుపడ్డాడు. ఈజీ మనీ కోసం చోరీలకు పాల్పడుతున్న అతను స్నేహితులతో కలిసి మాజీ మంత్రి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డట్లుగా గుర్తించారు. ఈ ఘటనలో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తేలింది. రాజ్‌కుమార్ పాండేతో పాటు ఆమె ఇద్దరు స్నేహితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారులో వచ్చి..కత్తులతో బెదిరించి..

బంగారు నగలు, నగదు అపహరణ


స్విఫ్ట్ కారులో వచ్చిన నిందితులు

రాజేంద్రనగర్: కత్తులతో ఇంట్లోకి దూరిన నలుగురు యువకులు భార్యాభర్తలను బెదిరించి ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ. 20 వేల నగదు, 20 తులాల వెండి వస్తువులతో ఉడాయించారు. స్విఫ్ట్ కారులో వచ్చిన నిందితులు ముఖాలకు మాస్కులు ధరించి 10 నిమిషాల్లో దొంగతనానికి పాల్పడి దర్జాగా వెనుతిరిగారు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ సన్‌సిటీ బీ-బ్లాక్‌లో మహ్మద్ షాకీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. రెండస్తుల భవనంలో కింది భాగంలో షాకీర్, పై భాగంలో అతని సోదరుడు ఉంటున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు షాకీర్ పని చేసుకుంటుండగా అతడి భార్య వంట గదిలో వంట చేస్తుంది. ఇంటి గేటును తట్టడంతో కుమార్తె వెళ్లి గేటు తీసింది. తెల్లటి స్విఫ్ట్ కారులో వచ్చిన ఐదుగురు నిందితుల్లో ఒకరూ కారు నడుపుతుండగా నలుగురు గేట్ తీయగానే కత్తులతో ఇంట్లోకి దూసుకొచ్చారు. ఇద్దరు షాకీర్‌ను చంపుతామని కత్తి మెడకు పెట్టగా.. మరో ఇద్దరూ షాకీర్ భార్య వద్దకు వెళ్లి అరిస్తే చంపుతామని హిందీలో మాట్లాడుతూ విలువైన వస్తువులు ఇవ్వాలంటూ సూచించారు. షాకీర్ భార్య అల్మారాలో ఉన్న 6 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు, రూ.20 వేల నగదు ఇచ్చింది. నిందితులు వాటిని తీసుకొని ఇంటికి బయటి నుంచి గడియ పెట్టి పారిపోయారు. షాకీర్ వద్ద సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఉన్నప్పటికీ నిందితులు వాటిని ముట్టుకోలేదు. నిందితులు సన్‌సిటీ ప్రధాన రహదారి బండ్లగూడ మీదుగా శివారు వైపు వెళ్లిపోయారు. దొంగలు వెళ్లిన అనంతరం భార్యభర్తలు కేకలు వేయడంతో పై అంతస్తులో ఉన్న కుటుంబ సభ్యులు గడియ తీయగా దోపిడీ విషయం తెలిసింది. దీనిపై సమాచారం అందడంతో రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిందితులంతా జీన్స్ ప్యాంట్, టీ-షర్ట్‌లు ధరించారని.... 30 ఏళ్ల లోపే ఉన్నారని బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సీసీ కెమెరాల్లో నిక్షిప్తం...


షాకీర్ ఇంటి వద్ద ఉన్న మరో ముందు నివాసం ముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిందితులు వచ్చిన దృశ్యాలన్ని రికార్డు అయ్యాయి. కారులో రావడం... కారును ఇంటి ముందు ఆపి నలుగురు యువకులు వెళ్లడం... తిరిగి ఐదు నిమిషాల్లోనే పరుగెత్తుకుంటూ రావడం తదితర దృశ్యాలన్నీ రికార్డు అయ్యాయి. సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితురాలికి జైలు

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన కాజా వాణికి ఆరు నెలల జైలు శిక్ష విధించడమేగాక ఫిర్యాదుదారుడికి పరిహారంగా రూ.30లక్షలు చెల్లించాలని ఖమ్మం ప్రొహిబిషన్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం మూడో డివిజన్ బాలాపేటకు చెందిన వడ్లమూడి నాగేశ్వరరావు వద్ద వాణి 2014 జూన్‌లో రూ.40 లక్షల అప్పు తీసుకుంది. ఈ అప్పు చెల్లించే క్రమంలో 2016 జనవరిలో రూ.30 లక్షలకు చెక్కు జారీ చేసింది. అయితే, ఆ చెక్కును బ్యాంకులో జమ చేయగా ఆమె ఖాతా మూసివేసినట్లు చెబుతూ అధికారులు మెమో జారీ చేశారు. దీంతో నాగేశ్వరరావు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం ఆమెకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు ఫిర్యాదుదారుడికి రూ.30లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

జీహెచ్‌ఎంసీ పథకాలు భేష్

నాగాలాండ్ అధికారుల బృందం కితాబు



సాక్షి,సిటీబ్యూరో: నగరంలో ప్రజలకు ఉపకరించేలా జీహెచ్‌ఎంసీ అమలు చేస్తున్న పథకాలు బాగున్నాయని నాగాలాండ్ సీనియర్ సివిల్ సర్వీసెస్ అధికారులు అభిప్రాయపడ్డారు. 'పబ్లిక్ పాలసీ ఆన్ గుడ్ గవర్నెన్స్ అండ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్' పై శిక్షణలో భాగంగా సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన వారికి అడిషనల్ కమిషనర్(ప్రకటనలు) వేణుగోపాల్ రెడ్డి జీహెచ్ఎంసీ ఆర్థిక వనరులు, అమలు చేస్తున్న వివిధ పథకాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం వారు క్షేత్ర స్థాయి పర్యటనలో భాంగా జవహర్‌నగర్‌లో ఘనవ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. నాగాలాండ్ అధికారుల్లో జాయింట్ సెక్రటరీలు రెనబొమో ఒడియు, విక్వినో చలె, కుసఫితు, సంగిట్ల జమిర్, శ్రీమతి అవేలు రుహో, వై చింగ్యక్ కొన్యక్, మొహ్మో తుంగాయ్, అడిషనల్ డిప్యూటీలు కెయిరంగ్ దింగ్ హిగుల్, పి.జమెస్ స్వా, ఎస్.అత్సంగ్లా, డిప్యూటీ సెక్రటరీ లివిటోలి సుఖా, తదితరులున్నారు.

భోజనంలో మత్తు మందు కలిపి..

- పారిశ్రామికవేత్త ఇంట్లో భారీ చోరీ
- 2 కిలోల బంగారు నగలు, రూ. 3 కోట్ల నగదు అపహరణ

కాచిగూడ: వృద్ధ దంపతులకు భోజనంలో మత్తు మందు కలిపి దాదాపు 2 కిలోల బంగారు నగలు, రూ.3కోట్ల నగదు, ఖరీదైన కారు ఎత్తుకెళ్లిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాచిగూడ లింగంపల్లి అమ్మవారి దేవాలయం సమీపంలో పారిశ్రామికవేత్త హేమ్‌రాజ్ (62), అతడి భార్య మీనా దుగ్గర్ (59) నివాసముంటున్నారు. కొద్ది రోజుల క్రితం వారు నేపాల్‌కు చెందిన దంపతులను ఇంట్లో పనికి పెట్టుకున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఇటీవల వారి కొడుకు, కోడలు విదేశీ యాత్రకు వెళ్లడంతో హేమ్‌రాజ్, అతడి భార్య మాత్రమే ఇంట్లో ఉన్నారు. ఇదే అదనుగా భావించిన పనివారు ఆదివారం రాత్రి భోజనంలో మత్తు మందు కలిపారు. వారు మత్తులోకి వెళ్లగానే ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదుతో ఉడాయించారు. ప్రతి రోజూ వాకింగ్‌కు వెళ్లే హేమరాజ్ సోమవారం వాకింగ్‌కు రాకపోవడంతో అతని స్నేహితుడు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో అతను స్నేహితుడి ఇంటికి వచ్చి తలుపు కొట్టడంతో మత్తులో ఉన్న హేమ్‌రాజ్ డోర్ తీశాడు. భార్య మీనా పూర్తిగా మత్తులోకి జారుకుంది. దీనిని గుర్తించిన అతను వారిని హైదర్‌గూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించాడు. ప్రస్తుతం హేమ్‌రాజ్ స్పృహలో ఉన్నాడని, అతని భార్య ఇంకా స్పృహలోకి రాలేదని స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఈస్ట్‌జోన్ డీసీపీ, అడిషనల్ డీసీపీ, కాచిగూడ డీఐ, ఎస్ఐ పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. నాలుగు టీంలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధి దీపాల ఏర్పాటు



వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తున్న కార్పొరేటర్

హిమాయత్‌నగర్: డివిజన్‌లో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగనిచోట సోమవారం జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలసి హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్‌గౌడ్, జాకి, సందీప్, జైస్వాల్, హితేష్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస గౌడ్.

పంజగుట్ట: చిన్నచిన్న ప్రభుత్వ పనులు చేసే కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని నేషనల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కాంట్రాక్టులన్నీ బడా కాంట్రాక్ట్ సంస్థలకే ఇస్తున్నారని అలా కాకుండా వర్క్ డివైడ్ చేసి చిన్న కాంట్రాక్టర్లకు కూడా పనులు ఇవ్వాలని కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చిన్నచిన్న కాంట్రాక్టర్లకు సుమారు 14 వేల కోట్ల పెండింగ్ బిల్స్ ఉన్నాయని గత రెండు సంవత్సరాల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందుల గురవుతున్నారన్నారు. ఈ సమావేశంలో రాజేష్ బోయ, శ్రీధర్ రావు, లింగా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, రాజబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

లిబర్టీ: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేవడం లేదని ముఖ్యమంత్రి స్పందించి ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమ్మర్ కల్చరల్ క్యాంపు పోస్టర్ ఆవిష్కరణ



వేసవి శిబిర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ సత్యగౌర చంద్రదాస

బంజారాహిల్స్: పిల్లలకు వేసవి కాలంలో సంస్కృతి, సంప్రదాయాలు, భక్తివంటి అంశాల కోసం ప్రత్యేక వేసవి హరేకృష్ణ కల్చరల్ క్యాంపు పేరుతో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ సత్యగౌర చంద్రదాస తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆదివారం బంజారాహిల్స్‌లోని కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24వ తేదీ నుంచి మే 17వ తేదీ వరకు ఈ వేసవి శిబిరం నగరంలోని బంజారాహిల్స్, కోకాపేట్, సంగారెడ్డిలోని హరేకృష్ణ టెంపుల్స్‌లో కొనసాగుతుందని తెలిపారు. ఆరేళ్ల నుంచి 16ఏళ్ల వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 8143655188 నంబర్లలో సంప్రదించాలని అయన కోరారు. పిల్లలకు ప్రాచీన భారతీయ సంస్కృతిని, నైతిక విలువలను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ శిబిరం ఎంతో తోడ్పడుతుందని ఆయన తెలిపారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు కిలో రూపాలయల్లో టమాట 15, నల్లవంకాయ 18, పొడుగువంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 40, పచ్చికాకరకాయ 38, పందిరిబీర 45, క్యాబేజీ 09, క్యారెట్ 20, దొండకాయ 23, గుండు బీన్సీస్ 65, గింజచిక్కుడు 55, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 26, చామగడ్డ 28, మొరంగడ్డ 18, కందగడ్డ 85, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4, మామిడికాయ 35, ముల్లంగి 4-5, ఉల్లిపారక 28లుగా ఉన్నాయి. **గమనిక:** ఈ ధరలు మంగళవారం ఉదయం 9గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆన్‌లైన్‌లో ప్రోగ్రెస్ రిపోర్ట్

- 23న విద్యార్థులకు అందించేందుకు ఏర్పాట్లు
- పండుగ వాతావరణంలో నిర్వహించాలని ప్రణాళికలు
- అదే రోజు పేరెంట్స్ కమిటీ సమావేశాలు



ఎన్టీటీ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

బంజారాహిల్స్: ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు ఇటీవల వార్షిక పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 23న ఈ విద్యా సంవత్సరం ముగియనుంది. జూన్ 12న తరగతులు పునః ప్రారంభం కానున్నాయి. ఈ సారి జరిగిన పరీక్షలు ప్రోగ్రెస్ కార్డులను ఇవ్వనున్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను గతంలో సాధారణ పద్ధతుల్లో ఇవ్వగా ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో జారీ కానున్నాయి. ప్రోగ్రెస్ కార్డుల పంపిణీకి ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత, రెండు ఎయిడెడ్, రెండు మైనార్టీ, రెండు రెసిడెన్షియల్ పాఠశాలల్లో కలిపి 45 ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 23వ తేదీన పేరెంట్స్ కమిటీ ఏర్పాటు చేసి పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వనున్నారు. ఇందు కోసం పాఠశాలల్లో టీచర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

1 నుంచి 9వ తరగతి వరకు

ఖైరతాబాద్ జోన్ పరిధి పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ. ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళ్‌రావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి వరకు 92 వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీరి ఫలితాలను విద్యాశాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయగా ఉపాధ్యాయులంతా ఈ ప్రక్రియను సోమవారం సాయంత్రానికి పూర్తి చేశారు. ఇదివరకే చేపట్టిన నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనానికి సంబంధించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం వార్షిక పరీక్షల ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుబరుస్తున్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కంప్యూటర్లు, ట్యాబ్‌ల ద్వారా డబ్లూడబ్లూడబ్లూ. ఐఏఎస్‌ఎంఎస్. తెలంగాణ. జీవోవి. ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. సోమవారం ఈ వెబ్‌సైట్ నుంచి కార్డులను డౌన్‌లోడ్ చేసి తప్పులేమైనా జరిగితే పరిశీంచి ఆన్‌లైన్‌లో పొందుబరిచారు. విద్యార్థులు ఆయా పాఠశాలలకు వెళ్లి ఈ నెల 23వ తేదీన ప్రోగెస్ రిపోర్ట్‌లను పొందవచ్చు. వార్షిక ఫలితాలకు సంబంధించి ప్రోగ్రెస్ కార్డులను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తీసుకునే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

'ఎంఐఎం'కు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు తొత్తులుగా మారాయి'



కృష్ణకాంత్ పార్కులో వాకర్లతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్

శ్రీనగర్‌కాలనీ: హైదరాబాద్ సంస్థాగత ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల కుటిల రాజకీయాలను ప్రజలు గమనించాలని మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. సంస్థాగత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని కృష్ణకాంత్ పార్కులో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దిగజారుడు రాజకీయాలపై వాకర్లకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, బలమున్న బీఆర్‌ఎస్ ఎందుకు తమ అభ్యర్థులను నిలబెట్టలేదో ప్రశ్నించాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు ఎంఐఎంకు తొత్తులుగా పనిచేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసం పోరాడే బీజేపీకి మద్దతు పలికేలా స్థానిక కార్పొరేటర్లపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు లక్ష్మణ్, నవీన్‌కుమార్, కొలన్ సత్యనారాయణ, సుప్రియ, సంగీత, ఈశ్వరయ్య, మహేష్, గోపాల్, శ్రావణ్ పాల్గొన్నారు.

సుందరీకరణకు మొదటి ప్రాధాన్యం



పార్కు సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వనం సంగీత

శ్రీనగర్‌కాలనీ: పార్కులతో పాటు కాలనీల సుందరీకరణకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కార్పొరేటర్ వనం సంగీత అన్నారు. సోమవారం సోమాజీగూడ డివిజన్ శ్రీకృష్ణదేవరాయనగర్ కాలనీ పార్కు చుట్టూ సుందరీకరణ పనులను ప్రారంభించారు. డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, కాలనీ అసోషియేషన్ సభ్యులు, నేతలు గని, ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తూ ఉన్నతంగా ఎదగాలి



షటిల్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

వెంగళరావునగర్: బాలబాలికలు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణిస్తూ ఉన్నతంగా ఎదగాలని మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి కాలనీవాసులకు నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలు 21 నుంచి జూన్ 7వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు సెలక్షన్స్ ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

లిబర్టీ: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మనెంట్ చేయాలని మున్సిపల్ లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిత్యం సేవలందిస్తూ మహానగరాన్ని పరిశుభ్రంగా పచ్చదనంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లలో అనేక ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చాలీచాలని జీతాలతో ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నారన్నారు. ప్రధానంగా హైదరాబాద్ మహానగరంలో వేలాది మంది కార్మికులు మహానగరాన్ని పరిశుభ్రంగా ఉందచేందుకు నిరంతరం పాటుపడుతున్నారన్నారు. ఈ సమావేశంలో దిలీప్‌సింగ్, మధు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



బండి సంజయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న పుప్పాల అశోక్

హిమాయత్‌నగర్ : దేశంలో పనిచేస్తున్న 5 లక్షల పైచిలుకు హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించే విధంగా హోంగార్డు 1946-47, 1962, 63 చట్టాలు సవరించి, రాష్ట్రంలో నిలిపివేసిన కారుణ్య నియామకాలను అమలు చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రికి సిఫార్సు చేయాలని కోరుతూ హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల అశోక్ కేంద్రమంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా విపత్తులో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోలీసులతో సమానంగా పనిచేశామన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేకపోవడంతో అనారోగ్యంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వినతి ఇచ్చిన వారిలో ప్రకాష్, కిరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

నవదుర్గ అమ్మవారికి బోనాలు

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ చౌరస్తాలోని నవదుర్గ అమ్మవారి బోనాలను సోమవారం కాంగ్రెస్ నేత ఏవీ మల్లేష్‌గౌడ్, బాలమణి దంపతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డా. పీవీ రవిశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రేఖ, సన్నిగౌడ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి పూజలో డా. రవిశేఖర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్ దంపతులు

కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోండి



సైబర్‌క్రైమ్ ఏసీపీ శివమూర్తి కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ తలపెట్టిన చలో వరంగల్ సభకు సంబంధించి గోడలపై రాతలను కొందరు దురుద్దేశంతో చెరిపేసి ఆ స్థానంలో బీఆర్‌ఎస్‌ను కించపరిచే విధంగా రాసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇలా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ సైబర్ క్రైమ్స్ ఏసీపీ శివమూర్తి కుమార్‌కు సోమవారం ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. తాము గోడలపై రాసిన రాతలను మార్ఫింగ్ చేసి వాటి స్థానంలో ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి ఆమె ఫొటో ఉన్న స్థానంలో లిక్కర్‌స్కామ్ అని... మరికొందరి ఫొటోల స్థానంలో ధరణి స్కామ్, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం స్కామ్, గులాబీ దొంగలు.. ఇదే మా చరిత్ర అంటూ రాశారన్నారు. ఈ రాతల వల్ల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయని మార్ఫింగ్ చేసిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పోస్టులను వెంటనే తొలగించాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో పార్టీ నేతలు సి. రాంచందర్, సారంగపాణి, విజయ్, అహ్మద్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్



నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న కార్మికులు

లక్డీకాపూల్: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎం వెంకటేష్ డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్డ్ అయిన కార్మికులకు ఉచితంగా వైద్యం అందించాలన్నారు. కార్మికుల జీతాల్లో ఫిక్స్‌డ్ అలవెన్స్ రూపంలో చూపిస్తున్న రూ. 1,400 గ్రాస్ శాలరీలో కలపాలని కోరారు. ఈ మేరకు సోమవారం నిమ్స్ ఆవరణలో జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించిన 61 సంవత్సరాల వయోపరిమితిని కాంట్రాక్టు కార్మికులకు కూడా వర్తింపజేయాలన్నారు. నిమ్స్ కార్మికులందరికీ ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని వెంకటేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే కార్మికులు కట్టుబానిసలుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్మికులందరూ యూనియన్లకు అతీతంగా ఏకమై తమ హక్కుల సాధన కోసం, ఉన్న హక్కులను కాపాడుకోవడానికి మే 20న జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని వెంకటేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి. ప్రవీణ్‌కుమార్, యూనియన్ నాయకులు బాలయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతుల పరిహారం కాజేసిన ఫైనాన్స్ సంస్థ

తమకు రావాల్సిన నగదు ఇప్పించాలని బాధితుల డిమాండ్



పంజగుట్ట: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు వల్ల తమ భూములు కోల్పోయాం. బలవంతంగా తమ భూములు లాక్కుని కొంత మొత్తాన్ని అప్పచెపితే ఆ ఇచ్చిన పైకం కూడా ఫైనాన్స్ కంపెనీ దోచుకుందని ఓం సాయి శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులపై చర్యలు తీసుకుని తమ డబ్బులు తమకు ఇప్పించాలని కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బాధితులు పర్వతాలు, ఎల్లమ్మ, వీరికి మద్దతుగా వచ్చిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య బాధ్యురాలు విమలక్క, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, సంగెం సూర్యారావు మాట్లాడుతూ.. 2023లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కోసం నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి జిల్లాల్లో మూడు గ్రామాలు పూర్తిగా తీసుకోవడంతో పాటు మొత్తం 25 గ్రామాల్లో భూసేకరణ చేశారని తెలిపారు. అప్పటికే 25 లక్షలకు ఎకరం స్థలం ఉండగా తమకు కేవలం 4.5, ఐదు లక్షలు ఎకరానికి ఇస్తామంటే తాము ఒప్పుకోలేదని, కాని అధికారులు వినకుండా బలవంతంగా తమ స్థలాలు లాక్కున్నారని తెలిపారు. ఇక్కడ భూసేకరణ జరుగుతుంది, అమాయక రైతులకు డబ్బులు వస్తున్నాయని తెలుసుకున్న కొంతమంది రాజకీయ నాయకుల, బడా పారిశ్రామికవేత్తల అనుచరులు ఓం సాయి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ స్థాపించారని తెలిపారు. భూములు కోల్పోయిన అమాయక రైతులను నమ్మించి మీరు మరోచోట స్థలం కొనుగోలు చేసే వరకు తమ సంస్థలో మీ డబ్బులు పెడితే మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు అత్యధిక వడ్డీ జోడించి మీ డబ్బులు ఇస్తామని నమ్మబలికారు. పెట్టుబడులు పెట్టించేందుకు కొంతమంది ఏజెంట్‌లను కూడా పెట్టుకున్నారు. వీరి మాటలు నమ్మిన సుమారు 2500 కుటుంబాలు ఏకంగా 180 కోట్ల పెట్టుబడులు పెట్టారని ఒక్కొక్కరూ రూ.5 లక్షల నుంచి రూ.85 లక్షల వరకు డిపాజిట్లు చేశారని తెలిపారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

వెంగళరావునగర్: ఫిట్స్‌తో కిందపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో నివసించే సయ్యద్ ఖాదర్(41) ఈనెల 11వ తేదీ ఆటో డ్రైవింగ్‌కు వెళ్లాడు. రాత్రి ఖాదర్ సోదరుడు ఆయూబ్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఖాదర్ రహమత్‌నగర్‌లో ఫిట్స్ వచ్చి పడిపోయాడని తెలియజేశారు. దాంతో ఖాదర్ భార్య కుటుంబ సభ్యులు అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. మరోసారి ఫిట్స్ రావడంతో 13వ తేదీన ఓజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య మేరాజ్ బేగం ఫిర్యాదు మేరకు సోమవారం మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై కేసు

వెంగళరావునగర్: మహిళను నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... రాజేంద్రనగర్‌కు చెందిన జి.అరుణ ఇటీవల తన భర్త జి.గంగాధర్ మౌళి ప్రవర్తనపై అనుమానంతో అతని సోదరుడు మహేష్ ద్వారా వివరాలు సేకరించింది. అతను వివరాలు సేకరించి తన సోదరుడు అనేకమంది మహిళలతో సంబంధం ఉన్నట్టుగా చెప్పాడు. ఇదే విషయాన్ని ఆమె భర్త స్నేహితులు మౌళీశ్వర్‌రెడ్డి, రామసుబ్రమణ్యంలు కూడా నిజమని చెప్పి ఫొటోలు కూడా ఇచ్చారు.

రాజేంద్రనగర్‌లోని తమకు చెందిన ఆస్తిని విక్రయించాడని, ముందుగా దానిపై రెండు దఫాలుగా రూ.35.30 లక్షల రుణం తీసుకున్నాడని తెలిపారు. వారు చెప్పినట్టు చేస్తే ఆస్తి పేపర్లు తిరిగి ఆమె పేరున రాయిస్తామని చెప్పారు. దాంతో ఆమె వారి మాటలు నమ్మి రూ.11.75 లక్షలు తీసుకుని వారికి రూ.9 లక్షలు, రూ.3 లక్షలు, రూ.7 లక్షలు తీసుకుని వారికి ఇచ్చింది. అయితే ఆమె పేరుమీద ఆస్తిని రాయించలేదు. పైగా తనను బెదిరిస్తున్నారు. అక్టోబరు నెలలో రుణాలు మూసివేయబడ్డాయని, కొన్ని సెటిల్ అయ్యాయని నోటీసులు అందాయి. దాంతో తనను మోసం చేసిన భర్త చందర్‌మౌళితో పాటుగా ఎల్‌ఐసీ హెచ్‌ఎఫ్‌ఎల్ బ్యాంకు మేనేజర్ కె.రమేష్, మౌళీశ్వర్‌రెడ్డి, నాగరత్నమ్మ, శ్రీరెడ్డి రామసుబ్రమణ్యం, వి.విష్ణులపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్నానం చేస్తుండగా వీడియోలు తీస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

– నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగింత

వెంగళరావునగర్: మహిళలు స్నానం చేస్తుండగా ఫొటోలు, వీడియోలు తీస్తున్న వ్యక్తిని మధురానగర్ అసోసియేషన్ నేతలు పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌కాలనీ కమ్యూనిటీహాల్‌లో కొన్నేళ్లుగా ఓ కుటుంబం విధులు నిర్వర్తిస్తోంది. వారి కుమార్తె సమీపంలోని చీరల దుకాణంలో సేల్స్‌గర్ల్‌గా పని చేస్తోంది. ఆమె సోమవారం ఉదయం విధులకు వెళ్లడానికి స్నానం చేస్తూ సబ్బు కోసం వెతికింది. అయితే ఆమెకు అక్కడ మొబైల్ ఫోన్ చేతిని తాకింది. భయపడి దుస్తులు ధరించి బయటకు వచ్చి చూడగా కమ్యూనిటీహాల్‌లో ఎలక్ట్రిషియన్‌గా విధులు నిర్వర్తించే వై.మరియాలి కుమార్ స్నానం గది కిటికీ పక్కన దాక్కుని ఉన్నాడు. ఈ విషయాన్ని ఆమె తన భర్తకు తెలియజేయగా అతడు వచ్చి మరియాలి కుమార్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించాడు. అయితే ఫోన్‌తో సహా అతను పారిపోయాడు. విషయాన్ని బాధితురాలు సంక్షేమ సంఘం అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి తదితరులకు తెలియజేసింది. సంఘం నేతలు పోలీసులకు ఫోన్ చేసి ఎలక్ట్రిషియన్‌ను పట్టుకుని విషయాన్ని సేకరించారు. ఐదేళ్లుగా మహిళలు స్నానం చేస్తుండగా వీడియోలు, ఫొటోలు తీస్తున్నట్లుగా అంగీకరించాడు. తాను తీసిన వీడియోలు, ఫొటోలు అన్నీ తొలగించినట్టుగా తెలియజేశాడు. అనంతరం నిందితుడిని కాలనీ నేతలు మధురానగర్ పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్.. వ్యక్తి అరెస్ట్

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్ పీఎస్ పరిధిలో ఆన్‌లైన్ బెట్టింగ్ జోరుగా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం రాత్రి ఎస్సై సాయినాథ్‌రెడ్డి తన అనుచరులతో మధురానగర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాలనీలో ఒకచోట పిల్లి అరవింద్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులు అతనిని పట్టుకుని విచారించగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వేస్తున్నట్టుగా అంగీకరించాడు. పోలీసులు అతనిని అదుపులోనికి తీసుకుని ఫోన్, రూ.686 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్ చేసిన టాటా ఏస్ మాయం

వెంగళరావునగర్: పార్కింగ్ చేసిన టాటా ఏస్ వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మధురానగర్‌కాలనీలో టెంట్‌హౌస్ నిర్వహించే ఆర్.శ్రీకాంత్ తన టాటాఏస్ వాహనాన్ని ఈనెల 19వ తేదీ రాత్రి యూసుఫ్‌గూడలోని హోటల్‌లో సమీపంలో పార్కింగ్ చేసి మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. అనేకప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేకపోవడంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ వ్యర్థాల తొలగింపు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం.10లోని సింగాడబస్తీలో ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. నిర్మాణంలో భాగంగా వేసిన గోనె సంచులతో పాటు తవ్వి పడేసిన వ్యర్థాలను రోడ్ల పక్కన కుప్పలుగా పడేశారని, దీని వల్ల ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోందని 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సర్కిల్-18 ఈఈ విజయ్‌కుమార్ స్పందించారు. రోడ్ల పక్కన, గల్లీల్లో కుప్పలుగా వేసిన గోనె సంచుల మూటలను సోమవారం ఇక్కడి నుంచి సంబంధిత కాంట్రాక్టర్ తొలగించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా తవ్వేసిన మట్టి దిబ్బలు, వ్యర్థాలను కూడా తొలగించారు. ఈ గోనె సంచుల కుప్పలతో రోడ్డు వ్యర్థాలతో స్థానికంగా న్యూసెన్స్‌గా మారిందన్నారు. సమస్యను 'సాక్షి'వెలుగులోకి తీసుకురావడంతో పరిష్కారం అయ్యింది.

క్లుప్తంగా...

ఎస్సీ వర్గీకరణపై మీ వైఖరి చెప్పండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ చట్టంపై వైఖరిని తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.మంగ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులైన అధికారులకు నోటీసులు జారీ చేసింది.

పీసీసీఎఫ్ ఎఫ్ఏసీగా చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి,హైదరాబాద్: ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్‌గా డా.జి. చంద్రశేఖర్‌రెడ్డి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) స్వీకరించారు. సోమవారం అరణ్యభవన్‌లో ఎఫ్ఏసీ హోదాలో ఆయన విధులు నిర్వర్తించారు. ప్రస్తుత పీసీసీఎఫ్‌గా ఉన్న రాకేశ్‌మోహన్ డోబ్రియాల్ మరో ఏడుగురు అటవీ అధికారులతో కూడిన బృందం ఆస్ట్రేలియాలో క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లింది. దీంతో పీసీసీఎఫ్ ఎఫ్ఏసీగా చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతంసీఎంవోలో చంద్రశేఖర్‌రెడ్డి కార్యదర్శి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 30న డోబ్రియాల్ ఉద్యోగ విరమణ చేయనున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి కూడా మరో రెండునెలల్లో రిటైర్ అవుతారు. ఈ నేపథ్యంలో తదుపరి పీసీసీఎఫ్‌గా ఎవరిని నియమిస్తారనే చర్చ అధికారవర్గాల్లో జరుగుతోంది.

భీమా జ్యువెల్లర్స్ 'బంగారం అంటే భీమ' క్యాంపెయిన్

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల రిటైలర్, భీమ జ్యువెల్లర్స్ సరికొత్త క్యాంపెయిన్ 'బంగారం అంటే భీమ'ను ప్రారంభించింది. ఈ ఉత్తేజకరమైన క్యాంపెయిన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా హీరో రామ్‌చరణ్ వ్యవహరిస్తున్నారు. ఈ ప్రచారంలో హారాలు, వడ్డాణాలు, గుట్టపూసలు, చోకర్లు, నక్షిగాజులు, అద్భుతమైన ఝుమ్కాలు వంటి ఏపీ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే వాటిని ప్రదర్శిస్తున్నారు. 'బంగారం అంటే భీమ'.. అనేది కేవలం క్యాంపెయిన్ మాత్రమే కాదని.. తమ విలువలైన నమ్మకం, పారదర్శకతతో పాటు.. అద్భుతమైన హస్తకళలను ప్రతిబింబిస్తుందని సంస్థ ఎండీ అభిషేక్ బిందు మాధవ్ తెలిపారు.

చట్టం అంటే లెక్క లేదా?

పోలీసులు, సిట్ అధికారులపై ఏపీ హైకోర్టు ఆగ్రహం

- సిట్ అధికారులు చాలా పెద్దవాళ్లం.. శక్తిమంతులం అనుకుంటున్నారు
- వ్యక్తి స్వేచ్ఛ కన్నా కోర్టులకేదీ ముఖ్యం కాదు..
- సాక్షి పేరుతో వృద్ధుడిని అర్ధరాత్రి తిరుపతి నుంచి విజయవాడకు తెస్తారా?
- అసలు రాష్ట్రంలో ఏం జరుగుతోంది?
- ఇదంతా ఎవరు చేస్తున్నారో వారిని మా ముందుకు రమ్మనండి



సాక్షి, అమరావతి: రెడ్‌బుక్ అరాచకాలకు కొమ్ము కాస్తూ రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు తూట్లు పొడుస్తున్న పోలీసు ఉన్నతాధికారులు, సిట్ అధికారుల తీరుపై ఏపీ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతోంది..? చట్టాన్ని బేఖాతర్ చేస్తున్న పోలీసులను ఇలాగే వదిలేస్తే రేపు మనం అందరం ఇబ్బందులు పడాల్సి వస్తుందంటూ వ్యాఖ్యలు చేసింది. వ్యక్తి స్వేచ్ఛకు మించి తమకు ఏదీ ముఖ్యం కాదని.. ఈ విషయాన్ని పలు మార్లు పునరుద్ఘాటించినా పోలీసులు కోర్టుల ఆదేశాలను లెక్కచేయడం లేదని మండిపడింది. ''పోలీసులై ఉండి చట్టాన్ని ఎలా ఉల్లంఘిస్తారు? మీరుండేది చట్టాన్ని, న్యాయాన్ని కాపాడటానికా? లేక దాన్ని ఉల్లంఘించడానికా? పిల్లలు తప్పు చేశారంటూ తల్లిదండ్రులను వేధిస్తారా? తెలియని విషయాలను చెప్పాలని ఒత్తిడి చేస్తారా? ఇలా చేయమని ఏ చట్టం మీకు చెబుతోంది? పౌరుల పట్ల వ్యవహరించాల్సిన తీరు ఇదేనా? దర్యాప్తు అధికారినే మా ముందుకు రమ్మనండి.. చట్టం ఏం చెబుతుందో ఆయన్ను అడిగి తెలుసుకుంటాం. సిట్‌లోని అధికారులు తమను తాము చాలా పెద్ద వాళ్లం.. శక్తిమంతులం అని అనుకుంటున్నారు. శక్తిమంతులం కాబట్టి ఏం చేసినా చెల్లుతుందని భావిస్తున్నారు. తమకు చట్టం అవసరం లేదు.. అధికారమే ముఖ్యమని అనుకుంటున్నారు. ఒంటిపై యూనిఫాం ఉంది కదా ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే ఆలోచనలో ఉన్నారు. సిట్ అదనపు ఎస్పీ ఎవరు కావాలంటే వారిని తీసుకొచ్చేస్తారా? పోలీసుల వ్యవహారశైలి అత్యంత దురదృష్టకరం''అని సోమవారం ఓ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. సాక్షిగా ఓ వృద్ధుడిని విచారించాలంటే చట్టం ఏం చెబుతుందో మీకు తెలియదా? అని సూటిగా ప్రశ్నించింది. ఆయన్ను సిట్ అదనపు ఎస్పీ తిరుపతి నుంచి విజయవాడకు ఎందుకు పిలిపించాల్సి వచ్చిందో స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ వ్యాజ్యంలో దర్యాప్తు అధికారి శ్రీహరిబాబుని సుమోటోగా ప్రతివాదిగా చేరుస్తూ తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, డాక్టర్ జస్టిస్ కుంభజడల మన్మథరావుల ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అధికారం ఉంది కాబట్టి చేశామంటారా?

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతున్న తీరు, పోలీసుల దుర్మార్గ పోకడను తిరుపతికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు, విశ్రాంత పోలీసు అధికారి సుబ్రహ్మణ్యంరెడ్డి హైకోర్టుకు పూసగుచ్చినట్లు నివేదించారు. కేసు ఏమిటి? నేరం ఏమిటి? అనే విషయాలను చెప్పకుండా తనను అర్ధరాత్రి తిరుపతి నుంచి విజయవాడకు ఆగమేఘాలపై తరలించిన పోలీసులు విచారణ పేరుతో దారుణంగా వ్యవహరించారని హైకోర్టుకు మొర పెట్టుకున్నారు. కేన్సర్‌తో బాధపడుతున్న తన భార్యకు కనీసం మందులు కొనేంత వరకైనా ఆగాలని ప్రాధేయపడినా వినకుండా బలవంతంగా తరలించారంటూ కన్నీటిపర్యంతమయ్యారు. పదోన్నతి కూడా వద్దనుకుని భార్యకు సపర్యలు చేస్తూ ఇంటి వద్ద ఉంటున్న తన పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించారన్నారు. తానేదో నేరం చేసినట్లు ఇంటి వద్ద మోహరించారన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు ముఖ్యంగా దర్యాప్తు అధికారి (ఐవో) విచారణ పేరుతో తనను బంధించి చిత్రహింసలు పెట్టారని కోర్టు దృష్టికి తెచ్చారు. సుబ్రహ్మణ్యారెడ్డి చెప్పిన వివరాలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు సిట్ దర్యాప్తు అధికారి, అదనపు ఎస్పీతో పాటు ఇతర పోలీసులపై నిప్పులు చెరిగింది. 'అసలు ఏం కేసు ఉందని సుబ్రహ్మణ్యంరెడ్డిని తిరుపతి నుంచి విజయవాడకు పిలిపించారు. ఆయన ఏ కేసులోనూ నిందితుడు కారు. అలాంటప్పుడు ఆయన పట్ల దురుసుగా ఎందుకు ప్రవర్తించినట్లు? అధికారం ఉంది కాబట్టి చేశామంటారా? అదే విషయం చెప్పండి.. ఏం చేయాలో మాకు బాగా తెలుసు...'అని న్యాయస్థానం మండిపడింది. బాలసుబ్రహ్మణ్యంరెడ్డిని గుర్తు తెలియని పోలీసులు ఈ నెల 16వ తేదీ రాత్రి 11.50 గంటలకు తిరుపతిలోని ఆయన ఇంటి నుంచి తీసుకెళ్లడంపై వైఎస్సార్‌సీపీ నేత మేకా వెంకటరామిరెడ్డి గత వారం హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం ఆదేశాల మేరకు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి స్వయంగా కోర్టు ముందు హాజరై వాస్తవాలను నివేదించారు.

ఆటిట్యూడ్ చూపితే ఏం చేయాలో తెలుసు..

బాలసుబ్రహ్మణ్యంరెడ్డి చెప్పిన వివరాలన్నింటినీ అఫిడవిట్ రూపంలో కోర్టు ముందుంచితేనే వాటికి సమాధానం ఇవ్వడం సాధ్యమవుతుందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) పేర్కొనటంపై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. ప్రభుత్వ న్యాయవాది నుంచి తాము ఇలాంటి తీరును ఆశించడం లేదని స్పష్టం చేసింది. అఫిడవిట్ దాఖలు చేస్తేనే స్పందిస్తామంటే ఆ దిశగా ఆదేశాలు ఇస్తామని, ఆ అఫిడవిట్‌కు వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదికి తేల్చి చెప్పింది. ఇలాంటి ఆటిట్యూడ్ చూపిస్తే తమకు ఏం చేయాలో తెలుసునంది. అసలు ఇదంతా చేయమని వెనకుండి ఎవరు చెబుతున్నారో వారిని ముందుకు రమ్మనండని, చట్టం గురించి వారితోనే మాట్లాడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. అవసరమైతే ఈ కేసులో తామే ట్రయల్ కూడా నిర్వహిస్తామని పేర్కొంది. ఈ సమయంలో పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్యం శ్రీరామ్ స్పందిస్తూ, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 సెక్షన్ ప్రకారం 60 ఏళ్ల పైబడిన వారిని వారి ఇంటి వద్దనే విచారించాల్సి ఉంటుందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

హైదరాబాదీ అసాల్ట్ రైఫిల్

- చిన్న ఆయుధాల తయారీ కేంద్రం ప్రారంభం
- మేఘా ఐకామ్– క్యారకల్ భాగస్వామ్యంతో స్థాపన
- కార్ 817 అసాల్ట్ రైఫిల్ వంటి ఆధునిక ఆయుధాల ఉత్పత్తి
- భారత దళాలతోపాటు విదేశాలకూ ఆయుధాల ఎగుమతి

సాక్షి, హైదరాబాద్: దేశ రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించే ప్రపంచ శ్రేణి చిన్న ఆయుధాల తయారీ కేంద్రాన్ని మేఘా ఇంజనీరింగ్ అనుబంధ సంస్థ 'ఐకామ్'సోమవారం ప్రారంభించింది. ఐకామ్ సమీకృత ఇంజనీరింగ్ విభాగం ఆవరణలో ఐకామ్, క్యారకల్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేశారు. ఐకామ్ టెలీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుమంత్ పాతూరు, క్యారకల్ సీఈఓ హమద్ అల్ అమెరీ సోమవారం దీనిని సంయుక్తంగా ప్రారంభించారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఇక్కడ తయారయ్యే ఆయుధాలు భారత సాయుధ దళాలు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్ఎస్), సాయుధ బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలు, ఎస్పీజీ వంటి సంస్థలకు సరఫరా కానున్నాయి. యూఏఈకి చెందిన క్యారకల్ సంస్థ వివిధ దేశాలకు ఆయుధాలను ఇక్కడి నుంచి ఎగుమతి చేయనుంది. ఈ సంస్థ భారతదేశానికి తొలిసారి చిన్న ఆయుధాల తయారీకి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోంది.

అత్యాధునిక ఆయుధాల తయారీ

ఈ సంస్థలో మిషన్-ప్రూవెన్ కార్ 816 క్లోజ్-క్వార్టర్స్ బాటిల్ రైఫిల్, కార్ 817 అసాల్ట్ రైఫిల్, తేలికపాటి సీఎస్ఆర్ 338, 308 బోల్ట్-యాక్షన్ స్నైపర్ రైఫిల్, సీఎస్ఆర్ 50 బోల్ట్-యాక్షన్ యాంటీ-మెటీరియల్ స్నైపర్ రైఫిల్, ఆధునిక సీఎంపీ 9 సబ్ మెషీన్ గన్, క్యారకల్ ఈఎఫ్, క్యారకల్ ఎఫ్ జెన్ 2 కంబాట్ పిస్టల్స్ వంటి ఆయుధాలను తయారు చేస్తున్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన ఆత్మనిర్భర్ నినాదం స్ఫూర్తితో దేశ రక్షణ దళాలకు ఆయుధ సంపత్తి అందించాలనే ఆశయంతో ఈ యూనిట్‌ను స్థాపించినట్లు సుమంత్ పాతూరు తెలిపారు. ప్రపంచంతో పోటీపడే అత్యాధునిక ఆయుధాలను తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. యూఏఈ-భారత్ మధ్య రక్షణ రంగ సహకారంలో ఇది ఒక మైలురాయి అని అన్నారు. భారతీయ మార్కెట్, రక్షణ పరిశ్రమకు మద్దతు ఇవ్వడానికి తమ ప్రయత్నాల్లో ఇది మైలురాయి అవుతుందని హమద్ అల్ అమెరీ తెలిపారు.

ఈ- సిగరెట్ ముఠా గుట్టురట్టు

- ఇద్దరి అరెస్టు..రూ.25 లక్షల విలువైన సిగరెట్ల స్వాధీనం
- విక్రయాలకు 'ఎస్ఐడీ' పేరిట వాట్సాప్ గ్రూప్.. ర్యాపిడో, ఉబర్, డీటీడీసీ ద్వారా కొరియర్

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యార్థులకు ఈ-సిగరెట్లు సరఫరా చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, హైదరాబాద్ పోలీసులు అబిడ్స్ ప్రాంతంలో నిర్వహించిన జాయింట్ ఆపరేషన్‌లో విద్యార్థులకు ఈ-సిగరెట్లు సరఫరా చేస్తున్న ఇద్దరిని గుర్తించారు. వాట్సాప్‌లో ప్రత్యేక గ్రూప్ ద్వారా ఆర్డర్లు తీసుకొని ర్యాపిడో, ఉబర్, డీటీడీసీ కొరియర్ ద్వారా వీటిని సరఫరా చేస్తున్నారని టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్‌శాండిల్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు ఉపాధ్యాయులు ఇచ్చిన సమాచారం మేరకు అబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజ్, సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్, రోజరీ కాన్వెంట్ హైస్కూల్, సుజాత హైస్కూల్, జూనియర్ కాలేజ్‌పై నిఘా ఉంచి ఆరాతీయగా, నాంపల్లి శక్తిసాయి కాంప్లెక్స్‌లోని ఫ్లాట్ నంబర్ 404లో సాధిక్‌లలాని, అతడి సోదరుడు అనిల్ లలాని ఈ-సిగరెట్లు అమ్ముతున్నట్టు తేలిందని, లలాని ఇంట్లో ఏడు కార్టన్ బాక్సులలో రూ.25 లక్షల విలువైన 1,217 ఈ- సిగరెట్లను స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్టు చేశామన్నారు.

వాట్సాప్ గ్రూప్‌లో ఆర్డర్లు: ఈ-సిగరెట్ ఆర్డర్ చేసేందుకు అబిడ్స్ ప్రాంతంలోని పాఠశాలల పిల్లలతో 'ఎస్ఐడీ' పేరిట ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసినట్టు టీజీఏఎన్‌బీ అధికారులు గుర్తించారు. ఇందులో 500 మంది సభ్యులు ఉన్నారని, ఈ-సిగరెట్ల ధరల వివరాలు, ఆర్డర్లు తీసుకోవడం వంటివి దీని ద్వారా చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆర్డర్ ఇచ్చిన వారు లలాని బంధువుల నంబర్లకు ఫోన్‌పే, గూగుల్‌పే చేయగానే ఈ-సిగరెట్లను ర్యాపిడో, ఉబర్, డీటీడీసీ కొరియర్ ద్వారా చేరవేస్తున్నారు. ఈ-సిగరెట్లు వాడుతున్న18 ఏళ్లలోపు ఉన్న 13 మంది బాలలను వారి ఫోన్ నంబర్లతో సహా గుర్తించారు. లలానీ సోదరులతో పాటు డీటీడీసీ కొరియర్, ఉబర్, ర్యాపిడోపై కూడా కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

వేలంలో కొన్న వాహనాలతో డ్రగ్స్ సరఫరా

పోలీసుల కళ్లు గప్పేందుకు మత్తు ముఠాలు కొత్తకొత్త ఉపాయాలు అమలు చేస్తున్నాయి. డ్రగ్స్, ఈ-సిగరెట్ల రవాణాకు ముఠాలు కొత్త మార్గాలు ఎంచుకుంటున్నాయి. రుణాలు చెల్లించకపోవడంతో జప్తుచేసిన ద్విచక్ర వాహనాలు, కార్లను బ్యాంకులు వేలంపాట వేసినప్పుడు తక్కువ ధరకు కొని మత్తుపదార్థాల రవాణాకు, ఇతర అవసరాలకు వాడుతున్నట్టు టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) అధికారులు గుర్తించారు. ఇటీవల పట్టుబడిన డ్రగ్స్ కేసుల్లో నిందితుల వద్ద జప్తు చేసిన వాహనాలపై ఆరా తీయగా, ఇది బయటపడింది. తాజాగా అబిడ్స్‌లో ఈ-సిగరెట్లను కొనుగోలుదారులకు చేరవేయడానికి డీటీడీసీ కొరియర్, ఉబర్, ర్యాపిడోలను వాడుతున్న విషయం వెలుగు చూసిన విషయం తెలిసిందే. పలు బ్యాంకులకు చెందిన రికవరీ ఏజెంట్లలో టచ్‌లో ఉంటున్న విదేశీ మత్తు ముఠాల సభ్యులు..వారి ద్వారా తక్కువ ధరకు వాహనాలు కొనుగోలు చేస్తున్నారని, ఇందులో కొందరు రికవరీ ఏజెంట్ల పాత్ర ఉన్నట్టుగా టీజీఏఎన్‌బీ అధికారులు అనుమానిస్తున్నారు.

నగర వార్తలు

అంబేడ్కర్ వర్సిటీలో నిరవధిక సమ్మె



బంజారాహిల్స్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. యూనివర్సిటీ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని, ఆ లోపు యూజీసీ పే స్కేల్ (బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏ, 3 శాతం ఇంక్రిమెంట్)తో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంబేడ్కర్ వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.అవినాష్, ప్రధాన కార్యదర్శి డా.ఎం.కిషోర్, సలహాదారులు డా.నర్సింలు, డా.విజయ్, ఉపాధ్యక్షులు కె.ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి డా. పి.రాధాకృష్ణ, కోశాధికారి డా. వైకుమార్, ఈసీ సభ్యులు డా. మఖ్దూం మోయినుద్దీన్ , డా.రామకృష్ణ పాల్గొన్నారు.

జలమండలి డైరెక్టర్‌గా ఎంఏ ఖాదర్

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి డైరెక్టర్ (పర్సనల్)గా మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ బాధ్యతలు స్వీకరించారు. జలమండలి పర్సనల్ - అడ్మినిస్ట్రేషన్ (పీఅండ్ఏ) చీఫ్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయనకు డైరెక్టర్ (పర్సనల్)గా పదోన్నతి లభించింది. సోమవారం ఆయన ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, మహమ్మద్ అబ్దుల్ ఖాదర్‌ను టీజీఓ హైదరాబాద్ జిల్లా విభాగం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్, సహాయ అధ్యక్షుడు ఆశన్న, ట్రెజరర్ ఎం.వి. రమణ, జాయింట్ సెక్రటరీ శ్రీరామ్, డాక్టర్ రమేష్, డాక్టర్ కోటాజీ, డాక్టర్ జె.రవికుమార్, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ సునీతా జోషి పాల్గొన్నారు.

రాష్ట్రమంతటా ఆవిష్కరణల స్ఫూర్తి

ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్

రాయదుర్గం: రాష్ట్రమంతటా ఆవిష్కరణల స్ఫూర్తిని తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తెలంగాణ ఇన్నోవేషన్ మహోత్సవం ముగింపు కార్యక్రమం సోమవారం ఇక్కడ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి సవాళ్లను అధిగమించడానికి సాధనాలు, జ్ఞానంతో ప్రజలను సన్నద్ధం చేయడమే తెలంగాణ ఇన్నోవేషన్ మహోత్సవం లక్ష్యమని పేర్కొన్నారు. టీజీఐసీ సీఈఓ మెరాజ్ మాట్లాడుతూ తెలంగాణలో కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకతను పెంపొందించడం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ప్రజాసేవే ఉద్యోగ ధర్మం: రామేశ్వరరావు

నూతన ఇంజనీర్లకు 'ఎస్కీ' డైరెక్టర్ దిశానిర్దేశం



శిక్షణలో పాల్గొన్న ఇంజనీర్లు, ఎస్కీ అధికారులతో డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: ప్రభుత్వ ఉద్యోగాన్ని ప్రతిక్షణం ప్రజల కోసం వాడాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు నూతన ఇంజనీర్లకు సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జీహెచ్ఎంసీలో నూతనంగా నియమించబడి వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లలో మొదటి బ్యాచ్‌కి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్



సబ్జెక్టు నిత్య నూతనమని పేర్కొన్నారు. ఆదిమ కాలంలోనే ఆహారం కోసం జంతువులను వేటాడే బల్లెం, గొడ్డళ్లు, కొడవళ్లు, కత్తులు, బాణాల తయారీ నుంచి నేటి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ దాకా ఇంజనీరింగ్‌లో అద్భుతమైన ప్రయోగాలు వచ్చాయని, ఇంకా వస్తున్నాయని పేర్కొన్నారు. అంతులేని ఈ టెక్నాలజీ వెనుక అపారమైన మేధస్సు కలిగిన ఇంజనీర్లు ఉన్నారన్నారు. సివిల్ ఇంజనీరింగ్ ఒక్కటే కాదని, ఏరో స్పేస్ ఇంజనీరింగ్, మెరైన్, మెకానికల్, మైనింగ్, ప్రొడక్షన్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ లాంటి సుమారు 15 రకాల ఇంజనీరింగ్ సబ్జెక్టులలో ఏ సబ్జెక్టు చూసినా అంతులేని ప్రగతి సాధించిందని అన్నారు. ప్రపంచ పురోగతికి ఇవి బాటలు వేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫ్యాకల్టీలు కె.రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ నరేష్, నాగ మల్లేశ్వరరావుపాటుగా బ్యాచ్-1 కింద 30 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు. విడతల వారీగా నాలుగైదు బ్యాచులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్గనైజర్ డాక్టర్ నరేష్ వివరించారు.

'ఫీజు' బకాయిలు చెల్లించాలి: ఆర్ కృష్ణయ్య

నల్లకుంట: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.4 వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిల విడుదల కోరుతూ ఈ నెల 29న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు, ఆర్డీఓ, ఎమ్మార్వో కార్యాలయాలు ముట్టడికి ఆయన పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయాలనే ఆలోచనతో కొందరు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి లేనిపోని సాకులు చెబుతూ.. ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తి వేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, అదే జరిగితే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. సోమవారం బీసీ భవన్‌లో విద్యార్థి నాయకుడు నీలం వెంకటేష్ అధ్యతన జరిగిన బీసీ విద్యార్థుల కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా స్కాలర్‌షిప్ నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

ప్రపంచ శాంతి కోసం పోప్ ఫ్రాన్సిస్ తపించారు..

రాంగోపాల్‌పేట్: పోప్ ఫ్రాన్సిస్ మరణించడం తీవ్ర విచారకరమని, ఆయన ప్రపంచంలోని సంఘాలకు కాపరి మాత్రమే కాకుండా శాంతి, దయ, న్యాయం కోసం ప్రవచనాత్మక స్వరాన్ని వినిపించారని కార్డినల్ పూల ఆంథోనీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాల వారిని జాగ్రత్తగా చూసుకోవాలని, చేసే ప్రతి పని దేవుడి ప్రేమకు సాధనంగా ఉండాలని ఆయన నిరంతరం గుర్తు చేసేవారని పేర్కొన్నారు. పోప్ ఫ్రాన్సిస్ నిరాడంబరత, ఆధ్యాత్మిక జీవనం ద్వారా క్రీస్తు హృదయానికి అందరినీ ఎంతో చేరువ చేశారని గుర్తు చేశారు.

పోప్ మరణం మానవాళికి తీరని లోటు

సాక్షి,సిటీబ్యూరో: పోప్ ఫ్రాన్సిస్ మరణం రోమన్ కాథలిక్ మానవాళికి తీరని లోటని తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోప్ ఫ్రాన్సిస్ గొప్ప కరుణ కలిగిన వ్యక్తి అని, కాథలిక్ చర్చికి, ప్రపంచానికి పోప్ ఫ్రాన్సిస్ అందించిన సేవలు మరవలేనివని పేర్కొన్నారు. సువార్త ప్రచారం, న్యాయం, దయ, ప్రేమ, సయోధ్యను చూపించడానికి పోప్ ఫ్రాన్సిస్ నిరంతరం నిబద్ధతను ప్రదర్శించారని తెలిపారు. పోప్ అచంచలమైన అంకితభావం అందరికీ స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు.

జీఎంఆర్ ఏరో అకాడమీలో శిక్షణ పునఃప్రారంభం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో జీఎంఆర్ ఏరో అకాడమీలో విమాన రక్షణ, అగ్నిమాపక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. గతంలో 2013 నుంచి 2018 వరకు 350 మంది ఏఆర్ఎఫ్ఎఫ్ శిక్షణ పొంది వివిధ విమానాశ్రయాల్లో సేవలందిస్తున్నారరు. ఐసీఏఓ ప్రమాణాలను అనుగుణంగా ఈ కోర్సును తీర్చిదిద్దినట్లు ఏరో అకాడమీ అధ్యక్షుడు అశోక్ గోపీనాథ్ తెలిపారు. మే 14 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. ప్రయాణికులకు, విమానాశ్రయ సిబ్బందికి రక్షణ కల్పించే విధంగా వీరిని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న వైమానిక రంగంలో ఆయా కోర్సుల్లో నిష్ణాతులైన వారి అవసరం కూడా ఎంతో ఉందని పేర్కొన్నారు.



సమాఖ్య స్ఫూర్తికి కేంద్రం విఘాతం: నారాయణ



మహాసభలో మాట్లాడుతున్న నారాయణ

శంషాబాద్: సమాఖ్య స్ఫూర్తికి కేంద్ర సర్కారు తూట్లు పొడుస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాల్గో మహాసభలను సోమవారం శంషాబాద్ పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల పన్నులు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని విమర్శించారు. అన్ని రంగాలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందన్నారు. వక్ఫ్‌బిల్లు సవరణను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అంతకుముందు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎంఎంఆర్ గార్డెన్ వరకు ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్ర చారి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రమేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, వెంకన్న, నర్సింహారెడ్డి, నర్రా గిరి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికకు రేపే పోలింగ్ !



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఈ ఎన్నికలో ఓటర్లయిన ఎక్స్‌అఫీషియో సభ్యుల కోసం ఒక పోలింగ్ కేంద్రం, కార్పొరేటర్ల కోసం మరో కేంద్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యుల పోలింగ్‌కేంద్రం ఒకటో నెంబరుది బిల్డింగ్ మెయింటనెన్స్ రూమ్‌లో.. కార్పొరేటర్ల పోలింగ్ కేంద్రం రెండో నెంబరుది, లైబ్రరీ రూమ్‌లో ఏర్పాటు చేశారు. డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్ ఫేస్ టు ఫేస్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు ఒక్కోటి చొప్పున ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ టీమ్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ విధుల కోసం ఒక్కో టీమ్‌లో నలుగురు అధికారులు చొప్పున మూడు టీమ్స్ నియమించారు. 25వ తేదీన శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఫస్ట్ ఫ్లోర్‌లోని పన్వర్‌హాల్‌లో ఫలితం వెల్లడయ్యేంత వరకు లెక్కింపు నిర్వహిస్తారు. లెక్కింపు సందర్భంగా మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్‌లతో కూడిన బృందాన్ని నియమించినట్లు పేర్కొన్నారు.

అమర్‌నాథ్ యాత్ర ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ

– గాంధీ ఆస్పత్రిలో షురూ



వైద్య నివేదికలు పరిశీలిస్తున్న జనరల్ మెడిసిన్ డాక్టర్ కృష్ణనాయక్

గాంధీఆస్పత్రి : అమర్‌నాథ్ యాత్రకు వెళ్లేవారికి అవసరమైన మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో సోమవారం ప్రారంభమైంది. ఆస్పత్రి ప్రధాన భవనం మొదటి అంతస్థులోని మెడికల్ రికార్డు డిపార్ట్‌మెంట్ (ఎంఆర్‌డీ)లో ప్రభుత్వం నియమించిన నలుగురు వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు 170 మందికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసింది. ఈ మేరకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీ చేస్తారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం హాజరయ్యారు. హార్ట్ సర్జరీలు, కీళ్ల నొప్పులు, దీర్ఘకాల రుగ్మతలతో బాధపడేవారి దరఖాస్తులను బోర్డు తిరస్కరించింది. రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డుతో నేరుగా హాజరై దరఖాస్తు చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి తెలిపారు. ఈ ఫిట్నెస్ సర్టిఫికెట్ల జారీ పూర్తిగా ఉచితమని, దళారులను ఆశ్రయించవద్దని ఆమె సూచించారు. సీబీపీ, ఈఎస్ఆర్, సీయుఈ, బ్లడ్ యూరియా, సీరం క్రియాటిన్, ఈసీజీ, చెస్ట్ ఎక్స్‌రే తదితర నివేదికలను మెడికల్ బోర్డుకు సమర్పించాలి. యాభై ఏళ్ల వయసు పైబడినవారు పై నివేదికలతోపాటు రెండు మోకాలి (బోత్ నీస్) ఎక్స్‌రేలు జత చేయాలి. ఆర్థోపెడిక్, కార్డియాలజీ, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యులు కిరణ్, జగదీష్‌రెడ్డి, భానుప్రియ, కృష్ణనాయక్, గాంధీ ఎమ్మార్డీ అధికారి యూసఫ్, నర్సింగ్, ఎంఆర్‌డీ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో నేడు..

- సమీకృత (అంతర్జాతీయ) తెలుగు సాంస్కృతిక – సారస్వత సంఘం(ఇట్క్లా) ఆధ్వర్యంలో సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు ఇట్క్లా- 2025 విశ్వ తెలుగు వెలుగు పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుంది.
- రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్ క్యాంపస్‌లో డిజైన్ సింక్ పేరిట ప్రదర్శన ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని లామకాన్‌లో ధరిత్రి దినోత్సవం, వాతావరణ స్థితిగతులపై చర్చ సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని లామకాన్‌లో రాత్రి 7 గంటలకు 21వ శతాబ్దంలో లెనిన్ ఔచిత్యంపై చర్చ కార్యక్రమం జరుగుతుంది.
- ఆల్ ఇండియా దాగ్ దెహ్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో ముషైరా, గజల్ కార్యక్రమం జరుగుతంది.



జూన్ 14న
చిత్రామృతం 2.0

పోస్టర్ ఆవిష్కరించిన సింగర్ ఎస్పీ చరణ్, సినీ గేయ రచయిత చంద్రబోస్

సాక్షి, సిటీ బ్యూరో: తాను రాసిన ఎన్నో పాటలకు ప్రముఖ సింగర్ చిత్ర ప్రాణం పోశారని, ఆమె గానం పాటల మాటలకు జీవం పోసే గొంతుక అని ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ తెలిపారు. గాన గంధర్వి కెఎస్ చిత్ర గాత్రయాత్రలో 45 ఏళ్ల ప్రత్యేకానుభూతిని జరుపుకునేందుకు నిర్వహించనున్న సంగీత మహోత్సవం 'చిత్రామృతం 2.0' పోస్టర్ ఆవిష్కరణ హైదరాబాద్‌లో నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రబోస్ ముఖ్య అతిథిగా పాల్గొని సింగర్ చిత్రతో తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా.. ఆమెను సత్కరించే ఈ వేదుకలో భాగం కావడం గర్వంగా ఉందని ఆయన అన్నారు. గాయని చిత్ర గానం కాలాన్ని దాటి మన మనసులను తాకే శక్తిని కలిగి ఉంది. తన తండ్రి ఎస్పీబీతో ఆమె కలిసి చేసిన ఎన్నో అద్భుత గీతాలు మర్చిపోలేని జ్ఞాపకాలని ఎస్పీ చరణ్ తెలిపారు. ఎమ్–3 ఎంటర్‌టైన్మెంట్స్, ఎస్ చాంట్ మీడియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మెగా ఈవెంట్ జూన్ 14న జరగనుందని, వేదికను త్వరలో ప్రకటించనున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు.









జలకాలాటల్లో.. జిమ్‌దగీ..

నగరంలో ఆక్వా వర్కవుట్స్‌కు ఆదరణ

పొద్దున్నే లేచి వ్యాయామం కోసం జిమ్‌కి వెళదామని ట్రాక్ సూట్, షూ ధరించేలోగానే చెమట్లతో తడిపేసే సీజన్ ఇది. అందుకే నగర వాసులు నీటి అడుగునే జిమ్‌దగీకి జై కొడుతున్నారు. చల్లని నీటిలో ఓ వైపు శరీరాన్ని చల్లబరుస్తూ.. మరోవైపు వ్యాయామాలు చేస్తూ సేదతీరుతున్నారు. ముంబై, బెంగళూర్ తదితర నగరాలతో పాటు భాగ్యనగరిలో కూడా ఆక్వా వర్కవుట్స్‌కి ఫిదా అవుతోంది నగర యువత.

- సాక్షి, సిటీబ్యూరో

- నీటి అడుగున వ్యాయామాలతో అదనపు లాభాలు
- సమ్మర్ సీజన్‌లో స్విమ్మింగ్‌తో పాటు మరెన్నో
- ఎక్సర్‌సైజ్‌లు, ఫన్ యాక్టివిటీస్‌కు చిరునామాగా పూల్స్
- అన్ని మెట్రో నగరాల్లోనూ ఆక్వా ఫిట్‌నెస్ పట్ల క్రేజ్

జంపింగ్ జాక్‌లు, ఆర్మ్ లిఫ్టులు, లెగ్ కిక్స్, లెగ్ షూట్స్ ఇవన్నీ.. రోజూ జిమ్‌లో చేసేవే కదా అనుకోవచ్చు. అయితే అవన్నీ ఇప్పుడు నీటిలోనూ చేయవచ్చు. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది సెలబ్రిటీలు అనుసరిస్తున్న ఆక్వా వర్కౌట్‌లు/హైడ్రో ఎక్సర్‌సైజ్‌లు నగరంలోనూ ఇప్పుడు ప్రాచుర్యం పొందుతున్నాయి. సిటీలో ఏప్రిల్, మే నెలల్లో ఆక్వా సంబంధిత వ్యాయామాలకు డిమాండ్ గరిష్ట స్థాయికి చేరుకుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు అనేక కొత్త ఎత్తయిన భవనాల్లోనూ, గేటెడ్ కమ్యూనిటీల్లోనూ అందుబాటులో ఉన్న పూల్స్‌లో ఈ వ్యాయామాల సందడి కనిపిస్తోంది. 'ఇది సాధారణ వ్యాయామాల మాదిరిగానే ఉంటుంది. కాకపోతే నీటిలో ఉన్నప్పుడు కాళ్లు, చేతుల కదలికలకు పరికరాల కదలికను జోడించడం సరదాగా ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో క్యాలరీలను బాగా ఖర్చు చేయడంలో ఇది సహాయపడుతుంది. నీటిలో సౌకర్యవంతంగా ఉన్నంత వరకూ (ఇది పూల్స్‌లో ఎక్కువ లోతులేని వైపు ఉంటుంది) ఈ ఫార్మాట్ అన్ని వయసుల వారికీ పని చేస్తుంది అని చెబుతున్నారు ఆక్వా ఫిట్ ఇన్‌స్ట్రక్టర్ కవితారెడ్డి.

వ్యాయామాలెన్నో..

ఆక్వా ఎరోబిక్స్ఎప్పటి నుంచో ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇప్పుడు సిటీలో క్యాలరీలను బర్న్ చేసి రక్త ప్రసరణను పెంచడానికి సహాయపడే అనేక నీటి ఆధారిత వ్యాయామాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో ఆక్వాటిక్ వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, ఆక్వా జుంబా, హెచ్‌ఐఐటీ, తబాటా, స్ట్రెంగ్త్ ట్రెనింగ్, ఆక్వా యోగా, కిక్–బాక్సింగ్ వంటి అనేక రకాలైన వర్కవుట్స్ చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. 'డంబెల్స్, నూడుల్స్, ఆక్వా బాక్సింగ్ గ్లోవ్స్, రెసిస్టెన్స్ ట్యూబింగ్, వాటర్ వాకింగ్, ఆక్వా ట్రెడ్‌మిల్స్, వాటర్ బైక్‌లు ఇంకా ఎన్నో.. పరికరాలతో చేసేందుకు ఆక్వా వ్యాయామాలు అందుబాటులో ఉన్నాయి.

కొన్ని సూచనలు..

- మాయిశ్చరైజర్‌ని అప్లై చేయడం స్విమ్మింగ్ క్యాప్ ధరించడం ద్వారా చర్మం, జుట్టుకు క్లోరిన్ నుంచి రక్షణ లభిస్తుంది. అలాగే కళ్లను రక్షించడానికి నీళ్ల కంట్లో కలిగించే చికాకును నివారించడానికి గాగుల్స్ ధరించాలి.
- నిదానంగా వ్యాయామం ప్రారంభించి కొంచెం కొంచెంగా తీవ్రతను పెంచాలి.
- శ్వాసను ఎక్కువసేపు బిగబట్టుకోవద్దు. నీటి అడుగున కఠినమైన విన్యాసాలు చేయవద్దు.
- నైపుణ్యం, స్థాయి, సామర్థ్యానికి తగిన వ్యాయామాలు మాత్రమే చేయాలి.
- సరైన శిక్షణ పర్యవేక్షణలో ఉంటే తప్ప అధునాతన వర్కవుట్స్ ఎప్పుడూ ప్రయత్నించవద్దు.
- అనుభవం లేకుంటే డైవింగ్ లేదా ఫ్లిప్ చేయడం మంచిదికాదు.

ప్రయోజనాలెన్నో..

నీటి అడుగున వ్యాయామాలు బరువు తగ్గడానికి, కండరాలను టోన్ చేయడానికి, శక్తిని పెంచడానికీ సహాయపడతాయని అధ్యయనాలు నిరూపించాయి. తక్కువ అలసటతో ఎక్కువ ప్రయోజనాలు అందిస్తాయి. ఆర్థరైటిస్ రోగులకు ఇవి ఉత్తమమైనవి. అంతేకాదు ఒత్తిడిని కూడా తగ్గిస్తాయి. ఆక్వా వర్కౌట్‌లు గర్భిణులకు కూడా మంచిదని చెబుతున్నారు కవిత. ఈ వ్యాయామం వల్ల కీళ్లకు కూడా మేలైన రక్షణ ఉంటుంది. అందుకే సాధారణంగా గాయం నుంచి కోలుకునే క్రమంలో తరచూ హైడ్రో థెరపీని ఉపయోగిస్తారు. కార్డియో–ఇన్‌టెన్సివ్‌గా ఉంటాయి, గాలి కంటే నీరు 13 రెట్లు ఎక్కువ నిరోధకతను కలిగి ఉంటుంది. కాబట్టి నీటి వ్యాయామాలు మరింత పటిష్టంగా ఉంటాయి. నేలమీది వ్యాయామం కంటే ఎక్కువ నిరోధకతను అందిస్తాయి. ఇది ఒక గంటలో 500–1,200 క్యాలరీలు బర్న్ చేయగలదు. నీటిలో ఉన్నప్పుడు శరీర బరువులో 10 శాతం మాత్రమే బరువు కలిగి ఉంటారు. కాబట్టి కీళ్ళు అన్‌లోడ్ చేయబడినట్లు అనిపిస్తుంది. నేల మీద మనం చేసే వ్యాయామాల్లో తప్పుడు కదలికల వల్ల లిగ్మెంట్స్ చిరిగిపోవడానికి /ఒత్తిడికి / బెణుకు లేదా పగుళ్లకు కారణమవుతుంది. నీటిలో వ్యాయామాల వల్ల గాయం అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. చికిత్స కోసం నీటి వ్యాయామాలు సిఫార్సు చేస్తారు. ఇది చురుకుదనం, వెయిట్‌లాస్ కోసం ప్రభావవంతంగా ఉంటాయి. కాలుతో త్రిభుజం ఆకారంలో ఉండే డెగేజ్ పాస్ వంటివి ఇందులో ఉన్నాయి. పూల్‌లో నీటి సాంద్రత కాలుని ఎక్కువ దూరం కదపడానికి సహాయపడుతుంది.





అన్ని సీజన్స్‌లోనూ ఆరోగ్యకరమే..

ఈ వర్కవుట్ కేవలం వేసవిలో మాత్రమే కాదు అన్ని కాలాల్లోనూ ప్రయోజనకరం. బెంగళూరులో ఉన్నప్పుడు వ్యక్తిగత సమస్యల నుంచి పరిష్కారంగా ఎంచుకున్న ఈ వ్యాయామం నగరానికి వచ్చిన తర్వాత నాకు పూర్తిస్థాయి ప్రొఫెషన్‌గా మారింది. దీని కోసం సింగపూర్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్, ఏరోబిక్ అండ్ ఫిట్‌నెస్ (ఫిసా) కోర్సును చేశాను. ప్రస్తుతం నగరంలోని జూబ్లీహిల్స్‌లో ఉన్న స్ట్రోక్స్‌తో పార్ట్‌నర్‌గా ఆక్వా వర్కవుట్స్‌లో సిటిజనులకు శిక్షణ అందిస్తున్నాను. ఈ వ్యాయామాల లాభాలపై అవగాహన మరింత పెరిగితే అది మరింతమందికి మేలు కలిగిస్తుంది.



- కవితారెడ్డి, ఆక్వా ఫిట్ శిక్షకురాలు



ట్రైబల్ ఆర్ట్ - క్రాఫ్ట్ సమ్మర్ క్యాంప్

సాక్షి,సిటీబ్యూరో : గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల కోసం ట్రైబల్ ఆర్ట్ – క్రాఫ్ట్ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 28 నుండి మే 7 వరకూ ఉదయం సెషన్‌లో 60 మంది విద్యార్థులకు, సాయంత్రం సెషన్‌లో 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మాసబ్ ట్యాంక్‌లోని టీఆర్‌ఐ, డీఎస్ఎస్ భవనాల్లో కోయ పెయింటింగ్, బంజారా క్రాఫ్ట్, నగల తయారీ, నాయక్పోడ్ మాస్కులు, కోలం వెదురు చేతిపనుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా గిరిజన మ్యూజియం సందర్శన, డాక్యుమెంటరీ ఫిల్మ్ షో ఉంటుందని, పాల్గొనే విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు రూ.1350 చొప్పున గూగుల్ పే లేదా ఫోన్ పే నం.94909 57078లో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి స్క్రీన్ షాట్ జతచేయాలన్నారు. సమగ్ర వివరాలకు అసిస్టెంట్ క్యూరేటర్, గిరిజన మ్యూజియం 92905 13990 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ నెల 26తో రిజిస్ట్రేషన్ కోసం గడువు ముగుస్తుందన్నారు.

అబ్బురపరిచే డిజైన్ సింక్

- ప్రదర్శనలో చేతివృత్తి కళాకారుల ఉత్పత్తులు
- ఐదు రోజులపాటు కొనసాగనున్న ఫెస్ట్
- రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ 'వార్షిక అకడమిక్ ఫెస్ట్'
- వృత్తిదారులు, విద్యార్థుల సృజనాత్మకతను చాటుతున్న ప్రదర్శన



విద్యార్థులు, కళాకారుల (ఆర్టిజాన్స్)లోని సృజనాత్మకత, వారి ఆవిష్కరణలు, ప్రతిభను చాటడానికి ఉద్దేశించిన ప్రత్యేక కార్యక్రమం. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్ మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్ క్యాంపస్‌లో 'డిజైన్ సింక్' పేరిట ఐదు రోజులపాటు నిర్వహించే కార్యక్రమం సోమవారం మొదలైంది. ఎఫ్‌డీడీఐలోని స్కూల్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్, స్కూల్ ఆఫ్ ఫుట్‌వేర్ డిజైన్, స్కూల్ ఆఫ్ రిటైల్ ఫ్యాషన్ మర్చెండైజ్, స్కూల్ ఆఫ్ లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ పర్యవేక్షణలో ఈ 'డిజైన్ సింక్' ఏర్పాటు చేశారు. - రాయదుర్గం



ఈ ప్రదర్శనలో ప్రముఖ చేరియాల్ పేయింటింగ్ కళాకారుడు ధనల కోటరాకేష్, బనానా ఫైబర్ వీవింగ్ కళాకారుడు అనకప్వూర్ జ్యూట్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీ శేఖర్, బాటిక్ పెయింటింగ్‌లో ప్రతిష్టాత్మక అవార్డుల గ్రహీత సీ ప్రకాశ్, సిల్వర్ ఫిలిగ్రీ కళాకారుడు రామోజు చిరంజీవి, ప్రముఖ ఏటికొప్పాక బొమ్మల కళాకారుడు పీ నాగేశ్వరరావు, కొల్హాపురి చెప్పుల తయారీ కళాకారుడు కామల్‌శెట్టి యాదిలాల్, టెక్స్‌టైల్స్ డిజైన్‌లో గ్రాడ్యుయేట్, బాటిక్ క్రాఫ్ట్ కళాకారుడు కృష్ణ ఎం.కొల్లి, పోచంపల్లి హ్యాండ్లూమ్ వీవింగ్ కళాకారుడు నర్సింహ్మ, నాచురల్ డైయింగ్ కళాకారుడు దుద్యాల శంకర్‌తోపాటు వివిధ రకాల బ్యాగులు, వివిధ రకాల చిత్రాలు, చేరియాల్ పెయింటింగులు, టోపీలు, జూట్‌తో తయారు చేసిన ఇతర వస్తువులు అమ్మకానికి ఉంచారు. వీటిని సందర్శించిన విద్యార్థులు వాటి తయారీ విధానాన్ని ఆసక్తిగా తెలుసుకున్నారు.

సిల్వర్ ఫిలిగ్రీపై అవగాహన..



తాత, నాన్న నుంచి అబ్బిన కళ సిల్వర్ ఫిలిగ్రీ. దీని ద్వారా తయారు చేసిన సంప్రదాయ వెండి, మెటల్ తయారీ ఉత్పత్తులపై అవగాహన కల్పించడమే లక్ష్యం. దీనికి ఎఫ్‌డీడీఐవారు అవకాశం కల్పించారు. ప్రభుత్వం నుంచి ఇలాంటి ప్రోత్సాహకాలు ఉత్సాహాన్నిస్తాయి. ప్రపంచంలోనే అతిపెద్ద వెండి ఫిలిగ్రీ విగ్రహాన్ని రూపొందించి వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్–2018 సాధించడం సంతోషానిచ్చింది.

- రామోజు చిరంజీవి, సిల్వర్ ఫిలిగ్రీ కళాకారుడు

కళలను ప్రోత్సహించడమే ఎఫ్‌డీడీఐ లక్ష్యం..



కళాకారులను, కళలను ప్రోత్సహించడమే ఎఫ్‌డీడీఐ లక్ష్యం. తమ కళను నలుగురికీ వివరించేలా చేయడమే 'డిజైన్ సింక్' ప్రదర్శన లక్ష్యం. ఐదు రోజులపాటు వివిధ రకాల కళలను, ఉత్పత్తులను ప్రదర్శనలో ఏర్పాటు చేశాం. చర్మకారులకు గతంలో 15 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేసి వారిలో నైపుణ్యాలు మెరుగుపరిచాం. ప్రదర్శనకు స్పందన బాగుంది. - నర్సింహుగారి తేజ్‌లోహిత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎఫ్‌డీడీఐ హైదరాబాద్

పురాతన కళలకు పునరుజ్జీవం..



స్వయంగా కళాకారుడిని. దీనికితోడు ఎఫ్‌డీడీఐలో ఫ్యాకల్టీగా పనిచేయడం సంతోషంగా ఉంది. చేతి వృత్తిదారులు తామలోని నైపుణ్యాన్ని ముందు తరాల వారికి అందించాలి. ఓ రకంగా ఇలాంటి ప్రదర్శనలు పురాతన కళలకు పునరుజ్జీవాన్ని అందిస్తాయి.

- డాక్టర్ రాంబాబు, ఫ్యాకల్టీ, కళాకారుడు



- ఫ్యాన్సీ నెంబర్లకు మార్కెట్లో డిమాండ్
- అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన ప్రారంభం

క్రేజీ.. కరెన్సీ నెంబర్లు..

చార్మినార్ : ఆర్టీఏ ఫ్యాన్సీ నెంబర్ల మాదిరిగానే.. కరెన్సీ నోట్ల ఫ్యాన్సీ నెంబర్లకూ ప్రజల్లో క్రేజ్ ఉంది. కేవలం క్రేజ్ మాత్రమే కాదు.. ప్రత్యేకంగా ఉన్న ఫ్యాన్సీ నెంబర్లకు గణనీయమైన ఆఫర్లు.. రేట్లు ఉన్నాయి. బహిరంగ మార్కెట్లో వీటికి ఖరీదు ఎక్కువ. పాతబస్తీ మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో అంతర్జాతీయ పురాతన నాణేలు, కరెన్సీ ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమైంది. పది లక్షల నోట్లలో ఒకటి, రెండు ఫ్యాన్సీ నోట్లు ఉంటాయని.. ఇవి అరుదుగా లభిస్తుండడంతో మార్కెట్లో డిమాండ్ ఉందన్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే 000786, 786786 నెంబర్లతో పాటు 444444, 666666 నెంబర్లకు భారీ డిమాండ్ ఉందన్నారు. వీటి ఖరీదు వేలల్లో ఉందని, ఏపీజే అబ్దుల్ కలాం ఆజాద్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 23 వరకూ కొనసాగనుందని తెలిపారు. తమ వద్ద పురాతన నాణేలు, కరెన్సీని ఎగ్జిబిషన్‌లో విక్రయించవచ్చని.. అదే విధంగా ఖరీదు చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు.

నోరూరించే.. మ్యాడ్ ఓవర్ డోనట్స్



గచ్చిబౌలి: డోనట్స్ ప్రియులకు 24 రకాల ఎగ్‌లెస్ డోనట్స్ అందుబాటులోకి వచ్చాయి. సోమవారం కొత్తగూడలోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్‌లో మ్యాడ్ ఓవర్ డోనట్స్ స్టోర్‌ను ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ తారక్ భట్టాచార్య ప్రారంభించారు. దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన డోనట్లలో మ్యాడ్ ఓవర్ డోనట్స్ (ఎంఓడీ) ఒకటి. బబుల్‌టీ, బ్రెనీలు, బైట్స్‌తో పాటు చేతితో తయారు చేసిన 24 రకాల ఎగ్‌లెస్ డోనట్‌లను రుచి చూడవచ్చు. పుట్టిన రోజులు, ప్రమోషన్‌లు, స్నేహితుల కలయికకు ఎంఓడీ వేదిక కానుంది. సర్కిల్ ఆఫ్ హ్యాపీనెస్‌లో చేరడానికి ఆహ్వానిస్తున్నట్లు తారక్ భట్టాచార్య ప్రకటించారు.

శ్రీలంక తలమన్నార్ నుంచి ధనుష్కోడి వరకూ రిలే స్విమ్

స్విమ్మింగ్‌లో రికార్డు నెలకొల్పిన తల్లీ కొడుకు



కాచిగూడ: డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, శాంతిని కాపాడాలని పేర్కొంటూ బర్కత్‌పురాకు చెందిన అంతర్జాతీయ స్విమ్మర్ గంధం క్వీనీ విక్టోరియా, అమె కుమారుడు స్టీఫెన్ కుమార్ శ్రీలంక తలమన్నార్ నుంచి తమిళనాడులోని రామేశ్వరం ధనుష్కోడి వరకూ రిలే స్విమ్మింగ్ చేసి సరికొత్త రికార్డు నెలకొల్పారు. తల్లీ, కుమారుడితో పాటు మరో ముగ్గురు బెంగళూరుకు చెందిన మోహన్‌రావు, ఆశ, రఘులతో కూడిన బృందం ఈ రిలే స్విమ్మింగ్ చేశారు. ఆదివారం ఉదయం 5:30 గంటలకు శ్రీలంక తలమన్నార్ నుంచి ఈ రిలే స్విమ్మింగ్ ప్రారంభించి 32.5 కిలోమీటర్ల దూరంలోని తమిళనాడు రామేశ్వరం ధనుష్కోడి వరకూ 9 గంటల 35 నిమిషాల వ్యవధిలో స్విమ్మింగ్ చేసి రికార్డు నెలకొల్పారు. ఈ ఐదుగురి బృందం ధనుష్కోడికి ఆదివారం సాయంత్రం 3.25 నిమిషాలకు చేరుకున్నారు. ఇండియన్ స్విమ్మింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు సతీష్ మట్ట సారథ్యంలో ఈ స్విమ్మింగ్ నిర్వహించగా విజయకుమార్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. సప్త సముద్రాలను ఈదడమే తమ లక్ష్యమని క్వీనీ విక్టోరియా వెల్లడించారు.

పసిడి... పరుగే పరుగు!

బంగారం అంటే సంపద. కుటుంబానికి ఆర్థిక భరోసా. అభివృద్ధికి సూచిక. కష్టకాలంలో తోడుంటుందన్న ఓ నమ్మకం. సామాన్యుడైనా, సంపన్నుడైనా తన కష్టార్జితంలో ఎంతో కొంత బంగారం రూపంలో పొదుపు చేసుకోవడం, పెట్టుబడిగా దాచుకోవడం అనాదిగా వస్తోంది. ఆడపిల్ల ఇంట్లో ఉందంటే బిడ్డ భవిష్యత్, పెళ్లి కోసం బంగారం కూడబెట్టడం భారతీయ కుటుంబాల్లో తొలి ప్రాధాన్యత. అంతేనా.. పండగైనా, వేడుకైనా నలుగురిలో ఆభరణాలు జిగేల్‌మనాల్సిందే. స్థాయిని చూపించుకోవడానికీ ఒక సాధనమైంది. తరతరాలుగా కుటుంబంలో భాగమైన ఈ పుత్తడి ఇప్పుడు అందనంత దూరం పరుగెడుతోంది. బంగారం ఇప్పుడు ప్రియమైంది. అందరూ ఊహించినట్టుగానే 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ ధర పన్నులు కలుపుకొని రూ.లక్ష దాటింది. ఈ పరుగు ఇప్పట్లో ఆగదంటోంది బులియన్ మార్కెట్. పరిస్థితులూ ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. మరోవైపు ధరలు అమాంతం పెరగడంతో భారతీయ వినియోగ దారులు వివాహాలు, ఇతర శుభకార్యాలకు గతంతో పోలిస్తే ఆచితూచి బంగారు ఆభరణాలను కొనుగోలు చేస్తున్నట్లు బంగారు వర్తకులు చెబుతున్నారు. అయితే ఆభరణాలతో పోలిస్తే బంగారు కడ్డీలు, నాణేల కొనుగోలుకే వినియోగదారులు మొగ్గుచూపుతున్నారని అంటున్నారు.



\- నూగూరి మహేందర్

ఎందుకీ పరిస్థితి?

ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు అంతర్జాతీయ పరిణామాలు బంగారానికి చుట్టుకున్నాయి. డాలర్ విలువ పడిపోవడం, అమెరికా–చైనా మధ్య సాగుతున్న వాణిజ్య యుద్ధం మరింత ముదిరి ఆర్థిక మాంద్యం భయాలు రేకెత్తించడంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు అమెరికా డాలర్ విలువ తగ్గింది. అమెరికా ట్రెజరీలు భారీగా అమ్ముడుపోతున్నాయి. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేటు తగ్గింపు అంచనాలు, భౌగోళిక రాజకీయ అస్థిరతలు, బంగారం ఆధారిత ఈటీఎఫ్‌లలో పెట్టుబడుల ప్రవాహం పెరుగుదల కూడా 2025లో పుత్తడి ర్యాలీకి మద్దతిచ్చాయి.

గరిష్టాలూ గరిష్టమే..

పసిడి 2024లో 40కిపైగా సందర్భాల్లో ఆల్‌టైమ్ హై ధర నమోదు చేసింది. 2025లో 23 సార్లు గరిష్టాలను తాకింది. దీంతో గరిష్టాలు గరిష్ఠ స్థాయిలో నమోదు కావడం విశేషం. ఔన్స్ ధర 2,650 డాలర్లతో 2025 సంవత్సరం ప్రారంభమైంది. సంప్రదాయ పరిణామాలకు విరుద్ధంగా 2024లో డాలర్ ఇండెక్స్ పెరిగి ఈక్విటీ మార్కెట్లు బాగా పనిచేసినప్పటికీ బంగారం ధర దాదాపు 28% అధికం కావడం గమనార్హం. అమెరికా డాలర్, భారత రూపాయి, చైనీస్ యువాన్, జపనీస్ యెన్, యూరో, బ్రిటిష్ పౌండ్, కెనడియన్ డాలర్, ఆస్ట్రేలియన్ డాలర్ సహా అన్ని ప్రధాన కరెన్సీలలో బంగారం ఆల్ టైమ్ గరిష్టాలను తాకింది. అంతర్జాతీయంగా ఔన్స్ (31.1 గ్రాములు) బంగారం ధర 2025 మార్చి 14న 3,000 డాలర్లు తాకి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఔన్స్ పసిడి రేటు 2,500 డాలర్ల నుంచి 3,000 డాలర్లకు చేరుకోవడానికి కేవలం 210 రోజులు పట్టింది. గత రికార్డులు చూస్తే బంగారం ధర 500 డాలర్లు పెరగడానికి సగటున 1,708 రోజుల సమయం తీసుకుంది.

రూపాయి బలపడటంతో ఉపశమనమే..

డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఈ ఏడాది ఫిబ్రవరి 10న రూ.87.95 తాకి ఆల్ టైమ్ గరిష్టం నమోదు చేసింది. రూపాయి అదే స్థాయిలో ఉన్నా, మరింత బలహీనపడ్డా భారత్‌లో ఈపాటికే గోల్డ్ రేట్ రూ.లక్ష దాటేది. కొద్ది రోజులుగా డాలర్ మారకంతో పోలిస్తే రూపాయి బలపడుతుండటం కాస్త ఉపశమనం కలిగించే అంశం. సోమవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.85.38గా నమోదైంది. ఇక 2025 జనవరి 1న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.78 వేలకు అటుఇటుగా పలికింది. సరిగ్గా 100 ఏళ్ల క్రితం ధర రూ.18.75 మాత్రమే.

ప్రత్యామ్నాయం వైపు కొనుగోలుదారుల చూపు..

సంప్రదాయంగా భారతీయ కొనుగోలుదారులు పెట్టుబడికి విలువ, ఆకట్టుకునేలా ఉండేలా 22 క్యారెట్లతో తయారైన బంగారు ఆభరణాలను ఇష్టపడతారు. అయితే పెరుగుతున్న ధరలు వారిని ప్రత్యామ్నాయాలను అన్వేషించేలా చేశాయి. ఆకర్షించే రూపు, సరసమైన ధర రెండింటినీ అందించే క్లిష్ట, తేలికైన డిజైన్లను ఎక్కువగా ఎంచుకుంటున్నారు. దీంతో 18, 14 క్యారట్ల ఆభరణాలు ఇప్పుడు ప్రజాదరణ పొందుతున్నాయి. తక్కువ బరువుతో సంప్రదాయ డిజైన్లను ఆభరణాల తయారీదారులు రూపొందించడానికి తయారీ సాంకేతికతలో వచ్చిన పురోగతి వీలు కల్పించిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తెలిపింది. 22 క్యారెట్లతో తయారు చేసిన ఆభరణాల్లో 91.67% స్వచ్ఛమైన బంగారం ఉంటుంది. 18 క్యారెట్లు అయితే 75% స్వచ్ఛమైన బంగారం, 25% ఇతర లోహాలు ఉంటాయి. 22 క్యారెట్ల బంగారంతో పోలిస్తే 18 క్యారెట్లతో తయారైన ఆభరణం ధర దాదాపు ఐదో వంతు తక్కువగా ఉంటుంది. తక్కువ ధర, ఎక్కువ మన్నిక కారణంగా 18 క్యారెట్ల ఆభరణాలకు డిమాండ్ క్రమంగా ఊపందుకుంది. మొత్తం అమ్మకాల్లో వీటి వాటా రెండేళ్ల క్రితం కేవలం 5–7% ఉండగా ఇప్పుడు 15% కంటే ఎక్కువగా పెరిగిందని ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వెల్లడించింది.

ఆభరణాల్లో మనమే ఫస్ట్..

భారత్‌లో ఏటా 10 లక్షలకుగా వివాహాలు జరుగుతున్నాయి. పెళ్లిళ్లకే ఏటా 300–400 టన్నుల పసిడి అమ్ముడవుతుందని కళ్యాణ్ జువెల్లర్స్ అంటోంది. దీపావళి, అక్షయ తృతీయ వంటి శుభదినాల్లో హిందువులు పసిడిని కొనుక్కుంటున్నారు. చైనాలోనూ అంతే. పెళ్లిళ్లు, బిడ్డ పుట్టిన నెలరోజులకు జరిపే వేడుక, ఇతర ముఖ్య సందర్భాల్లో ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు. చైనాలో అత్యధికులు టియోచు సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారు. దీని ప్రకారం వరుడి కుటుంబం వధువు కోసం నెక్లెస్, గాజులు, చెవి కమ్మలు, ఉంగరాన్ని కొనుగోలు చేస్తారు. చైనాను మించి ప్రపంచంలో అత్యధికంగా 2024లో భారతీయ వినియోగదార్లు 560 టన్నుల ఆభరణాలను అందుకున్నారు. 510 టన్నులతో చైనా రెండవ స్థానంలో ఉంది. గత ఏడాది భారతీయులు 240 టన్నుల గోల్డ్ బార్స్, కాయిన్స్‌ను కొనుగోలు చేస్తే చైనా వాసుల విషయంలో ఇది 345 టన్నులు ఉంది.



పెట్టుబడిగా బంగారం..

సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లను మినహాయిస్తే ప్రపంచ పసిడి డిమాండ్‌లో ఇండోనేసియా, వియత్నాం సహా ఆసియా వాటా ఏకంగా 64.5 శాతానికి చేరుకుంది. అయితే పెట్టుబడి స్వేచ్ఛ సూచికలో ఆసియా దేశాలు ప్రధానంగా భారత్, చైనా పేలవంగా ఉన్నాయి. భారతీయ కుటుంబాల్లో 6 శాతం కంటే తక్కువ సంపద ఈక్విటీల్లో, 15 శాతం బంగారంలో పెట్టుబడి పెడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ నెమ్మదించడంతో చైనీయులు బంగారం వైపు ఆకర్షితులవుతున్నారు. ఏటా 1–2 శాతం వడ్డీ ఇచ్చే డిపాజిట్లకు బదులు చైనీయులు చిన్నమొత్తంలో పసిడిని దక్కించుకుంటున్నారు. సెంట్రల్ బ్యాంక్ బాటలో పెట్టుబడిగా ముడి బంగారాన్ని కొంటున్నారు.




ఎగుమతులు డీలా..

భారత్ నుంచి 2024–25లో రత్నాలు, ఆభరణాల ఎగుమతులు 11.72 శాతం క్షీణించి రూ. 2,43,390 కోట్లకు చేరాయి. అలాగే దిగుమతులు 11.96 శాతం తగ్గి రూ.1,67,384 కోట్లుగా ఉన్నాయి. యూఎస్, చైనా మార్కెట్లు నిదానించడం, ప్రపంచంలో పలు ప్రాంతాల్లో యుద్ధాలు, రష్యా తవ్విన వజ్రాలపై ఆంక్షలు, చవకగా లభించే ల్యాబ్ తయారీ వజ్రాలు వెరసి రెండేళ్లుగా దేశం నుంచి ఎగుమతులు తగ్గడానికి కారణం అయ్యాయి. విదేశాలకు సరఫరా అయిన రత్నాలు, ఆభరణాల్లో యూఎస్ వాటా ఏకంగా 30.4 శాతం ఉంది. అయితే అమెరికా భారీ సుంకాలను ప్రకటించిన తర్వాత ఎగుమతుల్లో భారీగా తగ్గుదల ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ రంగంలో అతిపెద్ద మార్కెట్‌ను ప్రభావితం చేసే కొత్త సుంకాలు.. డైమండ్ కటింగ్, ఆభరణాల తయారీలో ప్రపంచంలో ముందంజలో ఉన్న భారత్ తన స్థానాన్ని నిలబెట్టుకునే సామర్థ్యాన్ని అడ్డుకుంటాయని భావిస్తున్నారు.

ఎస్‌జీబీల మాటేమిటి?

భారత్‌లో సావరిన్ గోల్డ్ బాండ్ పథకం (ఎస్‌జీబీ) 2015 నవంబర్‌లో ప్రారంభం అయింది. పథకంలో భాగంగా మొత్తం 67 విడతలుగా 146.96 టన్నుల గోల్డ్ బాండ్స్ జారీ అయ్యాయి. ప్రస్తుత ధరల వద్ద బకాయి ఉన్న సావరిన్ గోల్డ్ బాండ్లను రిడీమ్ చేయాలంటే ప్రభుత్వం సుమారు రూ. 1.3 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం 7 విడతల బాండ్లను పూర్తిగా తిరిగి చెల్లించింది. 8వ విడతకు ముందస్తు రిడెమ్షన్ కూడా ఆఫర్ చేసింది. తుది చెల్లింపు 2032 ఫిబ్రవరిలో జరగనుంది. పెరుగుతున్న బాధ్యతను సమతౌల్యం చేయడానికి ప్రభుత్వం గోల్డ్ రిజర్వ్ ఫండ్ (జీఆర్‌ఎఫ్)ను సృష్టించింది. 2023–24లో ఈ నిధిలో రూ. 3,552 కోట్లు జమ చేసింది. దీన్ని 2024–25 సవరించిన బడ్జెట్‌లో రూ. 28,605 కోట్లకు పెంచింది. గోల్డ్ బాండ్స్ కింద ఇన్వెస్టర్లకు 2024–25 చివరి నాటికి చెల్లించాల్సిన మొత్తం రూ. 85,000 కోట్లకు చేరుకుంటుందని 2024 జూలై మధ్యంతర బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం తెలిపింది. పసిడి దిగుమతులను తగ్గించాలన్న లక్ష్యంతో కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఆశించిన ప్రయోజనం లేకపోగా దూసుకుపోతున్న పుత్తడి ధరలతో ఖజానాపై ఆర్థిక భారం పడింది. దీంతో పథకాన్ని రద్దు చేయాల్సి వచ్చింది.

అందం, గుర్తింపు వ్యక్తీకరణ..



సందీప్ కోహ్లీ
సీఈవో, ఇంద్రియ, ఆదిత్య బిర్లా జువెలరీ

రత్నాలు, ఆభరణాల పరిశ్రమ భారత జీడీపీకి 7% సమకూరుస్తోంది. ఈ రంగం లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ మార్కెట్ విలువ దేశంలో సుమారు రూ.6,82,960–7,25,645 కోట్లు ఉంది. 2035 నాటికి ఇది రూ.19,20,825 కోట్లకు చేరుకుంటుందని అంచనా. సంప్రదాయికంగా ఆభరణాలు ఒక పెట్టుబడి. ఇప్పుడు ఇది అందం, గుర్తింపు వ్యక్తీకరణ. ఈ మార్పు అన్ని వయసుల వారికీ వర్తిస్తుంది. భిన్న డిజైన్లు కోరుకుంటున్నప్పటికీ యువ వినియోగదారులు ఆభరణాలపట్ల మొగ్గు చూపుతున్నారు.

బంగారం ముచ్చట్లు..

73 ఇప్పటివరకు వెలికితీసిన బంగారాన్ని ఒకచోట చేర్చితే.. 73 అడుగుల ఎత్తు, మందం, వెడల్పుతో ఒక దిమ్మెను తయారు చేయవచ్చు.

- ✓ ప్రపంచంలో ఉన్న పుత్తడిని 5 మైక్రాన్ల మందంగల తీగలా మార్చితే ప్రపంచాన్ని 1.12 కోట్ల సార్లు చుట్టివచ్చు.
- ✓ ఒక ఔన్స్ (31.1 గ్రాములు) బంగారాన్ని 50 మైళ్ల పొడవు వరకు సాగదీయవచ్చు
- ✓ మహాసముద్రాల్లో 15,000 టన్నుల వరకు బంగారు నిక్షేపాలు ఉన్నాయని అంచనా.
- ✓ బంగారం 2,808 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద మరుగుతుంది. 1,064 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద కరుగుతుంది.
- ✓ ఐదు క్యారెట్ల వజ్రం కంటే ఒక ఔన్స్ బంగారు దొరకడం చాలా అరుదు.
- ✓ అందుబాటులో ఉన్న బంగారంలో మూడింట ఒక వంతు 1950 సంవత్సరం తరువాత వెలికి తీసిందే.
- ✓ పారిశ్రామిక అవసరాలకు వాడే పుత్తడిలో 80 శాతం ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉపయోగిస్తున్నారు.

ప్రపంచ బంగారు నిక్షేపాలలో 10% మాత్రమే తదుపరి అభివృద్ధికి తగిన పసిడిని కలిగి ఉన్నాయి.

నిక్షేపాలు ఉన్నా భారత్‌లో బంగారం ఉత్పత్తి అంతంత మాత్రమే. 2022లో కేవలం ఒక టన్ను మాత్రమే ఉత్పత్తి అయింది.

2025లో పుత్తడి (ఔన్స్) ధరపై బ్యాంకుల అంచనాలు (డాలర్లలో)

డాయిష బ్యాంక్	3,139-3,700
హెచ్‌ఎస్‌బీసీ	3,015
ఏఎన్‌జెడ్	3,200
గోల్డ్‌మన్ సాక్స్	3,700-4,500
యూబీఎస్	3,200
బ్యాంక్ ఆఫ్ అమెరికా	3,350
జేపీ మోర్గాన్	3,000
సిటీ బ్యాంక్	3,500
డీవీర్ గ్రూప్	3,300-4,500
స్విస్ ఏషియా క్యాపిటల్ (2028కి)	8,000



ప్రపంచవ్యాప్తంగా 2024కి పసిడి వినియోగం ఇలా (టన్నుల్లో)

అమ్ముడైన మొత్తం పుత్తడి **2,16,265**

సెంట్రల్ బ్యాంక్స్ **37,755** (17%)

జువెలరీ **97,149** (45%)

ఇతర వినియోగం - **32,727** (15%)

బార్స్, కాయిన్స్ (ఈటీఎఫ్‌లు సహా) - **48,634** (22%)

సంవత్సరం	ధర
1925	రూ. 18.75
1935	రూ. 30.81
1945	రూ. 62.00
1955	రూ. 79.18
1965	రూ. 71.75
1975	రూ. 540
1985	రూ. 2,130
1995	రూ. 4,680
2005	రూ. 7,000
2010	రూ. 18,500
2015	రూ. 26,343
2020	రూ. 48,651
2025	రూ.లక్ష



సతీష్
కోటక్ మహీంద్రా ఏఎంసీ ఫండ్ మేనేజర్

వాణిజ్య ఉద్రిక్తతలకుతోడు వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు, భౌగోళిక అనిశ్చితులు, డాలర్ బలహీనపడడం బంగారం, వెండి ధరల పెరుగుదలకు మద్దతునిచ్చాయి. ఈ ఏడాది బంగారం ఇప్పటికే 25 శాతానికి పైగా పెరిగింది. ఏప్రిల్ 2 సుంకాలపై ప్రకటన తర్వాత నుంచి చూసినా 6 శాతం పెరిగింది.



ఈటీఎఫ్ ఇన్వెస్టర్ల నుంచి కొనుగోళ్ల డిమాండ్ పెరిగింది. భారత్‌లో రానున్న పండుగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని చూస్తే బంగారానికి అదనపు మద్దతు లభించనుంది. సుంకాలకు సంబంధించి అనిశ్చితి, యూఎస్ డాలర్ బలహీనత, ట్రెజరీ ఈల్డ్స్ పెరుగుతుండడం బంగారం ధరల ర్యాలీకి తోడ్పడుతోంది.

\- జేఎం ఫైనాన్షియల్ కమోడిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మెర్

బంగారం ధర పెరుగుదలకు నిపుణులు చెబుతున్న కారణాలు..

..: వాణిజ్య సుంకాలు :..
సుంకాల కారణంగా ప్రపంచ మార్కెట్లు తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొంటున్నాయి. ట్రంప్ ప్రకటించిన 90 రోజుల విరామం, ఆ తర్వాత ఏవైనా పరిణామాలు బంగారాన్ని సురక్షిత స్వర్గధామంగా ఆకర్షణీయంగా ఉంచుతాయి. అమెరికా–చైనా ప్రతీకార చర్యలు ఇప్పటికే స్వల్పకాలంలో డిమాండ్‌ను పెంచుతున్నాయి.

..: సెంట్రల్ బ్యాంక్స్ కొనుగోళ్లు :..
కేంద్ర బ్యాంకులు దశాబ్దాలుగా స్థిరంగా బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. మూడేళ్లలో ఇవి ఏటా 1,000 టన్నులకుపైగా సమకూర్చుకున్నాయి. మార్చి 2025లో వరుసగా 5వ నెలలోనూ చైనా బలమైన బంగారం కొనుగోళ్లను నివేదించింది.

..: స్టాగ్‌ఫ్లేషన్ ఆందోళనలు :..
తాజా యూఎస్ ఫెడ్ పాలసీ మినిట్స్ ఆ దేశ ఆర్థిక వ్యవస్థ స్టాగ్‌ఫ్లేషన్ వైపు మళ్లవచ్చనే ఆందోళనలను సూచిస్తున్నాయి. అధిక ద్రవ్యోల్బణం, తక్కువ ఆర్థిక వృద్ధి, అధిక నిరుద్యోగితను స్టాగ్‌ఫ్లేషన్ అంటారు. ఇటువంటి పరిస్థితుల్లో బంగారం మెరుగైన పనితీరు కనబరుస్తుంది.

..: చైనా ఈటీఎఫ్ పెట్టుబడులు :..
చైనా గోల్డ్ ఈటీఎఫ్‌లలో రికార్డు స్థాయిలో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెల్లువెత్తాయి. 2025లోనూ కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. 2024 నుంచి అంతర్జాతీయంగా ఈటీఎఫ్ పెట్టుబడులు పెరుగుతున్నాయి.

..: ఫెడ్ రేటు కోతలు :..
యూఎస్ ఫెడరల్ రిజర్వ్ 2025లో మరో రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉంది. ఇది బంగారం ధరల పెరుగుదలకు మద్దతు ఇస్తుంది.

..: స్థిరమైన పనితీరు :..
2000 నుంచి 2025 వరకు బంగారం రెండుసార్లు మినహా అన్ని సందర్భాల్లోనూ అనుకూల రాబడిని అందించింది.

..: భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు :..
రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నుంచి ఇజ్రాయెల్–హమాస్ కాల్పుల విరమణ పతనం, ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న రాజకీయ అశాంతి వరకు భౌగోళిక రాజకీయ అనిశ్చితి బంగారం డిమాండ్‌ను కొనసాగిస్తున్నాయి.

..: కరెన్సీ హెచ్చుతగ్గులు :..
డాలర్ సూచిక మూడేళ్ల కనిష్ఠ స్థాయిలో ట్రేడవుతోంది. స్విస్ ఫ్రాంక్, జపనీస్ యెన్, యూరోలతో పోలిస్తే తీవ్ర నష్టాల్లో ఉంది. ఈ కరెన్సీలలో బంగారం చౌకగా మారింది.

..: పెరుగుతున్న రుణ స్థాయిలు :..
2024 నవంబర్‌లో యూఎస్ జాతీయ రుణం రికార్డు స్థాయిలో 36 ట్రిలియన్ డాలర్లు దాటింది. ఈ రుణాన్ని ఎలా నిర్వహిస్తారనే దానిపై పెరుగుతున్న ఆందోళనలతో బంగారం సహజ హెడ్జ్‌గా మారింది. ప్రపంచ రుణం కూడా పెరిగింది.


..: మార్కెట్ అస్థిరత :..
2025లో ఇప్పటివరకు ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ఉన్నాయి. అస్థిరత పెరిగింది. పెట్టుబడిదారుల పోర్ట్‌ఫోలియోలు దెబ్బతిన్నాయి.

వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనాలు.. నిక్షేపాలు **54,770** టన్నులు | వనరులు **1,32,110** టన్నులు

వినియోగంలో మనం ఎక్కడంటే..

- ➤ 2024 నాటికి భారతీయుల వద్ద పుత్తడి నిల్వలు - 25,000 టన్నులు
- ➤ ప్రపంచ మొత్తం పరిమాణంలో భారతీయుల వద్ద ఉన్న పసిడి - 11.56 శాతం
- ➤ యూఎస్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, చైనా, స్విట్జర్లాండ్, భారత్, జపాన్, తుర్కియే దేశాల సెంట్రల్ బ్యాంకుల వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వలను మించి భారతీయుల వద్ద పసిడి ఉంది.






13

సాక్షి ఫ్యామిలీ

హైదరాబాద్

మంగళవారం ॥ 22-4-2025



2025 ఎర్త్‌డే పోస్టర్

నేడు ఎర్త్ డే

భూమాత భద్రంగా...

నేడు ఎర్త్ డే ఉమెన్స్ సమ్మిట్



'ఎర్త్ డే ఉమెన్స్ సమ్మిట్-2025' ఈరోజు అమెరికాలోని డల్లాస్‌లో జరుగుతుంది. వాతావరణ మార్పులను పరిష్కరించడానికి మహిళల ఆలోచనలు, సృజనాత్మక పరిష్కారాలకు ఈ సమ్మిట్ వేదిక కానుంది. 'నాయకత్వ స్థాయిలో మహిళలు ఉండడం వల్ల సమాజం, ఆర్థిక వ్యవస్థ, పర్యావరణంలో మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి' అంటున్నారు గ్లోబల్ గ్రీన్ సిఇవో విలియం బ్రిస్ట్. వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించడానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వ, వ్యాపార, పౌర సమాజ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారు.

ఈరోజు వరల్డ్ ఎర్త్ డే. మదర్ ఎర్త్‌ను పరిరక్షించాలని అందరికీ ఉంటుంది. అయితే వ్యక్తులుగా మనం ఏం చేయాలనే సందేహానికి సమాధానం ఉండదు. ఆ సందేహానికి సమాధానాలు వీళ్లంతా. లీలాలక్ష్మారెడ్డి రీ ఫారెస్టేషన్ ద్వారా గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఎదురైన గ్రీన్ హౌస్ గ్యాసెస్ విడుదలను నియంత్రిస్తున్నారు. అంకారావు గ్లోబల్ క్లీనప్ కాన్సెప్ట్‌లో అడవులను కాపాడుతూ ప్లాస్టిక్ కారణంగా ఎదురయ్యే అనారోగ్యాల నుంచి వన్యప్రాణులను రక్షిస్తున్నారు. స్పందన ప్లాస్టిక్ వినియోగాన్ని నివారిస్తూ పవర్ వినియోగాన్ని తగ్గించడం, సస్టెయినబుల్ ఫ్యాషన్‌లో భాగంగా రీ యూజ్‌ని ప్రోత్సహిస్తూ కెరీర్‌ని పర్యావరణహితంగా మలుచుకున్నారు. చిన్నారి ఆరాధన సముద్రాల నుంచి ప్లాస్టిక్‌ని ఏరివేస్తూ సముద్రజీవుల సంరక్షణ కోసం పని చేస్తోంది. వీరంతా మన బతుకులు ఛిద్రం కాకుండా ఉండాలంటే భూమి భద్రంగా ఉండాలని చెబుతున్నారు భావి తరాలకు పరిశుభ్రమైన భూమిని అందించాలనే ప్రపంచ ఎర్త్‌డే లక్ష్యానికి మార్గదర్శనం చేస్తున్నారు.

భూగోళాన్ని కాపాడుదాం!

గ్లోబల్ ఎర్త్ డే 2025... 'అవర్ పవర్, అవర్ ప్లానెట్' థీమ్‌తో మన ముందుకు వచ్చింది. 'మనకు రకరకాల శక్తి వనరులున్నాయి. భూమికి హాని కలిగించకుండా భవిష్యత్తును నడిపించే ఇంధనం పునరుత్పాదక శక్తి మాత్రమే' అనే అంశాన్ని ప్రతిబింబించే పోస్టర్ తయారైంది. నిజానికి ఎర్త్ డే అంటే ఎర్త్ యాక్షన్ డే. భూమిని పరిరక్షించుకోవడానికి మనుషులుగా మనమంతా కార్యాచరణ చేపట్టాల్సిన రోజు. ఏటా ఏప్రిల్ 22వ తేదీన ఎర్త్‌డేని జరుపుకుంటున్నాం. 55 ఏళ్ల కిందట 1970లో యూఎస్‌లో మొదలైన ఈ ఎర్త్ డే నిర్వహణ క్రమంగా విస్తరించింది. ప్రస్తుతం 193 దేశాలు భూమిని పరిరక్షించే బాధ్యతలో పాలు పంచుకుంటున్నాయి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ప్రతి రోజూ ఎర్త్ డే!

సీజీఆర్ (కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్)ను పదిహేనేళ్ల కిందట ఎర్త్ డే రోజునే ప్రారంభించాం. అప్పటి నుంచి 13 లక్షల మంది ఎర్త్ లీడర్స్‌ను తయారు చేశాం. యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్ నిర్వహించడంలో మా ఉద్దేశం... కొత్త తరాలకు బాధ్యతాయుతమైన జీవనశైలిని అలవరచడమే. అలాగే ఈస్టర్న్ ఘాట్స్ కన్వర్జేషన్‌ను చేపట్టాం. ఎర్త్ డే అంటే ఏడాదికి ఒక రోజు మాట్లాడుకుని మరిచిపోవడం కాదు. ప్రతి రోజూ ఎర్త్ డేనే. పిల్లల పుట్టిన రోజు ఏడాదికి ఒక రోజు చేస్తాం. మిగిలిన రోజుల్లో కూడా వాళ్లకు పోషకాహారం, అనారోగ్యం వస్తే వైద్యం చేయించడంతోపాటు వారి బాగోగులన్నీ చూసినట్లే ఇది కూడా. పిల్లల భవిష్యత్తు కోసం జీవితాలను అంకితం చేసే పేరెంట్స్‌కి కూడా వారి కోసం మంచి ఎన్విరాన్‌మెంట్‌ని అందించాలనే ధ్యాస ఉండడం లేదు. భూమిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఎవరికి వారు ఇది తమ ఒక్కరి బాధ్యత కాదన్నట్లు ఉంటున్నారు. మనకున్నది ఒక భూమి- ఒక కుటుంబం- ఒక భవిష్యత్. ఇవి బాగుండాలంటే వ్యక్తులుగా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. అప్పుడే భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన మదర్ ఎర్త్‌ని ఇవ్వగలుగుతాం.



- కోరుపోలు లీలా లక్ష్మారెడ్డి,
ప్రెసిడెంట్, సీజీఆర్

తొలకరి... మొక్కల పండగ!

ప్రకృతికి మనం ఏమిస్తే అది మనకు తిరిగి దానినే ఇస్తుంది. మంచి చేస్తే మంచినందుకుంటాం. చెడు చేస్తే ఆ పర్యవసానాలను చవి చూస్తాం. వందల ఏళ్ల వెనక్కు వెళ్తే మన గ్రామాల్లో పండుగకో చెట్టు నాటే అలవాటుండేది. మొక్కను ప్రేమించడం, పూజించడం మన సంస్కృతి. ఆ కల్చర్‌ని విసిరిపారేశాం. తిరిగి అదే డైలీ రొటీన్‌ని అక్కున చేర్చుకోవాల్సిన అవసరం వచ్చింది. అందుకే కోటి విత్తన బంతుల ఉద్యమం చేపట్టి విజయవంతంగా పూర్తి చేశాను. తొలకరి చినుకులు పడగానే మొక్క నాటడాన్ని అలవాటు చేసుకోవాలి. తొలకరిని మొక్కల వసంతంగా వేడుక చేసుకోవాలి.



- అంకారావు (జాజి) కొమ్మెర,
ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా

జెన్ జెడ్ ఎంటర్‌ప్రెన్యూర్

మేము మోడరన్ ఎనర్జీ మినిమమ్ థీమ్‌లో భాగమయ్యాం. పవర్ వినియోగాన్ని తగ్గించడానికి స్టోర్ కోసం గాలి వెలుతురు ధారాళంగా ప్రసరించే భవనాన్ని ఎంచుకున్నాం. పగలు లైట్, ఫ్యాన్ వేయాల్సిన అవసరమే ఉండదు. ప్లాస్టిక్ రహితంగా కూడా డిజైన్ చేశాం. క్యారీ బ్యాగ్‌ల విషయానికి వస్తే పేపర్ బ్యాగ్‌లు రీ యూజ్‌కి ఉపయోగపడడం లేదు. దాంతో నాన్‌ఓవన్ బ్యాగ్‌లు వాడుతున్నాం. సొసైటీలో ఎంత అవేర్‌నెస్ వచ్చిందంటే... మా కస్టమర్‌లు మా స్టోర్ వైపు నుంచే వెళ్లేటప్పుడు ఆ బ్యాగ్‌లను రీ యూజ్ కోసం తెచ్చిస్తున్నారు. ప్రైస్ ట్యాగ్‌కి దారం, నూలు, పేపర్‌లనే వాడుతాం. మంచినీటికి మాత్రం కొందరు కస్టమర్‌లు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్లనే అడుగుతున్నారు. ఇక మా దగ్గరకు వచ్చే క్లాత్ వేస్ట్‌ని రీ యూజ్ చేయడానికి రకరకాలుగా ఆలోచిస్తున్నాం. ఇంకా స్పష్టమైన రూపం రాలేదు. మా పార్టనర్స్ అనూష, అమృతలు కూడా ఎకో ఫ్రెండ్లీ లైఫ్ స్టయిల్‌ని గౌరవిస్తారు. కాబట్టి మా స్టోర్‌ని ఇలా యూనిక్‌గా తీసుకురాగలిగాం. ఒక మోడల్‌ని ఎవరో ఒకరు మొదలుపెడితే మిగిలిన వాళ్లు అందుకుంటారు. ఆ మొదటి అడుగు వేశాం.



- వి. స్పందన,
కో ఫౌండర్, లావెండర్ లేస్ – హౌస్ ఆఫ్ ఫ్యాషన్

ఎకో వారియర్

సేవ్ ఓషన్ ఇనిషియేటివ్‌లో భాగంగా పదేళ్ల తారాగై ఆరాధన 11.30 గంటలు నీటి లోపల ఉండి 1200 కిలోల ప్లాస్టిక్‌ని ఒడ్డుకు చేర్చింది. చెన్నైకి చెందిన ఆరాధన 'ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆఫ్ డైవింగ్ ఇన్‌స్ట్రక్టర్స్' సర్టిఫికేట్ పొందిన స్కూబా డైవర్. ఐదేళ్ల వయసులో డైవింగ్ మొదలు పెట్టిన ఆరాధన ఇప్పటి వరకు 30 వేల కిలోల ప్లాస్టిక్‌ని వెలికి తీసి సముద్రానికి ఊపిరిపోసింది. భూమండలంలోని అన్ని సముద్రాల్లో కలిపి యాభై ట్రిలియన్‌ల ప్లాస్టిక్ ముక్కలు ఉంటాయని అంచనా. ఇది ఇలాగే కొనసాగితే తీరం కోతకు గురవడంతోపాటు సముద్రాలు విస్తరించే ప్రమాదం పొంచి ఉంది. అంతేకాదు, 700 రకాల సముద్రజీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది కూడా. 'ప్లాస్టిక్ బ్యాగ్ ఇస్తున్న ప్రతి చోటా క్లాత్ బ్యాగ్ కావాలని అడగండి. మొదట మీ ఇంటిని ప్లాస్టిక్ ఫ్రీగా మార్చుకోండి. ఆ తర్వాత మీరు నివసిస్తున్న వీధిని మార్చండి. ఆ తర్వాత సముద్రాన్ని ప్రక్షాళన చేయండి' అని ఆరాధన ప్రతి ఒక్కరినీ వేడుకుంటోంది.





బిహార్ గయా జిల్లాలో పట్వాటోలి గ్రామాన్ని 'ఐ.ఐ.టి. విలేజ్' అని పిలుస్తారు. ప్రతి సంవత్సరం ఇక్కడ ఐ.ఐ.టి ర్యాంకులు సాధించివారు విపరీతంగా ఉంటారు. ఐ.ఐ.టి 2025 రిజల్ట్స్‌లో ఏకంగా 40 మంది స్టూడెంట్స్ ర్యాంకులు తెస్తే వీరిలో అమ్మాయిలే అధికం. నేతవాళ్లు ఎక్కువగా ఉండే ఈ ఊరి నుంచి ఇంటికొక ఇంజనీర్ ఉండటం విశేషం. ఇదెలా జరిగింది?

ఆ ఊరి పేరు ఐ.ఐ.టి. విలేజ్

ఎవరో ఒకరిద్దరు తలుచుకుంటే ఏ మార్పూ రాదని కొందరు అనుకుంటారు. కాని ఒక మనిషి తలుచుకున్నా మార్పు వస్తుంది. వచ్చింది.

1991.

బిహార్‌లోని గయ జిల్లాలోని పట్వాటోలి అనే చిన్న గ్రామంలో జితేంద్ర పట్వా అనే అబ్బాయికి ఐ.ఐ.టి.లో ర్యాంక్ వచ్చింది. ఆ ఊరి నుంచి ఎవరికైనా అలాంటి ర్యాంక్ రావడం ఇదే ప్రథమం. ఊరంతా సంతోషించింది. ఆ అబ్బాయి బాగా చదువుకున్నాడు. స్థిరపడ్డాడు. కాని ఊరికే ఉండలేదు. ఊరికి ఏదైనా చేయాలనుకున్నాడు. దేనికంటే ఆ ఊరు అప్పటికే తన ప్రాభవం కోల్పోయింది.

పట్వాటోలిని ఒకప్పుడు అందరూ 'మాంచెస్టర్ ఆఫ్ బిహార్' అని పిలిచేవారు. ఆ ఊర్లో అందరూ నేతపని వారే. నేత వస్త్రాలకు మంచి గిరాకీ ఉన్న రోజుల్లో ఆ ఊరు ఒక వెలుగు వెలిగింది. అయితే కాలక్రమంలో వచ్చిన మార్పులు వారిని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంచేశాయి. ఈ నేపథ్యంలో పిల్లలను మంచి చదువులవైపు మళ్లిస్తే ఊరి భవిష్యత్తు మారుతుందని భావించాడు జితేంద్ర పట్వా.

2013లో అతడు ఊరికి వచ్చి 'వృక్ష సంస్థాన్' పేరుతో ఒక ఎన్.జి.ఓ మొదలెట్టాడు. పేద నేతగాళ్ల పిల్లలకు, దిగువ మధ్యతరగతి ఇతర వర్గాల పిల్లలకు ఉచితంగా ఐ.ఐ.టి కోచింగ్ ఇవ్వడమే ఆ సంస్థ లక్ష్యం. ఒకప్పుడు ఆ ఊరిలో టెన్త్ తర్వాత చదువు మానేసేవారు. ఇప్పుడు టెన్త్ సమయం నుంచే ఐ.ఐ.టి. కోచింగ్ మొదలెడుతున్నారు.

అయితే ఇది ఆషామాషీగా జరగడం లేదు. విద్యార్థుల కోసం ఈ ఊరితో పాటు చుట్టుపక్కల కొన్ని లైబ్రరీలు స్థాపించారు. అవన్నీ ఐ.ఐ.టి. చదవడానికి అవసరమయ్యే పుస్తకాలతో నిండి ఉంటాయి. వాటిని ఏ పద్ధతిలో చదువుకుంటూ వెళ్లాలో గైడ్ చేస్తారు. అలాగే ఐ.ఐ.టి. చదివి ముంబై, ఢిల్లీలో స్థిరపడ్డ జితేంద్ర మిత్రులు ఇక్కడి కొచ్చి క్లాసులు చెబుతారు. కొత్తల్లో వీరు క్లాసులు చెప్పినా ఇప్పుడు ఇక్కడ నుంచి ఐ.ఐ.టి.కి వెళ్లిన వాళ్లు క్లాసులు చెబుతున్నారు.

అంటే ఈ ఫ్రీ కోచింగ్ ఎన్నాళ్లైనా కొనసాగే విధంగా ఇక్కడి విద్యార్థులే నిష్ణాతులయ్యారన్న మాట.

వస్త్రాలు నేసి రెక్కాడితే డొక్కాడని స్థితిలో ఉన్న ఈ ఊరిలో జె.ఇ.ఇ.- 2025 రిజల్ట్స్‌లో 40 మంది ర్యాంకులు సాధించారు. వీరిలో శరణ్య అనే అమ్మాయి టాపర్‌గా నిలిచి 99.64 పర్సంటేజ్ సాధించింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని పల్లెల నుంచి కూడా ఎందరో ఐ.ఐ.టి. సాధించారు. వారు ఇలాంటి అడుగు వేస్తే ప్రతి పల్లెటూరి నుంచి చదువు మీద ఆసక్తి ఉన్న విద్యార్థులు గొప్ప చదువులకు వెళతారు. గ్రామాల దశను మారుస్తారు.

మేలో దావణగెరెలో దేశీ విత్తనోత్సవం

తరతరాల వ్యవసాయక వారసత్వపు తరగని ఆస్తి దేశీ విత్తనాలు. ఆధునిక వంగడాలు ఎన్ని అందుబాటులోకి వస్తున్నప్పటికీ దేశీ విత్తన సంపదను కాపాడుకోవటం ఆహార సార్వభౌమత్వ సాధనకు ఎంతో కీలకం. ఈ చైతన్యంతోనే దేశంలో పలువురు సీడ్ సేవర్స్ పెద్ద సంఖ్యలో దేశీ వంగడాలను శక్తి మేరకు పరిరక్షిస్తున్నారు. వీటిని రైతులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పలు సంస్థలు దేశీ విత్తనోత్సవాలను నిర్వహిస్తూ ఉంటాయి. భారతీయ బీజ్ స్వరాజ్ మంచ్, సహజ సమృద్ధ, ఐకంతిక తదితర సంస్థలు మే నెల 10,11 తేదీల్లో కర్ణాటకలోని దావణగెరెలో హెరిటేజ్ సీడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నాయి. వివరాలకు.. 89704 19456, 99000 15758.

సాగుబడి

అశ్విని కార్తె : ఏప్రిల్ 26 వరకు
భరణి కార్తె : 27 నుంచి

నీరు మనకైనా పంటకైనా ప్రాణాధారం. భూగర్భంలో నీరంటూ ఉంటే బావి ద్వారానో, బోరు బావి ద్వారానో తోడుకొని పంటలు పండించుకోవచ్చు. అసలు భూగర్భంలోనే నీరు ఏటేటా అడుగుకు దిగిపోతుంటే అన్నదాతల ఆశలు ఆవిరైపోతున్నాయి. పంటల కోసం, పశువుల కోసం రోజూ తోడుకోవటానికి భూగర్భంలో నీరు పుష్కలంగా ఉండాలంటే.. వృథాగా చేను దాటి పోయే వర్షపు నీటి పరుగును ఆపి, భూమి లోపలికి చప్పున ఇంకింపజేసుకోవటం ఒక్కటే అత్యుత్తమ మార్గం. అందుకు కందకాలే సోపానాలంటున్నారు తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం పెద్దలు, వాన నీటి సంరక్షణ ఉద్యమకారులు సంగెం చంద్రమౌళి, మేరెడ్డి శ్యాం ప్రసాదరెడ్డి. తెలుగునాట రైతులు తమ భూముల్లో కందకాలు తవ్వుకోవటానికి పదేళ్లుగా మాట సాయం చేస్తున్నారు. వారి సూచనలు వారి మాటల్లోనే..




సంగెం చంద్రమౌళి



ఎం.శ్యాంప్రసాద్‌రెడ్డి

భూగర్భ నీరు @ కందకంతో చేరు!





ప్రతి పొలంలో వాలుకు అడ్డంగా కందకాలు తవ్వుదాం

- వాన నీటిని కందకాలకు తాపుదాం.. చేను కిందే చెరువును సృష్టించుకుందాం
- అవసరమైనప్పుడు బోర్లు / బావుల ద్వారా తోడుకుందాం
- ఎకరానికి 2% స్థలంలో రూ.5 వేల పెట్టుబడితో కందకాలు తవ్వుకుంటే శాశ్వతంగా సాగు నీటి భద్రత
- తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం నేతలు చంద్రమౌళి, శ్యాంప్రసాద్‌రెడ్డి పిలుపు



మన చేలో కురిసిన ప్రతి వాన బొట్టును పొలంలోనే ఇంకించుకోవాలి. మన చేను కిందే భూగర్భ జలాశయాన్ని ఏర్పాటు చేసుకోవాలి. అవసరమైనప్పుడు కావలసినంత నీటిని బోర్ల ద్వారా, బావుల ద్వారా తోడుకొని సమృద్ధిగా పంటలు పండించుకోవాలంటే.. ముందు మనం 'చేను కిందే చెరువు'ను సృష్టించుకోవాలి. అందుకు ఇదే సరైన సమయం. వానా కాలానికి ముందే పొలంలో కందకాలు తవ్వుకోవాలి. అకాల వేసవి వర్షాలను సైతం భూగర్భంలోకి ఇంకింపజేసుకోవటం తెలివైన పని. వర్షాధార, ఆరుతడి పంటలు సాగు చేసే భూముల్లో.. పొలంలో ప్రతి 50 మీటర్లకు ఒక వరుసలో వాలుకు అడ్డంగా కందకాలు తవ్వుకుంటే.. ఆ పొలానికి అడుగునే చెరువును నిర్మించుకున్నట్లే నీటి భద్రత నిక్కచ్చిగా దొరుకుతుంది. దీనికి ఖర్చు ఎకరానికి సగటున రూ. 5 వేలకు మించి కాదు. కందకాలకు ఎకారానికి 2 సెంట్ల భూమి అవసరం అవుతుంది. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఈ పెట్టుబడి ఎక్కువేమీ కాదని రైతులు గ్రహించాలి.

ఎకరానికి రూ. 5 వేల ఖర్చు

ఏ యే పొలాల్లో ఎలా తవ్వాలి?

పొలంలో వాలుకు అడ్డంగా.. ప్రతి 50 మీటర్లకు ఒక చోట.. మీటరు లోతు, మీటరు వెడల్పున సమతల కందకాలను తవ్వుకోవాలి. నేలను బట్టి, వాలు ఎక్కువ తక్కువలను బట్టి కొన్ని మార్పులు చేయాల్సి ఉంటుంది. పొలం ఆ చివరి నుంచి ఈ చివరికి ఒకే కందకం తవ్వకూడదు. కందకం పొడవు 25 మీటర్లుండాలి. ఆ తర్వాత 5 మీటర్లు ఖాళీ వదిలి, అదే వరుసలో వాలుకు అడ్డంగా మరో 25 మీటర్ల కందకం తవ్వాలి. కందకం తవ్విన మట్టిని పొడవుగా ఒకే కట్టగా కందకం లోతట్టు వైపున గట్టు మాదిరిగా పోయాలి. ఇలా చేస్తే కందకంలోకి వచ్చిన వదర నీరు సైతం పొర్లిపోకుండా ఉంటుంది. నీటి సంరక్షణతో పాటు పొలంలోని విలువైన పైపొర మట్టి కొట్టుకుపోకుండా కూడా కాపాడుకోవచ్చు.

ఎర్ర నేలల్లో ఎలా?

ఇసుక కలిసిన ఎర్ర నేలలు, చల్కా నేలల్లో నీరు తొందరగా భూమిలోకి ఇంకిపోతుంది. ఇటువంటి పొలాలు వాలు 2% ఉంటే.. పొలం మధ్యలో 50 మీటర్లకు ఒక్కటి చొప్పున కందకాలు తవ్వుకోవాలి. వాలు ఇంకా ఎక్కువగా ఉంటే 40 మీటర్లకు ఒక వరుసలో కందకాలు తవ్వుకోవాలి. ఒక వేళ భూమి వాలు లేకుండా సమతలంగా ఉంటే.. కందకాలకు బదులు మడులు ఏర్పాటు చేసుకోవాలి. అర ఎకరం లేదా ఎకరానికి ఒక మడి చొప్పున ఏర్పాటు చేసుకోవాలి. మడుల కట్టలు కనీసం అర మీటరు ఎత్తుగా వేసి.. పక్కనే కందకం తవ్వాలి.

నల్లరేగడి నేలల్లో ఎలా?

నల్లరేగడి నేలల్లో నీరు త్వరగా ఇంకదు. కాబట్టి, ఈ నేలలు ఏటవాలుగా ఉన్నా, సమతలంగా ఉన్నా, పొలం మధ్యలో కందకాలు తవ్వకూడదు. పొలం చివరన (బావి లేదా బోరు కింది భాగంలో) నీటి కుంట లేదా ఫామ్ పాండ్‌ను తవ్వుకోవాలి.

పొలాల్లో తవ్వే వాన నీటి సంరక్షణ కందకాల విషయంలో సందేహాలుంటే తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సంప్రదించవచ్చు: సంగెం చంద్రమౌళి (విశ్రాంత ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్): 98495 66009, మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి (విశ్రాంత ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) 99638 19074.



– సాదినేని శ్రీనివాసరావు
(99490 99055), శివలింగాపురం, వెల్దుర్తి మండలం, పల్నాడు జిల్లా

మాతో పాటు ఊరందరికీ మేలు!

9 ఏళ్ల క్రితం 'సాక్షి' సాగుబడిలో చదివి మా వందెకరాల పొలంలో కందకాలు తవ్వుతుంటే ఊళ్లో రైతులందరూ 'వీడేందిరా చేనంత గుంతలు కొడుతున్నాడు..' అంటూ నన్ను పిచ్చోడి లెక్క చూశారు. అయితే, మా పొలంతో పాటు దిగువున ఉన్న రైతుల పొలాల్లో (30 వరకు) బోర్లన్నీ బాగా పారుతున్నాయి. పొలంలో 50 అడుగులకు ఒక వరుస చొప్పున కందకాలు తవ్వటంతో పాటు చెరువులు కూడా తవ్వించాను. దీంతో భూగర్భంలోకి నీరు బాగా ఇంకి, నీటి సమస్య తీరింది. 40 ఎకరాల్లో కుంకుడు తోట నాటా. 5 వేల టేకు చెట్లు నాటా. మామిడి, నేరేడు తదితర వినూత్న రకాలు సాగు చేస్తున్నా.

3 రోజుల్లో నా జీవితం మారిపోయింది!



పద్మారెడ్డి తోటలో కందకాల్లో నాటిన కొబ్బరి చెట్లు

'సాక్షి' దినపత్రిక 'సాగుబడి'లో కందకాల గురించి కథనం చదివి మా 135 ఎకరాల్లో ఐదేళ్ల క్రితం మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు కందకాలు వేసవిలోనే తవ్వించాను. నీటి కరువు శాశ్వతంగా తీరింది. అంతకుముందు వందలాది బోర్లు తవ్వినా ప్రయోజనం లేకపోయింది. కందకాలు తవ్విన 3 రోజుల్లోనే పెద్ద వర్షం కురవటంతో బోర్లు రీచార్జ్ అయ్యి నా జీవితం నాటకీయంగా మారిపోయింది. అర్ధ ఇంచ్ నీరు పోసే బోర్లు 3 రోజుల్లోనే 3 ఇంచులు నీరు పోయటం మొదలైంది. అంతకుముందు బావిలో నీరు వేసవిలో 60-80 అడుగుల లోతుకు వెళ్లేవి. ఇప్పుడు 18 అడుగుల్లోనే ఉన్నాయి. బోర్లలో అయితే 12-16 అడుగుల్లోనే ఉన్నాయి. 95 ఎకరాల్లో కుంకుడు, బత్తాయి, ఉసిరి, జామ, సీతాఫలం, శ్రీగంధం తోటలకు 3 బోర్లతోనే నీరు పెడుతున్నాం. గతంలో ఈ 95 ఎకరాల్లోనే 247 బోర్లు వేసినా దొరకని నీటి భద్రత కందకాలతో ఒక్క పెద్ద వర్షంతో దొరికింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నీటి ఎద్దడి లేనే లేదు. కుంకుడు తోట ఎండిపోయే దశలో తవ్విన కందకాల వల్ల శాశ్వతంగా గొప్ప మేలు జరిగింది. నా తోటను ఇప్పటికి అనేక రాష్ట్రాల నుంచి 6 లక్షల మంది వచ్చి చూసెళ్లారు. ఈ పుణ్యం అంతా 'సాక్షి' ద్వారా తెలుసుకొని, తవ్వుకున్న కందకాలదే! కందకాల్లోనే 740 కొబ్బరి చెట్లు నాటా. చక్కగా పెరుగుతున్నాయి.



– లోకసాని పద్మారెడ్డి
(99481 11931), పోలేపల్లి, చందంపేట మం॥, నల్లగొండ జిల్లా



బోరుబావి రీఛార్జి కట్టడం వల్ల ఉపయోగం ఎంత?

బోరు చుట్టూ వాననీటి రీచార్జ్ కట్టడాలతో రైతుల నీటి కష్టాలను అధిగమించే పద్ధతులపై 'అకాల వర్షాన్ని ఒడిసిపడితే బోరులోనూ జలహోరు' శీర్షికన ఈ నెల 14న 'సాక్షి'(మెయిన్ ఎడిషన్)లో కథనం ప్రచురించాం. సీనియర్ హైడ్రాలజిస్టు, సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వాటర్ అండ్ లైవ్‌లిహుడ్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ వి రాంమోహన్ అనుభవాలను, సూచనలను ఈ కథనంలో ప్రచురించాం. అయితే, కొందరు పాఠకులు, ముఖ్యంగా రైతులు, బోరు చుట్టూ వాన నీటి రీచార్జ్ కట్టడాల నిర్మాణానికి సంబంధించి అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందేహాలను నివృత్తి చేయటం కోసం కొన్ని 'తరచూ అడిగే ప్రశ్నల'కు రాంమోహన్ (94401 94866) ఇచ్చిన సమాధానాలను 'సాగుబడి'లో ధారావాహికగా ప్రచురిస్తున్నాం.

- ఎడిటర్

ప్రశ్న: భూగర్భ నీటి రీఛార్జి విషయంలో చెక్ డ్యాంలు, నీటికుంటలు వంటి సాంప్రదాయ సాంకేతిక పద్ధతులతో పోలిస్తే, బోరుబావి రీఛార్జి కట్టడం ఎలాంటి పనితీరు చూపుతుంది?

జవాబు: వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకింపజేసే విషయంలో ఇతర సాంప్రదాయ సాంకేతిక పద్ధతులతో పోలిస్తే, బోరుబావి రీఛార్జి కట్టడాల ద్వారా తక్కువ సమయంలోనే పెద్ద మొత్తంలో వాన నీటిని రీఛార్జి చేయడానికి అవకాశం ఉంటుంది. ఈ పద్ధతిలో నీరు ఆవిరి రూపంలో వ్యర్థమయ్యే అవకాశం చాలా తక్కువ. బాగా లోతుగా ఉండే అక్విఫెర్ల నీటి నిల్వ సామర్థ్యం చాలా ఎక్కువగా ఉండటం మూలాన ఎక్కువ పరిమాణంలో నీటిని రీఛార్జి చేసే అవకాశం ఉంటుంది. చెక్ డ్యాం, నీటి కుంటలు వంటి సాంప్రదాయ కట్టడాలకు పరిమిత స్థాయిలో నీటి నిల్వ సామర్థ్యం ఉంటుంది. బోరు రీఛార్జి సాంకేతికతను ఉపయోగించి, రెండు వానాకాలపు సీజన్లలోనే ఎండిపోయిన బోరుబావులను పునరుద్ధరించవచ్చు.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



పంచ్‌కులా నుంచి బెంగళూరుకు...

భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తన పేరిట మే 24వ తేదీన నిర్వహించనున్న 'క్లాసిక్ ఈవెంట్' వేదిక హరియాణా రాష్ట్రంలోని పంచ్‌కులా నుంచి కర్ణాటకలోని బెంగళూరుకు మారింది. ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య ద్వారా 'ఎ' కేటగిరీ ఈవెంట్‌గా గుర్తింపు దక్కించుకున్న ఈ ఈవెంట్‌కు అంతర్జాతీయ పోటీల టీవీ ప్రసారం కోసం మైదానంలో కనీసం 600 లక్స్‌ల కాంతి ఉన్న ఫ్లడ్‌లైట్లు అవసరం. పంచ్‌కులాలో అలాంటి అవకాశం లేక పోవడంతో ఈవెంట్‌ను బెంగళూరులోని కంఠీరవ స్టేడియానికి మార్చారు.

నిత్య 'పసిడి' పరుగు



ఫెడరేషన్ కప్ జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ మీట్ తొలి రోజే తెలంగాణకు స్వర్ణ పతకం లభించింది. కొచ్చిలో జరుగుతున్న ఈ మీట్‌లో తెలంగాణ అమ్మాయి నిత్య గంధె మహిళల 100 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది. 25 ఏళ్ల నిత్య 100 మీటర్ల దూరాన్ని అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 11.50 సెకన్లలో పూర్తి చేసి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. అయితే ఆసియా చాంపియన్‌షిప్ పోటీల అర్హత ప్రమాణ సమయాన్ని (11.46 సెకన్లు) ఆమె అందుకోలేకపోయింది.

గుజరాత్ గర్జన

మెరిపించిన గిల్, సుదర్శన్, బట్లర్

- కూల్చేసిన రషీద్, ప్రసిధ్
- కోల్‌కతాపై 39 పరుగులతో టైటాన్స్ గెలుపు



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గిల్

కోల్‌కతా: గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనకు డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతులెత్తేసింది. దీంతో సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో టైటాన్స్ 39 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (55 బంతుల్లో 90; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), సాయి సుదర్శన్ (36 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించారు. బట్లర్ (23 బంతుల్లో 41 నాటౌట్; 8 ఫోర్లు) ధాటిగా ఆడాడు. కోల్‌కతా బౌలర్లలో రసెల్, వైభవ్, హర్షిత్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్లకు 159 పరుగులు చేసి ఓడింది. కెప్టెన్ అజింక్య రహానే (36 బంతుల్లో 50; 5 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే రాణించాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ, రషీద్ ఖాన్ చెరో 2 వికెట్లు తీశారు.

ఆ ఇద్దరు బాదేశారిలా...

గుజరాత్ ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో ముందుగా సాయి సుదర్శన్ బౌండరీతో బాదుడు మొదలు పెట్టాడు. మూడో ఓవర్లో మరో రెండు ఫోర్లు కొట్టాడు. కాస్త ఆలస్యమైనా... గిల్ ఐదో ఓవర్లో రెండు వరుస బౌండరీలతో దూకుడు షురూ చేశాడు. టైటాన్స్ పవర్‌ప్లే స్కోరు 45/0. అలీ వేసిన ఏడో ఓవర్లో గిల్ 6, 4, 4లతో ఒక్కసారిగా విరుచుకు పడ్డాడు. క్రమం తప్పకుండా ఫోర్లు బాదేయడంతో సగం ఓవర్లు ముగిసేసరికి గుజరాత్ 89/0 స్కోరు చేసింది. తర్వాతి ఓవర్లోనే గిల్ 34 బంతుల్లో, సుదర్శన్ 33 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. జట్టు స్కోరు 100 దాటింది. ఎట్టకేలకు సుదర్శన్‌ను అవుట్ చేసిన రసెల్ కోల్‌కతాకు ఊరటనిచ్చాడు. అయితే బట్లర్ రాకతో దంచుడులో ఏ మార్పులేక పోయింది. ఆఖర్లో గిల్, రాహుల్ తెవాటియా (0) వికెట్లు పడినా కూడా భారీస్కోరు సాధ్యమైంది.

కెప్టెన్ ఒంటరి పోరాటం

పెద్ద లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన నైట్‌రైడర్స్ పవర్‌ప్లేలోనే ఓపెనర్లను కోల్పోయింది. సిరాజ్ తొలి ఓవర్లోనే రహ్మనుల్లా గుర్బాజ్ (1) పెవిలియన్ చేరగా, కెప్టెన్ రహానేతో అడపాదడపా షాట్లతో స్కోరును నడిపిస్తున్న సునీల్ నరైన్ (17)ను రషీద్ ఖాన్ బోల్తా కొట్టించాడు. వెంకటేశ్ అయ్యర్ (14) మెప్పించలేకపోయాడు. బాధ్యతగా ఆడిన రహానే 36 బంతుల్లో అర్ధసెంచరీ సాధించగా, అదేస్కోరు వద్ద వాషింగ్టన్ సుందర్ అతన్ని అవుట్ చేశాడు. ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన రసెల్ (15 బంతుల్లో 21; 3 ఫోర్లు, 1 సిక్స్) స్టంపౌట్ కావడంతో కోల్‌కతా లక్ష్యానికి దూరమైంది. రఘువంశీ (13 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు అలరించాడు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) గుర్బాజ్ (బి) రసెల్ 52; శుబ్‌మన్ గిల్ (సి) రింకూ సింగ్ (బి) వైభవ్ 90; బట్లర్ (నాటౌట్) 41; తెవాటియా (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ రాణా 0; షారుఖ్ ఖాన్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 198.** వికెట్ల పతనం: 1-114, 2-172, 3-177. బౌలింగ్: వైభవ్ అరోరా 4-0-44-1, మొయిన్ అలీ 3-0-27-0, హర్షిత్ రాణా 4-0-45-1, వరుణ్ చక్రవర్తి 4-0-33-0, నరైన్ 4-0-36-0, రసెల్ 1-0-13-1.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 1; నరైన్ (సి) తెవాటియా (బి) రషీద్ 17; రహానే (స్టంప్డ్) బట్లర్ (బి) సుందర్ 50; వెంకటేశ్ (సి) సుందర్ (బి) సాయి కిషోర్ 14; రింకూ సింగ్ (సి) గిల్ (బి) ఇషాంత్ 17; రసెల్ (స్టంప్డ్) బట్లర్ (బి) రషీద్ 21; రమణ్‌దీప్ (సి అండ్ బి) ప్రసిధ్ కృష్ణ 1; మొయిన్ అలీ (సి) షారుఖ్ (బి) ప్రసిధ్ కృష్ణ 0; రఘువంశీ (నాటౌట్) 27; హర్షిత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 159.** వికెట్ల పతనం: 1-2, 2-43, 3-84, 4-91, 5-118, 6-119, 7-119, 8-151. బౌలింగ్: సిరాజ్ 4-0-32-1, ఇషాంత్ 2-0-18-1, ప్రసిధ్ కృష్ణ 4-0-25-2, రషీద్ ఖాన్ 4-0-25-2, సుందర్ 3-0-36-1, సాయి కిషోర్ 3-0-19-1.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	8	6	2	12	1.104
ఢిల్లీ	7	5	2	10	0.589
బెంగళూరు	8	5	3	10	0.472
పంజాబ్	8	5	3	10	0.177
లక్నో	8	5	3	10	0.088
ముంబై	8	4	4	8	0.483
కోల్‌కతా	8	3	5	6	0.212
రాజస్తాన్	8	2	6	4	-0.633
హైదరాబాద్	7	2	5	4	-1.217
చెన్నై	8	2	6	4	-1.392

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × ఢిల్లీ
వేదిక: లక్నో
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



శ్రేయస్, ఇషాన్‌లకు మళ్లీ చోటు

'ఎ' ప్లస్‌లోనే రోహిత్, కోహ్లి	పంత్‌కు ప్రమోషన్	నితీశ్ కుమార్ రెడ్డికి తొలిసారి అవకాశం	సిరాజ్, తిలక్ వర్మ కొనసాగింపు	బీసీసీఐ వార్షిక కాంట్రాక్ట్‌లు ప్రకటన



న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆటగాళ్ల వార్షిక కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించింది. అక్టోబర్ 1, 2024 నుంచి సెప్టెంబర్ 30, 2025 వరకు వర్తించే ఈ కాంట్రాక్ట్‌లో 34 మందికి అవకాశం లభించింది. దేశవాళీ క్రికెట్‌లో ఆడని కారణంగా గత ఏడాది కాంట్రాక్ట్‌లు కోల్పోయిన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లకు మళ్లీ ఇందులో చోటు కల్పించారు. స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలతో పాటు రవీంద్ర జడేజా కూడా టి20 ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినా... తమ 'ఎ' ప్లస్ కాంట్రాక్ట్‌ను నిలబెట్టుకున్నారు. ఆంధ్ర క్రికెటర్, ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో విశేషంగా ఆకట్టుకున్న నితీశ్ కుమార్ రెడ్డికి మొదటిసారి ఈ జాబితాలో స్థానం దక్కింది. నితీశ్‌కు గ్రేడ్ 'సి'లో చోటు లభించింది. మొత్తంగా 8 మంది క్రికెటర్లకు తొలిసారి కాంట్రాక్ట్ లభించింది. గత ఏడాది 'బి' కేటగిరీలో ఉన్న రిషభ్ పంత్ ఒక్కడే ప్రమోషన్ పొందుతూ గ్రేడ్ 'ఎ'లోకి వచ్చాడు. హైదరాబాద్ క్రికెటర్లు సిరాజ్... తిలక్ వర్మ కాంట్రాక్ట్‌లను నిలబెట్టుకున్నారు.

అందుకే అగ్రతాంబూలం...


రోహిత్, కోహ్లి, జడేజాలు 2024 జూన్‌లోనే ఒక ఫార్మాట్ నుంచి తప్పుకున్నారు. అయితే తాజా కాంట్రాక్ట్‌ల కోసం అక్టోబర్ 1, 2023 నుంచి సెప్టెంబర్ 30, 2024 మధ్య ఏడాది కాలాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. దీని ప్రకారం వీరు అన్ని ఫార్మాట్ ఆటగాళ్లు కాబట్టి 'ఎ' ప్లస్ గ్రేడ్ లభించింది. కనీసం రెండు కేటగిరీల్లో ఎలాంటి సందేహం లేకుండా కచ్చితంగా జట్టులో ఉండే అవకాశం ఉన్న ప్లేయర్లకు 'ఎ' గ్రేడ్ లభించింది. పంత్ గత సీజన్‌లో తగినన్ని మ్యాచ్‌లు ఆడకపోవడంతో 'సి' గ్రేడ్‌కు పడిపోయినా... ఇప్పుడు టెస్టు, టి20 జట్లలో రెగ్యులర్‌గా ఉంటున్నాడు. శ్రేయస్ అయ్యర్ కూడా నిర్ణీత సమయంలో 15 వన్డేలు ఆడటంతో పాటు దేశవాళీ క్రికెట్ నిబంధనను కూడా పూర్తి చేయడంతో అతనికి 'బి' గ్రేడ్ లభించింది. కనీసం ఒక ఫార్మాట్‌లో ఆడగలిగే, కొత్తవారికి 'సి'లో చోటు దక్కింది. ఇదే తరహాలో ఇషాన్ కిషన్ కూడా పునరాగమనం చేశాడు. బోర్డు పరిగణనలోకి తీసుకున్న సమయానికి అసలు జట్టులోకి రాకపోయినా... భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిబంధనను సడలిస్తూ యువ ఆటగాళ్లకు కాంట్రాక్ట్‌లు అందించారు. సూర్యకుమార్ యాదవ్ ఒకే ఫార్మాట్‌లో ఆడుతున్నా...అందులో అతను కెప్టెన్ కావడంతో 'బి' గ్రేడ్ లభించింది.

గత కాంట్రాక్ట్ జాబితాలో ఉన్నవారిలో ఐదుగురు స్థానం కోల్పోయారు. స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించడంతో అతడికి చోటు లభించలేదు. నిర్ణీత సమయంలో సరైన ప్రదర్శన కనబర్చక పోవడంతో పాటు టీమ్‌కు రెగ్యులర్‌గా ఎంపికయ్యే అవకాశం లేకపోవడంతో శార్దుల్ ఠాకూర్, జితేశ్ శర్మ, ఆంధ్ర క్రికెటర్ కేఎస్ భరత్, అవేశ్ ఖాన్‌లను కాంట్రాక్ట్ జాబితా నుంచి తొలగించారు.

బీసీసీఐ కాంట్రాక్ట్ జాబితా (మొత్తం 34 మంది)

'ఎ+' గ్రేడ్ (రూ.7 కోట్లు): రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా.
'ఎ' గ్రేడ్ (రూ.5 కోట్లు): మొహమ్మద్ సిరాజ్, కేఎల్ రాహుల్, శుబ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యా, మొహమ్మద్ షమీ, రిషభ్ పంత్.
'బి' గ్రేడ్ (రూ.3 కోట్లు): సూర్యకుమార్, కుల్దీప్, అక్షర్ పటేల్, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్.
'సి' గ్రేడ్ (రూ. 1 కోటి): రింకూ సింగ్, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, ముకేశ్ కుమార్, సంజు సామ్సన్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, రజత్ పాటీదార్, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్, నితీశ్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, ఆకాశ్‌దీప్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా.

సాక్షి సినిమా



సారంగపాణి జాతకంతో ఆ లోటు తీరింది - శివలెంక కృష్ణప్రసాద్

''సారంగపాణి జాతకం' చిత్రంలో యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్, కామెడీ, లవ్... ఇలా అన్ని రకాల అంశాలుంటాయి. ఇంద్రగంటి కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. థియేటర్లో అందరూ హాయిగా నవ్వుకునేలా ఈ సినిమా ఉంటుంది. జంధ్యాలగారితో పూర్తి స్థాయిలో ఓ వినోదాత్మక చిత్రం నిర్మించాలనుకున్నాను, కుదరలేదు. ఇప్పుడు ఇంద్రగంటిగారితో చేసిన ఈ వినోదాత్మక చిత్రంతో ఆ లోటు తీరిపోయింది. కొన్ని చిత్రాలు ప్రేక్షకులకు ఎప్పుడూ గుర్తుండిపోతాయి. అలా ఈ సినిమా కూడా చాలా కాలం పాటు గుర్తుంటుంది'' అని శివలెంక కృష్ణప్రసాద్ అన్నారు. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలకానుంది. ఈ సందర్భంగా శివ లెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ–''జెంటిల్‌మ్యాన్, సమ్మోహనం' వంటి చిత్రాల తర్వాత ఇంద్రగంటిగారు,నా కాంబోలో 'సారంగపాణి జాతకం'తో హ్యాట్రిక్ హిట్ సాధించనున్నాం. ఫ్యామిలీతో పాటుగా యూత్ ని కూడా మా చిత్రం మెప్పిస్తుంది. 'కోర్ట్' మూవీలో సీరియస్‌గా కనిపించిన ప్రియదర్శి మా సినిమాలో నవ్విస్తారు. 'వెన్నెల' కిశోర్, వైవా హర్ష, వీకే నరేశ్, అవసరాల శ్రీనివాస్ పాత్రలు నవ్విస్తాయి. జంధ్యాలగారి కామెడీ, ఈవీవీ సత్యనారాయణగారి స్టైల్, ఇంద్రగంటి మార్క్‌తో ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా ఈ చిత్రాన్ని తీశాం. అప్పట్లో మేం ఒక హీరోతో చేసిన తర్వాత ఇంకో హీరోతో సినిమాను ప్లాన్ చేసేవాళ్లం. కానీ, ఇప్పుడు ఒక్కొక్కరు నాలుగైదు ప్రాజెక్టులని లైన్‌లో పెడుతున్నారు. కాంబినేషన్స్ చుట్టూ తిరుగుతూ కథల గురించి పట్టించుకోవడం లేదు. నాకు సినిమాల పట్ల ఎక్కువ ప్యాషన్ ఉంటుంది. అందుకే నా మార్క్ కనిపించాలని కోరుకుంటున్నాను. నాకు సీక్వెల్స్ అంటే చాలా భయం. అందుకే నేను వాటికి దూరంగా ఉంటాను. 'యశోద' చిత్ర దర్శకులు హరి–హరీష్ చెప్పిన రెండు కథలు, అలాగే పవన్ సాధినేని చెప్పిన కథ నాకు నచ్చాయి. మోహనకృష్ణ ఇంద్రగంటిగారితో ఇంకో సినిమా కూడా చేయబోతున్నాను'' అన్నారు.

సీనిమాల యాక్ట్ జేశి..



● 'ముత్తయ్య' సినిమా పోస్టర్

కె. సుధాకర్‌రెడ్డి, అరుణ్‌రాజ్, పూర్ణ చంద్ర, మౌనికా బొమ్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ముత్తయ్య'. భాస్కర్ మౌర్య దర్శకత్వంలో వంశీ కారుమంచి, వృందా ప్రసాద్ నిర్మించారు. త్వరలో ఈ మూవీ ఈటీవీ విన్ ఓటీటీలో ప్రీమియర్ కానుంది. ఈ సినిమాలోని 'సీనిమాల యాక్ట్ జేశి... సినిమాల యాక్ట్ జేశి ఎలిగిపోతవా... బుట్టలల్లుకుంట ఊళ్ళొ మిగిలిపోతవా ముత్తయ్య...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విజయ్ దేవరకొండ విడుదల చేసి, ఈ పాటను లాంచ్ చేయడం సంతోషంగా ఉందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా తమ కలల్ని సాకారం చేసుకోవాలని పేర్కొని, ఈ సినిమా యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ చిత్రసంగీత దర్శకుడు కార్తీక్ రోడ్రిగ్స్ స్వరపరచిన ఈ పాటకు దర్శకుడు భాస్కర్ మౌర్య సాహిత్యం అందించగా, చిన్నా.కె పాడారు.


ముంబైలో రావణుడు



● యశ్

ముంబైలో ల్యాండ్ అయ్యారు హీరో యశ్. భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా నితీష్ తివారి దర్శకత్వంలో హిందీలో 'రామాయణ' అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమాను నమిత్ మల్హోత్రా, యశ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, లక్ష్మణుడిగా రవి దుబే, హనుమంతుడు పాత్రలో సన్నీ డియోల్, రావణుడిగా యశ్ నటిస్తున్నారని తెలిసింది. ఈ సినిమా షూటింగ్ కోసం ముంబై వెళ్లారు యశ్. ఈ షెడ్యూల్‌లో యశ్ పాత్రకు సంబంధించిన కీలక సన్నివేశాల చిత్రీకరణ మాత్రమే జరుగుతుందని, రణ్‌బీర్ కపూర్ పాల్గొనరని సమాచారం. ఇక 'రామాయణ' తొలి భాగం వచ్చే ఏడాది దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి రిలీజ్ చేస్తామని ఆల్రెడీ మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

వేసవిలో లెవన్



నవీన్ చంద్ర, రేయా హరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవన్'. లోకేశ్ అజ్లస్ దర్శకత్వంలో ఏఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై అజ్మల్ ఖాన్, రేయా హరి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం మే 16న విడుదల కానుంది. కాగా 'లెవన్' సినిమా తెలుగు హక్కులను రుచిర ఎంటర్‌టైన్మెంట్స్ అధినేత, ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ ఎన్. సుధాకర్ రెడ్డి సొంతం చేసుకున్నారు. అభిరామి, రవివర్మ, కిరీటి దామరాజు ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: డి.ఇమ్మాన్.

సుమతీ శతకం షురూ



● అమర్‌దీప్, సైలీ

'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి, సైలీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ 'సుమతీ శతకం'. ఎమ్ఎమ్ నాయుడు దర్శకత్వంలో కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అమరావతిలోని వైకుంఠపురం విలేజ్ టెంపుల్‌లో ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి వెన్నా సాంబశివా రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ క్లాప్ ఇచ్చారు. ఈ సినిమా స్క్రిప్ట్‌ను బండారు నాయుడు చిత్రయూనిట్‌కు అందించారు. ఈ సినిమాకు సంగీతం: సుభాష్ ఆనంద్, కెమేరా: హాల్‌స్వామి ఎస్.

రేస్‌లో తగ్గేదే లే!

బెల్జియం స్పా-ఫ్రాన్‌కోర్ ఛాంప్స్ సర్క్యూట్‌లో రెండో స్థానంలో నిలిచిన అజిత్ టీమ్



● అజిత్

స్టార్ హీరో అజిత్ మంచి ప్రొఫెషనల్ రేసర్, రైఫిల్ షూటర్ అనే సంగతి తెలిసిందే. వీలైనప్పుడల్లా కార్, బైక్ రేస్, రైఫిల్ షూట్ పోటీల్లో పాల్గొంటుంటారు అజిత్. ఆ పోటీల్లో కొన్నిసార్లు అజిత్ విజేతగా కూడా నిలిచారు. కాగా తాజాగా అంతర్జాతీయ కార్ రేసింగ్ పోటీలో అజిత్ అండ్ టీమ్ విజేతగా నిలిచింది. బెల్జియంలో జరిగిన స్పా–ఫ్రాన్‌కోర్ ఛాంప్స్ సర్క్యూట్ పోటీలో అజిత్ రేసింగ్ టీమ్ రెండో స్థానంలో నిలిచింది. సోషల్ మీడియాలో ఆయన బృందం ఈ విషయాన్ని వెల్లడించింది. సినిమా అయినా, స్పోర్ట్స్ అయిన అజిత్ ఉన్న చోట పాజిటివ్ ఎనర్జీ ఉంటుందని ఆయన టీమ్ ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఇక అజిత్ సెలబ్రేషన్స్ వీడియోలను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ 'ఎక్స్'లో షేర్ చేసింది. ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇంకా జనవరిలో దుబాయ్‌లో జరిగిన 24హెచ్ కార్ రేస్ పోటీల్లో, ఇటీవల ఇటలీలో జరిగిన 12 హెచ్ రేస్ పోటీల్లో అజిత్ అండ్ టీమ్ మూడో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఇలా వరుస విజయాలతో రేసింగ్‌లో అజిత్ రికార్డులు సృష్టిస్తున్నారు. ఇక అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా ఈ నెల 10న విడుదలై, విజయపథంలో దూసుకెళుతోంది.

డేర్ డేవిల్



● రాణీ ముఖర్జీ

పోలీసాఫీసర్ శివానీ శివాజీ రాయ్‌గా రాణీ ముఖర్జీ మళ్లీ డ్యూటీ ఆరంభించారు. 'మర్దానీ' చిత్రంలో రాణి పోషించిన పాత్ర ఇది అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. బాలీవుడ్ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ఫ్రాంచైజీ 'మర్దానీ'కి మంచి క్రేజ్ ఉంది. ఈ ఫ్రాంచైజీ నుంచి రాణీ ముఖర్జీ లీడ్ రోల్‌లో ఆల్రెడీ 'మర్దానీ (2014), మర్దానీ 2' (2019) చిత్రాలొచ్చాయి. తాజాగా 'మర్దానీ'మూడో భాగాన్ని 2026 ఫిబ్రవరి 27న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. రెండు భాగాలను నిర్మించిన ఆదిత్యా చోప్రాయే మూడో భాగాన్ని నిర్మిస్తున్నారు. కానీ 'మర్దానీ 3'కి దర్శకుడు మాత్రం మారారు. 'సుల్తాన్, టైగర్ 3' వంటి హిందీ సినిమాలకు దర్శకత్వ విభాగంలో చేసిన అభి రాజ్ మినావాలా 'మర్దానీ 3' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ''న్యాయం కోసం నిస్వార్థంగా పోరాడే డేర్ డేవిల్ పోలీసాఫీసర్ శివానీ శివాజీ రాయ్ పాత్రతో రాణీ ముఖర్జీగారు మళ్లీ వస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 4న హోలీ. ఈ సందర్భంగా చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా 'మర్దానీ 3'ని ఫిబ్రవరి 27న రిలీజ్ చేస్తున్నాం'' అని మేకర్స్ తెలిపారు.

యూనివర్సల్ బ్యాచిలర్



● శ్రావణి శెట్టి, జేపీ నవీన్

జేపీ నవీన్, శ్రావణి శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఏఎల్‌సిసి (ఓ యూనివర్సల్ బ్యాచిలర్)'. లేలీధర్ రావు కోలా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు అతిథిగా హాజరైన దర్శకుడు వి. సముద్ర మాట్లాడుతూ–''పిల్లలకు పాఠాలు చెప్పే టీచర్ లేలీధర్ రావు కోలా ఈ సినిమాకు దర్శక, నిర్మాతగా చేశారు. ఈ సినిమా కచ్చితంగా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఇలాంటి వైవిధ్యమైన సినిమాను ప్రోత్సహించండి'' అని మరో అతిథి దర్శకుడు నగేశ్ అన్నారు. ''సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేకుండా హీరోగా ఎంట్రీ ఇవ్వడం చాలా కష్టం. నాకు అవకాశం కల్పించిన లేలీధర్ గారికి థ్యాంక్స్'' అన్నారు జేపీ నవీన్. ''ఎంతో ఇష్టంగా ఈ సినిమా తీశాను. ఈ సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుందని భావిస్తున్నాను'' అన్నారు లేలీధర్ రావు కోలా.

నవ్వులు అపరిమితం



● నస్లెన్

మలయాళ హిట్ మూవీ 'అలప్పుళ జింఖానా' చిత్రం 'జింఖానా' పేరుతో తెలుగులో విడుదల కానుంది. నస్లెన్, లుక్మాన్ అవరన్, గణపతి, సందీప్ ప్రదీప్, అనఘ మాయ రవి ముఖ్య తారలుగా ఖలీద్ రెహమాన్ దర్శకత్వం వహించారు. ఖలీద్ రెహమాన్, జోబిన్ జార్జ్, సమీర్ కారత్, సుబీష్ కన్నంచెరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న మలయాళంలో విడుదలైంది. తెలుగులో ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని డైరెక్టర్ అనిల్ రావిపూడి విడుదల చేశారు. ''హ్యూమర్, సోల్, హై ఎనర్జీతో కూడిన పోరాట సన్నివేశాలతో పాటు అన్‌లిమిటెడ్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఖలీద్ రెహమాన్ ఈ సినిమాని రూపొందించారు. తెలుగు ప్రేక్షకులనూ మా చిత్రం ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థలు: ప్లాన్ బి మోషన్ పిక్చర్స్–రీలిస్టిక్ స్టూడియోస్, డిస్ట్రిబ్యూషన్: సెంట్రల్ పిక్చర్స్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
855	274
79,409	24,126

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ			
నాస్‌డాక్	15,708	▽	579
డోజోన్స్	37,953	▽	1189
ఎఫ్‌టీఎస్‌ఈ 100 (గురువారం ముగింపు)	8,276	▲	1
డాక్స్ (గురువారం ముగింపు)	21,206	▽	105
షాంఘై	3,291	▲	14
నికాయ్	34,280	▽	451

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	96,670
బంగారం (99.5 స్వచ్ఛత)	96,282
వెండి (కేజీ)	96,242

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.70	85.72
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	115.45	112.50
€	యూరో	ఒకటి	96.75	99.46
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	59.74	61.32
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.51	55.70
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.99	67.70
SAR	సౌదీ రియాల్	ఖాయపరుగు	21.80	23.31
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయపరుగు	22.29	24.07
¥	చైనా యువాన్	ఖాయపరుగు	10.82	12.64



వాహనాలకూ సైబర్ రిస్కులు

నివారణకు ఐడీపీఎస్, వీఎస్ఓసీలాంటి అధునాతన సాంకేతికతలు ● ప్రామాణిక ఫీచరుగా మారనున్న సైబర్‌సెక్యూరిటీ

కార్లు, రవాణా వాహనాలు మరింత కనెక్టెడ్‌గా, సాఫ్ట్‌వేర్ ఆధారితమైనవిగా మారిపోతున్న నేపథ్యంలో ఎయిర్‌బ్యాగ్‌లలాగా ఆటోమోటివ్ సైబర్‌సెక్యూరిటీ కూడా ప్రామాణిక ఫీచరుగా మారనుందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. అంతర్గతంగా వాహన నెట్‌వర్క్ ట్యాంపరింగ్, జీపీఎస్ సిగ్నల్ స్పూఫింగ్, స్టీరింగ్..బ్రేకింగ్ మొదలైన సిస్టమ్‌లను రిమోట్‌గా కంట్రోల్ చేయడం వంటి సైబర్‌సెక్యూరిటీపరమైన ముప్పులు కొత్త తరం వాహనాల్లో గణనీయంగా ఉంటున్నాయని పరిశ్రమవర్గాలు తెలిపాయి. ఇలాంటి రిస్కుల నుంచి వాహనాలను కాపాడేందుకు అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు కంపెనీలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా పలు సంస్థలు వాహన రంగం కోసం సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్‌ను రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నాయి. నియంత్రణ సంస్థలు నిర్దేశించినట్లుగా ఎయిర్‌బ్యాగ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఫీచర్ల తరహాలోనే డిజిటల్ భద్రత సాధనాలూ వాహనాల్లో తప్పనిసరి ఫీచర్లుగా మారొచ్చని సైబర్ సెక్యూరిటీ సంస్థ హ్యాకర్స్‌ఎరా వ్యవస్థాపకుడు వికాస్ చౌదరి తెలిపారు. ఐడీపీ ఎస్ (ఇన్‌ట్రూజన్ డిటెక్షన్ అండ్ ప్రివెన్షన్ సిస్టమ్స్), వీఎస్ఓసీ (వెహికల్ సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్స్) లాంటి సిస్టమ్‌లు ముప్పులను నివారించడానికే కాకుండా కొను గోలు ప్రణాళికలనూ ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు.

రియల్ టైమ్ పర్యవేక్షణ..

పెద్ద ఎత్తున వాహనాలను నిర్వహించే ఫ్లీట్ ఆపరేటర్లు, కనెక్టెడ్ ప్రజా రవాణా వ్యవస్థలు మొదలైన వాటికి సంబంధించి ఏ ఒక్క వాహనంలోనైనా సెక్యూరిటీపరమైన సమస్యలు తలెత్తితే అవి మొత్తం నెట్‌వర్క్ అంతటికీ వ్యాపించే అవకాశం ఉంటుందని చౌదరి తెలిపారు. ఇలాంటి వాటిని కట్టడి చేసేందుకు రూపొందించిన వీఎస్ఓసీలు సాంప్రదాయ ఐటీ సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్లలాగానే పని చేస్తాయి. కానీ ఇవి ప్రత్యేకంగా వాహనాల కోసం రూపొందించినవై ఉంటాయి. వాహనాల నుంచి వీటికి రియల్ టైమ్‌లో డేటా లభిస్తుంది. తద్వారా రిస్కులకు దారి తీసే ధోరణులను, ముప్పులను ఇవి పసిగట్టగలవు. కొత్త తరం వాహనాలకు డిజిటల్ సేఫ్టీ ప్రోగ్రాంలను రూపొందించడం కోసం వాహనాల తయారీ సంస్థలు, సరఫరాదారులు, మొబిలిటీ స్టార్టప్‌లతో తాము కలిసి పని చేస్తున్నట్లు చౌదరి వివరించారు. ఎథర్‌నెట్, ఆర్‌ఎఫ్, బ్లూటూత్ మొదలైన వాటన్నింటికీ దేని రిస్కు దానికి ఉంటుందని, ఒక్కో దానికి ఒక్కో రకమైన రక్షణ అవసరమని పేర్కొన్నారు. కనెక్టెడ్ వాహనాల్లో బలహీనతలను గుర్తించేందుకు, తగిన విధంగా పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాల్సి ఉంటుందని టాటా మోటార్స్ ప్రతినిధి తెలిపారు. ఐఎస్‌వో/ఎస్ఏఈ 21434లాంటి పరిశ్రమ ప్రమాణాలకు కట్టుబడి ఉండటం ద్వారా ఉత్తమ విధానాలను పాటించవచ్చని పేర్కొన్నారు. కంపెనీలు ఎప్పటికప్పుడు వాహన సాఫ్ట్‌వేర్‌ను లేటెస్ట్ సెక్యూరిటీ ప్యాచ్‌లతో అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. సైబర్ సెక్యూరిటీకి సంబంధించి ఏఐఎస్ 189 ప్రమాణాలు భారత్‌లో కూడా అమల్లోకి రానున్నట్లు చౌదరి చెప్పారు. ఇక యూఎన్ ఆర్155, ఐఎస్‌వో 21434లాంటి గ్లోబల్ ప్రమాణాలు కూడా ప్రాచుర్యంలోకి వస్తున్న నేపథ్యంలో వాహనాల సైబర్‌సెక్యూరిటీ కేవలం ఉత్తమ విధానంగానే కాకుండా చట్టబద్ధంగా అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని చెప్పారు. ఇప్పటి వరకు వాహనం 'ఎంత మైలేజీ' ఇస్తుందనే మాట్లాడుకుంటూ ఉండగా.. ఇకపై 'ఎంత సెక్యూర్‌గా ఉంటుంది' అని మాట్లాడుకునే రోజులు వస్తాయని పేర్కొన్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

టెలికం యూజర్లు @ 119 కోట్లు

జనవరిలో ఎయిర్‌టెల్ జోరు



న్యూఢిల్లీ: దేశీయంగా టెలికం యూజర్ల సంఖ్య జనవరిలో స్వల్పంగా పెరిగి 119 కోట్లకు చేరింది. వైర్‌లైన్, మొబైల్ సెగ్మెంట్లలో కొత్త సబ్‌స్క్రయిబర్స్‌ను దక్కించుకోవడంలో ఎయిర్‌టెల్ అగ్రస్థానంలో నిలిచింది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ సోమవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం గతేడాది డిసెంబర్‌లో 118.99 కోట్లుగా ఉన్న టెలికాం సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య జనవరిలో 119.20 కోట్లకు పెరిగింది. మొబైల్, వైర్‌లైన్ సెగ్మెంట్‌లో ఎయిర్‌టెల్ యూజర్లు వరుసగా 16.53 లక్షలు, 1.17 లక్షల మేర పెరిగారు. 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్‌ను వైర్‌లెస్ సర్వీసుగా ట్రాయ్ వర్గీకరించింది. ప్రస్తుతం ఈ విభాగంలో 48.44 లక్షల యూజర్లతో రిలయన్స్ జియో అగ్రస్థానంలో, 8.72 లక్షల సబ్‌స్క్రయిబర్స్‌తో ఎయిర్‌టెల్ రెండో స్థానంలో ఉన్నాయి.

మరిన్ని ముఖ్యాంశాలు..

- మొబైల్ సెగ్మెంట్‌లో జియో 46.5 కోట్ల యూజర్లతో నంబర్‌వన్‌గా, 38.69 కోట్ల మందితో ఎయిర్‌టెల్ రెండో స్థానంలో ఉన్నాయి. వొడాఫోన్ ఐడియా 13 లక్షల కనెక్షన్లను, ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ 3.69 లక్షలు, ఎంటీఎన్ఎల్ 2,617 మంది కస్టమర్లను కోల్పోయాయి.
- వైర్‌లైన్ విభాగంలో బీఎస్ఎన్ఎల్ 39,953, ఎంటీఎన్ఎల్ 9,904, క్వాడ్రాంట్ 4,741, వొడాఫోన్ ఐడియా 3,447 మంది కస్టమర్లను పోగొట్టుకున్నాయి.
- జియో, ఎయిర్‌టెల్ నిర్దేశిత ఫార్మాట్‌లో డిసెంబర్, జనవరి డేటాను సమర్పించకపోవడంతో ట్రాయ్ బ్రాడ్‌బ్యాండ్ యూజర్ల వివరాలను అప్‌డేట్ చేయలేదు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

ఏటా 80 లక్షల ఉద్యోగాలు కల్పించాలి	స్టీల్‌పై 12 శాతం సేఫ్‌గార్డ్ డ్యూటీ

ఐదో రోజూ బుల్ రంకెలు

- బ్యాంకులు, ఐటీ షేర్లకు భారీ డిమాండ్
- సెన్సెక్స్ లాభం 855 పాయింట్లు
- 274 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- 5 ట్రిలియన్ డాలర్లకు సంపద



ముంబై: దేశీయ కార్పొరేట్ కంపెనీలు క్యూ4లో మెరుగైన ఆర్థిక ఫలితాల వెల్లడి, విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లతో స్టాక్ సూచీలు ఐదో రోజూ లాభపడ్డాయి. సోమవారం సెన్సెక్స్ 855 పాయింట్లు పెరిగి 79 వేల స్థాయిపైన 79,409 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 274 పాయింట్లు బలపడి 24,126 వద్ద నిలిచింది. దేశీయ స్టాక్ మార్కెట్ వరుస ర్యాలీతో ఇన్వెస్టర్లకు లాభాల పంట పడింది. వరుస అయిదు ట్రేడింగ్ సెషన్లలో రూ.32.03 లక్షల కోట్లు సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే, బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.425.85 లక్షల కోట్ల(5 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. ఉదయమే సానుకూలంగా మొదలైన సూచీలు రోజంతా లాభాలతో ట్రేడయ్యాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా బ్యాంకులు, ఐటీ షేర్లకు భారీ డిమాండ్ లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 1,082 పాయింట్లు పెరిగి 79,635 వద్ద, నిఫ్టీ 338 పాయింట్లు బలపడి 24,190 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి.

- సెన్సెక్స్ సూచీలో ఆరు మినహా మిగిలిన 24 షేర్లూ లాభపడ్డాయి. బీఎస్ఈలో రంగాల వారీగా సూచీల్లో ఆయిల్‌అండ్‌గ్యాస్ 2.61%, విద్యుత్ 2.50%, ఐటీ, రియల్టీ, ఆటో, మెటల్ ఇండెక్సులు రెండుశాతం పెరిగాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్‌లు వరుసగా 2.20%, 1.67 శాతం ఎగబాకాయి.
- మెరుగైన ఆర్థిక ఫలితాల ప్రకటనతో అధిక వెయిటేజీ కంపెనీల షేర్లు రాణించాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 1%, ఇన్ఫోసిస్ 2%, ఐసీఐసీఐ బ్యాంకు అరశాతం చొప్పున పెరిగాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు (రూ.1,951) ఏడాది గరిష్టాన్ని, ఐసీఐసీఐ బ్యాంకు (రూ.1,436) వద్ద జీవిత కాల గరిష్టాన్ని అందుకున్నాయి. అలాగే రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు సైతం 2% రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచింది.
- ముత్తూట్ ఫైనాన్స్ రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతి ఈక్విటీ షేరుకు రూ.26 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.
- బ్యాంకు ఆఫ్ బరోడాలో ఎల్ఐసీఐ వాటా పెంచుకుంది. ఏడాదిన్నర కాలంలో 10.45 కోట్ల షేర్లను (2%) చేజిక్కించుకున్నట్లు తెలిపింది. తద్వారా బ్యాంకు ఆఫ్ బరోడాలో తమ వాటా 5.03% నుంచి 7.05 శాతానికి చేరిందని ఎల్ఐసీ పేర్కొంది.


కొనసాగుతున్న రూపాయి ర్యాలీ

రూపాయి ఐదో రోజూ బలపడింది. డాలర్ మారకంలో 23 పైసలు పుంజుకుని 85.15 వద్ద స్థిరపడింది. డాలర్ ఇండెక్స్ మూడేళ్ల కనిష్టానికి దిగిరావడంతో పాటు దేశీయ ఈక్విటీ ర్యాలీ... భారత కరెన్సీ బలోపేతానికి దన్నుగా నిలిచాయి.

మందగించిన మౌలికం..

మార్చిలో వృద్ధి 3.8 శాతానికి పరిమితం

న్యూఢిల్లీ: కీలకమైన 8 మౌలిక రంగాల గ్రూప్ వృద్ధి మార్చి నెలలో 3.8%కి పరిమితమైంది. గత మార్చి నెలలో నమోదైన 6.3%తో పోలిస్తే మందగించింది. నెలవారీగా చూస్తే ఫిబ్రవరిలో నమోదైన 3.4%తో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. తాజా గణాంకాల ప్రకారం మార్చి నెలలో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి నెగటివ్‌లోకి జారిపోయింది. బొగ్గు, రిఫైనరీ ఉత్పత్తులు, ఉక్కు, విద్యుదుత్పత్తి వృద్ధి వరుసగా 1.6%, 0.2%, 7.1%, 6.2 శాతంగా ఉంది., ఎరువుల ఉత్పత్తి 8.8%, సిమెంట్ ఉత్పత్తి 11.6% పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఎనిమిది మౌలిక రంగాల ఉత్పత్తి 7.6 శాతం నుంచి 4.4 శాతానికి నెమ్మదించింది.



భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

యూజీసీ నెట్ జూన్-2025

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్), జూన్ 2025 పరీక్షకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్), యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీపడేందుకు, పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తారు.

- **మొత్తం సబ్జెక్టుల సంఖ్య:** 85.
- **అర్హత:** 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ, ఎన్‌సీఎల్, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్ జెండర్ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలి.
- **వయసు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)కు 01.06.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ట వయోపరిమితి లేదు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. ఆబ్జెక్టివ్‌టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.05.2025
- **పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరితేది:** 08.05.2025.
- **పరీక్ష తేది:** 21.06.2025 నుంచి 30.06.2025 వరకు
- **వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in

జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ).. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సుల వివరాలు:** బీటెక్/బీటెక్(ఐడీపీ), ఎంటెక్/ఎంఫార్మ్/బీబీఏ(డేటా అనలిటిక్స్)/బీబీఏ(రెగ్యులర్)/ఎంటెక్/ఎంసీఏ/ఎంఎస్సీ/పీహెచ్‌డీ.
- **అర్హత:** ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జేఎన్‌టీయూ, హైదరాబాద్, డైరెక్టర్, యూనివర్సిటీ ఫారెన్ రిలేషన్స్, రెండో అంతస్తు, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500085 చిరునామకు పంపించాలి.
- **యూజీ దరఖాస్తులకు చివరితేది:** 16.06.2025
- **పీజీ దరఖాస్తులకు చివరితేది:** 14.08.2025.
- **పీహెచ్‌డీ దరఖాస్తులకు చివరితేది:** 30.10.2025.
- **వెబ్‌సైట్:** https://www.jntuh.ac.in

ఎన్‌ఏబీఎఫ్ఐడీ, ముంబైలో 31 పోస్టులు

ముంబైలోని నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఏబీఎఫ్ఐడీ).. రెగ్యులర్ ప్రాతిపదికన సీనియర్ అనలిస్ట్ గ్రేడ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 31.
- **పోస్టుల వివరాలు:** లీడింగ్ ఆపరేషన్స్(లీడింగ్ అండ్ ప్రాజెక్ట్ ఫైనాన్స్)-10, అకౌంట్స్-01, ట్రెజరీ-01, లీగల్-03, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-02, రాజ్‌భాషా/అఫీషియల్ లాంగ్వేజ్-01, రిస్క్ మేనేజ్‌మెంట్-08, ఇంటర్నల్ ఆడిట్-01, అడ్మినిస్ట్రేషన్-01, హ్యూమన్ రిసోర్స్-01, రిస్క్ మేనేజ్‌మెంట్ -ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ-01, ఎకనామిస్ట్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ/సీఏ/సీఎంఏ/ఐసీడబ్ల్యూఏ/బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ విద్యార్హతలతోపాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 21 నుంచి 40 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.05.2025.
- **వెబ్‌సైట్:** https://nabfid.org

అసిస్టెంట్ లోకో పైలట్ కొలువులు



రైల్వే జాబ్స్

- 9,970 పోస్ట్‌లకు రైల్వే నోటిఫికేషన్ విడుదల
- ఆర్ఆర్‌బీ-సికింద్రాబాద్ పరిధిలో 1,500 పోస్టులు
- రాత పరీక్ష, ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
- ప్రారంభంలోనే రూ.35 వేలకు పైగా వేతనం

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఆర్ఆర్‌బీ).. ప్రభుత్వ ఉద్యోగార్థులకు సుపరిచితమైన పేరు! పదో తరగతి నుంచి ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణుల వరకు.. ఆర్ఆర్‌బీ నుంచి నోటిఫికేషన్ల కోసం లక్షల మంది వేచి చూస్తున్న పరిస్థితి! ఇలాంటి వారికోసం ఆర్ఆర్‌బీ భారీ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌తో ముందుకొచ్చింది! దేశవ్యాప్తంగా ఉన్న పలు ఆర్ఆర్‌బీల పరిధిలో మొత్తం 9,970 అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఆర్ఆర్‌బీ తాజా నోటిఫికేషన్ వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

మొత్తం 9,970 పోస్టులు

భారత రైల్వే శాఖ ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం-దేశవ్యాప్తంగా 20 ఆర్ఆర్‌బీల పరిధిలో మొత్తం 9,970 అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆర్ఆర్‌బీ-సికింద్రాబాద్ పరిధిలో 1,500 ఖాళీలున్నాయి. వీటిలో దక్షిణ మధ్య రైల్వేలో 967 పోస్టులు, ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో 533 పోస్టులు భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు ఏదో ఒక ఆర్ఆర్‌బీకి మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సదరు ఆర్ఆర్‌బీ పరిధిలోని జోన్లను ప్రాధాన్యత క్రమంలో ఎంచుకోవాలి. దీనికి అనుగుణంగానే తుది నియామకాలకు పరిగణలోకి తీసుకుంటారు.

విద్యార్హత

ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మిల్‌రైట్/మెయింటనెన్స్ మెకానిక్, మెకానిక్(రేడియో అండ్ టీవీ), మెకానిక్(మోటార్ వెహికిల్), వైర్‌మ్యాన్, ట్రాక్టర్ మెకానిక్, ఆర్మేచర్ అండ్ కాయిల్ వైండర్, మెకానిక్(డీజిల్), హీట్ ఇంజన్, టర్నరల్, మెకనిస్ట్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్ ట్రేడ్‌లలో ఏదో ఒక ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత(లేదా) మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లతో డిప్లొమా లేదా బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు: జూలై 1, 2025 నాటికి 18-30 సంవత్సరాలు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ(నాన్-క్రీమీ లేయర్) వర్గాలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడంచెల ఎంపిక

అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టుల భర్తీకి మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-1, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్.

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-1

ఎంపిక ప్రక్రియలో తొలి దశగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-1ను నిర్వహిస్తారు. ఒక గంట వ్యవధిలో ఉండే ఈ పరీక్షలో.. మ్యాథమెటిక్స్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి 75 ప్రశ్నలు అడుగుతారు.

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-2

- తొలిదశ సీబీటీ-1లో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 15 మందిని చొప్పున ఎంపిక చేసి.. రెండో దశలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-2ను నిర్వహిస్తారు. ఇందులో పార్ట్-ఎ, పార్ట్-బి పేరుతో రెండు విభాగాలు ఉంటాయి.
- పార్ట్-ఎలో మ్యాథమెటిక్స్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, బేసిక్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 100 ప్రశ్నలతో 90 నిమిషాల వ్యవధిలో పార్ట్-ఎ ఉంటుంది.
- పార్ట్-బిలో సంబంధిత ట్రేడ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 75 ప్రశ్నలకు 60 నిమిషాల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. పార్ట్-బి పూర్తిగా అర్హత పరీక్ష మాత్రమే. రెండు పేపర్లలోనూ నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును తగ్గిస్తారు.

ప్రాంతీయ భాషల్లో పరీక్ష

అసిస్టెంట్ లోకో పైలట్ ఎంపిక ప్రక్రియలో.. సీబీటీ-1, 2లను 13 ప్రాంతీయ భాషల్లోనూ నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు తెలుగు లేదా ఉర్దూలో పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. మూడో దశ పరీక్ష సీబీఏటీని మాత్రం ఇంగ్లిష్ లేదా హిందీ మాధ్యమంలోనే నిర్వహిస్తారు.

మూడో దశ సీబీఏటీ

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-2లో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఒక్కో పోస్ట్‌కు ఎనిమిది మందిని చొప్పున (1:8 నిష్పత్తిలో) మూడో దశ కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా సైకో మాటిక్ టెస్ట్, రీజనింగ్ టెస్ట్, అదే విధంగా పరిశీలన, తులనాత్మక పరిశీలన అంశాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా రియాక్షన్ టైమ్ టెస్ట్, ఫామ్ పర్సెప్షన్ టెస్ట్, గ్రూప్ బోర్డన్ టెస్ట్, స్పీడ్ పర్సెప్షన్ టెస్ట్, విజువల్ డిఫరెన్షియేటింగ్ టెస్ట్‌లు ఉంటాయి. 100 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో అభ్యర్థులు ప్రతి టెస్ట్‌లో కనీసం 42 మార్కులు సాధించాల్సి ఉంటుంది.

తుది జాబితా ఇలా

తుది జాబితా రూపకల్పనలో వెయిటేజీ విధానం ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-2లోని పార్ట్-ఎలో పొందిన మార్కులకు 70 శాతం వెయిటేజీ; కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూట్ టెస్ట్ మార్కులకు 30 శాతం వెయిటేజీ కల్పించి.. దానికి అనుగుణంగా తుది జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి చివరగా డాక్యుమెంట్ వెరిఫికేషన్ పేరుతో సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. ఈ దశను కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంటే అసిస్టెంట్ లోకో పైలట్‌గా కొలువు సొంతమైనట్లే.

పే లెవల్-2

అసిస్టెంట్ లోకో పైలట్‌గా ఎంపికైన వారికి పే లెవల్-2తో ప్రారంభ వేతనం లభిస్తుంది. రూ.19,900-రూ.34,500 వేతన శ్రేణితో కెరీర్ ప్రారంభం అవుతుంది. నికర వేతనం రూ.35 వేలుగా ఉంటుంది.

ఎంపిక ప్రక్రియలో రాణించేలా

లోకో పైలట్ నియామకాలకు కీలకంగా నిలుస్తున్న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-1, టెస్ట్-2లలో విజయానికి సబ్జెక్ట్ వారీగా దృష్టి సారించాల్సిన అంశాలు..

మ్యాథమెటిక్స్

మ్యాథమెటిక్స్ సిలబస్‌లోని నంబర్ సిస్టమ్, బాడ్‌మాస్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎఫ్, రేషియో అండ్ ప్రపోర్షన్, పర్సంటేజెస్, మెన్సురేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్, ఇంట్రస్ట్, ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, ట్రిగనోమెట్రీ, జామెట్రీ, కేలండర్ అండ్ క్లాక్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం తొలుత పాఠశాల స్థాయి పాఠ్యపుస్తకాల్లోని అంశాలకు సంబంధించిన ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా బ్యాంకు, ఎస్ఎస్‌సీ, రైల్వే పరీక్షలకు సంబంధించిన పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది.

జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్

సిలబస్‌లో అనాలజీస్, ఆల్ఫాబెటికల్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, మ్యాథమెటికల్ ఆపరేషన్స్, రిలేషన్‌షిప్స్, జంబ్లింగ్, వెన్‌డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ డేటా సఫిషియెన్సీ, కన్‌క్లూజన్ అండ్ డెసిషన్ మేకింగ్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనలిటికల్ రీజనింగ్, క్లాసిఫికేషన్, డైరెక్షన్స్ తదితర అంశాలపై దృష్టిపెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్‌లో.. జాతీయ, అంతర్జాతీయ కరెంట్ అఫైర్స్,క్రీడలు, భారతదేశ చరిత్ర-సంస్కృతి, స్వాతంత్ర్య ఉద్యమం, భారత, ప్రపంచ జాగ్రఫీ, రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్షం, భారత అణు కార్యక్రమం, ఐక్యరాజ్యసమితి, ఇతర ముఖ్యమైన అంతర్జాతీయ సంస్థలు, పర్యావరణ అంశాలు, కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, భారత ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ పథకాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

జనరల్ సైన్స్

పదో తరగతి స్థాయిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్‌ను అధ్యయనం చేయాలి. ఫిజిక్స్‌లో మెకానిక్స్, హీట్, లైట్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, మోడర్న్ ఫిజిక్స్ తదితర అంశాల్లోని బేసిక్ కాన్సెప్టులపై దృష్టి పెట్టాలి. కెమిస్ట్రీలో ఆటమ్స్, మాలిక్యూల్స్, మెటల్స్ అండ్ నాన్ మెటల్స్, కార్బన్ కాంపౌండ్స్, మెటలర్జీ తదితర అంశాలపై పట్టుసాధించాలి. లైఫ్ సైన్సెస్‌కు సంబంధించి విటమిన్లు, న్యూట్రిషన్, హార్మోన్లు, ఎంజైమ్‌లు, సూక్ష్మజీవులు, వ్యాధులు, టీకాలు, పర్యావరణం అంశాలను అధ్యయనం చేయాలి.

బేసిక్ సైన్స్, ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ డ్రాయింగ్, యూనిట్స్, మెజర్‌మెంట్స్; మాస్ వెయిట్ అండ్ డెన్సిటీ; వర్క్ పవర్ అండ్ ఎనర్జీ; స్పీడ్ అండ్ వెలాసిటీ; హీట్ అండ్ టెంపరేచర్; బేసిక్ ఎలక్ట్రిసిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

పార్ట్-బికు ఇలా

నిర్దేశిత ట్రేడ్‌లో ప్రశ్నలు అడిగే సీబీటీ-2లోని పార్ట్-బిలో రాణించడానికి అభ్యర్థులు సంబంధిత ట్రేడ్ అకడమిక్ పుస్తకాలను అభ్యయనం చేయాలి. ఇందులో పొందిన మార్కులను తుది జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోరు. కానీ.. అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం


- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, మే 11
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** మే 14 నుంచి మే 23 వరకు.
- **సీబీటీ-1 పరీక్ష:** జూలై-ఆగస్ట్ మధ్యలో నిర్వహించే అవకాశం. **సీబీటీ-2 పరీక్ష:** సెప్టెంబర్‌లో నిర్వహించే అవకాశం. **సీబీఏటీ పరీక్ష తేదీ:** నవంబర్‌లో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.rrbsecunderabad.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

- సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ
- టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
- గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-కెమిస్ట్రీ
- బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్

అతివల ఆయుష్షే గట్టిదట!



పురుషుల కంటే మహిళల ఆయుర్దాయం రెండేళ్లు అధికం

- 2036 నాటికి 3.5 ఏళ్లకు పెరుగుతుందని అంచనా
- తెలంగాణలో ఇప్పటికే స్త్రీ, పురుషుల ఆయుష్షులో మూడేళ్ల తేడా
- రాష్ట్రంలో మహిళల వివాహ వయసు సగటు 23 ఏళ్లు
- ఏపీలో 22.5 సంవత్సరాలు.. కశ్మీర్‌లో అత్యధికంగా 22.7 ఏళ్లు
- ఉమెన్ అండ్ మెన్ ఇండియా-2024 నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పురుషులు, మహిళల్లో సాధారణంగా ఎవరు ఎక్కువ కాలం జీవిస్తారు? ప్రపంచమంతా ఏమోగానీ మనదేశంలో మాత్రం మహిళలే ఎక్కువ కాలం జీవిస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించింది. గణాంక, కార్యక్రమాల అమలు శాఖ పరిధిలోని సామాజిక గణాంకాల విభాగం ఇటీవల 'ఉమెన్ అండ్ మెన్ ఇండియా–2024' పేరుతో తన 26వ సంచికను విడుదల చేసింది. పురుషులు, మహిళల ఆయుర్దాయంపై ఈ సంచికలో పలు కీలక విషయాలు వెల్లడించింది. ఆ వివరాలు ఇవీ..

- గత 40 ఏళ్లుగా మనదేశంలో పురుషుల కంటే మహిళల ఆయుర్దాయమే ఎక్కువగా ఉంది. ప్రస్తుత లెక్కల ప్రకారం పురుషుల కంటే మహిళలు సగటున రెండేళ్లు అధికంగా జీవిస్తున్నారు.
- 2036 నాటికి ఈ వ్యత్యాసం 3.5 ఏళ్లకు పెరుగుతుంది. తెలంగాణలో ఇప్పటికే స్త్రీ, పురుషుల మధ్య మూడేళ్ల ఆయుర్దాయ వ్యత్యాసం కనిపిస్తోంది.
- దేశంలో మహిళల వివాహ వయసు ఒడిదుడుకులకు లోనవుతోంది. కొన్ని సంవత్సరాల్లో పెరుగుతుండగా, కొన్నేళ్లలో తగ్గుతోంది. 2017లో మహిళల వివాహ వయసు జాతీయ సగటు 22.1 ఏళ్లు ఉండగా, 2018లో 22.3 ఏళ్లకు పెరిగింది. 2019లో 22.1 ఏళ్లకు తగ్గి, 2020 నాటికి 22.7 ఏళ్లకు పెరిగింది. ప్రస్తుతం కూడా ఇదే వయసు కొనసాగుతోంది.
- తెలంగాణలో మహిళల సగటు వివాహ వయసు 23 ఏళ్లు కాగా, ఏపీలో 22.5 ఏళ్లుగా ఉంది. కేరళలో 23.4 ఏళ్లు, తమిళనాడులో 23.5 ఏళ్లు, కర్ణాటకలో 22.8 ఏళ్లు ఉంది. అత్యధికంగా జమ్మూకశ్మీర్‌లో సగటున 26 ఏళ్లకు అమ్మాయిలు పెండ్లిళ్లు చేసుకుంటుండగా, పశ్చిమబెంగాల్‌లో అత్యల్పంగా 21 ఏళ్లకే వివాహాలు జరిగిపోతున్నాయి.
- పొగాకు వాడుతున్న మహిళల్లో ఈశాన్య రాష్ట్రాలవారే ఎక్కువగా ఉన్నారు. మిజోరంలో 62 శాతం, త్రిపురలో 51 శాతం, మణిపూర్‌లో 43% మంది స్త్రీలు పొగాకు వాడుతున్నారు. తెలంగాణలో ఇది 5.6% మాత్రమే. తెలంగాణ పురుషుల్లో 22.3% మంది పొగాకు వినియోగిస్తున్నారు.
- దేశ జనాభా 150 కోట్లు దాటేందుకు మరో 11 ఏళ్లు పడుతుందని నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం 140 కోట్లు దాటగా, 2026 నాటికి 142.5 కోట్లకు, 2031 నాటికి 147.8 కోట్లు, 2036 నాటికి 152.1 కోట్లకు చేరుతుందని నివేదిక అంచనా వేసింది.

దేశంలో జనాభా పెరుగుదల వివరాలు (కోట్లలో)

సంవత్సరం	పురుషులు	స్త్రీ	మొత్తం
1951	18.5	17.5	36.1
1961	22.6	21.2	43.8
1971	28.4	26.4	54.8
1981	35.3	32.9	68.2
1991	43.9	40.7	84.6
2001	53.2	49.6	102.8
2011	62.3	58.7	121.0
2021	70.0	66.2	136.2
2026	73.2	69.3	142.5
2031	75.8	72	147.8
2036	77.9	74.2	152.1

నోట్: 2026, 2031, 2036 సంవత్సరాలకు చెందిన జనాభా కేవలం అంచనాలు మాత్రమే.

ఆయుర్దాయ గణాంకాలు (సంవత్సరాలు)

సంవత్సరం	పురుషులు	మహిళలు
2016-20	68.6	71.4
2021-25	69.4	72.7
2026-30	70.4	73.7
2031-36	71.2	74.7

(26 - 36 ఏళ్ల మధ్యవి అంచనాలు మాత్రమే)

కీరవాణి నన్ను టార్గెట్ చేశారు

- వెడ్డింగ్ ఈవెంట్స్ చేసేవాళ్లు గాయకులే కాదనడం చాలాపెద్ద తప్పు
- ఈటీవీ 'పాడుతా తీయగా' కంటెస్టెంట్ ప్రవస్తి ఆరాధ్య ఆవేదన
- ఆయన కంపోజ్ చేసిన పాటలు పాడితేనే ఎక్కువ మార్కులు వేస్తారు
- సింగర్స్‌ని తక్కువ చేసి మాట్లాడతారు.. పక్షపాతంగా వ్యవహరిస్తారు
- వాళ్లకు నచ్చిన వాళ్లను విజేతలుగా ప్రకటిస్తున్నారన్న గాయని
- పెద్దవాళ్ల గురించి మాట్లాడితే అవకాశాలు రావని చాలామంది బయటకు చెప్పడం లేదని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: 'వెడ్డింగ్ షోస్ చేసేవారు అసలు సింగర్సే కాదని కీరవాణి ఓ సందర్భంలో అన్నారు. నేను వెడ్డింగ్ ఈవెంట్స్ చేస్తుంటాను.. చేస్తే తప్పేంటి? ఎంతో ప్రతిభావంతులు, ఆస్కార్ అవార్డు గ్రహీత అయిన కీరవాణి అలా మాట్లాడటం నా మనసుని చాలా నొప్పించింది. ఆయన ఎందుకు అలా మాట్లాడారా అని బాధగా అనిపించింది..' అంటూ గాయని ప్రవస్తి ఆరాధ్య చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ఈటీవీలో ప్రసారం అవుతున్న సింగింగ్ రియాలిటీ షో 'పాడుతా తీయగా' సిల్వర్ జూబ్లీ సిరీస్‌కు సంగీత దర్శకుడు కీరవాణి, గాయని సునీత, పాటల రచయిత చంద్రబోస్ జడ్జీలుగా వ్యవహరిస్తున్నారు. దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ హోస్ట్‌గా ఉన్నారు. ఈ షోలో పాల్గొన్న ప్రవస్తి ఆరాధ్య అతి త్వరగా ఎలిమినేట్ అవడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే ఆమెకు మంచి గాయనిగా పేరుంది. గతంలో 'సరిగమ', 'సై అంటే సై', 'సూపర్ సింగర్' వంటి పలు సింగింగ్ రియాలిటీ షోల్లో తన అద్భుతమైన గానంతో వీక్షకులను రంజింపజేసి విజేతగా నిలిచారు. అలాంటి ఆమె 'పాడుతా తీయగా' నుంచి అంత త్వరగా తప్పించబడటం చర్చనీయాంశమైంది. దీనిపై ప్రవస్తి స్పందిస్తూ ఇన్‌స్టాగామ్ వేదికగా పోస్టులు పెట్టారు.

సిఫారసులుంటేనే ఆ 'షో'కి వెళ్లండి

'పాడుతా తీయగా' ప్రోగ్రామ్‌కి వెళ్లాలనుకుంటున్న సింగర్స్‌కి నా సలహా ఒక్కటే. ఎవరైనా సిఫారసు చేస్తేనో లేకుంటే ఆ షోలోని జడ్జీల నుంచి రిఫరెన్స్‌లు ఉంటేనో మాత్రమే పాల్గొనండి. ఆ రెండూ లేకుండా వెళ్తే మాత్రం మీకు అన్యాయం, మానసిక వేదన మాత్రమే ఎదురవుతాయి..'అంటూ తన ఆవేదన వ్యక్తం చేశారు. పాడుతా తీయగా షో గురించి, నిర్వాహకులు, జడ్జీలపై ఆమె తన యూట్యూబ్ చానల్ ద్వారా విడుదల చేసిన వీడియో తెగ వైరల్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.



బాలు గారి సమయంలో ఎలాంటి వివక్ష లేదు

'పాడుతా తీయగా' షోకి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గారు న్యాయ నిర్ణేతగా ఉన్నప్పుడు 2017లో తొలిసారిగా నేను కూడా పాల్గొన్నాను. ఆయన ఎలాంటి పక్షపాతం లేకుండా సింగర్స్ అందర్నీ చాలా బాగా ప్రోత్సహించారు. నేను కూడా ఫస్ట్ రన్నరప్‌గా నిలిచాను. ప్రస్తుతం జరుగుతున్న 'సిల్వర్ జూబ్లీ సిరీస్'కు అనారోగ్యం కారణంగా నేను ఆడిషన్స్ ఇవ్వలేదు. కానీ వాళ్లు అడగడంతో నేను కూడా పాల్గొని, పది పాటలు పాడా. ఈ షోలో మొత్తం 15 మంది పాల్గొనగా తొలుత ఇద్దర్ని ఎలిమినేట్ చేశారు. టాప్ 12 లిస్ట్ అంటూ ఆ తర్వాత నన్ను ఎలిమినేట్ చేయటం చాలామందికి ఆశ్చర్యంగా అనిపించింది. ఈ షో న్యాయంగా జరగడం లేదని, వారికి నచ్చినవాళ్లనే విజేతలుగా చేస్తున్నారని అర్థమైంది. పైగా షోలో పాల్గొన్నప్పుడు కీరవాణి మాటలతో నేను మానసిక వేదనకు గురయ్యా.

అలాంటివాళ్లు గాయకులే కాదనడం పెద్ద తప్పు

వెడ్డింగ్ ఈవెంట్స్ చేసుకునేవాళ్లను ఆయన అలా తక్కువ చేసి మాట్లాడటం నా దృష్టిలో తప్పే. వాళ్ల కుటుంబం కోసం, డబ్బులు సంపాదించడం కోసం ఇలాంటివి చేస్తుంటారు..అందులో తప్పేముంది? అలా చేసేవారు నా దృష్టిలో గాయకులే కాదు అనడం చాలా పెద్ద తప్పు. వ్యక్తిగతంగా ఆయనపై నాకు ఎలాంటి ద్వేషం లేదు. నా పాట గురించి బాగానే మాట్లాడారు. కానీ అంత పెద్ద స్థాయిలో ఉన్న ఆయన మా మనోభావాలు దెబ్బతినేలా ఎందుకు అలా మాట్లాడారు? అన్నదే నా బాధ. ఆయన మాటలను బట్టి చూస్తే నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారనిపించింది. పైగా ఆయన కంపోజ్ చేసిన పాటలు పాడిన వారికే ఎక్కువ మార్కులు వేస్తారు.

చాలామంది సింగర్స్ వివక్ష ఎదుర్కొన్నారు..

ఇలాంటి వివక్ష చాలా మంది సింగర్స్ ఎదుర్కొన్నారు. అయితే ఇలా మాట్లాడితే తమ కెరీర్‌కి ఇబ్బంది కలుగుతుందన్న భయంతో చాలా మంది మాట్లాడటం లేదు. ఈ విషయాన్ని వారు నాతో పంచుకున్నారు. జడ్జిమెంట్ విషయంలో చాలా అన్యాయం చేస్తున్నారంటూ ఇలాంటి రియాలిటీ షోలో పాల్గొన్న అందరూ కుమిలిపోతున్నారు. జడ్జీలు ఇచ్చే మార్కులు న్యాయంగా ఉండటం లేదు. షో దర్శకులు చెప్పినట్లు జడ్జీలు చేస్తున్నారు. పైగా పాట కూడా వాళ్లకి ఇష్టం వచ్చింది ఇస్తుంటారు. కానీ బయటికి మాత్రం మేము ఎంపిక చేసుకున్నట్లు చూపిస్తారు. 'పాడుతా తీయగా'లో నేను పది పాటలు పాడి ఎలిమినేట్ అయ్యాను. ప్రతిసారీ సునీత నెగిటివ్ కామెంట్స్ ఇచ్చారు. చంద్రబోస్ మొదటి రెండు ఎపిసోడ్స్ వరకూ నాకు మంచి అభినందనలు ఇచ్చారు. ఆ తర్వాత నుంచి నాకు నెగిటివ్ కామెంట్స్ ఇవ్వడం స్టార్ట్ చేశారు. కొంతమందిని ఆయన రికమెండ్ చేయడం, ప్రోత్సహించడం, లిరిక్స్ తప్పుగా పాడినా నెగిటివ్ కామెంట్స్ ఇవ్వకపోవడం, వాళ్లని ప్రత్యేకంగా ట్రీట్ చేయడం చాలా బాధగా అనిపించింది..'అని ప్రవస్తి తెలిపారు.


జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ సురేందర్ బదిలీ!

- సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- మొత్తంగా ఏడుగురు జడ్జీల బదిలీకి సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు చెందిన ఇద్దరు న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది. న్యాయవ్యవస్థలో పరిపాలనాభివృద్ధి, సమ్మిళితతత్వాన్ని పెంపొందించేందుకు ఈ బదిలీలు చేపడుతున్నట్లు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి. శ్రీసుధను కర్ణాటకకు, జస్టిస్ కె. సురేందర్‌ను మద్రాస్‌కు బదిలీ చేస్తూ సిఫార్సు చేసింది. జస్టిస్ శ్రీసుధ 2021 అక్టోబర్ 15న, జస్టిస్ సురేందర్ 2022 మార్చి 24న తెలంగాణ హైకోర్టు జడ్జీలుగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ హైకోర్టులో మొత్తం జడ్జీల మంజూరు సంఖ్య 42కాగా ప్రస్తుతం 30 మంది ఉన్నారు. వారి బదిలీకి కేంద్రం ఆమోద ముద్ర వేస్తే జడ్జీల సంఖ్య 28కి పడిపోనుంది. ఖాళీల సంఖ్య 14కు పెరగనుంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జస్టిస్ కె.మన్మథరావును కర్ణాటకకు.. కర్ణాటక హైకోర్టుకు చెందిన జస్టిస్ హేమంత్ చందన్‌గౌడర్‌ను మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ కృష్ణన్ నటరాజన్‌ను కేరళ హైకోర్టుకు, జస్టిస్ దీక్షిత్ కృష్ణశ్రీపద్‌ను ఒడిశా హైకోర్టుకు, జస్టిస్ ఎన్.శ్రీనివాసన్ సంజయ్‌గౌడను గుజరాత్ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం సిఫార్సు చేసింది.

ఒకే ఎఫ్ఐఆర్‌పై దర్యాప్తు చేయండి

లగచర్ల కేసులో 154, 155 ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో భూసేకరణ వివాదానికి సంబంధించిన ఘటనలో పోలీసులు ఇష్టారీతిన ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఒకే ఎఫ్ఐఆర్ (153)పై దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఎఫ్ఐఆర్ 154, 155లో ఇప్పటివరకు ఎవరి వాంగ్మూలమైనా రికార్డు చేస్తే దాన్ని 153 ఎఫ్ఐఆర్ కింద పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. ఎఫ్ఐఆర్ 154, 155లను కొట్టేస్తూ తీర్పునిచ్చింది. గతేడాది నవంబర్ 11న లగచర్లలో భూసేకరణపై చర్చ సందర్భంగా కలెక్టర్ సహా పలువురు అధికారులపై దాడి జరగడం తెలిసిందే. ఈ దాడి వెనుక పలువురు రైతులు కూడా ఉన్నారని ఎఫ్ఐఆర్ 153 నమోదు చేసిన పోలీసులు.. ఆ తర్వాత ఇదే అంశంలో మరో రెండు ఎఫ్ఐఆర్‌లు (154, 155) నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ 153లోని కొందరు రైతులను 154, 155 ఎఫ్ఐఆర్లలోనూ నిందితులుగా పేర్కొన్నారు. ఇది టీటీ అంటోనీ వర్సెస్ కేరళ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధమంటూ రైతు విష్ణువర్ధనరెడ్డితోపాటు మరికొందరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి కె.లక్ష్మణ్.. ఒకే అంశంపై పలు ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయడం సరికాదన్నారు. ఎఫ్ఐఆర్ 153 కింద దర్యాప్తు చేపట్టవచ్చని పోలీసులకు స్పష్టం చేశారు. మరో రెండు ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ తీర్పునిచ్చారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

‘సమితి’ సంబరాలకు వేళాయె

బీఆర్‌ఎస్ పాతికేళ్ల పండుగకు వేదిక సిద్ధం

- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి–చింతలపల్లి శివారులో నిర్వహణ
- పార్కింగ్, ఇతర సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- ఎల్కతుర్తి చుట్టూ జిల్లాల పార్కింగ్ స్థలాల ఏర్పాటు
- సభాస్థలి, ఏర్పాట్ల పర్యవేక్షణకు పెరిగిన నేతల తాకిడి
- ఇప్పటికీ రాని హరీశ్‌రావు, కేటీఆర్‌లు.. అన్నీ తానై పర్యవేక్షిస్తున్న కేసీఆర్
- ఉమ్మడి వరంగల్ నేతలతో ఉదయం, సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్
- నేడు ఎల్కతుర్తికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వేదిక ఏర్పాట్ల పరిశీలన.. అనంతరం ముఖ్యనేతలతో భేటీ


హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి- చింతలపల్లి శివారులో సిద్ధమైన రజతోత్సవ సభావేదిక, బారికేడింగ్, ఫ్లడ్‌లైట్లు

సాక్షి ప్రతినిధి, వరంగల్: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పాతికేళ్ల పండుగ వేడుకలకు సభావేదిక సిద్ధమైంది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి – చింతలపల్లి శివారులో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో సభావేదిక, సభకు హాజరయ్యే జనం కోసం ఏర్పాట్లు పూర్తి దశకు చేరుకున్నాయి. భారీ జనసమీకరణ చేయనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉద్యమ పార్టీగా అవతరించిన బీఆర్ఎస్ (టీఆర్‌ఎస్) 25 ఏళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పదిహేను రోజులుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఎల్కతుర్తి, చింతలపల్లి, దామెర, కొత్తపల్లి, గోపాల్‌పూర్ శివార్లలో 1200 ఎకరాలకు పైగా భూసేకరణ చేసిన బీఆర్‌ఎస్ నేతలు.. సుమారు వెయ్యి ఎకరాలకు పైగా పార్కింగ్ కోసమే కేటాయించారు.

వెయ్యి ఎకరాల్లో పార్కింగ్

- రాష్ట్ర నలుమూలలనుంచి జనాలను తరలించే వాహనాల కోసం సుమారు వెయ్యి ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వచ్చే వాహనాల కోసం హనుమకొండ – ఎల్కతుర్తి మార్గం.. ఎల్కతుర్తి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో సుమారు 400 ఎకరాలు కేటాయించారు.
- ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం హుజూరాబాద్ – ఎల్కతుర్తి మార్గంలో సభకు సుమారు కిలోమీటర్ దూరంలో గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల సమీపంలో 200 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.
- ఉమ్మడి మెదక్, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ముల్కనూర్ – ఎల్కతుర్తి మార్గంలో గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్ రోడ్డుకిరువైపులా 200 ఎకరాల పార్కింగ్ కేటాయించారు.
- దేవునూరు, ఉనికిచర్ల మీదుగా సభకు హాజరయ్యే జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల వారి కోసం కూడా పార్కింగ్ స్థలం కేటాయించారు.

కేసీఆర్ కనుసన్నల్లో ఏర్పాట్లు

బీఆర్‌ఎస్ పాతికేళ్ల పండుగ వేడుకలకు మరో ఐదు రోజులే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అధినేత, గులాబీ దళపతి కేసీఆర్ సభావేదిక ఏర్పాట్లను అన్నీ తానై పర్యవేక్షిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ఉమ్మడి వరంగల్‌కు చెందిన సభా బాధ్యులు, ముఖ్యనేతలతో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. సభా వేదిక ఏర్పాట్లను అడిగి తెలుసుకోవడంతో పాటు పలు సూచనలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ గ్యాదరి బాలమల్లు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు సభా వేదిక, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ముఖ్యనేతలు సిరికొండ మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తక్కళ్లపెల్లి రవిందర్‌రావులతోపాటు ఇతర జిల్లాలకు చెందిన బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు సభా వేదిక, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేసి వెళ్లారు. మొదట రజతోత్సవాల సభ ఇన్‌చార్జిలుగా నియమితులైన మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు ఇంత వరకు సభావేదికను సందర్శించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఎల్కతుర్తికి నేడు కేటీఆర్..

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లు తుదిదశకు చేరిన నేపథ్యంలో మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఎల్కతుర్తికి రానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చేరుకోనున్న ఆయన సభావేదిక ఏర్పాట్లతోపాటు పార్కింగ్ స్థలాలను పరిశీలించనున్నారని పార్టీవర్గాల సమాచారం. అనంతరం సభ సక్సెస్, జనసమీకరణ తదితర అంశాలపై ఉమ్మడి వరంగల్‌కు చెందిన ముగ్గురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్య నేతలతో భేటీ కానున్నట్లు తెలిసింది.


మరుబెని సంస్థ ముఖ్య కార్యాలయం

పాతికేళ్ల క్రితమే రామగుండంలో ‘మరుబెని’ ప్రాజెక్ట్!

‘బీపీఎల్’స్థాపనకు ప్రభుత్వంతో ఒప్పందం

ఇప్పుడు జపాన్ సంస్థకు ‘ఫ్యూచర్ సిటీ’అభివృద్ధి పనులు

గుర్తు చేసుకుంటున్న రామగుండం ప్రజలు

రామగుండం: జపాన్ దేశానికి చెందిన మరుబెని సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులతో పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకోవడం తెలిసిందే. అయితే, ఆ సంస్థ సుమారు 25 ఏళ్ల క్రితమే.. పెద్దపల్లి జిల్లా రామగుండంలో బీపీఎల్ విద్యుత్ కేంద్రం స్థాపించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. బీపీఎల్ విద్యుత్ కేంద్రంలో ఎరక్షన్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ)లో భాగంగా.. బాయిలర్ తదితర కీలక విభాగాల పనుల బాధ్యతలను మరుబెనీ చేపట్టేందుకు జూన్ 2001లో అప్పటి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ తర్వాత బాయిలర్, టర్బయిన్ ఏర్పాటుకు కాంక్రీట్ ఫౌండేషన్ పనులు ప్రారంభించింది. అంతలోనే సాంకేతిక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంతో విభేదాలు రావడంతో పనులు అంతటితోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జెన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం కుదరడంతో.. మరుబెనీ సంస్థ మరోసారి తెరపైకి రావడం గమనార్హం.


Marubeni

మరుబెని సంస్థతో 25ఏళ్ల క్రితం నాటి ఒప్పంద పత్రం



ప్రతిపాదిత బీపీఎల్ విద్యుత్ కేంద్రం స్థల సూచిక బోర్డు

స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించాలి

- ఎమ్మెల్సీ కొమరయ్య



సాక్షి, హైదరాబాద్: అర్హులైన సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన సోమవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని కలిసి, ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పదోన్నతి కోసం గతంలోనే సీనియార్టీ లిస్టులు రూపొందించారని గుర్తు చేశారు. వెబ్ ఆప్షన్లు నమోదు చేసేటప్పుడు సాంకేతిక కారణాల వల్ల పదోన్నతులు వాయిదా పడ్డాయని తెలిపారు. ఈ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని, పాఠశాలలు తెరిచేలోగా హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయాలని కోరారు. విద్యాశాఖ అధికారులను కలిసిన వారిలో టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి సురేశ్, సంఘ నాయకురాలు ఉషారాణి ఉన్నారు.

‘ఉపాధి’ మరింత విస్తరణ

- ఈ పథకంలోకి మహిళా శక్తి ఉపాధి భరోసా, పొలం బాట
- ఫలవనాలు, వనమహోత్సవం, జలనిధి, రూరల్ శానిటేషన్ కూడా..
- ఈ ఏడాది పథకానికి రూ.2,708.3 కోట్లు మంజూరు
- రూ.1,625 కోట్లు వేతనాలకు, రూ.1,083 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్‌కు
- తెలంగాణకు ఈ ఏడాది 6.5 కోట్ల పనిదినాల కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ పథకం కింద మహిళా శక్తి ఉపాధి భరోసా, పొలం బాట, ఫలవనాలు, వనమహోత్సవం, జలనిధి, రూరల్ శానిటేషన్, మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ పథకాన్ని మరింత విస్తృతం చేసి, వివిధ రంగాల్లో కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా జిల్లాలవారీగా ఉపాధి హామీ పనులు, వాటికి కేటాయించే నిధులకు సంబంధించిన వర్క్ ప్లాన్ సిద్ధమైంది. ఉపాధి హామీ నిధులను జిల్లాలవారీగా కేటాయించే ఫైల్‌పై సోమవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంతకం చేశారు. ఈ పనుల కోసం ఈ ఏడాది రూ.2,708 కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ.1,625 కోట్లు వేతనాలకు, రూ.1,083 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కింద ఖర్చు చేయనున్నారు. ఉపాధి హామీ కింద కేంద్ర ప్రభుత్వం గతేడాది తెలంగాణకు 8 కోట్ల పనిదినాలు కేటాయించింది. పనులకు డిమాండ్ అధికంగా ఉండటంతో 12 కోట్ల పనిదినాలను రాష్ట్రం పూర్తిచేయగా అందుకు అనుగుణంగా కేంద్రం అనుమతులిచ్చింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం 6.5 కోట్ల పని దినాలనే కేటాయించింది. దీంతో అవసరమైతే పనిదినాలు పెంచాలని కేంద్రానికి లేఖ రాసే యోచనలో మంత్రి సీతక్క ఉన్నట్టు ప్రభుత్వవర్గాల సమాచారం.

మహిళా శక్తి ఉపాధి భరోసా కింద చేపట్టే పనులు

పశువుల పాకలు, అజోలా నిర్మాణం.. వెర్మి, నాడెప్, కంపోస్ట్ పిట్లు.. పౌల్ట్రీ, మేకల షెడ్లు.. వ్యక్తిగత బయోగ్యాస్ ప్లాంట్లు, ఎస్సీ, ఎస్టీ, ఆర్‌వోఎఫ్‌ఆర్ భూముల అభివృద్ధి, డైవర్షన్ డ్రెయిన్లు, కొత్తగా బావులు తవ్వే పనులు చేపట్టనున్నారు.

పొలం బాట కింద.. : వ్యవసాయ భూములకు మట్టి, కంకర రోడ్ల నిర్మాణం.

ఫలవనాల కింద..

డ్రిప్ ఇరిగేషన్‌తో ఉద్యానవన, ఈత, ఇతర పంటలకు సహాయం. వనమహోత్సవం కింద.. మార్చి, 2026 వరకు 10 కోట్ల నర్సరీ మొక్కల పెంపకం, కమ్యూనిటీ ప్లాంటేషన్, వాటరింగ్, వాచ్ అండ్ వార్డ్ వంటి పనులు చేపడతారు.

జలనిధి కింద..

హెచ్‌డీపీఈ షీట్లతో కూడిన ఫామ్‌పాండ్స్, రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, అటవీ ప్రాంతాల్లో స్టాగర్డ్ ట్రెంచ్‌లు, పర్క్యులేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ల నిర్మాణం వంటి పనులు చేపడుతారు.

రూరల్ శానిటేషన్ కింద..

వ్యక్తిగత సోక్‌పిట్లు నిర్మాణం

గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన కింద..

స్కూల్ టాయిలెట్లు (బాలికలకు), కొత్త గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, సీసీరోడ్లు, పీఎం ఆవాస్‌యోజన, స్టేట్ హౌస్‌ల నిర్మాణం చేపట్టనున్నారు.



ఖమ్మం జిల్లా రూరల్ మండలం ముత్తగూడెం – ఆరెకోడు మధ్య రెండెకరాల భూమి కలిగిన రైతు రాములు.. ఈసారి కూడా పెసర పంట పండించాడు. ఈ ప్రాంతం మీదుగా రింగ్ రోడ్డు నిర్మాణం జరుగుతుండడంతో రాములు భూమి కోల్పోనున్నాడు. ఇప్పటికే పంట తొలగించాలని అధికారులు సూచించగా.. తన పొలంలో ఇదే చివరి పంట అంటూ.. ఆవేదనగా సోమవారం తూర్పార పట్టడంలో నిమగ్నమయ్యాడు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

‘లగచర్ల’పై ఎన్‌హెచ్‌ఆర్‌సీ నివేదిక

- స్వాగతించిన బీజేపీ

సాక్షి, హైదరాబాద్: లగచర్ల ఘటనపై జాతీయ మానవహక్కుల సంఘం ఇచ్చిన నివేదికను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు స్వాగతించారు. అధికార పార్టీ ఫార్మాసిటీ పేరుతో చేసిన అధికార దుర్వినియోగం ఈ నివేదిక ద్వారా బట్టబయలైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రను ఆనాడే బీజేపీ చెప్పిందని, ఇప్పుడు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నివేదికలో అదే బయటపడిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే పోలీసులు లగచర్ల రైతులను శారీరకంగా, మానసికంగా హింసించారని ఆరోపించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆరోపించారు. ఫార్మాసిటీ భూ సర్వేకు వచ్చిన అధికారులను ఎదురు ప్రశ్నలు వేసిన రైతులు.. వారి కుటుంబ సభ్యులను పోలీసులు చిత్రహింసలకు గురిచేసి, అక్రమ కేసులు బనాయించారన్నారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపిన రైతులపైనే కాకుండా.. ఆ స్థలంలో లేని బీజేపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధించారన్నారు. ఈ మొత్తం ఘటనను డీజీపీ, గవర్నర్ దృష్టికి బీజేపీ తీసుకెళ్లిందన్నారు.

ఈపీఎఫ్‌ఓలోకి 16.10 లక్షల చందాదారులు

- ఫిబ్రవరి గణాంకాలు విడుదల చేసిన ఈపీఎఫ్‌ఓ
- గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే 3.99 శాతం పెరుగుదల

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ)లోకి ఫిబ్రవరిలో 16.10 లక్షల మంది చందాదారులు చేరారు. చందాదారుల చేరికపై ఈపీఎఫ్‌ఓ నెలవారీగా గణాంకాల విడుదలలో భాగంగా ఫిబ్రవరి నివేదికను సోమవారం విడుదల చేసింది. గతేడాది ఫిబ్రవరి గణాంకాలతో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో చందాదారుల చేరిక 3.99 శాతం పెరిగినట్లు ఈపీఎఫ్‌ఓ వెల్లడించింది. ఉపాధి అవకాశాలు పెరుగుతుండటం, ఈపీఎఫ్‌ఓపై అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో చందాదారుల సంఖ్య పెరుగుతున్నట్లు ఈపీఎఫ్‌ఓ పేర్కొంది. ఫిబ్రవరిలో చేరిన చందాదారుల్లో కొత్తగా ఉద్యోగంలోకి వచ్చిన వారు సుమారు 7.39 లక్షల మంది ఉన్నారు. వారిలో 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు 4.27లక్షల మంది ఉండగా వారి శాతం 57.71గా ఉంది. ఈపీఎఫ్‌ఓలో సభ్యులుగా ఉంటూ కొత్తగా ఉద్యోగంలోకి చేరిన వారు దాదాపు 13.18 లక్షల మంది ఉన్నారు. గతేడాది ఫిబ్రవరి గణాంకాలతో పోలిస్తే ఇలాంటి వారి సంఖ్య 11.85 శాతం పెరిగింది. ఈపీఎఫ్‌ఓలో సభ్యులుగా ఉంటూ ఉద్యోగం మారుతున్నప్పటికీ చందాదారులుగా కొనసాగేందుకే ఎక్కువ మంది ప్రాధాన్యత ఇస్తున్నారు. దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను కాపాడుకొనే వ్యూహంతోనే ఉద్యోగులు ఈపీఎఫ్‌ఓ పథకం నుంచి వైదొలగడం లేదని అధికారులు అభిప్రాయపడ్డారు.

పెరుగుతున్న మహిళా చందాదారులు...

ఈపీఎఫ్‌ఓలో మహిళా చందాదారుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్తగా 2.08 లక్షల మంది చందాదారులుగా చేరారు. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే కొత్త సభ్యులు 1.26 శాతం పెరిగినట్లు ఈపీఎఫ్‌ఓ తెలిపింది. మహిళా సభ్యుల పెరుగుదలను పరిశీలిస్తే పురుషులతో సమానంగా మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఈపీఎఫ్‌ఓలో చందాదారులుగా ఉంటూ ఉద్యోగం మారిన వారి సంఖ్య 3.37 లక్షలు. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ సంఖ్య 9.23శాతం పెరిగింది. ఈపీఎఫ్‌ఓ గణాంకాల ప్రకారం ఫిబ్రవరి నెల చందాదారుల సంఖ్యను పరిశీలిస్తే కేవలం ఐదు రాష్ట్రాల నుంచే 59.75 శాతం ఉన్నారు. 9.62 లక్షల మంది ఈపీఎఫ్‌ఓ చందాదారులుగా ఉంటూ ఉద్యోగాన్ని మారగా... ఇందులో మహారాష్ట్ర నుంచే 10.90 శాతం ఉన్నారు. మిగతా చందాదారులు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, ఢిల్లీ, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలున్నాయి. ఫిష్ ప్రాసెసింగ్, సొసైటీ క్లబ్బులు, క్లీనింగ్ సేవలు, కంప్యూటర్ సేవలు, విమానయాన సంస్థలు వంటి పరిశ్రమల్లో చందాదారుల చేరిక ఎక్కువగా ఉన్నట్లు ఈపీఎఫ్‌ఓ తెలిపింది.

అంతర్జాతీయ విద్య మరింత సులభం

- అరిజోనా– అనురాగ్ వర్సిటీల మధ్య ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: తెలుగు విద్యార్థులకు అత్యున్నత అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు అనురాగ్ విశ్వవిద్యాలయం, అమెరికాకు చెందిన అరిజోనా స్టేట్ విశ్వవిద్యాలయం మధ్య సోమవారం ఒప్పందం కుదిరింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అనురాగ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఏఎస్‌యూ గ్లోబల్ పార్టనర్‌షిప్ డెవలప్‌మెంట్ సీనియర్ డైరెక్టర్ క్రిస్ జాన్సన్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. భారత్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయం ఇంటర్నేషనల్ కాలేజీలో విద్యార్థులు తమ చదువును ప్రారంభించి, తర్వాత అమెరికాలోని ఏఎస్‌యూలో డిగ్రీని పూర్తి చేయడానికి ఒప్పందం వీలు కల్పిస్తుందని క్రిస్ జాన్సన్ తెలిపారు.

శభాష్ సన్నిరెడ్డి: ఎంపీ అరుణ

- వేన్ స్టేట్ యూనివర్సిటీ గవర్నర్‌గా ఎన్నికవడంపై అభినందన

సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని వేన్ స్టేట్ యూనివర్సిటీ గవర్నర్‌గా తెలంగాణ ముద్దుబిడ్డ సన్నిరెడ్డి ఎన్నికవడం గర్వకారణమని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం ఎంపీ అరుణను.. వేన్ స్టేట్ యూనివర్సిటీ గవర్నర్, అమెరికా తెలుగు అసోసియేషన్ తెలంగాణ సభ్యుడు సన్ని రెడ్డి కలుసుకున్నారు. ఈ సందర్భంగా అరుణ.. బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ రెడ్డితో కలిసి సన్నిరెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని షాద్‌నగర్ నియోజకవర్గం కిషన్‌నగర్‌కు చెందిన సన్నిరెడ్డి.. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరాలని అరుణ ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయరు?

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు బీజేపీ నేత ప్రభాకర్ ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్–బీఆర్‌ఎస్.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థిని ఎందుకు దించలేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. ముస్లింలలో పెరిగిన పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యతకు అడ్డుకట్ట వేసేందుకు ఎంఐఎంకు బుద్ధి చెప్పే సమయం ఈ ఎన్నిక ద్వారా వచ్చిందన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇది కేవలం సంఖ్య ఆధారంగా జరుగుతున్న ఎన్నిక కాదని స్పష్టం చేశారు. అనేక అంశాలు ముడిపడిన ఈ ఎన్నిక ద్వారా ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పాలని కోరారు. ఎన్నికను బహిష్కరించిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల కార్పొరేటర్లకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

రాజకీయ సహకారంతో కొత్త ఒరవడి

- ప్రపంచ స్థాయి రాజకీయ యవనికకు తెలంగాణ ఆతిథ్యం
- రాష్ట్ర ప్రభుత్వం, సమృద్ధ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గ్లోబల్ సమ్మిట్
- ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహణ
- హాజరుకానున్న రాహుల్‌గాంధీ, ప్రియాంక సహా 95 దేశాల ప్రతినిధులు
- రాజకీయ భాగస్వామ్యాల ఏర్పాటులో ముందడుగు అంటున్న విశ్లేషకులు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ స్థాయి రాజకీయ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యమివ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సమృద్ధ భారత్ అనే స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 26 వరకు హైదరాబాద్ వేదికగా ‘గ్లోబల్ సమ్మిట్’పేరిట అంతర్జాతీయ స్థాయి సమావేశాలు జరగనున్నాయి. ఈ సదస్సుకు 95 దేశాల నుంచి 350 మంది ప్రతినిధులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. దేశంలోని ఒక రాష్ట్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ అంతర్జాతీయ రాజకీయ భేటీగా ఇది చరిత్రలో నిలిచిపోతుందని వెల్లడించారు.

బహుళార్థ సాధకంగా..

బహుళార్థ సాధకంగా ఉపయోగపడే విధంగా భారత్ సమ్మిట్–2025ను నిర్వహిస్తున్నారు. విధాన నిర్ణేతలు, ప్రవాస నాయకులు, విద్యావేత్తలు, ఉద్యమకారులను ఒక్క వేదిక పైకి తేవడం ద్వారా ప్రపంచ స్థాయి సహకారాన్ని ఈ సదస్సు పునర్నిర్వచించనుంది. అంతర్జాతీయ రాజకీయ సహకారంలో ఈ సదస్సు కొత్త ఒరవడి సృష్టించేందుకు ప్రయత్నించడంతో పాటు సమన్వయం, సహకారం, సత్సంబంధాల ద్వారా సమ్మిళిత అభివృద్ధికి మార్గ నిర్దేశం చేయనుంది. ఇది కేవలం ఒక వేదిక మాత్రమే కాదని, ప్రపంచంలోని సుమారు 100 దేశాల మధ్య రాజకీయ భాగస్వామ్యాలను ఏర్పరిచే ప్రయత్నంలో ముందడుగు అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఆర్థిక, పర్యావరణ, రాజకీయ నమూనాలు

మేధావులు, విధాన నిర్ణయ సంస్థల మధ్య దీర్ఘకాలిక సంబంధాలు నెలకొల్పడం ద్వారా అంతర్జాతీయ స్థాయి సహకారాల కొనసాగింపు, రాజకీయ ఆవిష్కరణలకు ఈ సదస్సు అనువైన వాతావరణం ఏర్పరుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రవాస సంబంధాలు, దేశానికి అంతర్జాతీయ సంస్థలతో సాన్నిహిత్యాన్ని ఏర్పాటు చేసేందుకు వేదికవుతుందని, తెలంగాణ లక్ష్యమైన అందరికీ న్యాయం దిశలో మానవత్వాన్ని ఏకతాటిపై నడిపించేలా ఆర్థిక, పర్యావరణ, రాజకీయ నమూనాలను తయారు చేస్తుందని చెబుతున్నారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలతో పాటు ఆ పార్టీ జాతీయ స్థాయి నాయకులు, దేశంలోని పలువురు కీలక రాజకీయ నేతలు, పలు దేశాల మంత్రులు కూడా హాజరు కానున్నారు.

నిధుల వినియోగంపై నిర్ణయాలొద్దు

- హెచ్‌సీఏకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రోజువారీ ఖర్చులు, వేతనాలు తప్ప ఇతర నిధుల వినియోగంపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)ను హైకోర్టు ఆదేశించింది. హెచ్‌సీఏ నిధుల దుర్వినియోగానికి పాల్పడిందని, దీనిపై సీబీఐతో దర్యాప్తు చేయించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీబీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. హెచ్‌సీఏ మేనేజింగ్ కమిటీ నిధుల దుర్వినియోగానికి పాల్పడటంతో పాటు ఖాతాల నిర్వహణ సరిగా లేదని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది రాజాశ్రీపతిరావు వాదించారు. పారాస్పోర్ట్స్‌కు క్రికెట్ బంతుల సరఫరా, జిమ్ పరికరాల సరఫరాకు అధిక ధరలతో బాడీ డ్రెస్ ఇండియాతో ఒప్పందం, క్విడ్‌ప్రోకో కింద లబ్ధి పొందిన సురేందర్ అగర్వాల్‌కు చెందిన రూ.51 లక్షలను ఈడీ జప్తు చేసిందని చెప్పారు. అయితే ఇవన్నీ గత మేనేజింగ్ కమిటీ హయాంలో జరిగాయని హెచ్‌సీఏ తరఫున మాజీ ఏఏజీ రామచంద్రరావు వాదనలు వినిపించారు. ప్రస్తుత కమిటీ ఇటీవలే ఎన్నికైందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మేనేజింగ్ కమిటీపై ఆరోపణలను విచారణలో తేల్చాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అప్పటివరకు ఎలాంటి ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవద్దని ఆదేశిస్తూ విచారణ జూన్ 16కు వాయిదా వేశారు.

క్లుప్తంగా...

12 వేల నీటి తొట్టెల నిర్మాణం పూర్తి

సాక్షి, అమరావతి: వేసవి నేపథ్యంలో ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో పశువుల కోసం ఇప్పటి వరకు 12 వేల నీటి తొట్టెల నిర్మాణం పూర్తయినట్టు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క నీటి తొట్టె నిర్మాణానికి రూ.45 వేల చొప్పున మొత్తం 15 తొట్టెలకు రూ.67.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఇప్పటి వరకూ 12 నిర్మాణం పూర్తి కాగా, మిగిలినవాటిని ఈనెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు.

రాహుల్, సోనియాను కఠినంగా శిక్షించాలి

బీజేపీ యువ మోర్చా నాయకుల డిమాండ్

సాక్షి, అమరావతి: నేషనల్ హెరాల్డ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ యువ మోర్చా నాయకులు సోమవారం విజయవాడలో ఆందోళన నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన కోసం బయలుదేరిన నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సోనియా, రాహుల్ గాంధీ చిత్రపటాలను దహనం చేశారు.

ఆరుగురు ఎంపీడీవోలకు పదోన్నతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆరుగురు ఎంపీడీవోలు డీఎల్‌డీవోలుగా పదోన్నతులు పొందారు. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

వర్సిటీల్లో రాజకీయ వేడుకలు సిగ్గు చేటు

ఏబీవీపీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ కురుమళ్ల గంగాధర్

సాక్షి, అమరావతి: రాజకీయ ప్రయోజనాల కోసం విశ్వవిద్యాలయాలను వాడుకోవటం సిగ్గుచేటని ఏబీవీపీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ కురుమళ్ల గంగాధర్ సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. సీఎం చంద్రబాబు పుట్టినరోజుకు వర్సిటీలు వేదికలుగా మారడంపై మండిపడ్డారు. విద్యా వ్యవస్థను నడిపించాల్సిన వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్‌లు సైతం రాజకీయ నేతల మాదిరి కేక్ కట్ చేయడం విస్మయాన్ని కలిగిస్తోందన్నారు. ఇలాంటి ఘటనలపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రేక్షక పాత్ర సరికాదని, వెంటనే వర్సిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొత్త హాస్టళ్లలో జిమ్.. వెంటిలేషన్ ఉండాలి

సాంఘిక సంక్షేమ శాఖ సమీక్షలో మంత్రి వీరాంజనేయస్వామి

సాక్షి, అమరావతి: నూతన సంక్షేమ హాస్టళ్లు అధునాతన సౌకర్యాలతో నిర్మించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. హాస్టళ్ల మరమ్మతులు, కొత్త హాస్టళ్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. పలు డిజైన్లు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా నిర్మించే ప్రతి హాస్టల్లో రీడింగ్ రూమ్, జిమ్, వెంటిలేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ఏడాది నవంబర్‌లోపు హాస్టళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

ఏపీ ఆగ్రోస్ పనితీరు అధ్వానం

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు



సాక్షి, అమరావతి: ఏపీ ఆగ్రోస్ పనితీరు అధ్వానంగా ఉందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీ రావు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు వ్యక్తిగత పనిముట్లు ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి విరుద్ధంగా ఆగ్రోస్ పనితీరు ఉందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు తీరును సమీక్షించారు. పథకం ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా, రైతుల నమోదు ప్రక్రియపై అశ్రద్ధ చూపడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

మత్స్యశాఖ ఎంపీఈఓల కాంట్రాక్టు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: మత్స్యశాఖలో 37 మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ అసిస్టెంట్స్ కాంట్రాక్టు గడువును మరో ఏడాదిపాటు పొడిగించారు. ఈ మేరకు మత్స్యశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'జైల్లో ప్రభుత్వ ఆతిథ్యాన్ని ఆస్వాదించండి'



- హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఏపీ అధికారిపై 'సుప్రీం' సీరియస్
- చట్టానికి అతీతులమని భావించొద్దు.. తక్షణమే అరెస్టులకూ వెనుకాడం..

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన ఓ ప్రభుత్వ అధికారిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినందుకు 'జైల్లో ప్రభుత్వ ఆతిథ్యాన్ని ఆస్వాదించండి..' అని వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కార అప్పీళ్లను కొట్టివేసేందుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించటాన్ని సవాల్ చేస్తూ ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న అధికారి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్‌ను విచారించింది.

ఇదీ నేపథ్యం..

2013 డిసెంబరు 11న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను ధిక్కరిస్తూ నాడు తహసీల్దార్‌గా ఉన్న అధికారి 2014 జనవరిలో గుంటూరు జిల్లాలో గుడిసెలను బలవంతంగా తొలగించారంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని విచారించిన హైకోర్టు సింగిల్ జడ్జి.. ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు ఆ అధికారికి రెండు నెలల జైలు శిక్ష విధించారు. దీనిపై జోక్యం చేసుకునేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించటాన్ని సవాల్ చేస్తూ ఆ అధికారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

అధికారులు చట్టానికి అతీతులమని భావించొద్దు..

మురికి వాడలను కూల్చివేయొద్దని ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించి 80 మంది పోలీసులను తీసుకెళ్లారా? అని సుప్రీం కోర్టులో తాజా విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ప్రశ్నించింది. న్యాయస్థానం ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తే తక్షణమే అరెస్టు చేస్తామని హెచ్చరించింది. ×ఆయన ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నారు? అమరావతి, విజయవాడ, తీహార్‌లో ఏదో ఒక జైలు ఎంపిక చేసుకొనేందుకు అవకాశం ఇస్తాం. అధికారులు తాము చట్టానికి అతీతులమని భావించరాదు.. । అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. 'చట్టాన్ని గౌరవించని వారికి ఎలాంటి మినహాయింపు లేదు. హైకోర్టు వారించినప్పటికీ మురికివాడలను ఎలా కూల్చివేశారు?' అని జస్టిస్ గవాయ్ సదరు అధికారిని నిలదీశారు. కేవలం మందలించడం మాత్రమే కాకుండా హైకోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినందుకు సదరు అధికారిని డిప్యూటీ కలెక్టర్ స్థాయి నుంచి మళ్లీ తహసీల్దార్ స్థాయికి తగ్గించే విషయాన్ని తెలియచేయాలని పిటిషనర్ తరపు న్యాయవాదికి సుప్రీం సూచించింది. సంబంధిత అధికారి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్ డైరెక్టర్‌గా ఉన్న పిటిషనర్‌కు ఇద్దరు పిల్లలున్నారని, జైలులో ఉంటే ఉద్యోగం పోతుందని కోర్టుకు నివేదించారు. దీనిపై మండిపడ్డ జస్టిస్ గవాయ్ ధర్మాసనం... సదరు అధికారి కూలగొట్టిన ఇళ్లలో ఉంటున్న పిల్లల సంగతేమిటని ప్రశ్నించింది. ఆ అధికారి జైలులో ప్రభుత్వ ఆతిథ్యాన్ని పొందాలని లేదా కూల్చివేతలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు భారీగా పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేసింది. దీనిపై తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసిన సుప్రీం ధర్మాసనం అప్పటి వరకు హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది.

హజ్ కమిటీలో టీడీపీ కార్యకర్తల్ని ఎలా నియమిస్తారు?

- నియామక నిబంధనల్ని ఉల్లంఘించిన కూటమి సర్కార్
- ఏపీ హజ్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజం

సాక్షి, అమరావతి: ముస్లింల హజ్ యాత్ర కోసం నియమించిన కమిటీలో టీడీపీ కార్యకర్తలకు స్థానం కల్పించడం దారుణమని ఏపీ హజ్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజం మండిపడ్డారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. హజ్ కమిటీ నియామకాలకు భిన్నంగా కూటమి ప్రభుత్వం పార్టీ వ్యక్తులతో నియామకాలు చేయడం ముస్లిం సమాజాన్ని అవమానించడమేనన్నారు. ఈ అనుచిత నియామకాల కోసం జారీ చేసిన జీఓను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే హజ్ కమిటీలో నియమించిన ముగ్గురు టీడీపీ కార్యకర్తలను తొలగించాలని కోరారు. సెంట్రల్ హజ్ కమిటీ యాక్ట్ నంబర్ 35, 2002 ప్రకారం సబ్ క్లాజ్ 3లో ముగ్గురు మత గురువులను నియమించాల్సి ఉందన్నారు. కానీ.. కూటమి ప్రభుత్వం దాన్ని ఉల్లంఘించి ముగ్గురు టీడీపీ కార్యకర్తలను నియమించిందన్నారు. పార్టీ కార్యకర్తలను మతగురువులుగా చూపించి హజ్ కమిటీలో చేర్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. మక్కాకు వెళ్లిన తర్వాత కొన్ని కార్యాలు (అర్కాన్లు) చేయాల్సి ఉంటుందని, అక్కడ అర్కాన్లు చెప్పే సామర్థ్యం కేవలం ముస్లిం సయాలజిస్టులైన ముఫ్తీ, హాఫీజ్, ఉలేమాలు, మౌల్వీలకు మాత్రమే ఉంటుందన్నారు. అలాంటి వారిని పక్కనపెట్టి టీడీపీ కార్యకర్తలను నియమించడం సరికాదన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్‌కు అవకాశం ఇవ్వాలి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల బదిలీల్లో ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్జీటీల బదిలీలకు దరఖాస్తు చేయాలంటే సుమారు 2 వేల నుంచి 2500 ఆప్షన్స్ ఇవ్వాల్సి వస్తోందన్నారు. అలాగే, యూపీ స్కూళ్లకు స్కూల్ అసిస్టెంట్ పోస్టు మంజూరు చేయాలని, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

హేతుబద్ధీకరణ మేలు చేయాలి – ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ విద్యార్థులకు మేలు చేసేలా ఉండాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దిబాబూ రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలల్లోని బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కేటాయింపు ఆదర్శవంతంగా ఉందని, వీటినే అన్ని రకాల ప్రాథమిక పాఠశాలలకు వర్తింపచేయాలని వారు కోరారు.

విద్యుత్ సంస్కరణలపై నేడు కేంద్ర మంత్రివర్గ ఉపసంఘం భేటీ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వెల్లడి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ విజయానంద్

సాక్షి, అమరావతి: విద్యుత్ రంగ సంస్కరణలపై మంగళవారం కేంద్ర మంత్రివర్గ ఉపసంఘం సమావేశం విజయవాడలో జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్), ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ ఏకేవీ భాస్కర్, ఇతర ఉన్నతాధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన అనంతరం సీఎస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీపాద యశో నాయక్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ యుటిలిటీ రిఫార్మ్స్, స్పెషల్ ఇంటర్వెన్షన్స్ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తోందని, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సభ్యులతోపాటు ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రులు, కార్యదర్శులు హాజరవుతారని, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏపీసీపీడీసీఎల్ నుంచి ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక స్థిరత్వం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరుగుతుందన్నారు. రెగ్యులేటరీ చట్టాల్లో మార్పులు, డిస్కంల పునర్వ్యవస్థీకరణ, కేంద్రం నుంచి రాష్ట్రాలకు సహాయం, పెట్టుబడి ప్రణాళికల తయారీ, వాటిలో ఎలాంటి మార్గదర్శకాలు ఉండాలనే అంశాలపై కూడా చర్చ ఉంటుందని చెప్పారు. ఈ ప్రణాళికలు డిస్కంలను బలోపేతం చేసి, సేవలు మెరుగుపరిచేలా ఉపయోగపడతాయని విజయానంద్ వివరించారు.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్లపై సందిగ్ధం

- విచారణార్హతపై ధర్మాసనానికి నివేదన
- న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జున రావు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులు దాఖలు చేసే ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణార్హత విషయంలో నెలకొన్న సందిగ్ధతను తొలగించే దిశగా హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులు నేరుగా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేయవచ్చా? లేక హైకోర్టు కన్నా ముందు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టునే ఆశ్రయించాలా? అనే విషయంపై స్పష్టత ఇచ్చేందుకు ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి నివేదించింది. తగిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు ఈ కేసు ఫైళ్లను ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల జారీ అనంతరం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి తరపు న్యాయవాది స్పందిస్తూ, ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణార్హతపై ధర్మాసనం నిర్ణయం వెలువరించేంత వరకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరారు. అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. ధర్మాసనానికి నివేదించిన తర్వాత ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పారు. అక్రమ మైనింగ్ వ్యవహారంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ దాఖలు చేసిన తర్వాత ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కూడా నమోదు చేశారు. ఇదే రీతిలో టీడీపీ చిలకలూరిపేట సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత విడదల రజినిపై చిలకలూరిపేట పట్టణ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆమె ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే తరహాలో మరికొందరు కూడా ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై ఇటీవల వాదనలు విన్న న్యాయమూర్తి సోమవారం తన నిర్ణయాన్ని వెలువరించారు.

సెర్ప్ సిబ్బంది సర్దుబాటు షురూ!

మంత్రి శ్రీనివాస్ ఆదేశాలు



సాక్షి, అమరావతి: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో పనిచేసే సిబ్బంది అన్ని జిల్లాల్లో సమాన స్థాయిలో ఉండే విధంగా సర్దుబాటు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు శిక్షణ, పంటలకు విలువ జోడింపు వంటి చర్యల ద్వారా అధిక ఆదాయాలు సాధించేందుకు సెంటర్ ఫర్ క్యాటలిస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్, ఏపీఎంఎస్ఎస్ ద్వారా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

అడవిలో ఆగని వేట

- అడవి జంతువులే లక్ష్యంగా ఉచ్చులు వేస్తున్న వేటగాళ్లు
- ఇటీవల చిరుతతోపాటు అడవి పందుల మృత్యువాత
- కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక అన్నమయ్య జిల్లాలో విష సంస్కృతి
- అడవులపై వేటగాళ్లు పంజా విసురుతున్నా పట్టించుకోని అటవీశాఖ



సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఆటవిక రాజ్యం కొనసాగుతోంది.కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత విష సంస్కృతికి బీజం పడింది. నాటు తుపాకులతో అడవులను చెరబట్టడం..వేట పేరుతో కొనసాగుతున్న దమనకాండతో వన్య మృగాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇదేమని అడిగే అధికారులు లేక, తాము చెప్పిందే వేదమన్నట్లు అడవుల్లో వేట కొనసాగిస్తున్నారు. పెద్ద జంతువులను వధించేందుకు వేట గాళ్లు వేస్తున్న ఉచ్చులు చిన్న జంతువుల ప్రాణాలు తీస్తున్నాయి. ఒక్కోసారి వేటగాళ్లు జంతువులపై ఎక్కుపెట్టిన గురి తప్పి పలువురు సామాన్యులు కూడా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకు గురి చేస్తోంది.

అమాయకుల బలి

జిల్లాలో లైసెన్స్‌డ్ తుపాకులు పక్కనపెడితే అడవిలో వేటాడటానికి అప్పట్లో తీసుకున్న తుపాకులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎందుకంటే వేట కోసం వెళుతున్న వేటగాళ్ల అదుపు తప్పో.. గురితప్పో.. జంతువులను కాల్చబోయి అమాయకుల ప్రాణాలు బలిగొంటున్నారు. ఇటీవల రాయచోటి సమీపంలోని మాధవరం వద్ద వేటగాళ్ల కాల్పుల్లో హనుమంతు అనే వ్యక్తి మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. అంతే కాకుండా గుర్రంకొండ ప్రాంతంలో కూడా గతంలో అడవి జంతువులనుకుని కాల్చడంతో ఓ మహిళ ఇదే తరహాలో గాయపడి నెలరోజుల తర్వాత కోలుకుంది. అడవి పందుల కోసం వేసిన విద్యుత్ తీగలు తగులుకుని పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. టెక్నాలజీ పెరిగిన ప్రస్తుత తరుణంలోనూ వేట పేరుతో జంతువులను తుద ముట్టడిస్తుండడం పట్ల పలువురు జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రణ ఏదీ..

జిల్లాలో వేటగాళ్లు అడవి జంతువులను పట్టడానికి ఉచ్చు బిగిస్తున్నారు. అవి వన్యప్రాణుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. నాలుగు రోజుల కిందట మదనపల్లె పరిధిలోని పాస్నేటిపాలెం వద్ద వేటగాళ్ల ఉచ్చుకు గర్భంతో ఉన్న చిరుత మృత్యువాత పడిన విషయం అందరికీ తెలిసిందే. అంతేకాకుండా చిరుత కావడంతో వ్యవహారం కాస్త బట్టబయలైంది. అటవీశాఖ అధికారులు ఉదయాన్నే అక్కడికి చేరుకున్నా చిరుతను సంరక్షించుకోలేకపోయారు. ఈ ఘటన ఓ ఉదాహరణ మాత్రమే. అధికారులకు తెలియకుండా జరుగుతున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. పంటలపై అడవి పందులు దాడి చేస్తున్నాయని వేస్తున్న విద్యుత్ తీగల కారణంగా పందులతోపాటు ఇతర జంతువులు నేలరాలుతున్నాయి. వేటగాళ్లు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వేటకు వెళుతున్నా నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి.



మదనపల్లె పరిధిలో ఇటీవల వేటగాళ్ల ఉచ్చులో చిక్కి మృతి చెందిన చిరుత (ఫైల్)

కొరవడుతున్న పర్యవేక్షణ

జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో అడవిలో అలజడి రేగుతోంది. ప్రధానంగా సుండుపల్లె, గువ్వల చెరువు, గంగనేరు, పెద్దమద్యం, బి.కొత్తకోట, మదనపల్లె, పెద్దమద్యం, రాజంపేట, చిట్వేలి, చిన్నమండెం తదితర ప్రాంతాల్లోని సమీపంలోగల అడవుల్లో వేట కొనసాగుతున్నట్లు తెలియవచ్చింది. ఏది ఏమైనా వేటగాళ్లపై అటవీశాఖ అధికారుల నిఘాలేకపోవడం, వారికి అవగాహన కల్పించకపోవడంతో విపత్కర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అమాయకులు బలి కాకుండా ఉండాలన్నా, పెద్ద జంతువులను వేటాడకుండా ఉండాలన్నా వేటగాళ్లలో మానసిక పరివర్తనలో మార్పు తీసుకొస్తే ప్రయోజనం ఉంటుందని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పవన, సౌర విద్యుత్ కేంద్రాలు

ప్రైవేటు సంస్థలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: అనంతపురం, కర్నూలు జిల్లాల్లో రెండు సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ప్రైవేట్ సంస్థలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రెన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అనంతపురం జిల్లా గూటి, పమిడి మండలాల్లో 540 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుకు అనుమతి కోరింది. అదేవిధంగా జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ సంస్థ కర్నూలు జిల్లా ఆస్పరిలో 88 మెగావాట్ల పవన విద్యుదుత్పత్తి కేంద్రం స్థాపనకు ముందుకు వచ్చింది. ఈ రెండు సంస్థల ప్రతిపాదనలకు ఇటీవల స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ అంగీకారం తెలిపింది. దీంతో ప్రాజెక్టుల స్థాపనకు అనుమతినిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 ప్రకారం ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు లభిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాత లేఅవుట్లకు అభివృద్ధి చార్జీల మినహాయింపు

సాక్షి, అమరావతి: మున్సిపాలిటీల్లోని పాత లేఅవుట్లకు ప్రభుత్వం అభివృద్ధి చార్జీలను మినహాయించింది. 2018కి ముందు లే అవుట్ దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లో తీసుకునేవారు. ఇలాంటి లే అవుట్ల అనుమతి రెండేళ్లపాటు ఉంటుంది. ఈలోగా లే అవుట్ల ప్రక్రియ పూర్తిచేయాలి, లేదా వారి అనుమతి కోసం తిరిగి దరఖాస్తు చేసుకోవాలి. ఈ క్రమంలో ఆయా లేఅవుట్లకు అభివృద్ధి చార్జీలు చెల్లించాలి. దీంతో ఇలాంటి పునరుద్ధరించని లే అవుట్లు రాష్ట్రంలో 8,509 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 870 ఉన్నాయని గుర్తించి, తిరిగి ధ్రువీకరించాల్సిన అవసరం ఉందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో లేఅవుట్ల యజమానులకు ఇబ్బంది లేకుండా తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు అభివృద్ధి చార్జీలను మినహాయిస్తూ పురపాలక పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

యాంత్రీకరణతో కూలీల కొరతకు చెక్

ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివన్నారాయణ

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయంలో యంత్రాల వినియోగాన్ని పెంచడంతో కూలీల కొరతను అధిగమించవచ్చని, క్షేత్ర పరిశీలనలు 150–200 మంది రైతులతో జరిగేలా చూడాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివన్నారాయణ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ఉత్తర కోస్తాలోని అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల వ్యవసాయ పరిశోధన, విస్తరణ మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ శాస్త్రవేత్త రైతుకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. రైతులకు అధిక దిగుబడినిచ్చే వంగడాలు అందించాలన్నారు. రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయని చెప్పారు. రైతుల ఆదాయం పెంచేలా పరిశోధనలు జరగాలన్నారు. పంటలను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చితే ఆదాయం పొందవచ్చని తెలిపారు. పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రైతుల పొలాల్లో మినీకిట్లు, ప్రదర్శన కేంద్రాల పరిశీలనల్లో రైతుల భాగస్వామ్యం పెరగాల్సి ఉందన్నారు. నైర వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌లక్ష్మి మాట్లాడుతూ చెరకు పంట ఇంకా వాణిజ్య పంటగానే ఉందని తెలిపారు. నాబార్డు డీడీఎం మాట్లాడుతూ యువత వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పెరగాలన్నారు.

వేసవితో రెట్టింపయ్యే ఉక్కపోత సమస్య వల్ల చెమటలు పట్టడం... ఆ చెమట కారణంగా దుర్వాసన వస్తుండటం సాధారణమే. రద్దీగా ఉండే బస్సుల్లో, మూసి ఉన్న గదుల్లో, లిఫ్టుల్లో... జనం బాగా దగ్గరగా ఉండాల్సి వచ్చే ప్రదేశాల్లో ఈ చెమట వాసన పక్కవారిని ఇబ్బంది పెడుతుంది. తమ నుంచి చెమట వాసన రావడాన్ని భరించలేని చాలామంది దీనికి విరుగుడుగా యాంటీ పెర్‌స్పిరెంట్లు, డియోడరెంట్లను వాడుతుంటారు. నిజానికి పెరిస్పిరేషన్ అంటే చెమట పట్టడం. ఆ చెమటకు విరుగుడు కాబట్టే వాటికి పెర్‌స్పిరెంట్లని పేరు. ఇక డియోడరెంట్లు అంటే దుర్వాసనను తాత్కాలికంగా దాచిపెట్టి సువాసన వచ్చేలా చేసే సుగంధ లేపనాలని అర్థం. ఇప్పుడు మార్కెట్లో చాలారకాల యాంటీ పెర్‌స్పిరెంట్లూ, డియోడరెంట్లు లభ్యమవుతున్నాయి. గతంలో చాలా ఉన్నత వర్గాలుగా తమను చెప్పుకునేవారు మాత్రమే వాడే ఈ ఉత్పాదనలను ఇటీవల చాలామంది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు కూడా వాడుతున్నారు. ఈ నేపథ్యంలో వాటితో ప్రయోజనాలేమిటి, ప్రతికూలతలేమిటి అన్న విషయాలపై అవగాహననిచ్చే కథనమిది.

యాంటీపెర్‌స్పిరెంట్లు | డియోడరెంట్లు

స్కిన్ 'కేర్'ఫుల్‌గా పరిమళిద్దాం!



చెమట పట్టడం చాలామందిని ఇబ్బంది పెట్టే సమస్య. చెమట పట్టేవారితో పాటు... ఆ చెమటలు పట్టేవారికి పక్కనుండేవారికీ కష్టం కలిగించే సమస్య ఇది. కొందరు లోపలి బనియన్ వంటి లోదుస్తులను (ఇన్నర్‌వేర్‌లను) రెండో రోజూ వాడతారు. చెమటనవి పీల్చుకుని బయట పొడిగా కనిపించడం కోసం ఉద్దేశించిన అలాంటి ఇన్నర్‌వేర్‌లను మర్నాడూ వాడే వారి నుంచి చెమట దుర్వాసన వస్తుంటుంది. నిజానికి చెమట చాలా స్వచ్ఛమైన ద్రవం. అందులోంచి ఎలాంటి దుర్వాసనా రాదు. కానీ చెమట పట్టే ప్రదేశాల్లో పెరిగే సూక్ష్మజీవుల కారణంగానే ఈ దుర్వాసన వచ్చి ఇబ్బందులు కలిగిస్తుంది. నిజానికి చెమటను ఇబ్బంది కలిగించే సమస్యగా చూస్తారుగానీ... మానవ మనుగడకు ఆ ప్రక్రియ ఎంతో కీలకం. చెమట దుర్వాసనను అణచడానికి వాడే పెర్‌స్పిరెంట్లూ, డియోడరెంట్ల గురించి తెలుసుకునే ముందర అసలు చెమట పట్టడం ఎందుకో, ఎలాగో చూద్దాం.

చెమట ఎందుకు పడుతుందంటే...?

మానవ దేహం తాలూకు జీవక్రియలన్నీ (మెటబాలిక్ యాక్టివిటీస్) ఒక నిర్ణీత ఉష్ణోగ్రత వద్ద జరుగుతుంటాయి. ఇలా అవి క్రమబద్ధంగా జరగాలంటే ఓ నిర్ణీత ఉష్ణోగ్రత మెయింటెయిన్ అవుతూ ఉండటం అవసరం. అందుకే మన శరీర ఉష్ణోగ్రత ఎప్పుడూ 98.4 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉండేలా నిర్వహితమవుతుంటుంది. ఇలా ఓ నిర్ణీతమైన దేహ ఉష్ణోగ్రత మెయింటెయిన్ అయ్యేందుకు మెదడులోని కీలకమైన హైపోథలామస్ అనే గ్రంథి చూస్తుంటుంది. దేహ ఉష్ణోగ్రత అన్నది ఆ నిర్ణీత 98.4 డిగ్రీల ఫారెన్‌హీట్‌కంటే ఎక్కువైనా, తక్కువైనా జీవక్రియలన్నీ అస్తవ్యస్తమై, ప్రాణాపాయమూ కలిగే ముప్పు ఏర్పడవచ్చు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా మానవ శరీరాలూ వేడెక్కుతుంటాయి. అలా వేడెక్కగాన్నే మెదడులోని హైపోథలామస్... దేహాన్ని చల్లబరిచేందుకు పూనుకుంటుంది. ఇందుకోసం స్వేదగ్రంథులనుంచి చెమట బయటకు స్రవించేలా ఆదేశాలిస్తుంది. చర్మంపై స్వేదం బయటకు రాగానే అది శరీరంలోని ఉష్ణోగ్రత (లాటెంట్ హీట్)ను స్వీకరించి, ఆ వేడిమి సాయంతో ఆవిరవుతుంది. ఇలా ఆవిరయ్యే క్రమంలో దేహం నుంచి ఉష్ణోగ్రతను తీసుకుంటుంది కాబట్టి ఆ మేరకు దేహ ఉష్ణోగ్రత తగ్గుతుంది. అందుకే చెమట పట్టినప్పుడు అది ఆవిరయ్యేలా చల్లగాలికో లేదా ఫ్యానుగాలికో ఎక్స్‌పోజ్ అయినప్పుడు దేహానికి ఓ ఆహ్లాదకరమైన చల్లటి అనుభూతి (కూలింగ్ ఎఫెక్ట్) కలుగుతుంది. ఇలా దేహం నుంచి ఉష్ణోగ్రత స్వీకరించి ఆవిరవుతూ శరీరాన్ని చల్లబరచడం కోసమూ... అలా చల్లబరచడం ద్వారా జీవక్రియలన్నీ సజావుగా జరుగుతూ ఉండటం కోసమూ, తద్వారా మానవ మనుగడ సుసాధ్యం చేయడం కోసమే చెమట పడుతుంటుంది.

చెమట ఎలా పడుతుందంటే...?

మానవ దేహం మీద రెండు రకాల చెమట గ్రంథులుంటాయి. మొదటివి ఎక్రైన్ గ్లాండ్స్. రెండోవి అపోక్రైన్ గ్లాండ్స్.

ఎక్రైన్ గ్లాండ్స్ విధులేమిటంటే... మొదటి రకం చెమట గ్రంథులైన 'ఎక్రైన్ గ్లాండ్స్' మనం పుట్టిన నాటి నుంచే పనిచేయడం మొదలుపెడతాయి. మన అరచేతులూ, అరికాళ్లతో సహా ఇవి శరీరమంతా వ్యాపించి ఉంటాయి. శరీరాన్ని చల్లగా ఉంచడానికివి సమర్థంగా తోడ్పడుతుంటాయి. వీటి ద్వారా పట్టే చెమటలో 99 శాతం నీరు, ఒక శాతం లవణాలు ఉంటాయి.

ఇక అపోక్రైన్ గ్లాండ్స్ విషయానికి వస్తే... ఇవి మనం యుక్తవయసుకు వచ్చాక పనిచేయడం ప్రారంభిస్తాయి. ప్రధానంగా బాహుమూలాలతో పాటు కొన్ని ప్రైవేటు పార్ట్స్ దగ్గర ఉంటాయి. బాగా ఉద్వేగాలకు లోనైనప్పుడు, తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నప్పుడు, భరించలేనంత బాధ కలిగినప్పుడు, విపరీతమైన శారీరక శ్రమ (లేదా వ్యాయామం) చేసినప్పుడు ఈ ప్రాంతంల్లో ఎక్కువగా చెమట పడుతుంది. మొదటి రకం ఎక్రైన్ గ్లాండ్స్‌తో పోలిస్తే ఈ అపోక్రైన్ గ్లాండ్స్ తాలూకు చెమటలో ప్రోటీన్లు, లైపిడ్లు, హార్మోనులు ఎక్కువగానూ నీరు కొద్ది మోతాదుల్లో ఉంటుంది.

వాసన ఉండని చెమట... మరి దుర్వాసన ఎందుకంటే...

నిజానికి మనకు పట్టే చెమట అనేది చాలా పరిశుభ్రమైన నీరు. అందుకే దీన్ని స్టెరైల్‌గా పేర్కొంటారు. కాబట్టి వాస్తవానికి చెమటలో ఎలాంటి దుర్వాసనా ఉండటానికి అవకాశం ఉండకూడదు. అందుకే గ్రంథి లోపలే చెమట ఉన్నప్పుడు అది స్వచ్ఛంగా ఉంటుంది.

అయితే చెమట తన గ్రంథుల్లోంచి బయటకు రాగానే మన బాహుమూలాల్లో ఉండే ప్రాప్రినో బ్యాక్టీరియమ్ అనే బ్యాక్టీరియా తన మనుగడ కోసం... చెమటలో ఉండే ప్రోటీన్లు, లైపిడ్‌లను ధ్వంసం చేస్తుంటుంది. అలా తాను బద్దలుకొట్టిన ప్రోటీన్లు, కొవ్వులపై పెరుగుతూ వాటిని శిథిలం చేస్తున్న క్రమంలో చెమట దుర్వాసన వెలువడుతుంటుంది.

ఇలా దేహం నుంచి దుర్వాసన రావడాన్ని వైద్యపరిభాషలో 'బ్రామ్‌హిడరోసిస్' అంటారు. చెమటలో నీటితో పాటు కొన్ని లవణాలు, లాక్టేట్, యూరియా కూడా ఉంటాయి. బ్యాక్టీరియా శిథిలం చేసే పదార్థాలతో పాటు ఈ లవణాలూ, యూరియా, లాక్టేట్ రసాయనాల కారణంగా చెమట దుర్వాసన మరింత పెరుగుతుంది.

ఎవరెవరిలో చెమటలు ఎక్కువ...?

- వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు ఎవరికైనా చెమటలు పట్టడం మామూలే. అయితే యుక్తవయస్కులూ, మధ్యవయస్కుల్లో ఎక్రైన్ గ్లాండ్స్‌తోపాటు, అపోక్రైన్ గ్లాండ్స్ కూడా పనిచేస్తుంటాయి కాబట్టి ఈ వయసులో ఉన్నవారిలో చెమట పట్టడం మరింత ఎక్కువ.
- శారీరకంగా వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజీన్) అంతగా పాటించని వారి దేహం నుంచీ, అలాగే ఎక్కువ బద్ధకంగా ఉండేవారి శరీరం నుంచి దుర్వాసన రావడానికి అవకాశాలెక్కువ.
- తమ తల్లిదండ్రులూ లేదా కుటుంబ సభ్యుల్లో చెమట కారణంగా దుర్వాసన వచ్చే జన్యుస్వభావం ఉన్న కుటుంబాల్లోని వారికి, అలాంటి కుటుంబంలోని సంతానానికి ఆ సమస్య అనువంశీకంగా / వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు మరింత ఎక్కువ.
- దీర్ఘకాలిక నాన్ కమ్యూనికబుల్ మెటబాలిక్ ఆరోగ్య సమస్యలైన మధుమేహం (డయాబెటిస్), గౌట్, మూత్రపిండాలు, కాలేయం సమస్యలు, టైఫాయిడ్ ఉన్నవారి నుంచి కూడా చెడువాసన ఎక్కువగా వస్తుంటుంది.
- స్థూలకాయం ఉన్నవారు, ఇతరత్రా చర్మ సమస్యలు / ఇన్ఫెక్షన్లతో బాధపడేవారి చెమటలో దుర్వాసన వచ్చే అవకాశాలు మరింత ఎక్కువ. ముఖ్యంగా ఇంటెర్‌ట్రిగో, ట్రైకోమైకోసిస్ ఆగ్జిలారీస్, ఎరిథ్రాస్మా వంటి సమస్యలు ఉన్నవారిలో ఈ సమస్య ఇంకా ఎక్కువ.
- మద్యం తాగేవారూ, తమ ఔషధాల్లో భాగంగా పెన్సిలిన్, బ్రోమైడ్స్ వంటి మందుల వాడకం వల్ల కూడా ఒంటినుంచి చెడువాసన వస్తుంటుంది.

ఆహారానికీ, శరీర దుర్వాసనకూ సంబంధమిలా...

ఆహారానికీ, శరీరం నుంచి వచ్చే దుర్వాసనకూ నేరుగా సంబంధం లేదుగానీ... కొన్ని రకాల ఆహారాలతో చెమటల్లో దుర్వాసన వచ్చే అవకాశాలు పెరుగుతాయని కొన్ని అధ్యయనాల్లో తేలింది. ఉదాహరణకు ఆహారంలో వేపుడు పదార్థాలు ఎక్కువగా తినేవారిలో, ఉల్లిపాయలు, వెల్లుల్లి, మాంసహారం, కొన్ని రకాల ఆకుకూరలు తీసుకునే కొందరిలో చెమట దుర్వాసన వచ్చే అవకాశాలెక్కువ.

అలాగే పానియాల విషయానికి వస్తే... కెఫిన్ ఎక్కువగా ఉండే పానీయాలు తీసుకునే కొందరిలోనూ చెమట నుంచి దుర్వాసన రావడం పెరుగుతుంది. ఇది అందరి విషయంలోనూ అంతే నిర్దిష్టంగా జరగదు గానీ... చెమటల వల్ల శరీరం దుర్వాసన వస్తుండే వారిలో ఈ ఆహారాలు ఆ దుర్వాసనను మరింతగా ప్రేరేపించడానికి అవకాశాలెక్కువ.



డా. స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

యాంటీ పెర్‌స్పిరెంట్స్, డియోడరెంట్స్ ఏం చేస్తాయంటే...

ముందుగా చెప్పకున్నట్లు శరీరానికి చెమట పట్టడమన్నది ప్రకృతి కొన్ని ప్రయోజనాల కోసం చేసే ప్రక్రియ. శరీరాన్ని చల్లగా ఉంచడం కోసం ఇది తప్పనిసరిగా జరగాల్సిన అవసరం ఉంది. యాంటీ-పెర్‌స్పిరెంట్ అంటే చెమటలకు వ్యతిరేకమైనదనీ... మరింత స్పష్టంగా చెప్పాలంటే చెమటపట్టడాన్ని నిలిపివేసేదని అర్థం. కానీ వాస్తవానికి ఇప్పుడు మార్కెట్‌లో దొరికే ఏ యాంటీ పెర్‌స్పిరెంట్ కూడా చెమట పట్టడం అనే సహజ శారీరక ధర్మాన్ని నిలిపివేయలేదు. బయటి ఉష్ణోగ్రతను బట్టి చెమటపట్టడమన్నది నిరంతరమూ జరుగుతుండే ప్రక్రియ. అందుకే వేడినీటితో స్నానం తర్వాత చాలామందిలో అలా చెమటలు పడుతుండటాన్ని, చాలావరకు అందరూ గమనించవచ్చు. కాకపోతే అప్పడే పరిశుభ్రమైన నీటితో స్నానం చేసిన చెమ్మ ఒంటిపై ఉంటుంది కాబట్టి... ఏదీ స్నానపు నీరో, ఏది చెమటో తెలియదు. దీన్ని బట్టి తేలిసే విషయమేమిటంటే కొందరు అపోహ పడ్డట్టుగా యాంటీపెర్‌స్పిరెంట్స్ చెమట పట్టడాన్ని పూర్తిగా ఆపేయవు.

యాంటీ పెర్‌స్పిరెంట్లు ఎలా పనిచేస్తాయంటే...

యాంటీ పెర్‌స్పిరెంట్లలో అల్యూమినియమ్ క్లోరో హైడ్రేట్, అల్యూమినియమ్ క్లోరైడ్, అల్యూమినియమ్ ఫీనాల్ సల్ఫోనేట్, అల్యూమినియమ్ సల్ఫేట్, జిర్కోనియమ్ క్లోరో హైడ్రేట్స్ వంటి లవణాలు ఉంటాయి. ఈ రసాయనిక లవణాలు చెమట గ్రంథి ద్వారాన్ని తాత్కాలికంగా మూసివేస్తాయి. దాంతో కాసేపు చెమట తక్కువ పట్టేలా చేయగలవు. కాకపోతే వాటి ప్రభావం తగ్గాక మళ్లీ స్వేద గ్రంథి నుంచి చెమట ముందులాగే స్రవిస్తూ ఉంటుంది. చెమట గ్రంథులను తాత్కాలికంగా మూసేసి, చెమటను తాత్కాలికంగా తగ్గిస్తుంది కాబట్టే దీన్ని యాంటీ పెర్‌స్పిరెంట్ అంటారు. ఈ యాంటీ పెర్‌స్పిరెంట్లను కేవలం బాహుమూలాల్లో మాత్రమే రాస్తారు.

యాంటీ పెర్‌స్పిరెంట్లతో ప్రతికూలతలు...

- కొన్నిసార్లు ఇవి తమ రసాయనిక చర్యల కారణంగా వాటిని ఉపయోగించిన వారి లేదా రానుకున్నవారి దుస్తుల రంగు మారేలా చేస్తాయి.
- కొందరికి ఈ యాంటీ పెర్‌స్పిరెంట్స్ సరిపడకపోతే వాళ్లలో కాంటాక్ట్ డర్మటైటిస్ అనే తరహా అలర్జీ మొదలవుతుంది. అది తర్వాత నల్ల మచ్చలుగా మారుతుంది.
- వీటిలోని ఆసిడిక్ పీహెచ్ గుణం కారణంగా కొందరిలో అవి తమ చర్మాన్ని ఇరిటేట్ చేయడానికి అవకాశముంది. అందుకే కొన్ని యాంటీ పెర్‌స్పిరెంట్స్‌లో వాటి వల్ల కలిగే ఇరిటేషన్‌ను తగ్గించడానికి జింక్ ఆక్సైడ్, మెగ్నీషియమ్ ఆక్సైడ్, అల్యూమినియమ్ హైడ్రాక్సైడ్ వంటివి కలుపుతారు.

డియోడరెంట్స్ ఏం చేస్తాయంటే...

- సాధారణంగా డియోడరెంట్స్‌ను బాహుమూలాలతో పాటు... శరీరంలోని ఎక్కడి చర్మంపైనైనా రానుకోవచ్చు. డియోడరెంట్స్ చెమట పట్టే ప్రక్రియకు ఏమాత్రం ఆటంకం కలిగించవు. కాకపోతే చెమటపైనే బతికే ప్రాపినో బ్యాక్టీరియమ్ వంటి బ్యాక్టీరియాను తాత్కాలికంగా తుదముట్టిస్తాయి. దాంతో శరీరం నుంచి వచ్చే దుర్వాసన కూడా తగ్గుతుంది.
- డియోడరెంట్స్‌లో అమోనియమ్ అలమ్, పొటాషియమ్ అలమ్ వంటి రసాయనాలు ఉంటాయి. ఇవి బ్యాక్టీరియాను తాత్కాలికంగా నాశనం చేస్తాయి. వాటి ప్రభావం తగ్గాక బ్యాక్టీరియా మళ్లీ యథావిధిగా పెరుగుతూనే ఉంటుంది.
- యాంటీ పెర్‌స్పిరెంట్స్‌తో పోలిస్తే డియోడరెంట్స్ చర్మంపై చాలా తక్కువగా ఇరిటేషన్ పుట్టిస్తాయి.

యాంటీ పెర్‌స్పిరేంట్స్, డియోడరెంట్స్ ఎలా వాడాలంటే..?

ఎవరు ఏం చేసినా, యాంటీ పెర్‌స్పిరెంట్స్‌తోనూ, డియోడరెంట్స్‌తోనూ కృత్రిమంగా కాసేపు ఎదుర్కొన్నప్పటికీ చెమట పట్టడమనే స్వాభావికమైన కార్యకలాపం జరగాల్సిందే. ఈ నేపథ్యంలో యాంటీ పెర్‌స్పిరెంట్స్ లేదా డియోడరెంట్స్ సమర్థంగా వాడటానికి ఈ కింద పేర్కొన్న మార్గదర్శకాలను పాటించడం చాలావరకు మేలు చేస్తుంది.

•••

కొందరికి చెమటలు చాలా ఎక్కువేగానీ దేహ దుర్వాసన అంతగా ఉండకపోవచ్చు. అలాంటి వారు తమ బాహుమూలాల్లో యాంటీ పెర్‌స్పిరెంట్స్ వాడవచ్చు.

•••

కొందరిలో కొద్దిగా చెమట పట్టినా వెంటనే దుర్వాసన వస్తుంది. ఇలాంటివారు డియోడరెంట్స్ వాడుకోవచ్చు.

•••

ఇక కొందరిలో చెమటా, దుర్గంధమూ... ఈ రెండూ ఎక్కువే. అలాంటివారు ఈ రెండింటినీ వాడవచ్చు. ఇలాంటివారు యాంటీ పెర్‌స్పిరెంట్స్‌ను బాహుమూలాల్లో మాత్రం రానుకుని, మిగతా శరీరానికి డియోడరెంట్‌ను వాడవచ్చు.

యాంటీ పరిస్పిరెంట్స్ ఎలా వాడాలంటే...

- రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు... స్నానం చేశాక... ఒళ్లు పొడిబారి ఉన్నప్పుడు వాడాలి. ఎందుకంటే ఆ టైమ్‌లో స్వెట్ తక్కువగా ఉంటుంది కాబట్టి స్వెట్ గ్లాండ్స్ దాన్ని బాగా అబ్‌జార్బ్ చేసుకుంటాయి. పొద్దున్నే మళ్లీ యాంటీపెర్‌స్పిరెంట్స్‌ను కడిగేసుకోవాలి. ఇలా మొదట 15 రోజులు చేయాలి. ఆ తర్వాత రోజు విడిచి రోజు మళ్లీ నెల రోజుల పాటు చేయాలి.
- యాంటీ పరిస్పిరెంట్స్‌ను నోరు, ముక్కు, కనురెప్పల దగ్గరా, అలాగే మర్మావయవాల (ప్రైవేట్ పార్ట్స్ దగ్గర) అస్సలు రాయకూడదు.
- బాహుమూలాల్లోని వెంట్రుకలను తొలగించిన రోజున పెరిస్పిరెంట్స్‌ను గాని, డియోడరెంట్స్‌ను గాని అస్సలు రాయకూడదు. ఆ రోజున వదిలేసి, ఆ మర్నాటి నుంచి రానుకోవచ్చు.

డియోడరెంట్స్ వాడడం ఎలాగంటే...

వీటిని రోజూ పొద్దున్నే స్నానం చేశాక బయటికి వెళ్లే ముందు దేహంలో ఎక్కడైనా అప్లై చేసుకోవచ్చు.

ఏటా 80 లక్షల ఉద్యోగాలు

వచ్చే 10-12 ఏళ్లలో కల్పించాలి
- జీడీపీలో తయారీ వాటా పెంచుకోవాలి
- అప్పుడే 2047 నాటికి సంపన్న దేశ లక్ష్యం సాధ్యం
- సీఈఏ నాగేశ్వరన్ వెల్లడి



న్యూయార్క్: వచ్చే 10–12 ఏళ్లలో భారత్ ఏటా 80 లక్షల ఉద్యోగాలు కల్పిస్తేనే 2047 నాటికి సంపన్న దేశంగా ఎదగాలన్న లక్ష్యం సాకారమవుతుందని కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ తెలిపారు. ఇందుకోసం స్థూల దేశీయోత్పత్తిలో తయారీ రంగం వాటా కూడా మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 1990లలో సంస్కరణలు అమల్లోకి వచ్చాక సుమారు ముప్పై ఏళ్ల పాటు దేశానికి వెలుపల పరిస్థితులు కాస్త సానుకూలంగా ఉన్నప్పటికీ, వచ్చే 10–20 ఏళ్ల పాటు అలా ఉండకపోవచ్చని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో చైనా ఏ విధంగానైతే తయారీ రంగంలో ఆధిపత్యం సాధించిందో, మనం కూడా జీడీపీలో తయారీ రంగ వాటాను పెంచుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కొలంబియా వర్సిటీలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. సంపన్న దేశాలకు కృత్రిమ మేథ, టెక్నాలజీ, రోబోటిక్స్‌లాంటివి సవాలు కాదని, కానీ అభివృద్ధి ప్రస్థానంలో ఉన్న దేశాలకు సమస్యాత్మకంగా ఉండవచ్చని పేర్కొన్నారు. 'భారీ జనాభా ఉండే భారత్ ఇది పెద్ద సవాలే. దీనికి సులభతరమైన సమాధానాలేమీ లేవు. ఓవైపు, ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలకు, ఐటీ నైపుణ్యాల అవసరం తక్కువగా ఉండే సర్వీస్ కొలువులకు కృత్రిమ మేథతో ముప్పు పొంచి ఉంది. మరోవైపు, ఏటా 80 లక్షల ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం నెలకొంది' అని నాగేశ్వరన్ వివరించారు.

చిన్న సంస్థలకు అనుకూల పరిస్థితులు కల్పించాలి..

2047 నాటికి భారతీయ సంస్థలను అంతర్జాతీయ వేల్యూ చెయిన్‌లలో భాగం చేయడంతో పాటు చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) అనుకూల పరిస్థితులు కల్పించాల్సి ఉంటుందని నాగేశ్వరన్ చెప్పారు. తయారీ, ఎంఎస్‌ఎంఈలు రెండూ కలిసి ప్రయాణిస్తేనే ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. శక్తివంతమైన తయారీ హబ్‌లుగా ఎదిగిన దేశాలన్నింటిలోనూ ఎంఎస్ఎంఈలకు అనువైన పరిస్థితులను కల్పించడానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు. దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం పడే అవకాశం ఉందని నాగేశ్వరన్ చెప్పారు. ఈ నేపథ్యంలో పెట్టుబడులను మరింత రాబట్టుకోవడమో లేదా వచ్చిన పెట్టుబడులను మరింత సమర్ధవంతంగా ఉపయోగించుకోవడంపైనో దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

8 శాతం వృద్ధి రేటు కష్టమే..

ప్రస్తుత పరిస్థితుల్లో 8 శాతం వృద్ధి రేటును నిలకడగా సాధించడం కష్టమైన వ్యవహారమేనని నాగేశ్వరన్ తెలిపారు. అయితే, దేశీయంగా నియంత్రణలను సడలించడంపై దృష్టి పెట్టి, రాబోయే ఒకటి..రెండు దశాబ్దాల పాటు స్థిరంగా 6.5 శాతం వృద్ధినైనా సాధించగలిగితే.. నెమ్మదిగా 7 శాతం వైపు వెళ్లొచ్చని ఆయన చెప్పారు. విధానాలపరంగా చూస్తే, గతంలోలాగా జీడీపీ వృద్ధిలో ఎగుమతులు ప్రాధాన్య పాత్ర పోషించే పరిస్థితి ఉండకపోవచ్చని నాగేశ్వరన్ వివరించారు. ఆర్థిక సంక్షోభానికి ముందు తొలి దశాబ్దకాలంలో ఏటా జీడీపీ వృద్ధిలో ఎగుమతుల వాటా 40 శాతం వరకు ఉండేదని, అప్పట్లో స్థూల దేశీయోత్పత్తి సగటున 8–9 శాతం స్థాయిలో వృద్ధి నమోదు చేసిందని ఆయన పేర్కొన్నారు. రెండో దశాబ్ద కాలంలో జీడీపీ వృద్ధిలో ఎగుమతుల వాటా 20 శాతానికి పడిపోయిందని, మూడో దశాబ్ద కాలంలో ఇది మరింతగా తగ్గిపోవచ్చని నాగేశ్వరన్ చెప్పారు. అలాగని ఎగుమతులను తక్కువ చేసి చూడటానికి వీల్లేదని, వాటితో పాటు దేశీయంగా నాణ్యత, పరిశోధనలు.. అభివృద్ధి కార్యకలాపాలు, లాజిస్టిక్స్, లాస్ట్–మైల్ కనెక్టివిటీలాంటి అంశాలపైనా మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంటుందని వివరించారు.

బిజినెస్ రీల్

హైదరాబాద్‌లో 'డైఫుకు ఇంట్రాలాజిస్టిక్స్' కేంద్రం



హైదరాబాద్: మెటీరియల్ హ్యాండ్లింగ్ ఆటోమేషన్ సంస్థ 'డైఫుకు ఇంట్రాలాజిస్టిక్స్ ఇండియా', హైదరాబాద్‌లో తమ అధునాతన తయారీ, ఇన్నోవేషన్ కేంద్రాన్ని ప్రారంభించింది. రూ. 227 కోట్ల పెట్టుబడులతో దీన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ చైర్మన్ శ్రీనివాస్ గరిమెళ్ల తెలిపారు. దీనితో ప్రాథమికంగా ఇంజినీరింగ్, ఆటోమేషన్, ప్రొడక్షన్ వంటి విభాగాల్లో 100 పైగా ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రధానంగా అధునాతన ఆటోమేషన్ టెక్నాలజీలు, డిజిటల్ సాధనాలపై దృష్టి పెడుతుందని తెలిపారు. టెక్నికల్ ఇనిస్టిట్యూట్స్‌తో జట్టు కట్టడంతో పాటు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపైనా కంపెనీ ఫోకస్ చేయనున్నట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

జెన్సోల్‌పై ప్రభుత్వ చర్యలు

ఎంసీఏ సెబీ ఆదేశాల పరిశీలన

GENSOL

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశాలు పరిశీలించాక జెన్సోల్ ఇంజినీరింగ్‌పై అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు కార్పొరేట్ వ్యవహారాల శాఖ(ఎంసీఏ) తాజాగా పేర్కొంది. కంపెనీ ప్రమోటర్లు అన్మోల్ సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీ ఎలాంటి కీలక పదవులు చేపట్టకుండా గత వారం సెబీ నిషేధం విధించింది. అంతేకాకుండా తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ సెక్యూరిటీ మార్కెట్ల నుంచి సైతం తప్పిస్తున్నట్లు ప్రకటించింది. లిస్టెడ్ కంపెనీ జెన్సోల్ రుణాల ద్వారా సమీకరించిన నిధులను ప్రమోటర్లు వ్యక్తిగత వినియోగాలకు అక్రమంగా మళ్లించిన కేసులో సెబీ చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ అంశంలో కార్పొరేట్ అవతవకలపై వివిధ రకాల చర్యలు తీసుకునేందుకు వీలున్న 2013 కంపెనీల చట్టం ప్రకారం ఎంసీఏ వ్యవహరించనుంది. కంపెనీల రిజిస్ట్రార్(ఆర్‌వోసీ) సైతం కంపెనీ పుస్తకాల తనిఖీకి తెరతీసే వీలుంది. అంతేకాకుండా తీవ్ర ఆర్థిక నేరాల పరిశీలనా కార్యాలయ(సిఫో) దర్యాప్తునకు సైతం ఆదేశించవచ్చు.

హైదరాబాద్‌లో చిన్న ఆయుధాల తయారీ కేంద్రం

ప్రారంభించిన క్యారకల్–ఐకామ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా (ఎంఈఐఎల్) గ్రూప్ సంస్థ ఐకామ్ టెలీ తాజాగా హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి చిన్న ఆయుధాల తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. ఇందుకోసం యూఏఈకి చెందిన చిన్న ఆయుధాల తయారీ సంస్థ, ఎడ్జ్ గ్రూప్‌లో భాగమైన క్యారకల్‌తో జట్టు కట్టింది. రెండు సంస్థల మధ్య కుదిరిన లైసెన్సింగ్ ఒప్పందం కింద క్యారకల్ సాంకేతిక సహకారాన్ని అందిస్తుంది. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ నినాదం కింద ఈ ప్లాంటులో సీఏఆర్ 816 క్లోజ్–క్వార్టర్స్ అసాల్ట్ బ్యాటిల్ రైఫిల్, సీఏఆర్ 817 అసాల్ట్ రైఫిల్ మొదలైనవి ఉత్పత్తి చేస్తారు. వీటిని భారత సాయుధ బలగాలు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌లు, రాష్ట్రాల పోలీస్ ఫోర్స్‌లు, ఎస్‌పీజీ మొదలైన రక్షణ రంగ విభాగాలకు సరఫరా చేయడంతో పాటు వివిధ దేశాలకు ఎగుమతి కూడా చేస్తారు. రక్షణ బలగాల పట్ల తమ నిబద్ధతకు, ఆత్మ నిర్భర్ భారత్ విజన్‌పై నమ్మకానికి ఇది నిదర్శనంగా నిలుస్తుందని ఐకామ్ ఎండీ సుమంత్ పాతూరు తెలిపారు. ఇరు దేశాల మధ్య రక్షణ రంగ సహకారానికి సంబంధించి సాంకేతిక బదిలీ ఒప్పందం కీలక మైలురాయిలాంటిదని క్యారకల్ సీఈవో హమద్ అల్‌అమెరి పేర్కొన్నారు.

స్టీల్‌పై సేఫ్‌గార్డ్ డ్యూటీ

200 రోజుల వరకూ 12 శాతం విధింపు



న్యూఢిల్లీ: ప్రభుత్వం తాజాగా ఐదు విభాగాల స్టీల్ ప్రొడక్టులపై సేఫ్‌గార్డ్ డ్యూటీకి తెరతీసింది. 200 రోజులపాటు అమలయ్యే విధంగా 12 శాతం సుంకాన్ని విధించింది. ఈ జాబితాలో హాట్ రోల్డ్ క్వాయిల్స్, షీట్లు, ప్లేట్లు తదితరాలున్నాయి. తద్వారా పెరుగుతున్న దిగుమతుల నుంచి దేశీ సంస్థలకు రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టింది. వాణిజ్య శాఖ దర్యాప్తు విభాగం డీజీటీఆర్ సలహామేరకు ప్రభుత్వం స్టీల్ దిగుమతులపై తాజా సుంకాలను విధించింది. వాణిజ్య పరిష్కారాల డైరెక్టర్ జనరల్ సూచనలమేరకు కేంద్ర ప్రభుత్వం 12 శాతం విలువ ఆధారిత ప్రొవిజనల్ సేఫ్‌గార్డ్ డ్యూటీని విధించినట్లు ఆదాయ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. తాజా సుంకాలు గడువుకంటే ముందుగా ఎత్తివేయడం లేదా మార్పులు చేపట్టడం వంటివిలేకుంటే 200 రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలియజేసింది. సుంకాల పరిధిలో చేర్చిన ఐదు రకాల(విభాగాల) స్టీల్ ప్రొడక్టుల దిగుమతి ధరలు టన్నుకి 675 డాలర్ల నుంచి 964 డాలర్ల మధ్య నిర్ణయించింది. ఈ ధరలకంటే దిగువన దిగుమతయ్యే ప్రొడక్టులకు సేఫ్‌గార్డ్ డ్యూటీ వర్తించనుంది. వీటికంటే అధిక ధరలకు దిగుమతయ్యే(జాబితాలో చేర్చిన) ప్రొడక్టులపై సుంకాలు అమలుకాబోవు.

ఇక మైనర్లే బ్యాంక్ ఖాతాలు నిర్వహించుకోవచ్చు

10 ఏళ్లు నిండిన వారికి ఆర్‌బీఐ అనుమతి



ముంబై: పిల్లలు బ్యాంక్ సేవింగ్స్/డిపాజిట్ ఖాతాల ప్రారంభం, నిర్వహణ విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. పదేళ్లు నిండిన వారు (మైనర్లు) బ్యాంక్ ఖాతాలు తెరిచేందుకు, సొంతంగా నిర్వహించేందుకు వీలుగా బ్యాంక్‌లకు ఆర్‌బీఐ అనుమతి మంజూరు చేసింది. ఈ దిశగా సవరించిన నిబంధనలను ఆర్‌బీఐ విడుదల చేసింది. ఏ వయసు మైనర్లు అయినా తమ తల్లిదండ్రులు లేదా చట్టబద్ధమైన సంరక్షకుల ద్వారా సేవింగ్స్, టర్మ్ డిపాజిట్లు తెరిచేందుకు అనుమతిస్తున్నట్లు వాణిజ్య బ్యాంక్‌లు, కోపరేటివ్ బ్యాంక్‌లకు జారీ చేసిన సర్క్యులర్‌లో ఆర్‌బీఐ పేర్కొంది. బ్యాంక్‌లు తమ రిస్క్ నిర్వహణ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని పదేళ్లు నిండిన మైనర్లు సేవింగ్స్, టర్మ్ డిపాజిట్ ఖాతాలను తెరిచి, స్వతంత్రంగా నిర్వహించుకునేందుకు అనుమతించొచ్చని స్పష్టం చేసింది. అయితే ఇందుకు సంబంధించిన నిబంధనలను ఖాతాదారులకు ముందుగానే తెలియజేయాలని పేర్కొంది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం/డెబిట్ కార్డులు, చెక్‌బుక్ సదుపాయాలను సైతం మైనర్ ఖాతాదారులకు ఆఫర్ చేయొచ్చని తెలిపింది.

ఇంధన స్టోరేజీపై పెట్టుబడులు రూ.4.79 లక్షల కోట్లు

- 2032 నాటికి వస్తాయి
- 74 గిగావాట్లకు డిమాండ్
- ఇండియా ఎనర్జీ స్టోరేజీ అలయన్స్ అంచనా



న్యూఢిల్లీ: ఇంధన స్టోరేజీ రంగంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు రానున్నాయి. ఈ రంగం 2032 నాటికి రూ.4.79 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుందని ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్ (ఐఈఎస్‌ఏ) అంచనా వేసింది. 2026 నుంచి 2032 మధ్య దేశ ఇంధన నిల్వ రంగం పరిమాణం ఐదింతలు అవుతుందన్నది ఐదవ ఎడిషన్ అంతర్జాతీయ సదస్సులో భాగంగా ఐఈఎస్‌ఏ పేర్కొంది. 2026–27 నాటికి దేశ ఇందన స్టోరేజీ సామర్థ్యం 16.13 గిగావాట్ అవసరమన్నది జాతీయ విద్యుత్ ప్రణాళిక అంచనా. ఇందులో 7.45 గిగావాట్ హవర్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల రూపంలో, 8.68 గిగావాట్ హవర్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) రూపంలో ఉండనుంది. 2031–32 నాటికి నిల్వ సామర్థ్యం డిమాండ్ 73.93 గిగావాట్‌కు చేరుకుంటుందని అంచనా వేయడం గమనార్హం. సాంకేతికపరమైన ఆవిష్కరణలు, బలమైన ఇంధన స్టోరేజీ వ్యవస్థ ఏర్పాటుకు వీలుగా కావాల్సిన వసతుల కల్పన కోసం ఈ స్థాయి భారీ పెట్టుబడులు అవసరం అవుతాయని ఐఈఎస్‌ఏ తెలిపింది. ఈ సదస్సులో పరిశ్రమ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, 10కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ విస్తరణ..

''2 హవర్, 4 హవర్ టెండర్లకు మంచి స్పందన వస్తోంది. 8 హవర్ టెండర్లపై ప్రకటనలు త్వరలోనే రానున్నాయి. గుజరాత్ 30 గిగావాట్లకు పైన పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అందిస్తోంది. 2030 నాటికి 100 గిగావాట్లకు చేరుకోవాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది. పునరుత్పాదక ఇంధన రంగం బలమైన వృద్ధితో ఇంధన స్టోరేజీ మార్కెట్ భారీ విస్తరణను చూడనుంది'' అని గుజరాత్ పవర్ కార్పొరేషన్ ఎండీ అరుణ్ మహేష్ బాబు ఈ సదస్సులో భాగంగా ప్రకటించారు. 2030 నాటికి 500 గిగావాట్ హవర్స్, 2047 నాటికి 5,000 గిగావాట్‌హవర్స్ సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) చైర్మన్, ఎండీ ఆర్‌పీ గుప్తా తెలిపారు. పునరుత్పాదక ఇంధన రంగంలో పెద్ద ఎత్తున ఆవిష్కరణలు, పెట్టుబడులకు అవకాశాలున్నట్టు చెప్పారు. మెగావాట్ ఇంధన స్టోరేజీ సామర్థ్యం ఏర్పాటు వ్యయం గత రెండేళ్లలో రూ.10 లక్షల నుంచి రూ.2.5 లక్షలకు తగ్గినట్టు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ ఘనశ్యామ్ ప్రసాద్ వెల్లడించారు. బ్యాటరీ ఇంధన స్టోరేజీపై కొత్త ప్రమాణాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

అమెరికాతో ఒప్పందంపై చురుగ్గా చర్చలు


కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



శాన్‌ఫ్రాన్సిస్కో: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై (బీటీఏ) అమెరికాతో చర్చలు చురుగ్గా సాగుతున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సెప్టెంబర్–అక్టోబర్ నాటికి తొలి దశకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేసే అవకాశం ఉందని ప్రవాస భారతీయుల కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పేర్కొన్నారు. భారత్ సహా పలు దేశాలపై అమెరికా భారీగా ప్రతీకార టారిఫ్‌లు ప్రకటించిన నేపథ్యంలో ఇరు దేశాలు బీటీఏపై కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన చర్చలను రెండు దశల్లో పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాయి. మరోవైపు, సెమీ కండక్టర్లు, రెన్యువబుల్ ఎనర్జీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, కృత్రిమ మేథ మొదలైన వాటిల్లో పురోగమిస్తున్న భారత్.. భవిష్యత్తులో ఆయా రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెడుతోందని ఆమె చెప్పారు.

ఇకపై ప్రతి నెలా నిరుద్యోగ గణాంకాలు

మే నెల 15 నుంచి ఆరంభం



ముంబై: దేశంలో నిరుద్యోగ గణంకాలను ఇకపై ప్రతి నెలా విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ప్రతి మూడు నెలలకు ఒకసారి (త్రైమాసికం) విడుదల చేస్తుండడం గమనార్హం. మే 15న ఈ ఏడాది మొదటి మూడు నెలల గణాంకాలను విడుదల చేయనున్నట్టు, ఆ తర్వాత నుంచి ప్రతి నెలా ప్రకటించనున్నట్టు గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ పేర్కొంది. మన దేశంలో నిరుద్యోగ గణాంకాల సేకరణకు సంబంధించి సరైన వ్యవస్థ లేకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు విడుదల చేస్తున్నది కూడా పట్టణ నిరుద్యోగం గురించే. గ్రామీణ నిరుద్యోగ గణాంకాలను ఏడాదికోసారి ప్రకటిస్తోంది. అసంఘటిత రంగం డేటాను సైతం మూడు నెలలకోసారి విడుదల చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

రామ్‌రాజ్ నుంచి 'మృదు టవల్స్'



హైదరాబాద్: రామ్‌రాజ్ కాటన్ టవల్స్ విభాగంలోకి ప్రవేశించింది. 'మృదు' పేరుతో కస్టమర్లకు టవల్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటి మీనాక్షి చౌదరి వ్యవహరించనున్నారు. మెరుగైన నాణ్యత, వినూత్న డిజైన్లలో మృదు టవల్స్ ఉంటాయని కంపెనీ ఎండీ అరుణ్ ఈశ్వర్ తెలిపారు. రామ్‌రాజ్ అంటే నాణ్యత, ప్రామాణికత, నిబద్ధతకు నిదర్శనమని మీనాక్షి చౌదరి అభిప్రాయపడ్డారు. మృదు టవల్స్‌కు ప్రచాకర్తగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు.

స్మార్ట్‌ఫోన్లు, పీసీల తయారీ కేంద్రంగా భారత్

- మనదేశం వైపు దృష్టి సారిస్తున్న అంతర్జాతీయ సంస్థలు
- కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక

అమెరికా - చైనాల మధ్య వాణిజ్య యుద్ధ ప్రభావం



ముంబై: అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం భారత్‌కు అనుకూలంగా మారుతోంది. అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాబ్‌లు/వ్యక్తిగత కంప్యూటర్ (పీసీలు) సంస్థలు తమ ఉత్పత్తి కర్మాగారాలను చైనా నుంచి భారత్‌కు తరలించే అంశాన్ని పరిగణలోకి తీసుకుంటున్నాయి. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం అగ్రరాజ్యాల మధ్య సుంకాల విధింపులు, ప్రతీకార టారిఫ్‌ల ఉద్రికత్తలు కొనసాగితే.., అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ల మొత్తం ఉత్పత్తిలో డ్రాగన్ దేశపు వాటా 2026 నాటికి 55 శాతానికి పడిపోయే వీలుంది. గత సంవత్సరం(2024) ఈ వాటా 64 శాతంగా ఉంది. ఇదే సమయంలో భారత్ నుంచి ముఖ్యంగా అమెరికాకు యాపిల్, శాంసంగ్ ఎగుమతులు జోరందుకోనున్నాయి. అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ల మొత్తం ఉత్పత్తిలో భారత్ వాటా 2026 నాటికి 25–28 శాతానికి చేరొవచ్చు. కాగా గత సంవత్సరంలో ఈ వాటా 18 శాతంగా ఉంది.

- అంతర్జాతీయంగా ఐఫోన్ల ఉత్పత్తి విలువలో భారత్ ఎగుమతుల వాటా ప్రస్తుతం 20 శాతంగా ఉంది. ఇది 2025–26 కల్లా 25 శాతానికి, 2026–27 నాటికి 35 శాతానికి చేరుతుందని కౌంటర్‌పాయింట్ అంచనా వేస్తోంది.
- ల్యాప్‌ట్యాబ్‌లు/ పీసీల మొత్తం తయారీలో చైనా వాటా 2026 నాటికి 68–70 శాతానికి దిగివచ్చే అవకాశం ఉంది. 2024లో ఈ వాటా 75 శాతంగా ఉంది. అంతర్జాతీయ ల్యాప్‌ట్యాబ్‌ల ఉత్పత్తిలో భారత్ వాటా 2026 నాటికి ఏడు శాతానికి చేరుకోవచ్చు. 2024లో భారత్ వాటా కేవలం నాలుగు శాతంగా ఉంది.

''ల్యాప్‌ట్యాబ్‌లు, పీసీలు చైనా నుంచే అధికంగా దిగుమతి అవుతున్నాయి. వాణిజ్య వార్ నేపథ్యంలో హెచ్‌పీ, డెల్ ఇతర సంస్థలు తమ ఉత్పత్తి స్థావరాలు చైనా నుంచి భారత్‌కు మారిస్తే అంతర్జాతీయంగా దేశీయ మార్కెట్ వాటా పెరగడమే కాకుండా ఎగుమతులు సైతం గణనీయంగా పెరుగుతాయి. భారత్ సైతం ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే ఐటీ హార్డ్‌వేర్ రంగాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్రం 'మేక్ ఇన్ ఇండియా' 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం' వంటి పథకాలు ప్రవేశపెట్టింది'' అని ఇండియన్ సెల్యూలర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) సభ్యుడొకరు తెలిపారు.

అంత సులువేం కాదు:


చైనా నుంచి తయారీ కర్మాగారాలను భారత్‌కు తరలించడం అంత సులువు కాదని కాన్లేస్ నివేదిక చెబుతోంది. డెల్ సంస్థ ల్యాప్‌ట్యాబ్‌ల ఉత్పత్తి 79% చైనాలో ఉండగా, మిగిలినదంతా వియత్నాంలో ఉంది. కాన్లేస్ రిపోర్ట్ ప్రకారం 2026 నాటికి డెల్ తన తయారీ సామర్థ్యాన్ని సగానికిపైగా వియత్నాంకు తరలించనుంది. లెనివో సైతం వియత్నాంను ప్రత్యమ్నాయ దేశంగా చూస్తోంది. చైనాలో 85% తయారీ సామర్థ్యం ఉన్న హెచ్‌పీ.. 2026 కల్లా మెక్సికో, తైవాన్ దేశాలకు 45% మార్చనుంది.

జోయాలుక్కాస్ 'గోల్డెన్ ప్రాస్పెరిటి' క్యాంపెయిన్



హైదరాబాద్: అక్షయ తృతీయ సందర్భంగా జోయాలుక్కాస్ 'గోల్డెన్ ప్రాస్పెరిటి' క్యాంపెయిన్ ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రత్యేక పలు ఆఫర్లు ప్రకటించింది. రూ.75,000 అంతకంటే ఎక్కువ విలువైన డైమండ్, అన్‌కట్ డైమండ్స్, ప్లాటినమ్ జ్యువెలరీ కొనుగోలుపై 500 మిల్లీగ్రామ్‌ల 24 క్యారెట్ గోల్డ్ బార్ ఉచితంగా ఇస్తుంది. లక్షన్నర విలువైన డైమండ్, అన్‌కట్ డైమండ్స్, ప్లాటినమ్ జ్యువెలరీ కొనుగోలుపై ఒక గ్రాము 24 క్యారెట్ గోల్డ్ బార్ లేదా లక్ష్మీ విగ్రహం పొందవచ్చు. 2025 ఏప్రిల్ 30న(అక్షయ తృతీయ పర్వదినం) జోయాలుక్కాస్‌ను సందర్శించిన కస్టమర్లు రూ.75వేలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన బంగారు ఆభరణాలు కొనుగోలుపై 200 మిల్లీగ్రామ్‌ల గోల్డ్ కాయిన్ ఉచితంగా పొందవచ్చు. లక్ష లేదా అంతకంటే ఎక్కువ విలువైన వెండి ఆభరణాల కొనుగోలుపై 5 గ్రాముల సిల్వర్ కాయిన్ పొందవచ్చు. ముందస్తు బుకింగ్‌పై పదిశాతం ఆఫర్‌ను అందిస్తోంది. పాత బంగారం మార్పిడిపై సున్నా శాతం తగ్గింపు నుంచి ప్రయోజనం పొందవచ్చు. ఇప్పటికే మొదలైన ఆఫర్లు మే 1 వరకు అందుబాటులో ఉంటాయి.

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ రూ. 16,000 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: విద్యుదుత్పత్తి సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ పశ్చిమ బెంగాల్‌లోని సాల్బనిలో అల్ట్రా సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణం చేపట్టింది. రూ. 16,000 కోట్ల పెట్టుబడులతో దీన్ని నిర్మిస్తున్నట్లు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ తెలిపారు. ఇందులో ఉత్పత్తయ్యే విద్యుత్‌కి సంబంధించి రాష్ట్ర ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీతో (డబ్ల్యూబీఎస్ఈడీసీఎల్) కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకున్నట్లు వివరించారు. సుమారు 2,000 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

22-4-2025

విశాఖ	425–00
చిత్తూరు	440–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400–00
విజయవాడ	420–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

బోర్డు సమావేశాలు

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హాత్‌వే కేబుల్స్, హావెల్స్ ఇండియా, సైయెంట్ డీఎల్‌ఎం, డెల్టా కార్ప్, ఎంఅండ్‌ఎం ఫైనాన్స్ సర్వీసెస్, 360 వన్, ఏయూ స్మాల్ ఫైనాన్స్, మాక్స్ ఇండియా, టాటా కెమికల్స్, వర్ధమాన్ స్పెషల్ స్టీల్స్, డెక్కన్ బేరింగ్స్, వారీ ఎనర్జీస్, సీడీజీ పెట్రోకెమ్

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,374.00	5.14
TRENT	5,352.00	4.32
INDUSINDBK	826.95	4.06
POWERGRID	320	3.56
HEROMOTOCO	3,903.40	3.49

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,243.40	-1.27
HDFCLIFE	712	-1.12
ITC	422.95	-1.01
HINDUNILVR	2,352.00	-0.97
ASIANPAINT	2,444.80	-0.94

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,617
ఎన్ఎస్ఈ	1,05,396
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,27,295
ఎఫ్ఐఐ	+ 1,970
డీఐఐ	+ 247

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.33	$ 64.01
బ్రెంట్	66.07	$ 67.96



సిమ్రన్‌ప్రీత్ కౌర్‌కు రజతం

అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) రెండో ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత్ ఖాతాలో ఏడో పతకం చేరింది. పెరూ రాజధాని లిమాలో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ రజత పతకం సాధించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 20 ఏళ్ల సిమ్రన్‌ప్రీత్ 33 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు నెగ్గిన భారత స్టార్ మనూ భాకర్ 22 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. తెలంగాణ షూటర్ ఇషా సింగ్ 17 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది.



‘ఇది నా కొత్త కల’

‘క్లాసిక్ ఈవెంట్’పై భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తన కెరీర్‌లో ఇప్పటికే ఎన్నో అద్భుత విజయాలు సాధించాడు. ఒలింపిక్స్‌లో స్వర్ణపతకం, రజత పతకంతో పాటు వరల్డ్ చాంపియన్‌షిప్, కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు, డైమండ్ లీగ్‌లలో కూడా అతను విజేతగా నిలిచాడు. అయితే ఇన్ని సాధించిన తాను ఆటకు ఏదైనా తిరిగి ఇవ్వాలని సంకల్పించాడు. ఇందులో భాగంగానే ఒక ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌ను భారత్‌లో స్వయంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యాడు. ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య అధికారికంగా ‘ఎ’ కేటగిరీ గుర్తింపుతో ‘నీరజ్ చోప్రా క్లాసిక్’ ఈవెంట్ జరగనుంది. బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియంలో మే 24న ఇది జరుగుతుంది. ఈ నేపథ్యంలో నీరజ్ తన స్పందనను పంచుకున్నాడు. ‘అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించిన తర్వాత చాలా మంది తర్వాతేంటి అని అడిగేవారు. దానికి ఇదే నా సమాధానం. ఇప్పటి వరకు నేను సాధించిన పతకాలన్నీ నా ఇంటికి వెళతాయి. కానీ ఈ ఈవెంట్ మాత్రం భారత అథ్లెట్లు, భారత అభిమానుల కోసమే. భారత్‌లో ఇలాంటి ప్రపంచస్థాయి ఈవెంట్ నిర్వహించాలని ఎంతో కోరుకున్నా. ప్రేక్షకులు దీనిని ఎంతో ఆదరిస్తారని గట్టిగా నమ్ముతున్నా’ అని చోప్రా అన్నాడు.

పోటీలో తానూ...

నీరజ్ చోప్రా స్వయంగా ఈ పోటీల్లో బరిలోకి దిగుతుండగా... వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్, ఒలింపిక్ చాంపియన్ థామస్ రోలర్, జూలియర్ యెగో, కర్టిస్ థాంప్సన్ తదితర దిగ్గజాలు కూడా ఇందులో పోటీ పడుతున్నారు. పారిస్ ఒలింపిక్స్ స్వర్ణపతక విజేత, పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్‌ను కూడా ఆహ్వానించానని...అయితే అతను ఇంకా దానిని ఖాయం చేయలేదని నీరజ్ వెల్లడించాడు. మరి కొందరు భారత జావెలిన్ త్రోయర్లు కూడా ఇందులో పాల్గొనే అవకాశం ఉంది. ఆటగాడిగా తన ప్రదర్శనపైనే దృష్టి పెట్టిన తనకు ఇప్పుడు ఈవెంట్ ఏర్పాట్లు చేయడం కొత్తగా అనిపిస్తోందని అతను అన్నాడు. ‘నేను టోర్నీల్లో బరిలోకి దిగే సమయంలో ఆట తప్ప ఇతర అంశాలను దేనినీ పట్టించుకోలేదు. పంచ్‌కులాలో ఈవెంట్ అనుకున్నప్పుడు రోజూ హరియాణా ప్రభుత్వ అధికారులతో మాట్లాడి అన్ని విషయాలు చూసుకుంటూ వచ్చాను. ఇప్పుడు వేదిక బెంగళూరుకు మారింది. అక్కడ నాకు సన్నిహితులైన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ టీమ్ ఉంది. వారే అన్నీ దగ్గరుండి చూసుకుంటున్నారు’ అని నీరజ్ వివరించాడు.

ప్రతీ ఏటా జరుగుతుంది...

ప్రపంచవ్యాప్తంగా పలువురు గొప్ప అథ్లెట్ల పేర్లతో క్లాసిక్ ఈవెంట్లు జరుగుతాయి. కెన్యా రన్నర్ పేరిట నైరోబీలో ‘కిప్ కీనో క్లాసిక్’... పోల్‌వాల్ట్ గ్రేట్ అర్మాండో డుప్లాంటిస్ పేరిట స్వీడన్‌లో ‘మొండో క్లాసిక్’ కూడా నిర్వహిస్తారు. వీటికి ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య గుర్తింపు ఉంది. ఈ ఈవెంట్ల స్ఫూర్తితోనే తాను ముందుకు వచ్చినట్లు నీరజ్ వివరించాడు. ‘ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్’ ఒక్కసారితోనే ఆగిపోదని, దీనిని ప్రతి ఏటా నిర్వహిస్తామని కూడా అతను స్పష్టం చేశాడు. ‘ప్రస్తుతానికి ఇది పురుషుల జావెలిన్ ఈవెంట్ మాత్రమే. భవిష్యత్తులో ఇతర అథ్లెటిక్స్ అంశాలు కూడా జోడిస్తాం. లాంగ్‌జంప్, 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌వంటి ఈవెంట్లు జత చేసే అవకాశం ఉంది. భారత్‌లో అథ్లెటిక్స్ స్థాయి పెరుగుతోందనే విషయంలో ప్రపంచ సమాఖ్యకు కూడా తెలుసు. ఇదే కోవలో డైమండ్ లీగ్ కూడా మన దేశంలో జరగవచ్చు’ అని భారత దిగ్గజం ఆశాభావం వ్యక్తం చేశాడు. అభిమానుల కోసం వేర్వేరు స్థాయిల టికెట్లు ఉన్నాయని... అయితే మన ఫ్యాన్స్‌ను ఆకర్షించడమే ప్రధాన ఉద్దేశం కాబట్టి అవన్నీ అందుబాటు ధరలోనే ఉంచామని కూడా నీరజ్ వివరించాడు.

ఒంటరిగా ఆధిక్యంలో హంపి

ఏడో రౌండ్‌లో చైనా గ్రాండ్‌మాస్టర్ జు జినెర్‌పై విజయం



పుణే: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్ గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి ఒంటరిగా ఆధిక్యంలోకి వచ్చింది. చైనా గ్రాండ్‌మాస్టర్ జు జినెర్‌తో సోమవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన కోనేరు హంపి 55 ఎత్తుల్లో గెలిచింది. ఈ టోర్నీలో నాలుగో విజయంతో హంపి 5.5 పాయింట్లతో తొలిసారి అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. ప్రపంచ జూనియర్ చాంపియన్, భారత్‌కే చెందిన మరో ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ తన ఖాతాలో నాలుగో విజయం జమ చేసుకుంది. బత్ఖుయాగ్ మున్‌గున్‌తుల్ (మంగోలియా)తో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన దివ్య 42 ఎత్తుల్లో గెలిచింది. పొలీనా షువలోవా (రష్యా)తో జరిగిన గేమ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 43 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగించింది. అలీనా కష్లిన్‌స్కాయా (పోలాండ్)తో జరిగిన గేమ్‌ను భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు 84 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకుంది. మెలియా సలోమి (జార్జియా), నుర్గ్యుల్ సలీమోవా (బల్గేరియా) మధ్య జరిగిన గేమ్ 57 ఎత్తుల్లో ‘డ్రా’ అయింది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఏడో రౌండ్ తర్వాత దివ్య దేశ్‌ముఖ్, జు జినెర్ ఐదు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉండగా... ద్రోణవల్లి హారిక 3.5 పాయింట్లతో ఐదో స్థానంలో, వైశాలి 3 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నారు. నేడు జరిగే ఎనిమిదో రౌండ్ గేముల్లో సలోమితో హారిక; అలీనాతో హంపి; సలీమోవాతో వైశాలి; జు జినెర్‌తో దివ్య దేశ్‌ముఖ్; మున్‌గున్‌తుల్‌తో పొలీనా తలపడతారు.





పియాస్ట్రి జోరు

- సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రిలో టైటిల్ సొంతం
- ఫార్ములావన్ తాజా సీజన్‌లో మూడో విజయం

జిద్దా (సౌదీ అరేబియా): ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన రేసులో మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి పైచేయి సాధించాడు. ఫార్ములావన్ 2025 సీజన్‌లో మూడో విజయాన్ని అందుకున్నాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన సీజన్‌లోని ఐదో రేసు సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రిలో పియాస్ట్రి విజేతగా నిలిచాడు. నిర్ణీత 50 ల్యాప్‌లను పియాస్ట్రి అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంటా 21 నిమిషాల 06.758 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ‘పోల్ పొజిషన్’తో రేసును ఆరంభించిన డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్, రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి మలుపు వద్ద వెర్‌స్టాపెన్ ప్రమాదకరంగా దూసుకుపోవడంతో రేసు నిర్వాహకులు వెర్‌స్టాపెన్‌పై ఐదు సెకన్ల పెనాల్టీ విధించారు. ఈ పెనాల్టీ వెర్‌స్టాపెన్ తుది ఫలితంపై ప్రభావం చూపింది. ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్‌కు మూడో స్థానం దక్కింది. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ నాలుగో స్థానంలో నిలిచాడు. సీజన్‌లోని తదుపరి రేసు మయామి గ్రాండ్‌ప్రి మే 4వ తేదీన జరుగుతుంది.

సుదిర్మన్ కప్ నుంచి వైదొలిగిన సాత్విక్ జోడీ



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక సుదిర్మన్ కప్ ప్రపంచ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పతకావకాశాలకు దెబ్బ పడింది. భారత పురుషుల డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ఈ టోర్నీ నుంచి వైదొలిగింది. అనారోగ్యం కారణంగా వీరిద్దరూ ఈ టోర్నీలో పాల్గొనడం లేదని భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) సోమవారం ప్రకటించింది. సాత్విక్–చిరాగ్ స్థానంలో మరో జోడీని ఎంపిక చేయడం లేదని ‘బాయ్’ స్పష్టం చేసింది. ఇప్పటికే భారత మహిళల డబుల్స్ ద్వయం పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ఈ టోర్నీకి దూరమైంది. ఈ నేపథ్యంలో భారత విజయావకాశాలన్నీ పురుషుల సింగిల్స్, మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలపైనే ఆధారపడి ఉన్నాయి. సుదిర్మన్ కప్ ఈనెల 27 నుంచి మే 4వ తేదీ వరకు చైనాలోని జియామెన్ నగరంలో జరుగుతుంది. ర్యాంకింగ్స్ ఆధారంగా ఈ మెగా ఈవెంట్‌కు భారత్ అర్హత సాధించింది. గ్రూప్ ‘డి’లో మాజీ చాంపియన్ ఇండోనేసియా, డెన్మార్క్, ఇంగ్లండ్ జట్లతో భారత్ పోటీపడనుంది.

సబలెంకాకు షాక్ ఇచ్చి...

పోర్షె గ్రాండ్‌ప్రి టెన్నిస్ టోర్నీ టైటిల్ సాధించిన ఒస్టాపెంకో




స్టుట్‌గార్ట్ (జర్మనీ): ఫ్రెంచ్ ఓపెన్ మాజీ చాంపియన్, లాత్వియా టెన్నిస్ స్టార్ ఎలెనా ఒస్టాపెంకో ఎనిమిదేళ్ల విరామం తర్వాత క్లే కోర్టులపై మళ్లీ టైటిల్ సాధించింది. సోమవారం ముగిసిన పోర్షె గ్రాండ్‌ప్రి డబ్ల్యూటీఏ-500 టోర్నీలో ప్రపంచ 24వ ర్యాంకర్ ఒస్టాపెంకో చాంపియన్‌గా అవతరించింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో ఒస్టాపెంకో 6–4, 6–1తో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్)ను బోల్తా కొట్టించి తన కెరీర్‌లో తొమ్మిదో సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. విజేతగా నిలిచిన ఒస్టాపెంకోకు 1,42,610 యూరోల (రూ. 1 కోటీ 39 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. అంతేకాకుండా ఒస్టాపెంకోకు రూ. 96 లక్షలు విలువ చేసే పోర్షె మకాన్ టర్బో మోడల్ కారును బహుమతిగా అందజేశారు. 2017లో క్లే కోర్టులపై ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన ఒస్టాపెంకో ఆ తర్వాత మళ్లీ క్లే కోర్టులపై టైటిల్ దక్కించుకోవడం విశేషం. సెమీఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)ను ఓడించిన ఒస్టాపెంకో ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించింది. 2012 తర్వాత క్లే కోర్టులపై ఒకే టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, రెండో ర్యాంకర్‌లను ఓడించి విజేతగా నిలిచిన తొలి ప్లేయర్‌గా ఒస్టాపెంకో నిలిచింది.

అభివృద్ధి కోసమా... ఆతిథ్యమిస్తే చాలా?

- భారత బిడ్‌లపై అమెరికా దిగ్గజ అథ్లెట్ ఎడ్విన్ మోజెస్ ఆసక్తికర వ్యాఖ్య
- నిర్దిష్ట ప్రణాళిక అవసరం
- చెల్లింపుల్లోనూ మార్పుండాలి





ఎడ్విన్ మోజెస్

మాడ్రిడ్: అమెరికన్ దిగ్గజ అథ్లెట్ ఎడ్విన్ మోజెస్ భారత ప్రభుత్వం మెగా ఈవెంట్ల ఆతిథ్యం కోసం వేస్తున్న బిడ్‌లపై స్పందించారు. స్పష్టమైన ప్రణాళికతో దేశంలో క్రీడాభివృద్ధి కోసమైతే మెగా ఈవెంట్లు దోహదం చేస్తాయని లేదంటే ఆతిథ్యంతోనే సరిపెట్టుకుంటే క్రీడల్లో భారత్ ఎప్పటికీ సూపర్ పవర్ కాలేదని అన్నారు. 1976 మాంట్రియల్, 1984 లాస్‌ఏంజెలిస్ ఒలింపిక్స్‌లలో 400 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకాలు సాధించిన ఈ దిగ్గజ చాంపియన్ క్రీడాకారుల పారితోషికాల్లోనూ మార్పు రావాలని ఆశించారు. కొందరు క్రీడల ద్వారా ఆకాశానికి ఎదుగుతుంటే మరికొందరి పరిస్థితి ఏళ్లు, దశాబ్దాలు గడిచిన మారడం లేదని వాపోయారు. ప్రతిష్ఠాత్మక లారియస్ స్పోర్ట్స్ అకాడమీలో సభ్యుడిగా ఉన్న 69 ఏళ్ల మోజెస్ ఈ ఏడాదికి సంబంధించిన లారియస్ విజేతను ప్రకటించాల్సి ఉంది. ఈ సందర్భంగా పలు అంశాలపై మోజెస్ వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

కావాల్సింది దూరదృష్టి... చేయాల్సింది కసరత్తు...

భారత్ ఇంతకుముందే 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ప్రిలిమినరీ బిడ్) బిడ్‌ను దాఖలు చేసింది. ఇటీవల 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యంపై కూడా కన్నేసింది. భారత్‌లాంటి పెద్ద దేశంలో ఇవి జరగడం మంచిదే అయినా... క్రీడాభివృద్ధికి చేయాల్సిన కసరత్తు ఎంతో ఉంది. అభివృద్ధి లక్ష్యమైతే ఓ నిర్దిష్ట ప్రణాళికతో, దూరదృష్టితో ముందుకెళ్లాలి. కేవలం ఆతిథ్యం కోసమే అయితే ఇలాంటివి ఎన్ని మెగా ఈవెంట్లు ‘మమ’ అనిపించినా మేటి అథ్లెట్లు ఎన్నటికి తయారు కాలేరు. ఆతిథ్యపుటల్లో భారత్ నిలుస్తుందే తప్ప పతకాల పట్టికలో ఎన్నటికి ఎదగదు.

క్రికెట్‌ను మించేలా ఆసక్తిని పెంచాలి

భారత్‌లో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ అందరికీ తెలుసు. మరి అథ్లెటిక్స్ సంగతి? ఈ ట్రాక్ అండ్ ఫీల్డ్ ఏ స్థాయిలో ఉందో చూసి బేరీజు వేసుకొని మౌలిక సదుపాయాలు, ప్రతిభా పాటవాలు సమాంతరంగా పెంచుకోవాలి. క్రీడా సంస్కృతి కూడా మారాలి. క్రికెట్‌తో పాటు మిగతా క్రీడలపై కూడా ప్రేక్షకుల అభిరుచి పెరిగేలా కృషి చేయాలి. ముఖ్యంగా మెగా ఈవెంట్ల సమయంలోనే చేసే హడావుడిని క్రమం తప్పకుండా చేయాలి. అంటే స్టేడియాల్లో వసతులు, అథ్లెట్లకు ఆధునిక కిట్లు, నిష్ణాతులైన కోచ్‌ల నియామకం, అంకిత భావంతో కూడిన సహాయ సిబ్బందిపై నిరంతరం దృష్టిపెట్టాలి.

అథ్లెట్లకు అరకొరే!

అంతర్జాతీయ క్రీడా వేదికలపై కొందరు పతకాలు తెచ్చినా రాని ఆర్థిక ప్రయోజనాలు కొందరికైతే ఆటలో ప్రభావం చూపినా పెద్ద మొత్తం వచ్చేస్తాయి. ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్లు, బాస్కెట్‌బాలర్లు మిలియన్ డాలర్లలో (రూ. కోట్లలో) ఆర్జిస్తే... చాంపియన్ అథ్లెట్లు మాత్రం అరకొరే అందుకుంటారు. నేను 1978లో పరుగు పెడితే వచ్చింది అత్తెసరే! కానీ వింబుల్డన్ టోర్నీ పురుషుల చాంపియన్ 80 వేల డాలర్లు అందుకున్నాడు. అమెరికన్ బాస్కెట్‌బాలర్ కరీమ్ అబ్దుల్ జబ్బార్ ఏడాదికి ఏకంగా 12 లక్షల డాలర్లు ఆర్జించాడు. ఇక్కడ గమనించాల్సింది టెన్నిస్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడా సమాఖ్యలు పలుకుబడి చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగింది. కానీ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఇప్పటికీ ఆ పరిస్థితి లేదు. జమైకన్ చిరుత ఉసేన్ బోల్ట్‌లాంటి ఒకరిద్దరు మినహా అందరు పతకాలు గెలిచినా పలుకుబడిని, ఆశించిన ఆదాయాన్ని పెంచుకోలేకపోయారు.

కనీసం కొవెంట్రీ ప్రాధాన్యమిస్తే...

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్ష పీఠాన్ని చేజిక్కించుకున్న తొలి మహిళ కిర్‌స్టీ కొవెంట్రీ అథ్లెట్లకు ఇచ్చే చెల్లింపులపై దృష్టి సారించాలి. గోల్ఫ్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడాకారులు ఎప్పటి నుంచో భారీ మొత్తంలో పారితోషికాలు, నగదు బహుమతులు పొందుతున్నారు. కానీ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు, స్విమ్మర్లు, జిమ్నాస్ట్‌లు మాత్రం ఎన్ని పతకాలు గెలిచినా అందుకునేది అత్యల్ప స్థాయిలోనే ఉండటం విచారకరం. కొత్త అధ్యక్షురాలు ఈ తారతమ్యాల్ని కాస్తయినా సవరిస్తే మంచిది.

పోప్ వారసుని ఎన్నిక ఇలా...

వాటికన్ సిటీ: పోప్ ఫ్రాన్సిస్ వారసుని శతాబ్దాలుగా అనుసరిస్తూ వస్తున్న సంప్రదాయం ప్రకారం ఎన్నుకుంటారు. అందుకు పెద్ద ప్రక్రియే ఉంటుంది. అది వాటికన్‌లోని సిస్టిన్ చాపెల్‌లో ఆద్యంతం అత్యంత గోప్యత నడుమ జరుగుతుంది. తుది ఫలితాన్నే తప్ప ప్రక్రియను ఎప్పటికీ బయటికి వెల్లడించరు. ఎంపిక ప్రక్రియ సందర్భంగా ఏం జరిగిందో బయటి ప్రపంచానికి చెప్పడం పూర్తిగా నిషిద్ధం. దీన్ని ఉల్లంఘించిన కార్డినల్స్‌ను తక్షణం వెలి వేసేలా నిబంధనలను పోప్ బెనెడిక్ట్–16 కఠినతరం చేశారు. 1996లో పోప్ జాన్‌పాల్–2 తిరగ రాసిన పోప్ ఎన్నిక తాలూకు నియమ నిబంధనలను బెనెడిక్ట్ రెండుసార్లు సవరించారు.

- పోప్ ఫ్రాన్సిస్ వారసున్ని ఎన్నుకునేదాకా రోజువారీ వ్యవహారాలను వాటికన్ కార్డినల్ కెవిన్ ఫారెల్ చాంబర్లెయిన్ హోదాలో లాంఛనంగా నిర్వర్తిస్తారు. ఈ దశలో కీలక నిర్ణయాలేవీ తీసుకోరు.
- పోప్ మృతిని చాంబర్లెయిన్ అధికారికంగా ధ్రువీకరించాక పోప్ నివాసానికి సీల్ వేస్తారు.
- పోప్ అస్తమయంతో ఒకరిద్దరు మినహా దాదాపుగా వాటికన్ అధికారులంతా మాజీలవుతారు.
- 'ఫిషర్‌మన్స్ రింగ్'గా పిలిచే పోప్ అధికారిక ముద్రను చాంబర్లెయిన్ ప్రత్యేక సుత్తెతో విరగ్గొడతారు. తద్వారా ప్రస్తుత పోప్ పాలనకు తెరపడిందని లాంఛనంగా ప్రకటిస్తారు.
- త్వరత కార్డినల్స్ కాలేజీ సమావేశమై పోప్ అంత్యక్రియల ఏర్పాట్లను ఖరారు చేస్తుంది.
- ఫ్రాన్సిస్ కోరిక మేరకు అంత్యక్రియలు ఆయనకెంతో ఇష్టమైన సెయింట్ మేరీ మేజర్ బాసిలికాలో సాదాసీదాగా జరుగుతాయి. సాధారణంగా పోప్ అంత్యక్రియలకు సైప్రస్, జింక్, ఇల్మ్‌తో కూడిన మూడు శవపేటికలను ఉపయోగిస్తారు. ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు మాత్రం ఆయన కోరిక మేరకు జింక్‌తో కూడిన ఒకే పేటికను వాడనున్నారు.
- తర్వాత వాటికన్‌లో 9 రోజుల పాటు సంతాప దినాలు పాటిస్తారు. ఈ సమయంలో కార్డినల్స్ అంతా రోమ్‌కు విచ్చేస్తారు.

ప్రక్రియ ఇదీ..

- పోప్ మరణించిన 15 నుంచి 20 రోజులకు ఆయన వారసుని ఎన్నిక ప్రక్రియ లాంఛనంగా మొదలవుతుంది.
- కార్డినల్స్ అంతా సిస్టిన్ చాపెల్‌లో సమావేశమై పోప్‌ను ఎన్నుకుంటారు. 80 ఏళ్లలోపు వయసువారు మాత్రమే అందుకు అర్హులు. ప్రస్తుతం ఆలోపు వయసున్న కార్డినల్స్ 135 మంది ఉన్నారు. నిబంధనల ప్రకారం ఎలక్టర్ల సంఖ్య 120కు మించరాదు.
- పోప్ ఎన్నిక దీర్ఘచతురస్రాకృతిలో ఉండే కాగితపు బ్యాలెట్ ద్వారా జరుగుతుంది. దానిపై భాగంలో 'సుప్రీం పాంటిఫ్‌గా నేను ఎన్నుకుంటున్నది' అని రాసుంటుంది. పేరు రాసేందుకు వీలుగా పక్కన ఖాళీ వదులుతారు.
- ఒక్కో కార్డినల్ దానిపై తనకిష్టమైన వారి పేరు రాసి సగానికి మడిచి ట్రేలో వేస్తారు. దాన్ని సరిగ్గా నింపిందీ లేనిదీ స్క్రూటినీర్స్‌గా పిలిచే ముగ్గురు కార్డినల్స్ సరిచూస్తారు.
- తర్వాత ఒక్కో బ్యాలెట్ తెరిచి అందులో రాసిన పేరు బయటికి చదువుతూ లెక్కిస్తారు. ప్రతి రౌండ్ అనంతరం ఫలితాలను ప్రకటిస్తూ పోతారు.
- కనీసం మూడింట రెండొంతుల ఓట్లు వచ్చిన వారే తదుపరి పోప్ అవుతారు. అందుకోసం ఇనిషియల్ మాస్‌గా పిలిచే లాంఛన కార్యక్రమం అనంతరం ఫస్ట్ బ్యాలెట్ నిర్వహిస్తారు. పోప్‌ను ఎన్నుకోలేకపోతే బ్యాలెట్లను సూది ద్వారా దారానికి గుచ్చి ట్రేలో వేస్తారు. తర్వాత వాటిని స్టూపాకారపు స్టౌలో కాల్చేస్తారు. దాని తాలూకు పొగ నల్ల రంగులో సిస్టిన్ చాపెల్ చిమ్నీ గుండా అందరికీ కన్పించేలా బయటికొస్తుంది. ఇంకా పోప్‌ను ఎన్నుకోలేదని దాని అర్థం. అలా పోప్‌ను ఎన్నుకునే దాకా ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. అది పూర్తవగానే తెల్ల పొగ వెలువడుతుంది. చర్చి గంటలు మోగుతాయి.
- అనంతరం కార్డినల్స్ 'మనం పోప్‌ను ఎన్నుకున్నాం' అని ప్రకటిస్తారు. నూతన పోప్ ఎంచుకున్న పేరును చదివి విన్పిస్తారు.
- చివరికి కొత్త పోప్ సెయింట్ పీటర్స్ స్క్వేర్ నుంచి అందరికీ దర్శనమిచ్చి తన తొలి ఆశీర్వాదమిస్తారు.
- పోప్ ఎన్నిక ప్రక్రియ పొడవునా కార్డినల్స్‌తో పాటు అందులో పాలుపంచుకునే వారికి బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలూ ఉండవు. వారు మొబైల్స్‌తో సహా ఎలాంటి ఆడియో, వీడియో పరికరాలూ వెంట ఉంచుకునేందుకు వీల్లేదు.

కార్డినల్స్‌లో నలుగురు భారతీయులు

పోప్‌ను ఎన్నుకునే 35 మందితో కూడిన కార్డినల్స్ కాలేజీలో నలుగురు భారతీయులున్నారు. వారు ఫిలిప్ నెరీ ఫెరారో, బాసెలియోస్ క్లీమిస్, ఆంథోనీ పూల, జార్జ్ జాకోబ్ కూవకాడ్.

రేసులో వీరే

బాప్టిజం తీసుకున్న క్యాథలిక్ పురుషుడెవరైనా పోప్ కావచ్చు. అయితే 1378 నుంచి కేవలం కార్డినల్స్ మాత్రమే పోప్‌గా ఎన్నికవుతూ వస్తున్నారు. పోప్ ఫ్రాన్సిస్ వారసునిగా విన్పిస్తున్న కొన్ని పేర్లు...

- ఇటలీకి చెందిన కార్డినల్ పియెట్రో పారోలిన్ (70). వాటికన్‌లో సీనియర్ దౌత్యాధికారి. ప్రస్తుత విదేశాంగ మంత్రి.
- కెనడాకు చెందిన కార్డినల్ మార్క్ ఔలెట్ (80). 2010 నుంచి 2023 దాకా వాటికన్ బిషప్స్ హెడ్‌గా ఉన్నారు.
- ఆస్ట్రియాకు చెందిన కార్డినల్ క్రిస్టోఫ్ షోన్‌బర్న్ (80). పోప్ బెనెడిక్ట్–16 దగ్గర శిష్యరికం చేశారు. సంప్రదాయవాదిగా పేరు.
- ఫిలిప్పీన్స్‌కు చెందిన కార్డినల్ లూయిస్ టగ్లే (67. వాటికన్ మిషనరీ ఆఫీస్ సారథిగా ఫ్రాన్సిసే ఎంపిక చేశారు.
- ఇటలీకి చెందిన కార్డినల్ మట్టెయో జుప్పీ (69). ఫ్రాన్సిస్‌కు బాగా ఇష్టుడు.

పోప్.. సరదా సందర్భాలు


ఫుట్‌బాల్‌ను సరదాగా వేలిపై తిప్పుతున్న పోప్


'ఐ లవ్యూ' సంకేతం చూపుతూ...


స్పైడర్‌మాన్ వేషధారి నుంచి మాస్క్ అందుకుంటూ...


గాలికి ఎగిరిపోతున్న టోపీని పట్టుకునే ప్రయత్నంలో...

ఢిల్లీలో వాన్స్ కుటుంబం


సోమవారం ఢిల్లీలోని అక్షర్‌ధామ్ ఆలయ ప్రాంగణంలో జేడీ వాన్స్, ఉష దంపతులు, వారి ముగ్గురు పిల్లలు


వాన్స్ దంపతుల పిల్లలను ముద్దు చేస్తున్న మోదీ


వాన్స్‌తో భేటీ సందర్భంగా ఆయన ఇద్దరు కుమారులతో ప్రధాని

పాత విధానాలతో పాలన జరగదు

దేశ వెయ్యేళ్ల భవితను నిర్దేశించేలా నిర్ణయాలు తీసుకుంటున్నాం

సివిల్ సర్వీసెస్ డే కార్యక్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: కాలం చెల్లిన పాతతరం పరిపాలనా విధానలతో పాలన కొనసాగదని, తమ ప్రభుత్వ హయాంలో వెయ్యేళ్ల దేశ భవితను నిర్దేశించేలా నిర్ణయాలు తీసుకుంటున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన 17వ 'సివిల్ సర్వీసెస్ డే'కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని సివిల్ సర్వీస్ అధికారులనుద్దేశించి ప్రసంగించారు. ''గతంలో ప్రభుత్వాధికారులు(బ్యూరోక్రసీ) అంటే దేశ పారిశ్రామికీకరణ, అంకుర సంస్థల ఏర్పాటుకు ప్రతిబంధకాలుగా ఉండేవారనే అపవాదు ఉండేది. కాలంచెల్లిన నియమనిబంధనలను కఠినంగా అమలుచేసేవారు. ఇప్పుడు కాలం మారింది. పౌరులు సైతం నూతన వ్యాపారాలు మొదలుపెట్టే వాతావరణం బ్యూరోక్రసీ కల్పిస్తోంది. కొత్త వ్యాపారాల ఏర్పాటులో ఎదురయ్యే అడ్డంకులను బ్యూరోక్రసీ తొలగిస్తోంది. ఇప్పుడు భారతీయ సమాజంలో యువత, రైతులు, మహిళల్లో అభివృద్ధి ఆకాంక్షలు విపరీతంగా పెరిగాయి. వాటిని వేగంగా సాకారం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అందుకే మా ప్రభుత్వం మరో 1,000 సంవత్సరాల దేశ భవితను దృష్టిలో ఉంచుకుని నేడు నిర్ణయాలు తీసుకుంటోంది''అని చెప్పారు.



భారత్ లక్ష్యాలు ఎన్నెన్నో..

''ఇంధన భద్రత, శుద్ధ ఇంధనం, క్రీడలు, అంతరిక్ష ఆవిష్కరణ తదితర రంగాల్లో రాబోయే రోజుల్లో భారత్ అగ్రగామిగా మారాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. వీలైనంత త్వరగా ప్రపంచంలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించేందుకు సివిల్ సర్వెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలి. లక్ష్యం ఆలస్యంకాకుండా పనిలో కార్యోన్ముఖులు కావాలి. భారత సమ్మిళిత అభివృద్ధి అంటే దేశంలోని ఏ ఒక్క గ్రామం, కుటుంబం, పౌరుడు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోకూడదు. చిన్నపాటి మార్పు నిజమైన అభివృద్ధి అనిపించుకోదు. విస్తృతస్థాయిలో అభివృద్ధిచెందడమే నిజమైన అభివృద్ధి. కొత్త పథకాలు ప్రారంభించినంతమాత్రాన నాణ్యమైన పరిపాలన అందిస్తున్నట్లు కాదు. పథకాల ఫలాలు లబ్ధిదారులందరికీ అందినప్పుడే పరిపాలన సవ్యంగా సాగుతుందని అర్థం''అంటూ మోదీ గత పదేళ్లలో తమ ప్రభుత్వహయాంలో దేశంలో జరిగిన అభివృద్ధిని ప్రస్తావించారు.

నాగరిక్ దేవో భవా..

అణగారిన వర్గాల సమస్యలను పట్టించుకోవాలని అధికారులకు మోదీ సూచించారు. ''తమ గోడును మీ ముందు వెళ్లబోసుకునేందుకు వచ్చే పౌరులను పట్టించుకోండి. అతిథి దేవో భవ తరహాలో నాగరిక్ దేవో భవా(పౌరులూ దైవంతో సమానం)ను పాటించండి. అంకితభావం, తపనతో బాధ్యతాయుతంగా ఉంటూ పౌరుల సమస్యలను పరిష్కరించండి. టెక్నాలజీతో పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదు. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని తదనుగుణంగా పాలించడం. ఏఐ, క్వాంటమ్ ఫిజిక్స్ వంటి వాటితో దేశ భవిష్యత్ అంతా టెక్నాలజీ విప్లవంతో ముడిపడి ఉంది. అందుకే మీరంతా టెక్నాలజీపై పట్టుసాధించి పౌరుల ఆకాంక్షలను తీర్చడంలో ఆ సాంకేతికతను వినియోగించండి''అని మోదీ సూచించారు.

పరిస్థితి మరింత దారుణం

చిన్నారుల అక్రమ రవాణాపై సుప్రీం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో నడిచే చిన్నారుల అక్రమ రవాణా ముఠా సూత్రధారుల్ని అరెస్ట్ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు సోమవారం ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. ఈ విషయంలో పరిస్థితి మరింత దారుణంగా మారిందని జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ద్వారక ప్రాంతంలో పలువురు నవజాత శిశువులు మాయం కావడంపై దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారి నుంచి ధర్మాసనం పలు వివరాలను తెలుసుకుంది. ముఠా లీడర్ పూజతోపాటు మాయమైన శిశువుల జాడ కనుగొనేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. అదే సమయంలో, కొందరు తల్లిదండ్రులు తమ శిశువుల్ని విక్రయిస్తున్నట్లు అగుపించడం దురదృష్టకరమంది. కేసు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

శాటిలైట్లను రెండోసారి డాకింగ్ చేసిన ఇస్రో

బెంగళూరు: స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా సోమవారం ఇస్రో రెండోసారి శాటిలైట్ల డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా చేపట్టింది. ఈ విషయాన్ని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్'లో ప్రకటించారు. వచ్చే రెండు వారాల్లో మరిన్ని ప్రయోగాలను ఇస్రో చేపట్టనుందన్నారు. గతేడాది డిసెంబర్ 30న స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్(స్పేడెక్స్) మిషన్‌ను ప్రయోగించిన తర్వాత, మొదటి సారిగా జనవరి 13న రెండు శాటిలైట్లను అతి సమీపానికి తీసుకువచ్చిన(డాకింగ్) ఇస్రో, మార్చి 13న అన్‌డాకింగ్ చేసిన సంగతి తెలిసిందే.

మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసు.. రూ. 573 కోట్ల ఆస్తులు ఈడీ సీజ్

న్యూఢిల్లీ: మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌పై నమోదైన మనీ లాండరింగ్ కేసులో రూ.573 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తెలిపింది. బెట్టింగ్ యాప్ ద్వారా సంపాదించిన మొత్తాన్ని దేశం వెలుపలికి తరలించి, తిరిగి ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్(ఎఫ్‌పీఐ)ల రూపంలో భారత స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 16న ఢిల్లీ, ముంబై, ఇండోర్, అహ్మదాబాద్, చండీగఢ్, చెన్నై, ఒడిశాలోని సంబాల్‌పూర్‌లో సోదాలు చేపట్టి రూ.3.29 కోట్ల నగదును, రూ.573 కోట్ల విలువైన సెక్యూరిటీలు, బాండ్లు, డీమాట్ అకౌంట్లను స్తంభింపజేయడంతోపాటు కీలక పత్రాలు, ఎలక్ట్రానిక్ రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది.

నష్టం కలిగిస్తే ప్రతీకారం తప్పదు

అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే దేశాలకు చైనా వార్నింగ్

బీజింగ్: టారిఫ్‌ల నుంచి తప్పించుకునే క్రమంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే దేశాలకు చైనా హెచ్చరికలు చేసింది. ఆ ఒప్పందాలతో తమకు నష్టం వాటిల్లే పక్షంలో ప్రతీకార చర్యలు తప్పవని ఆయా దేశాలకు తేల్చి చెప్పింది. ఇటువంటి ఒప్పందాలకు తాము పూర్తిగా వ్యతిరేకమని చైనా వాణిజ్య శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. అత్యధిక సుంకాల నుంచి మినహాయించినందుకు ప్రతిఫలంగా చైనాతో వాణిజ్య సంబంధాలను పరిమితం చేయాలంటూ ఇతర దేశాలపై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా సిద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో వాణిజ్య శాఖ ప్రతినిధి ఈ ప్రకటన చేశారని అధికార జిన్హువా వార్తా సంస్థ పేర్కొంది. 'ఒక వేళ అటువంటి పరిస్థితే ఏర్పడితే చైనా ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోదు. తీవ్ర ప్రతీకార చర్యలు తీసుకుంటుంది. తాత్కాలిక లాభం కోసం ఇతరుల ప్రయోజనాలను ఫణంగా పెట్టాలని చూడటం పులి చర్మం కోసం దానితో బేరమాడటం వంటిదే. ఎదురుదెబ్బ తప్పదు'అని ఆ ప్రతినిధి వ్యాఖ్యానించారు. తమతో లాభదాయకమైన వ్యాపార సంబంధాలు కలిగిన పలు దేశాలు సుంకాల మినహాయింపులు పొందడానికి అమెరికాతో ప్రత్యేక వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోకుండా నిరోధించడానికే చైనా ప్రభుత్వం ఈ ప్రకటన చేసినట్లుగా భావిస్తున్నారు. జపాన్, ఈయూ, ఆసియాన్‌లోని పలు దేశాలు అమెరికాతోపాటు చైనాతోనూ విస్తృత వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నాయి. భారత్ కూడా అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. చైనా వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 245 శాతం టారిఫ్‌లు ప్రకటించగా, చైనా సైతం అమెరికా వస్తువులపై 125 శాతం టారిఫ్‌లు విధించింది. ఎక్కువగా ఎగుమతులపైనే ఆధారపడిన చైనా ఆర్థిక వ్యవస్థపై అమెరికాతో ఆసియాన్ లాంటి భాగస్వాములు కుదుర్చుకునే ఒప్పందాలతో ప్రతికూల ప్రభావం చూపుతుంది.

బెంగళూరులో వాయుసేన అధికారిపై దాడి

దొడ్డబళ్లాపురం/ కృష్ణరాజపురం: బెంగళూరులో రక్షణ శాఖ అధికారిపై దాడి జరిగింది. డీఆర్‌డీఓలో పనిచేస్తున్న వాయుసేన వింగ్ కమాండర్ ఆదిత్య బోస్ తనపై ఈ నెల 18న దాడి జరిగినట్లు ఇన్‌స్టా గ్రాంలో రెండు వీడియోలను పోస్టు చేశారు. సోమవారం ఈ విషయం వైరలైంది. ఆదిత్యబోస్, భార్య, ఎయిర్‌ఫోర్స్ స్క్వాడ్రన్ లీడర్ మధుమితతో కలిసి 18న సీవీ రామన్ నగరలోని డీఆర్‌డీఓ కాలనీ నుంచి కారులో ఎయిర్‌పోర్టుకు వెళ్తున్నారు. దారి మధ్యలో ఒక బైకిస్టు వారితో గొడవకు దిగాడు. కారుకు ఉన్న డీఆర్‌డీఓ స్టిక్కర్ చూసి, తనతో కన్నడలో మాట్లాడాలని కేకలు దాడి చేశాడు. కారులో నుంచి బయటకు లాగి బైక్ తాళాలు, రాయి తీసుకుని కొట్టాడు. దీంతో తనకు రక్త గాయాలైనట్లు ఆదిత్య బోస్ తెలిపారు. కారులో తన భార్య ఉండడం వల్ల తాను బతికి బయటపడ్డానన్నారు. కర్ణాటకలో ఇలాంటి పరిస్థితి చూసి భయమేస్తోందని, దేశ రక్షణలో ఉన్న తనపై అకారణంగా దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇందిరా నగర పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితున్ని అరెస్టు చేసి విచారణ చేపట్టినట్లు తెలిసింది.

పరిహారానికి సంతానం అర్హులే

కర్ణాటక హైకోర్టు స్పష్టీకరణ

బెంగళూరు: ప్రమాదాల్లో మరణించిన వ్యక్తి జీవిత భాగస్వామితోపాటు వారి చట్టబద్ధ వారసులుగా ఉన్న వయోజన సంతానం సైతం పరిహారం పొందేందుకు అర్హులేనని కర్ణాటక హైకోర్టు తీర్పు చెప్పింది. ఇలాంటి వాటిని 'కన్సార్టియం లాస్'గా పరిగణించాల్సి ఉంటుందని స్పష్టతనిచ్చింది. ఒక వ్యక్తి అకాల మరణం ఫలితంగా ఆ కుటుంబానికి కలిగే మానసిక, భావోద్వేగపరమైన నష్టానికి ఇది పరిష్కారం చూపుతుందని వివరించింది. కలబురిగికి చెందిన సుభాష్ అనే వ్యక్తి 2019లో బైక్‌పై ఆలయానికి వెళ్తుండగా వాహనం ఢీకొని చనిపోయారు. 2021లో కలబురిగిలోని మోటార్ యాసిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ రూ.10.30 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. సుభాష్ సంపాదనపై ఆధారపడిన ఆయన భార్య మాత్రమే పరిహారానికి అర్హురాలని, ఇద్దరు పిల్లలు స్వతంత్రంగా జీవిస్తున్నందున పరిహారం అవసరం లేదని పేర్కొంది. దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారించిన జస్టిస్ సీఎం జోషి పైవిధంగా తీర్పు వెలువరించారు. తలా రూ.52 వేల చొప్పున తల్లి, ఇద్దరు కుమారులకు కలిపి రూ.1.56 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. ట్రిబ్యునల్ తమ తండ్రి ఆదాయాన్ని సగానికి తగ్గించి పరిహారం ఖరారు చేసిందని పిటిషనర్లు చేసిన వాదనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఆదాయంలో మూడోవంతును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. కుమారులకు పరిహారం విషయంలో గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన రెండు కేసులను ప్రస్తావించారు.


ఆదివారం బీజేపీ నేత జైవీర్ షేర్‌గిల్ కుటుంబంతో గడిపిన సందర్భంగా వారి చిన్నారిని ప్రధాని మోదీ ఇలా చెవి నులిమి ముద్దు చేశారు


జర్మనీలోని పడెర్‌బోర్న్ జిల్లా రెన్ స్టెయిన్‌హౌసెన్ గ్రామంలో ఏకకాలంలో రెండు ఇంద్ర ధనుస్సులు ఇలా కనువిందు చేశాయి


జమ్మూలోని రాంబన్‌లో వరద ధాటికి రోడ్లపై పేరుకున్న చెత్తాచెదారం గుండా వేదిక వద్దకు వెళ్తున్న పెళ్లి కుమారుడు, బంధువులు



సోమవారం వైట్ హౌస్ సౌత్‌లాన్‌లో ఈస్టర్ ఎగ్ రోల్ సందర్భంగా విజిల్ ఊది చిన్నారులను ఉత్సాహపరుస్తున్న ట్రంప్, మెలానియా దంపతులు

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పార్లమెంట్ మొదటి సమావేశం ఎప్పుడు జరిగింది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ



మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో సమాఖ్య ప్రభుత్వ ఏర్పాటుకు కిందివాటిలో ఏ చట్టం ఆధారం?
   a) 1909 మార్లే - మింటో సంస్కరణల చట్టం
   b) 1919 మాంటెగ్ - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం
   c) 1935 భారత ప్రభుత్వ చట్టం
   d) 1947 భారత స్వతంత్ర చట్టం
2. రాజ్యాంగ పరిషత్ ఉప సంఘమైన సలహా సంఘం అధ్యక్షుడిగా ఎవరు పని చేశారు?
   a) బి. నర్సింగరావు b) జె.బి. కృపలాని
   c) సర్దార్ వల్లభాయ్ పటేల్
   d) రాజేంద్రప్రసాద్
3. రాజ్యాంగ ప్రవేశిక ప్రకారం రాజ్యాంగం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
   a) 26-1-1950 b) 15-8-1947
   c) 24-1-1950 d) 26-11-1949
4. 1976లో రాజ్యాంగ ప్రవేశికలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన పదాలేవి?
   a) సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర
   b) సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక
   c) సామ్యవాద, లౌకిక, సమగ్రత
   d) సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర
5. భారత రాజ్యాంగంలోని ఒకటో అధికరణ భారత ప్రభుత్వాన్ని ఏవిధంగా ప్రకటించింది?
   a) సమాఖ్య ప్రభుత్వం
   b) అర్ధ సమాఖ్య ప్రభుత్వం
   c) కేంద్రీకృత సమాఖ్య ప్రభుత్వం
   d) పైవేవీ కాదు
6. భారతదేశంలో ప్రభుత్వం ఎంతవరకు అధికారంలో కొనసాగుతుంది?
   a) ప్రజల విశ్వాసం మేరకు
   b) రాష్ట్రపతి విశ్వాసం మేరకు
   c) పార్లమెంట్ విశ్వాసం మేరకు
   d) లోక్‌సభ విశ్వాసం మేరకు
7. అల్ప సంఖ్యాకుల సంరక్షణ కోసం చేర్చిన ప్రత్యేక హక్కు ఏది?
   a) సమానత్వ హక్కు
   b) విద్య, సాంస్కృతిక హక్కు
   c) మత స్వాతంత్ర్య హక్కు
   d) పీడనాన్ని నిరోధించే హక్కు
8. ప్రభుత్వాలు తమ కర్తవ్యాలను, విద్యుక్త ధర్మాలను సమర్థంగా నిర్వహించడానికి తోడ్పడేవి?
   a) ఆదేశిక సూత్రాలు
   b) ప్రాథమిక హక్కులు
   c) ప్రాథమిక విధులు
   d) ప్రణాళికలు
9. ఏ కమిటీ సిఫార్సు మేరకు 2002 నుంచి జాతీయ జెండా నియమావళిని అమల్లోకి తీసుకువచ్చారు?
   a) ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ
   b) స్వరణ్‌సింగ్ కమిటీ
   c) జస్టిస్ వర్మ కమిషన్
   d) జస్టిస్ శ్రీ కృష్ణ కమిటీ
10. కిందివాటిలో సరికానిది ఏది?
   a) అంటరానితనం నిషేధం: అధికరణ - 17
   b) వెట్టిచాకిరి నిషేధం: అధికరణ - 23
   c) బలవంతంగా మతమార్పిడి నిషేధం: అధికరణ -29
   d) బాలకార్మికుల వ్యవస్థ నిషేధం: అధికరణ - 24
11. ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని 2015లో ఏ రాష్ట్రంలో నిర్వహించారు?
   a) గుజరాత్ b) మహారాష్ట్ర
   c) తెలంగాణ d) హర్యానా
12. రాజ్యసభలో సీట్ల కేటాయింపు గురించి ఏ షెడ్యూల్‌లో పేర్కొన్నారు?
   a) షెడ్యూల్-1 b) షెడ్యూల్-4
   c) షెడ్యూల్-10 d) షెడ్యూల్-8
13. రాష్ట్రపతిని ఎన్నుకునే 'ఎలక్ట్రోరల్ కాలేజీ'లో ఎవరు సభ్యులుగా ఉంటారు?
   a) పార్లమెంట్ సభ్యులు, అసెంబ్లీ సభ్యులు
   b) ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, ఎన్నికైన విధానసభ సభ్యులు
   c) పార్లమెంట్ సభ్యులు మాత్రమే
   d) ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయిస్తుంది
14. కింద పేర్కొన్నవారిలో అతి తక్కువ కాలం రాష్ట్రపతిగా పనిచేసింది ఎవరు?
   a) జాకీర్‌హుస్సేన్
   b) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
   c) వి.వి.గిరి
   d) నీలం సంజీవరెడ్డి
15. విదేశీ రాయబారిగా పనిచేసి రాష్ట్రపతి అయిన వ్యక్తి ఎవరు?
   a) జాకీర్ హుస్సేన్
   b) కె.ఆర్.నారాయణన్
   c) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
   d) నీలం సంజీవరెడ్డి
16. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
   a) అధికరణ - 108 ప్రకారం రాష్ట్రపతి పార్లమెంట్ ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు
   b) అధికరణ - 72 ప్రకారం నేరస్థులకు క్షమాభిక్ష పెట్టవచ్చు. శిక్ష తగ్గించవచ్చు
   c) అధికరణ -143 ప్రకారం - రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరవచ్చు
   d) పైవన్నీ
17. కిందివారిలో ఎవరికి సభలో సభ్యత్వం లేకపోయినా నిర్ణాయక ఓటు హక్కు ఉంటుంది?
   a) లోక్‌సభ స్పీకర్
   b) రాజ్యసభ చైర్మన్
   c) విధాన పరిషత్ అధ్యక్షులు
   d) రాజ్యసభ డిప్యూటీ చైర్మన్
18. ఉప రాష్ట్రపతి పదవికి ఖాళీ ఏర్పడినప్పుడు తాత్కాలిక ఉప రాష్ట్రపతిగా ఎవరు కొనసాగుతారు?
   a) రాజ్యసభ ఉపాధ్యక్షుడు
   b) లోక్‌సభ స్పీకర్
   c) ప్యానెల్ స్పీకర్
   d) ఎవరూ కాదు
19. కిందివారిలో అతి తక్కువ కాలం ప్రధానిగా పని చేసింది ఎవరు?
   a) అటల్ బిహారీ వాజ్‌పాయ్
   b) చంద్రశేఖర్
   c) వి.పి.సింగ్ d) దేవెగౌడ
20. కిందివాటిలో సరికానిది ఏది?
   a) జాతీయ ప్రభుత్వాన్ని నడిపిన ప్రధాని - జవహర్ లాల్ నెహ్రూ
   b) మైనార్టీ ప్రభుత్వాన్ని నడిపిన ప్రధాని - పి.వి. నరసింహారావు
   c) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఎక్కువ కాలం నడిపిన ప్రధాని - వాజ్‌పాయ్
   d) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొదటి ప్రధాని - మొరార్జీ దేశాయ్
21. ఎవరి జన్మదినాన్ని సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించారు?
   a) జవహర్ లాల్ నెహ్రూ
   b) గుల్జారీ లాల్ నందా
   c) లాల్ బహదూర్ శాస్త్రి
   d) అటల్ బిహారీ వాజ్‌పాయ్
22. 1947లో నెహ్రూ ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో విదేశాంగ శాఖను నిర్వహించిన మంత్రి ఎవరు?
   a) సర్దార్ వల్లభాయ్ పటేల్
   b) జగ్జీవన్‌రామ్
   c) ఎస్.పి. ముఖర్జీ
   d) ఎవరూ కాదు
23. మంత్రి మండలి సభ్యుల సంఖ్య లోక్‌సభ సభ్యుల సంఖ్యలో 15 శాతానికి మించకూడదని ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు?
   a) 89 b) 91
   c) 92 d) 100
24. మంత్రి మండలి సభ్యులు వ్యక్తిగతంగా ఎవరికి బాధ్యత వహిస్తారు?
   a) రాష్ట్రపతి b) ప్రధానమంత్రి
   c) పార్లమెంట్ d) లోక్‌సభ
25. ఏ ప్రధానమంత్రి కాలంలో ఇద్దరు ఉప ప్రధాన మంత్రులు పనిచేశారు?
   a) చరణ్‌సింగ్ b) వి.పి.సింగ్
   c) మొరార్జీ దేశాయ్ d) ఇందిరాగాంధీ
26. పార్లమెంట్ మొదటి సమావేశం ఎప్పుడు జరిగింది?
   a) 13-5-1952 b) 13-5-1950
   c) 1-4-1952 d) 14-5-1952
27. లోక్‌సభ మొత్తం స్థానాల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా కేటాయించిన సీట్ల సంఖ్య?
   a) 79, 41 b) 84, 47
   c) 84, 44 d) 79, 47
28. లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్యను 2026 వరకు పొడిగించకూడదని ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు?
   a) 81 b) 84
   c) 85 d) 91
29. లోక్‌సభకు మొదటి మధ్యంతర ఎన్నికలు జరిగిన సంవత్సరం?
   a) 1967 b) 1971
   c) 1980 d) 1991
30. పార్లమెంట్ ఉమ్మడి సభ సమావేశానికి అధ్యక్షత వహించేది ఎవరు?
   a) భారత రాష్ట్రపతి b) ప్రధానమంత్రి
   c) లోక్‌సభ స్పీకర్ d) రాజ్యసభ చైర్మన్
31. ప్రస్తుతం కొనసాగుతున్న రాజ్యసభ ఎన్నోది?
   a) 13 b) 14
   c) 16 d) ఏదీకాదు
32. ప్రస్తుత రాజ్యసభ చైర్మన్ ఎవరు?
   a) హమీద్ అన్సారీ
   b) పి.జె. కురియన్
   c) తంబిదొరై d) జగదీప్ ధన్‌కర్
33. ఆర్థిక బిల్లుకు సంబంధించి సరికానిది?
   a) రాష్ట్రపతి ఆమోదంతో మొదట లోక్‌సభలో ప్రవేశపెట్టాలి
   b) లోక్‌సభలో ఆమోదం పొందకపోతే ప్రభుత్వం కూలిపోతుంది
   c) రాజ్యసభకు పంపినప్పుడు ఆమోదించి లేదా వ్యతిరేకించి 14 రోజుల్లో తిప్పి పంపాలి
   d) రెండు సభల మధ్య విభేదాలు ఏర్పడితే రాష్ట్రపతి ఉమ్మడి పార్లమెంట్ సభ సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు
34. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడానికి ఎంత మంది సభ్యుల మద్దతు కావాలి?
   a) 20 b) 50
   c) 100 d) 273
35. పార్లమెంటరీ ప్రక్రియలో పేర్కొనని పదం ఏది?
   a) ప్రశ్నల గంట b) శూన్య కాలం
   c) వాయిదా తీర్మానం
   d) సావధాన తీర్మానం
36. పార్లమెంటరీ కమిటీల్లో అతి ప్రాచీనమైనంది ఏది?
   a) ప్రభుత్వ ఖాతాల సంఘం
   b) ప్రభుత్వ అంచనాల సంఘం
   c) ప్రభుత్వ ఉపక్రమాల సంఘం
   d) సభా వ్యవహారాల సంఘం
37. పార్లమెంట్, రాష్ట్రపతి, మంత్రిమండలి మధ్య సంధానకర్తగా ఎవరు పనిచేస్తారు?
   a) రాష్ట్రపతి
   b) ప్రధానమంత్రి
   c) లోక్‌సభ స్పీకర్
   d) కేబినెట్ కార్యదర్శి
38. కేంద్ర కేబినెట్ సభ్యుడు కాకపోయినా కేబినెట్ సమావేశాల్లో పాల్గొనే అర్హత ఉన్నవారెవరు?
   a) అటార్నీ జనరల్
   b) లోక్‌సభ స్పీకర్
   c) హోంశాఖ కార్యదర్శి
   d) భారత రాష్ట్రపతి
39. కేంద్రం - రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం సుప్రీంకోర్టు ఏ అధికార పరిధిలోకి వస్తుంది?
   a) ప్రారంభ అధికార పరిధి
   b) అప్పీళ్ల విచారణ పరిధి
   c) సలహా అధికార పరిధి
   d) పైవేవీకాదు
40. జాతీయ ప్రజాస్వామ్య కూటమి 99వ రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పాటు చేసిన జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ అధ్యక్షునిగా ఎవరు కొనసాగుతారు?
   a) ప్రభుత్వం నియమించిన న్యాయమూర్తి
   b) భారత రాష్ట్రపతి
   c) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
   d) సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి

సమాధానాలు

1) c; 2) c; 3) d; 4) c; 5) d; 6) d; 7) b; 8) a; 9) c; 10) c; 11) a; 12) b; 13) b; 14) a; 15) b; 16) d; 17) b; 18) d; 19) b; 20) c; 21) d; 22) d; 23) b; 24) a; 25) c; 26) a; 27) b; 28) b; 29) b; 30) c; 31) d; 32) d; 33) d; 34) b; 35) b; 36) a; 37) c; 38) a; 39) a; 40) c.

విద్య, ఉద్యోగ సమాచారం

టీహెచ్ఎస్‌టీఐ-బీఆర్ఐసీ, ఫరీదాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

ఫరీదాబాద్‌లోని బీఆర్ఐసీ-ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- **పోస్టుల వివరాలు:** టీచింగ్ అసోసియేట్(బయోస్టాటిస్టిక్స్)-01, టీచింగ్ అసోసియేట్(క్లినికల్ రీసెర్చ్)-01, జూనియర్ టీచింగ్ అసోసియేట్(క్లినికల్ రీసెర్చ్)-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ, ఎంబీబీఎస్, పీహెచ్‌డీ, ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** జూనియర్ టీచింగ్ అసోసియేట్‌కు 40 ఏళ్లు, మిగతా పోస్టులకు 45 ఏళ్లు.
- **వేతనం:** నెలకు జూనియర్ టీచింగ్ అసోసియేట్‌కు రూ.1,25,000, మిగతా పోస్టులకు రూ.1,92,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**06.05.2025
- **వెబ్‌సైట్:** https://thsti.res.in

మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ తిరుపతిలో 12 ఉద్యోగాలు

మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ తిరుపతిలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
- **పోస్టుల వివరాలు:** కౌన్సెలర్(ఫిమేల్)-01, సోషల్ వర్కర్(మేల్)-01, డేటా అనలిస్ట్-01, ఔట్ రీచ్ వర్కర్-01, పార్ట్‌టైమ్ డాక్టర్-01, ఎర్లీ చైల్డ్‌హుడ్ సోషల్ వర్కర్(ఫీమేల్)-01, ఆయా(ఫీమేల్)-04, చౌకీదార్(ఫీమేల్)-01, అసిస్టెంట్ కమ్ డీఈవో-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఇంటర్, ఎంబీబీఎస్, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు కౌన్సిలర్, సోషల్ వర్కర్, డేటా అనలిస్ట్ పోస్టులకు రూ.18,536, ఔట్ రీచ్ వర్కర్‌కు రూ.10,592, పార్ట్‌టైమ్ డాక్టర్‌కు రూ.9,930, ఆయా, చౌకీదార్‌కు రూ.7,944, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.13,240.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ ఆఫ్ ది డీడబ్ల్యూ- సీడబ్ల్యూ-ఈవో, రూమ్ నెం .506, ఐదో అంతస్తు, బి బ్లాక్, కలెక్టరేట్, తిరుపతి చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 30.04.2025.
- **వెబ్‌సైట్:** https://tirupati.ap.gov.in

'వానలు కురిస్తే పంటలు పండుతాయి' అనేది ఏ వాక్యం?



భాషాంశాలు - వాక్య భేదాలు

డీఈఈసెట్ పరీక్షలో వాక్య భేదాలకు సంబంధించి 4 నుంచి 5 ప్రశ్నలు అడుగుతారు. అందువల్ల అభ్యర్థులకు వాక్య భేదాలపై సమగ్రమైన అవగాహన ఉండాలి.

భాషావేత్తలు వాక్యం, రూపం, అర్థం, క్రియా ప్రాధాన్యాన్ని అనుసరించి వాక్య భేదాలను స్థూలంగా కొన్ని విధాలుగా వర్గీకరించారు.

➡ **రూపం ఆధారంగా వాక్య భేదాలు:** వాక్య రూపాన్ని అనుసరించి, ఆంగ్ల వాక్య నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకొని భాషా శాస్త్రవేత్తలు వాక్యాలను మూడు రకాలుగా విభజించారు. **అవి:**

I. సామాన్య వాక్యం (simple sentence)
II. సంశ్లిష్ట వాక్యం (complex sentence)
III. సంయుక్త వాక్యం (compound sentence)

I. సామాన్య వాక్యం

కర్త, కర్మతో పాటు ఒక సమాపక క్రియ ఉండే వాక్యాన్ని సామాన్య వాక్యం అంటారు.

ఉదా: కవిత పుస్తకం కొన్నది. ఇతర భాషల్లో లేని విధంగా తెలుగు వాక్య నిర్మాణంలో క్రియారహిత వాక్యాలున్నాయి. సామాన్య వాక్యాన్ని క్రియను అనుసరించి రెండు విధాలుగా వర్గీకరించవచ్చు.

1. **క్రియాసహిత వాక్యాలు**
2. **క్రియారహిత వాక్యాలు**

క్రియాసహిత వాక్యాలు: క్రియలు ఉన్న వాక్యాలు క్రియాసహిత వాక్యాలు.

ఉదా: రాముడు వాలిని చంపాడు. క్రియ ఉన్నందు వల్ల ఇది క్రియాసహిత వాక్యం.

క్రియా రహిత వాక్యం: క్రియలు లేని వాక్యాలు క్రియారహిత వాక్యాలు.

ఉదా: ఆమె మంచి నటి. ఆయన మంచి ప్రొఫెసర్. ఆమె విద్యావంతురాలు లాంటివి క్రియారహిత వాక్యాలు.

క్రియాసహిత వాక్యాలను మళ్లీ రెండు విధాలుగా వర్గీకరించవచ్చు.

ఎ) కర్తృసహిత వాక్యాలు: కర్తృసహిత వాక్యాలను క్రియలను అనుసరించి మళ్లీ మూడు విధాలుగా వర్గీకరించవచ్చు.

1) **సకర్మక వాక్యం** 2) **అకర్మక వాక్యం**
3) **ప్రేరణార్థక వాక్యం**

సకర్మక వాక్యం: వాక్యంలో వరుసగా కర్త, కర్మ, క్రియ ఉంటే అది సకర్మక వాక్యం. వాక్యంలో కర్మ ఉన్నా, లేదా క్రియాపదం వల్ల కర్మ ఉన్నట్లు తెలిసినా అది కూడా సకర్మక వాక్యమే.

ఉదా: విమల వంట చేసింది, స్వాతి తిట్టింది, అమ్మ కొట్టింది, వాడు ఉత్తరం చదివాడు.

అకర్మక క్రియ: వాక్యంలో కర్మ లేకుండా కేవలం కర్త, క్రియ మాత్రమే ఉంటే దాన్ని అకర్మక క్రియ అంటారు.

ఉదా: పులి చచ్చింది, వర్షం కురిసింది.

ప్రేరణార్థక వాక్యం: ఒక పని జరిగేందుకు ఇతరుల ప్రేరణ ఉంటే దాన్ని ప్రేరణార్థక వాక్యం అంటారు. ధాతువుకు ఇంచు ప్రత్యయం చేరడం వల్ల ప్రేరణార్థక వాక్యం ఏర్పడుతుంది.

ఉదా: మాష్టారు నా చేత పరీక్ష రాయించాడు.
అమ్మ పిల్లాడి చేత అన్నం తినిపించింది.

బి. కర్తృరహిత వాక్యాలు: కర్తృరహిత వాక్యాల్లో కర్త ఉండదు.'ఉంది'అనే క్రియారూపం ఉంటుంది.

ఉదా: నాకు బాధగా ఉంది.
వాడికి సంతోషంగా ఉంది.

II. సంశ్లిష్ట వాక్యం

వాక్యంలో సమాపక క్రియ, అసమాపక క్రియతో కలిసి ఉన్న పద సముదాయాన్ని 'సంశ్లిష్ట వాక్యం' అంటారు.

ఉదా: కందుకూరి వీరేశలింగం రచనలు చేస్తూ సంఘసంస్కరణ చేశారు.

ఈ వాక్యంలో 'చేశారు'అనేది సమాపక క్రియ. చేస్తూ అనేది అసమాపక క్రియ. సంశ్లిష్ట వాక్యాల్లో క్త్వార్థకం, శత్రర్థకం, ఛేదర్థకం, అప్యర్థకం ప్రధానపాత్ర పోషిస్తాయి.

1. శత్రర్థక వాక్యాలు: శత్రర్థకంలో క్రియకు 'తూ' ప్రత్యయం చేరుతుంది.

ఉదా: విమల వంట చేస్తూ పాటలు పాడుతుంది. ఈ వాక్యంలో 'చేస్తూ' అసపమాక క్రియ. పాడుతుంది సమాపక క్రియ. కాబట్టి ఇది శత్రర్థక వాక్యం.

2.ఛేదర్థక వాక్యం: ఛేదర్థక క్రియలో ధాతువుకు 'తే', 'అయితే' ప్రత్యయాలు చేరతాయి. ఇందులో ఒక పనిపై ఆధారపడి మరో పని జరుగుతుంది.

ఉదా: ప్రామాణిక భాష అయితే అందరికీ ఆమోద యోగ్యం.

వానలు కురిస్తే పంటలు పండుతాయి.

పై వాక్యాల్లో 'అయితే', 'తే' ప్రత్యయాలు వచ్చాయి కాబట్టి ఛేదర్థక వాక్యాలు.

3. అప్యర్థక వాక్యాలు: అప్యర్థక క్రియల్లో ధాతువుకు 'ఇనా' ప్రత్యయం చేరుతుంది.

ఉదా: ఆ లెక్చరర్ పాఠం చెప్పినా అర్థం కాదు. వరకట్న నిషేధ చట్టం వచ్చినా ఫలితం లేదు.

పై వాక్యాల్లో 'ఇనా' ప్రత్యయం ధాతువుకు చేరింది. అందువల్ల ఇవి అప్యర్థక వాక్యాలు.

4. క్త్వార్థక వాక్యాలు: భూతకాలిక అసమాపక క్రియను క్త్వార్థకం అంటారు. ఇందులో ధాతువుకు 'ఇ' ప్రత్యయం చేరుతుంది.

ఉదా: డాక్టర్ రవి ఆసుపత్రికి వెళ్లి రోగులను చూశారు.

ఇందిర కాలేజీకి వెళ్లి పాఠాలు చెప్పింది.

పై వాక్యాల్లో 'వెళ్లి' అనే క్త్వార్థక క్రియ ఉంది. అందువల్ల ఇవి క్త్వార్థక వాక్యాలు.

III. సంయుక్త వాక్యం

రెండు లేదా అంత కంటే ఎక్కువ సమాన ప్రతిపత్తి ఉన్న వాక్యాలు కలిసి ఒకే వాక్యంగా ఏర్పడితే దాన్ని 'సంయుక్త వాక్యం' అంటారు. దీన్నే 'మహా వాక్యం' అని కూడా అంటారు. ఆంగ్ల భాషా సంప్రదాయం వల్ల వచ్చిన వాక్య నిర్మాణం కాబట్టి ఆంగ్లంలో మాదిరిగా రెండు వాక్యాల మధ్య and, but, so లాంటివి చేరిన విధంగా తెలుగులో కానీ, అయితే లాంటి అవ్యయాలు అనుసంధానాలుగా చేరతాయి. సంయుక్త వాక్యాలను మూడు విధాలుగా వర్గీకరించవచ్చు. అవి...

1. **సంకలన సంబంధ వాక్యాలు**
2. **వికల్ప సంబంధ వాక్యాలు**
3. **వైరుధ్య సంబంధ వాక్యాలు**

1. సంకలన సంబంధ వాక్యాలు: సంయుక్త వాక్యంలో ఉపయోగించే వాక్యాల మధ్య సంకలన సంబంధం ఉంటుంది.

ఉదా: కాళోజీ కవిత్వం రాస్తారు.
విమర్శ వ్యాసాలు రాస్తారు.
ఉపన్యాసాలిస్తారు.
ఇవి సంకలన సంబంధ వాక్యాలు

2. వికల్ప సంబంధ వాక్యాలు: సందేహాస్పదమైన ఊహలు వికల్ప సంబంధ వాక్యాల్లో ఉంటాయి. వీటిలో నామ బంధాలకు 'ఓ' ప్రత్యయం చేరుతుంది.

ఉదా:రవి ఉద్యోగమో, వ్యాపారమో చేస్తున్నాడు.

3. వైరుధ్య సంబంధ వాక్యాలు: రెండు వాక్యాలు ప్రతిపాదించే విషయాల మధ్య వైరుధ్య సంబంధం ఉంటుంది.

ఉదా: ఆ రాజకీయ నాయకుడు పెద్ద అవినీతి పరుడు. అయితే సభల్లో నీతి బోధలు వల్లిస్తాడు.

➡ అర్థం ఆధారంగా వాక్య భేదాలను నిశ్చయార్థక, వ్యతిరేకార్థక, విధ్యర్థక, ఆశీర్వాద్యర్థక, అనుమత్యర్థక, ఆశ్చర్యార్థక, ప్రార్థనార్థక, నిషేధార్థక వాక్యాలుగా వర్గీకరించారు.

➡ క్రియా ప్రాధాన్యం ఆధారంగా వాక్యాలను మూడు రకాలుగా విభజించారు.

1. కర్త ప్రధాన వాక్యాలు
2. కర్మ ప్రధాన వాక్యాలు
3. భావార్థక వాక్యాలు

1. కర్తరీ వాక్యాలు: కర్త ప్రధానంగా ఉన్న వాక్యాలను 'కర్తరీ వాక్యాలు' అంటారు. ఆంగ్లంలో వీటిని Active Voice అంటారు. కర్తరీ వాక్యాల్లో కర్త ప్రథమా విభక్తి ప్రత్యయాల్లో ఉంటుంది. ఒక్కోసారి విభక్తి ప్రత్యయాలు లేకుండా ఉంటుంది. సమాపక క్రియ ఉంటుంది. కర్మ ద్వితీయా విభక్తి ప్రత్యయాల్లో ఉంటుంది.

ఉదా: ఆళ్వారు స్వామి 'చిన్నప్పుడే' అనే కథ రాశారు.

వాల్మీకి రామాయణాన్ని రచించారు.

2. కర్మణీ వాక్యాలు: కర్మ ప్రధానంగా ఉన్న వాక్యాలు కర్మణీ వాక్యాలు. ఆంగ్లంలో వీటిని Passive Voice అంటారు. ఇందులో కర్మకు ప్రథమా విభక్తి ప్రత్యయాలు, కర్తకు తృతీయా విభక్తి ప్రత్యయాలు చేరతాయి. క్రియకు 'బడు' ప్రత్యయం చేరుతుంది.

ఉదా: కన్యాశుల్కం నాటకం గురజాడ చేత రచింపబడింది.

బాలురచే సెలవు తీసుకోబడింది.

➡ **అనుకృతి వాక్యాలు:** ఆంగ్ల వాక్య సంప్రదాయంతో తెలుగులో అనుకృతి వాక్యాలు వచ్చాయి. ఇవి రెండు రకాలు.

1. ప్రత్యక్షానుకృతి (ప్రత్యక్ష కథన వాక్యాలు)
2. పరోక్షానుకృతి (పరోక్ష కథన వాక్యాలు)

1. ప్రత్యక్షానుకృతి కథనం: ఒకరు చెప్పిన విషయాన్ని యథాతథంగా చెప్పడం ప్రత్యక్ష కథనం. ఇందులో ఒకరు చెప్పిన విషయం 'అనుకరణ చిహ్నాల మధ్య' ఉంటుంది.

ఉదా: 'నేనొక్కడినే అదృష్టవంతుడినా?' అన్నారు జంఘాలశాస్త్రి.

2. పరోక్షానుకృతి కథనం: ఒకరు చెప్పిన విషయాన్ని పరోక్షంగా అనుకరించి చెప్పడం పరోక్ష కథనం. ఇందులో నేను/ మేము లాంటి ఉత్తమ పురుష సర్వనామాలు తాను/ తాముగా మారతాయి.

ఉదా:అంబేద్కర్ తాను హిందువుగా పుట్టానని,హిందువుగా మాత్రం మరణించనని అన్నారు.

➡ **నామ్నీకరణ వాక్య విధానం:**నామం కానిదాన్ని నామం చేయడమే నామ్నీకరణం. ఒక వాక్యాన్ని కొన్ని మార్పులతో కర్తృ,కర్మ పద స్థానాల్లో ప్రయోగించే పద్ధతిని 'నామ్నీకరణం' అంటారు. ఆచార్య చేకూరి రామారావు 'తెలుగు వాక్యం' పరిశోధనాత్మక గ్రంథంలో నామ్నీకరణ పద్ధతులను సూచించారు.

నామ్నీకరణగా మార్చడం:

ఉదా: ఆరోగ్యం బొత్తిగా చెడిపోయింది. ఇందులో క్రియకు 'ఇన' ప్రత్యయం చేర్చి కర్త, కర్మ పద స్థానాలను మార్చాలి.

బొత్తిగా చెడిపోయిన ఆరోగ్యం.

మాదిరి ప్రశ్నలు

1. 'చుక్క పొడుపుతో సీత లేచింది', 'సీత గడపను పూజించింది'. ఈ వాక్యాలను సంశ్లిష్ట వాక్యంగా మార్చండి.
   1) సీత చుక్కపొడుపుతో లేచింది. గడపను పూజించింది
   2) సీత చుక్క పొడుపుతో లేచి, గడపను పూజించింది.
   3) సీత గడపను పూజించి, చుక్కపొడుపుతో లేచింది.
   4) చుక్కపొడుపుతో లేచింది, సీత గడప ను పూజించింది.
2. 'నీలిమ టీవీ చూసి నిద్రపోయింది'. ఇది ఏ వాక్యం?
   1) సామాన్య వాక్యం
   2) సంయుక్త వాక్యం
   3) సంశ్లిష్ట వాక్యం
   4) ప్రత్యక్ష కథన వాక్యం
3. 'వ్యక్తికి బహువచనం శక్తి' అని శ్రీశ్రీ రాశారు. ఈ వాక్యం దేనికి ఉదాహరణ?
   1) పరోక్షానుకృతి
   2) వ్యావహారికానుకృతి
   3) సామాన్య వాక్యం
   4) ప్రత్యక్షానుకృతి
4. 'అతడు బాగా చదివినా మార్కులు రాలేదు' అనేది ఏ రకమైన వాక్యం?
   1) అప్యర్థకం 2) ఛేదర్థకం
   3) హేత్వర్థకం 4) వికల్పసంబంధం
5. 'వానలు కురిస్తే పంటలు పండుతాయి' అనేది ఏ వాక్యం?
   1) క్త్వార్థకం 2) ఛేదర్థకం
   3) అనుమత్యర్థకం 4) హేత్వర్థకం
6. సంశ్లిష్ట వాక్యంలో ప్రధానక్రియ పని జరగ దానికి ఉపయోగించే షరతును సూచించే క్రియ?
   1) అసమాపక క్రియ 2) అప్యర్థక క్రియ
   3) సమాపక క్రియ 4) క్త్వార్థక క్రియ
7. 'నాకు ఒక అనుభవం బాగా జ్ఞాపకం ఉంది' అనే వాక్యాన్ని నామ్నీకరిస్తే..?
   1) బాగా జ్ఞాపకం ఉన్న ఒక నా అనుభవం
   2) నాకు బాగా జ్ఞాపకం ఉన్న ఒక అనుభవం
   3) ఒక అనుభవం నాకు బాగా జ్ఞాపకం ఉన్నది
   4) జ్ఞాపకం ఉన్న ఒక నా అనుభవం
8. 'నాకు ఆకలిగా ఉంది' - ఇది ఏ వాక్యం?
   1) కర్మార్థక వాక్యం 2) కర్తృరహిత వాక్యం
   3) విధ్యర్థక వాక్యం
   4) కర్తృసహిత వాక్యం
9. 'వైద్యుడు ప్రథమ చికిత్స చేస్తూ మందులిస్తాడు' అనే వాక్యం?
   1) సామాన్య వాక్యం 2) సంశ్లిష్ట వాక్యం
   3) సంయుక్త వాక్యం
   4) సంకలన సంబంధ వాక్యం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 1; 5) 2; 6) 3; 7) 2; 8) 2; 9) 2.

సున్నపురాయిపై ఆధారపడే పరిశ్రమ ఏది?

కాల్షియం, మెగ్నీషియం

మెగ్నీషియం, కాల్షియంతో పాటు బెరీలియం, స్ట్రాన్షియం, బేరియం, రేడియం మూలకాలు కూడా ఆవర్తన పట్టికలో రెండో గ్రూపులో ఉంటాయి. వీటినే 'క్షార మృత్తిక లోహాలు' అంటారు. ఆరోగ్యవంతమైన దంతాలు, ఎముకల కోసం కాల్షియం అత్యంత ఆవశ్యకమైంది. యుక్త వయసులో మానవ శరీరంలో సుమారు 25 గ్రాముల మెగ్నీషియం (Mg), 1200 గ్రాముల కాల్షియం (Ca) ఉంటాయి. శరీరంలో ఉండే కాల్షియంలో 99 శాతం ఎముకలు, దంతాల్లో ఉంటుంది. కండరాల్లోని నరాల పనుల్లోనూ, రక్తం గడ్డకట్టడంలోనూ కాల్షియం ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

కాల్షియం ముఖ్యమైన సమ్మేళనాలు: కాల్షియం కార్బొనేట్, కాల్షియం హైడ్రాక్సైడ్, సిమెంట్, జిప్సం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్.

- సున్నపురాయి, సుద్ద, చలువరాతి ముక్కలను రసాయనికంగా 'కాల్షియం కార్బొనేట్ ($CaCO_3$)' అంటారు. సున్నపురాయిని బట్టీల్లో కాల్చినప్పుడు పొడిసున్నం (కాల్షియం ఆక్సైడ్) వస్తుంది. దీనికి పరిమితంగా నీటిని కలిపితే రాళ్లు పగిలి ముద్దగా మారుతాయి. ఈ ప్రక్రియనే 'స్లేకింగ్ ఆఫ్ లైమ్' అంటారు. ఇది కాల్షియం హైడ్రాక్సైడ్.
- గాజు తయారీ, చర్మం శుద్ధి, బ్లీచింగ్ పౌడర్ తయారీ, చక్కెర శుద్ధి ప్రక్రియల్లో కాల్షియం హైడ్రాక్సైడ్ ఉపయోగపడుతుంది.
- సున్నపురాయిని పొడిసున్నం తయారీలో వాడతారు. సిమెంట్ తయారీకి ప్రధాన ముడి పదార్థాలు – సున్నపురాయి, బంకమట్టి.
- ప్రత్యేకంగా అవక్షేపించిన కాల్షియం కార్బొనేట్‌ను మేలు రకం కాగితం తయారీలో, ఆమ్ల విరోధిగా, టూత్‌పేస్ట్‌లో సున్నితమైన అపఘర్షకంగా, చ్యూయింగ్ గమ్‌లో, సౌందర్య సాధనాల్లో పూరకంగానూ వాడతారు.
- కాల్షియం సల్ఫేట్ డై హైడ్రేట్ ($CaSO_4 . 2H_2O$)ను 'జిప్సం' అంటారు. దీన్ని ప్రత్యేక ఉష్ణోగ్రత 393K వద్ద వేడిచేస్తే 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్($CaSO_4 . \frac{1}{2}H_2O$)' ఏర్పడుతుంది. దీన్ని గృహ నిర్మాణాల్లో, విరిగిన విగ్రహాలను అతికించడంలో, ఎముకలు కదలకుండా కట్టు కట్టడంలో, దంత వైద్యంలో, నగలు పోతపోయడానికి, విగ్రహాల తయారీలో ఉపయోగిస్తారు.
- సున్నం (కాల్షియం ఆక్సైడ్) ఎక్కువగా ఉండే పదార్థాన్ని సిలికా (SiO_2) అధికంగా ఉండే బంకమట్టితో పాటు అల్యూమినియం, ఐరన్, మెగ్నీషియం ఆక్సైడ్‌తో కలిపితే ఏర్పడే సంకలిత పదార్థం 'సిమెంట్'.
- మొక్కల్లో ఉండే ఆకుపచ్చ వర్ణద్రవ్యం 'క్లోరోఫిల్'. ఇందులో ఉండే లోహ అయాన్ 'మెగ్నీషియం'.
- ఆమ్ల విరోధిగా పనిచేసే 'మెగ్నీషియం హైడ్రాక్సైడ్'ను 'మిల్క్ ఆఫ్ మెగ్నీషియా' అంటారు.
- ఎక్కువ బలం ఉన్న స్ప్రింగ్‌ల తయారీలో కాపర్–బెరీలియం మిశ్రలోహాలను ఉపయోగిస్తారు.
- మెగ్నీషియం పొడి/రిబ్బన్లను ఫ్లాష్ పౌడర్ తయారీలో, బల్బులు, సిగ్నల్‌లలో వాడతారు.
- రేడియం అనేది రేడియోధార్మిక మూలకం. దీని లవణాలను 'రేడియో థెరపీ' (కేన్సర్ చికిత్స)లో వాడతారు.
- ముత్యంలో కాల్షియం కార్బొనేట్, ఎమరాల్డ్‌లో బెరీలియం ఉంటాయి.

సున్నపు తేటను 'మిల్క్ ఆఫ్ లైమ్' లేదా 'లైమ్ వాటర్' అంటారు. సున్నపు తేటలోకి 'కార్బన్ డై ఆక్సైడ్' పంపిస్తే పాలలా తెల్లగా మారుతుంది. ఈ ప్రక్రియలో 'కాల్షియం కార్బొనేట్' ఏర్పడుతుంది. గోడలకు వెల్ల వేసినప్పుడు కూడా గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకొని కాల్షియం కార్బొనేట్‌ను ఏర్పరుస్తూ తెల్లగా మారుతుంది.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

మాదిరి ప్రశ్నలు

1. రక్తం గడ్డ కట్టడానికి, కండరాలు సంకోచించడానికి ఏ లోహం అవసరం?
   1) ఇనుము(ఐరన్) 2) రాగి (కాపర్)
   3) సోడియం 4) కాల్షియం
2. మొక్కల్లోని ఆకుపచ్చ రంగుకు కారణం పత్రహరితం (క్లోరోఫిల్) అనే సంక్లిష్ట పదార్థం. ఇందులో ఉండే లోహం ఏది?
   1) ఐరన్ 2) కాల్షియం
   3) మెగ్నీషియం 4) కోబాల్ట్
3. సున్నపురాయి రసాయన నామం?
   1) సోడియం కార్బొనేట్ (Na_2CO_3)
   2) కాల్షియం కార్బొనేట్ ($CaCO_3$)
   3) కాల్షియం హైడ్రాక్సైడ్ ($Ca(OH)_2$)
   4) కాల్షియం ఆక్సైడ్ (CaO)
4. సున్నపురాయి దేని వల్ల చలువరాయి (మార్బుల్)గా మారుతుంది?
   1) అధిక ఉష్ణోగ్రత 2) అధిక వర్షపాతం
   3) అధిక పీడనం (ఒత్తిడి)
   4) అల్ప పీడనం
5. టూత్ పేస్టుల్లో ఉపయోగించేవి?
   1) $CaCO_3$, CaO
   2) $CaCO_3$, $MgCO_3$
   3) $CaCO_3$, $Ca(OH)_2$
   4) CaO, $Ca(OH)_2$
6. ఎముకల పొడిలో ఉండే కాల్షియం సమ్మేళనం ఏది?
   1) కాల్షియం సల్ఫేట్
   2) కాల్షియం ఫాస్ఫేట్
   3) కాల్షియం కార్బొనేట్
   4) కాల్షియం ఆక్సైడ్
7. కిందివాటిలో భిన్నమైంది ఏది?
   1) చలువరాయి 2) సున్నపురాయి
   3) సుద్ద 4) బొగ్గు
8. కిందివాటిలో సరికాని జత ఏది?
   1) సున్నపురాయి – కాల్షియం కార్బొనేట్ ($CaCO_3$)
   2) పొడిసున్నం – కాల్షియం ఆక్సైడ్ (CaO)
   3) తడిసున్నం – కాల్షియం హైడ్రాక్సైడ్ ($Ca(OH)_2$)
   4) సున్నపు తేట – కాల్షియం సల్ఫేట్ ($CaSO_4$)
9. ఇసుక, నీరు, సిమెంట్ (లేదా సున్నం) కలిసిన మిశ్రమానికి పేరు?
   1) గచ్చు (మోర్టార్) 2) కాంక్రీట్
   3) గట్టితనం ఉన్న కాంక్రీట్
   4) తుప్పు
10. కిందివాటిలో కాల్షియం కార్బొనేట్ ఉపయోగం కానిది?
    1) మేలు రకం కాగితం తయారీలో వాడతారు
    2) టూత్‌పేస్టులో సున్నితమైన అపఘర్షకంగా వాడతారు
    3) 'చ్యూయింగ్ గమ్'లో ఒక అనుఘటకంగా ఉపయోగిస్తారు
    4) ఎముకలు విరిగినప్పుడు కట్లు కట్టడానికి వాడతారు
11. కిందివాటిలో ఆమ్ల విరోధిగా వాడకూడని పదార్థం?
    1) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
    2) కాల్షియం హైడ్రాక్సైడ్
    3) కాల్షియం సల్ఫేట్
    4) కాల్షియం కార్బొనేట్
12. నీటిని కలిపితే గట్టిపడే ఒక విశేష ధర్మాన్ని చూపే కాల్షియం పదార్థం ఏది?
    1) సున్నపురాయి 2) ప్లాస్టర్ ఆఫ్ పారిస్
    3) చలువరాయి 4) బ్లీచింగ్ పౌడర్
13. సిమెంట్ పరిశ్రమకు ప్రధాన ముడిసరకు ఏది?
    1) సున్నపురాయి 2) ఇనుప ఖనిజం
    3) చలువరాయి 4) ఫ్లై యాష్
14. కాల్షియం అధికంగా ఉండే ఆహార పదార్థం?
    1) పాలు 2) మాంసం
    3) నారింజ పండ్లు 4) టీ, కాఫీ
15. ప్లాస్మాలో ఉండే లోహ అయాన్లు ఏవి?
    1) కాల్షియం 2) సోడియం
    3) పొటాషియం 4) మెగ్నీషియం
16. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ అనేది ..?
    1) కాల్షియం ఫాస్ఫేట్
    2) కాల్షియం కార్బొనేట్
    3) కాల్షియం సల్ఫేట్ హెమిహైడ్రేట్
    4) కాల్షియం క్లోరైడ్
17. మానవ శరీరంలో కాల్షియం పరిమాణం (సుమారుగా) ఎంత?
    1) 25 g 2) 1200 g
    3) 5000 g 4) 25 mg
18. ఇళ్లకు వేసే సున్నం, సున్నపుతేటలో ఉండేది?
    1) కాల్షియం కార్బొనేట్
    2) కాల్షియం ఆక్సైడ్
    3) కాల్షియం హైడ్రాక్సైడ్
    4) కాల్షియం క్లోరైడ్
19. తడి సున్నం (స్లేక్‌డ్ లైమ్)ను నీటిలో అవలంబనం చేస్తే వచ్చే సున్నపు తేటను పాన్ తయారీలో తమలపాకుపై రాస్తారు. ఈ సున్నపు తేటకు మరో పేరు?
    1) మిల్క్ ఆఫ్ లైమ్ 2) బట్టర్ మిల్క్
    3) మిల్క్ ఆఫ్ సోయా
    4) మిల్క్ ఆఫ్ మెగ్నీషియా
20. పోర్ట్‌లాండ్ సిమెంట్‌లోని ప్రధాన అనుఘటకాలేవి?
    1) సున్నం, బొగ్గు, ఫ్లై యాష్
    2) సున్నం, అల్యూమినా, జింక్
    3) సున్నం, సిలికా, అల్యూమినా
    4) సున్నం, అల్యూమినా, ఫ్లై యాష్
21. ముత్యంలో ప్రధాన అనుఘటకాలేవి?
    1) సోడియం కార్బొనేట్, కాల్షియం కార్బొనేట్
    2) కాల్షియం కార్బొనేట్, మెగ్నీషియం కార్బొనేటు
    3) కాల్షియం ఆక్సైడ్, అల్యూమినియం ఆక్సైడ్
    4) కాల్షియం సల్ఫేట్, కాల్షియం కార్బొనేట్
22. కిందివాటిలో ఏది లోపించడం వల్ల ఎముకలు, దంతాలు బలహీనపడతాయి?
    1) కాల్షియం 2) ఫాస్ఫరస్
    3) ఫ్లోరైడ్ 4) పైవన్నీ
23. సిమెంట్ వేటి మిశ్రమం?
    1) కాల్షియం కార్బొనేట్, కాల్షియం సిలికేట్
    2) కాల్షియం సిలికేట్, కాల్షియం అల్యూమినేట్
    3) ఇసుక, సున్నం, నీరు
    4) జిప్సం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్
24. మార్బుల్ రసాయన సంకేతం ఏది?
    1) $Ca(OH)_2$ 2) $CaCO_3$
    3) CaO 4) $CaHCO_3$
25. ఎమరాల్డ్‌లో ఉండే ప్రధాన మూలకం ఏది?
    1) కాల్షియం 2) మెగ్నీషియం
    3) బెరీలియం 4) సిలికాన్
26. సిమెంట్‌కు జిప్సం కలపడానికి కారణం?
    1) గట్టిదనం కోసం
    2) బూడిద రంగు కోసం
    3) నీరు కలిపినప్పుడు ప్రారంభ దశలో నెమ్మదిగా సెట్టింగ్ జరగడానికి
    4) బరువు తూగడానికి
27. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను ఏ పదార్థం నుంచి తయారు చేయవచ్చు?
    1) తడిసున్నం 2) జిప్సం
    3) సిమెంట్ 4) మార్బుల్
28. సముద్రపు నీటి నుంచి సంగ్రహించే లోహం?
    1) బంగారం 2) సిల్వర్
    3) మెగ్నీషియం 4) మెర్క్యూరీ
29. బాణాసంచా కాల్చినప్పుడు మిరుమిట్లు గొలిపే తెల్లని కాంతినిచ్చే లోహం ఏది?
    1) మెగ్నీషియం 2) కాల్షియం
    3) స్ట్రాన్షియం 4) బేరియం
30. టపాకాయలు కాల్చినప్పుడు సింధూర ఎరుపు రంగునిచ్చే లోహం ఏది?
    1) మెగ్నీషియం 2) కాల్షియం
    3) బేరియం 4) స్ట్రాన్షియం
31. నీటి తాత్కాలిక కాఠిన్యానికి కారణమైన ఆయాన్లు ఏవి?
    1) బైకార్బొనేట్లు 2) క్లోరైడులు
    3) సల్ఫేట్లు 4) పైవన్నీ
32. నీటికి శాశ్వత కాఠిన్యాన్ని కలిగించేవి?
    1) క్లోరైడ్‌లు 2) సల్ఫేట్లు
    3) 1, 2 4) ఏదీకాదు
33. కఠినజలంలో ఉండే లోహ ఆయాన్లు? (గ్రూప్-I, 2012)
    1) కాల్షియం, మెగ్నీషియం
    2) సోడియం, పొటాషియం
    3) కాల్షియం, బేరియం
    4) సోడియం, జింకు
34. కిందివాటిలో ఏ సమ్మేళనం ఉండటం వల్ల నీటికి శాశ్వత కాఠిన్యత వస్తుంది? (గ్రూప్-I, 2011)
    1) కాల్షియం సల్ఫేట్
    2) కాల్షియం బైకార్బొనేట్
    3) సోడియం బైకార్బొనేట్
    4) మెగ్నీషియం బై కార్బొనేట్
35. సున్నపురాయిపై ఆధారపడే పరిశ్రమ ఏది?
    1) గాజు 2) సిమెంట్
    3) 1, 2 4) స్టీల్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 2; 4) 3; 5) 2; 6) 2; 7) 4; 8) 4; 9) 1; 10) 4; 11) 3; 12) 2; 13) 1; 14) 1; 15) 1; 16) 3; 17) 2; 18) 3; 19) 1; 20) 3; 21) 2; 22) 4; 23) 2; 24) 2; 25) 3; 26) 3; 27) 2; 28) 3; 29) 1; 30) 4; 31) 1; 32) 3; 33) 1; 34) 1; 35) 3.

The Lend - Lease Act has designed to



Bank Exams

GENERAL ENGLISH

Directions (Q. No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. In the engineering sector (1)/ there are know jobs at the moment (2)/ for those without experience, (3)/ fact that makes it difficult for us. (4)/ No error (5)
2. The young man were surprised (1)/ to find that his experience as a tutor (2)/ had been used as the basis for events in the life of the protagonist (3)/ in a short story written by a former friend. (4)/ No error (5)
3. On Discovery channel last night (1)/ there was an informative program (2)/ about innovations in medical imaging, (3)/ a program you will have found interesting. (4)/ No error (5)
4. If the gardener was to sow the seeds (1)/ in the greenhouse rather than in the garden, (2)/ he might get (3)/ a better display of flowers. (4)/ No error (5)
5. In the fine print at the end of the document (1)/ lies the clauses that make us liable (2)/ for any expenses (3)/ that result from civil unrest. (4)/ No error (5)

Directions (Q. No. 6-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Unwilling to admit that they had been in error, the researchers tried to ____ their case with more data obtained from dubious sources.
   1) ascertain 2) buttress
   3) refute 4) absolve
   5) dispute
7. Archaeology is a poor profession; only ____ sums are available for excavating sites and even more ____ amounts for preserving the excavations.
   1) paltry, meager
   2) miniscule, substantial
   3) average, augmented
   4) judicious, penurious
   5) modest, generous
8. The student was extremely foolhardy; he had the _____ to question the senior professor's judgment.
   1) wisdom 2) temerity
   3) interest 4) trepidation
   5) condescension
9. The formerly _____ waters of the lake have been polluted so that the fish are no longer visible from the surface.
   1) muddy 2) tranquil 3) stagnant
   4) pellucid 5) rancid
10. After the accident, the nerves to her arm were damaged and so the muscles _____ through disuse.
    1) atrophied 2) contracted
    3) elongated 4) invigorated
    5) dwindled
11. Some critics maintain that Tennyson's poetry is uneven, ranging from the _____ to the ____.
    1) sublime, elevated
    2) trite, inspired
    3) vacuous, inane
    4) succinct, laconic
    5) sonorous, voluble
12. After grafting there is a _____ of lymphocytes in the lymph glands; the newly produced lymphocytes then move in to attack the foreign tissue.
    1) diminution 2) proliferation
    3) obliteration 4) paucity
    5) attraction
13. One ____ the new scheme is ____ just that it might actually ____ those applicants that it was intended to encourage.
    1) highlight of, stimulate
    2) feature of, attract
    3) problem with, induce
    4) attraction of, intimidate
    5) drawback of, daunt
14. Corruption is ____ in our society; the integrity of even senior officials is ____
    1) growing, unquestioned
    2) endangered, disputed
    3) pervasive, intact
    4) rare, corrupted
    5) rife, suspect
15. In their day to day decision making, many senior managers do not follow the rational model favored by orthodox management experts, but rather rely on intuitive processes that often appear ____ and ____.
    1) cerebral, considered
    2) heretical, judgmental
    3) conscientious, logical
    4) irrational, iconoclastic
    5) capricious, deliberate

Directions (Q. No. 16-24): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

The establishment of the third Reich influenced events in American history by starting a chain of events which culminated in war between Germany and the United States. The complete destruction of democracy, the persecution of laws, the war on religion, the cruelty and barbarism of the Nazis and especially, the plans of Germany and her allies, Italy and Japan, for world conquest caused great indignation in this country and brought on fear of another world war. While speaking out against Hitler's atrocities, the American profile generally favored isolationist policies, and neutrality. The neutrality acts of 1935 and 1936 prohibited trade with any **belligerents** or loans to them. In 1937 the president was empowered to declare an arms embargo in wars between nations at his **discretion**.

American opinion began to change somewhat after President Roosevelt's quarantine the aggressor speech at Chicago (1937) in which he severely criticized Hitler's policies. Germany's seizure of Austria and Munich pact for the partition of Czechoslovakia (1938) also around the American people. The conquest of Czechoslovakia in March 1939 was another rude awakening to the menace of the third Reich. In August, 1939, came the shock of the Nazi - Soviet pact and in September the attack on Poland and the outbreak of European war. The United States attempt to maintain neutrality in spite of sympathy for the democracies arranged against the Third Reich. The Neutrality act of 1939 repeated the arms embargo and permitted 'cash' and 'carry' exports of arms to belligerent nations. A strong national defense program was begun. A draft act was passed (1940) to strengthen the military services. A Lend - Lease Act (1940) authorized the president to sell, exchange or lend materials to any county deemed necessary by him for the defense of the United States. Help was given to Britain territory in the western Hemisphere. In August 1941, President Roosevelt and Prime Minister Churchill met and issued the Atlantic Charter which **proclaimed** the kind of a world which should be established after the war. In December 1941, Japan launched the unprovoked attack on the United States at Pearl harbor, immediately thereafter Germany declared war on the United States.

16. USA entered the war against Germany
    1) because Pearl Harbor was attacked
    2) after peaceful efforts had failed
    3) because Germany declare war against it
    4) because Japan was an ally of Germany
    5) after Germany had signed the Nazi - Soviet pact
17. The Neutrality Act of 1939 favored Great Britain because
    1) the British had command of the sea
    2) the law permitted USA to trade only with the allies
    3) it antagonized Japan
    4) it led to the Lend - Lease Act
    5) it agreed with the British on the principle of the Atlantic Charter
18. An event that did not occur in 1939 was the
    1) invasion of Poland
    2) invasion of Czechoslovakia
    3) passing of the Neutrality Act
    4) passing of the Lend - Lease act
    5) outbreak of the war in Europe
19. One item occurring 1937 that the author does not mention in the list of actions that alienated the American Public was
    1) The persecution of religious groups
    2) Nazi barbarism
    3) The pacts with Italy
    4) German plans for conquest of the world
    5) The burning of the Reich tag.
20. The Lend - Lease Act has designed to
    1) Strengthen USA's national defense
    2) Provide battle shit to the Allies
    3) Help the British
    4) the Atlantic Charter
    5) Avenge Pearl Harbor
21. The Neutrality Act of 1939
    1) restated America's isolationist policies
    2) proclaimed American neutrality
    3) permitted the selling of arms to belligerent nation
    4) was cause of USA's entrances in to WORLD WAR II
    5) started USA's national defense programs
22. During the years 1933-36, American policy may be described as having been
    1) watchful 2) isolationist
    3) pacific 4) incorrect
    5) discretionary

Directions: (Q. No. 23 & 24): Choose the word which is most similar in meaning to the given word from the five options given below each.

23. Proclaimed
    1) Degree 2) Decree
    3) Denizen 4) Designed
    5) Developed
24. Discretion
    1) Diplomacy 2) Democracy
    3) Autocracy 4) Plutocracy
    5) Monarchy

ANSWERS

1) 2; 2) 1; 3) 4; 4) 1; 5) 2; 6) 2; 7) 1; 8) 4; 9) 4; 10) 1; 11) 2; 12) 2; 13) 5; 14) 5; 15) 4; 16) 3; 17) 1; 18) 4; 19) 5; 20) 1; 21) 3; 22) 2; 23) 2; 24) 1.